శ్రీ మత్స్వం దేవతా[illegible],

# వ్రతకథలు

గ్రంథకర్త:


చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి

శతావధాని.



మొదటి కూర్పు

వెయ్యి ప్రతులు

1952

పరిష్కర్త: విద్వాన్

చెళ్లపిళ్ల దుర్గేశ్వరశాస్త్రి



హక్కులు

ప్రకాశకులవి


వెల

3-00

# వ్రతకథలు

ఇందు

CHECKED
1992

పేజీ

1. శ్రీ సత్యనారాయణ వ్రతము 1
2. శ్రీ మంగళగౌరీ వ్రతము 24
3. శ్రీ వినాయకచతుర్థీ వ్రతము 37
4. శ్రీ కేదారేశ్వర వ్రతము 58
5 శ్రీ కార్తికసోమవార వ్రతము 73
6. శ్రీ స్కందషష్ఠీ వ్రతము 92
7. శ్రీ సావిత్రీగౌరీ వ్రతము 103
8. శ్రీ శివరాత్రి వ్రతము 123
9. శ్రీ నందికేశ్వర వ్రతము 153
10. శ్రీ కులాచారావన వ్రతము 172
11. శ్రీ ఏకపత్నీ వ్రతము 187

UNIVERSITY OF HYDERABAD.
Acc. No. 2973
Date 19-12-80
LIBRARY

అను వ్రతకథలు గలవు

ప్రకాశకులు :

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి సన్సు

వేంకటేశ్వర పబ్లికేషన్సు

కడియం - P. O.

తూర్పుగోదావరి జిల్లా.

శ్రీమత్పరదేవతాయైనమః
శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీసత్యనారాయణవ్రతము.

వ. శ్రీమద్విజయవాటికాపురనివాసా। కృత్తివాసా। మల్లికార్జునదేవా। మహానుభావా। 1

కం. శివలీలలు విరచించిన
కవనముతోఁ దృప్తిసనకకావించెద పై
భవకరము భవత్పూజన
ము వ్రతకథల పుణ్యచరితముల రచనమునన్. 2

కం. దేవా। "యావత్తైలం
తావద్వ్యాఖ్య" నినుగొల్చి ధన్యతఁగాంచం
గా వాంఛించుచుఁ గవితా
భావుకమగుసేవ నీకుఁ బచరింతుశివా। 3

కం. దేవా। యావత్తైలం
తావద్వ్యాఖ్య భపదీయతత్వము నెఱుఁగన్
నావశమే నీవ్రతములు
గావించెదఁ గావ్యములుగఁ గలుషములుడుఁగన్. 4

వ. అవధరింపుము. నైమిశంబున లోకసంగ్రహణార్థంబుగా నేవియేవి పురాణవ్రతకథాకథనవిద్విలాసుండగుసూతుంగాంచి శౌనకాదులిట్లనిరి.

తే.గీ. వ్రతము లెన్నేని గలవ యవంధ్యఫలక
ములు సమస్తవ్రతమ్ముల నలఘుచరిత
సత్యనారాయణవ్రత సదృశమైన
వ్రతము లేదని విందుము కృతులవలన. 6

వ. "వ్రతానా ముత్తమం వ్రత" మ్మని ప్రతివ్రతమ్మనుగూర్చి చెప్పినట్లన
దీనింగూర్చి చెప్పుటయో? లేక యీవ్రతప్రభావం బట్టిదియో! ఆన
తిచ్చి యనంతర మీ వ్రతవిధానాదికంబు వినిపింపు మనవుడు
సూతుండు. 7

కం. మునులార! వినుఁడు తద్వ్రత
మునుగూర్చి వచింతు లోకమునఁ గల వ్రతముల్
ఘనఫలదము లయ్యును దా
విని బోలఁగఁ జాల వనుట నిక్కమ్ము యగున్. 8

తే.గీ. కాలనియమమ్ముగాఁ జేయుఁగాక లేక
కదఁగుఁగాక తన్నియమము నెడలి నరుఁడు
తద్వ్రతము వ్యాధు లాధుల దగులనీక
ప్రోచు గేస్తుల నది నిక్కము వినుఁడయ్య. 9

కం. చాతుర్వర్ణ్యము వారును
ప్రీతిమెయి నొనర్పవచ్చు విశ్వశ్రేయం
బై తనరెడి యీవ్రత మెం
తో తాత్పర్యమునఁ జేయఁ దొలఁగు దొసంగుల్. 10

వ. సావధానంబుగ నాలకింపుఁడు. లోకహితార్థియగు నారదుం డనేక లోకమ్ములు పర్యటించుచు, మధ్యమలోకప్రాంతమ్మునఁ జరించునెడ నానాయోనిసముత్పన్నులును, నానాదుఃఖసమన్వితులును, నానాప్రకారులును నగు నందలిజనుల నీక్షించి యవ్వారల దుస్థితికి వగచి వీరలకు సూక్ష్మోపాయమ్మున నెవ్వగ దొలఁగుటకును సుఖము గలుగుటకును నుపాయమారయు మనంబుతోఁ దత్క్షణంబ విష్ణులోకమ్మునకున్ జని యచ్చట శ్రీమన్నారాయణు లక్ష్మీసనాథు శంఖచక్రాయుధోపేతుఁ గని నమస్కరించి సన్నుతించి సుప్రసన్నుంజేసికొనుటయు నప్పుర

మేశ్వరుండు మందహాససుందర వదనారవిందుం డగుచు నారదున
కిట్లను. 11

కం. బహుకాలం బైనది నీ
విహభువనమ్మునకు వచ్చి యిపు డెయ్యదియో
తహతహ పొడమెన్। భవదీ
యహృదయమునయందు లేక యరుదెంచెదవే। 12

తే.గీ. స్వార్థమొక్కింత లేకయు నఖిలలోక
ములు చరింతు పరార్థమం దెలమి గలిగి
నీవు లేని పురాణమ్ము నీవు లేని
కతలు వ్రతములు మఱి యొండు గానరావు. 13

కం. సంసారివి గాకుండియు
సంసారసుఖమ్ము లెల్లఁ జవిచూచితి మీ
మాంసించి తాఁడువారల
సంసారము గూడ ఛేనిసావివి నగుచున్. 14

తే.గీ. జ్ఞప్తి నున్నదియే యవి సారెసారె
ప్రశ్న సేయునధోక్షజా పరిహసితవ
చనములకు సిగ్గువడుచు నాసంయమీంద్రుఁ
డిట్లు వచియించె నతిభక్తి యెసకమెసఁగ. 15

వ. దేవా। నాఁటియావద్గాథయు జ్ఞప్తినున్నకతమున నే యప్పటినుం
డియు భవద్దర్శనమ్ము సేయుటకు మొగము చెల్లక రాక మానితి.
నాయజ్ఞానోక్తులంబట్టి గర్విష్ఠునిగా నెంచికొని నీమాయం బడఁ ద్రోచి
తివి. బుద్ధివచ్చె. నీమాయం దరియింప బ్రహ్మాదులకునయిత మశక్య
మగుచో నస్మదాదుల మలంతులము వలంతుల మెట్లు కాఁగలము.
నీదర్శన మొనరించుటకు మరల రానోడియు నేఁడు వచ్చిన కార

ణము విన్నవింతు సావధానమ్ముగ నాలకించి తగిన సదుపాయ
మ్ముపదేశింప వలయు నని వెండియు. 16

తే.గీ. మనుజలోకమ్మునందలి జనులఁ జూచి
వచ్చితిని వారు పొందు నవస్థలెల్ల
నాకళింపయ్యె వారల యాకళంకు
లెట్లు వాసెడిఁ దరియించు టెట్లు వారు. 17

కం. చేయని పాపము నిరతముఁ
బాయక పడని దురవస్థ పరికింపఁగ నా
కే యొకటియుఁ గనుపట్టదు
నాయెద దురపిల్లి వచ్చినాఁడ విచటికిన్. 18

తే.గీ. కలియుగము దాపుగా నుండెఁ గస్తి కోర్చి
కృచ్ఛ్రచాంద్రాయణాదులు ఋషులవంటి
వారికే సాఁగ నిట్టి సంసారికుల గు
ఱించి చెప్పినఁ జేసి తరించు టెట్లు. 19

కం. దేవా! దేవరమది కరు
ణావారిధి గాన భూజనమ్ములతరణం
బేవిధి సూక్ష్మోపాయ
ప్రావీణ్యము వలనఁ దెమలుఁ బలుకఁగ వలయున్. 20

తే.గీ. చూచువానికె కష్టమై తోఁచినపుడు
వారలే గతిఁ గుడుచుచున్నారొ? దేవ;
సకలమును నీ వెఱుంగుదు సాక్షి వగుచు
నంటి యంటక చరియించు టర్హ మగునె. 21

కం. ఏదేని లఘూపాయము
నీదయ నేర్పడినఁ దప్ప నిఖిలజనుల యా

చీదర వదలదుగద; దా
మోదర: సెలవీయవలె "నమో నమ" యనుదున్. 22

వ. పుండరీకాక్షుండు నారదుని పరోపకార ధురీణత్వమ్మునకు సంత సించి దయార్ద్రయాంతరంగమ్ముతో నిట్లను. నారదా! నీహృదయ మార్దవంబునకుఁ గడుఁగడు సంతసించితి. నీయందు మహామునుల కుండఁదగిన లక్షణంబులెల్ల మూర్తీభవించి విరాజిల్లు చున్నవి. "ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబక" మనుట నీక తగుఁగాన నతిగోప్యంబగు నొక వ్రతమ్ము గలదు; దాని వింతవఱ కెవ్వరికిని దెలియఁ బఱచినవాఁడఁ గాకుండియు నీయందలి వాత్సల్యమ్మునం జేసి ప్రకటించుచుంటి. నయ్యదియు సత్యనారాయణవ్రతంబు నాబడు; దాని యాచరణమ్మునకుఁ గాలనియమాదు లుండనువచ్చును; నుండ కున్నను ఫలంబు కొఱత వడదనుటయు నారదుండు మహాత్మా! తద్విధానంబుగూడ నుంత యానతీయవలయునని ప్రార్థించుటయు మధుసూదనుండు సంగ్రహమ్ముగా నిట్లుపన్యసించె. నదీతీరమ్మునఁ గాని, దేవాలయమ్మునఁ గాని, పుణ్యదినమ్మునఁ గాని, యేదినమ్మున గాని నరుండు భక్తిశ్రద్ధాసమన్వితుండై తనశక్తి ననుసరించి తత్ త్పదార్థంబులు గోధూమ చూర్ణాదికంబులు చతుర్భాగయుక్తంబుగా సేకరించి విప్రులం బిలిచి వ్రతం బొనర్చి యం దైదవవంతు ప్రసా దంబు తానును భార్యయును బిల్లలును భుజించి తక్కినప్రసాదం బితరులకు వినియుక్తం బొనర్పవలయునని వెండియు. 23

తే.గీ. ఎవరుగాని ప్రసాదంబు లిచ్చునపు డ
నాదరము చూపరాద యనాదరంబు
చూపిరేనియు సత్యుండు కోపి యగుచుఁ
దగిన పాచితి వారి కొదవఁగఁజేయు. 24

వ. ఇయ్యది ముఖ్యముగా గమనింపఁ దగిన యంశమని సంగ్రహమ్ముగా నొడువుటయు నా శ్రీమన్నారాయణుండు నొడివిన యావత్సంగతులును తూ-చా తప్పకుండ మనమ్మునం దిడికొని యయ్యధోక్షజు నానతిం గొని వ్రతప్రచారంబునకయి చనియె నావుడు శౌనకాదు లా వ్రతము నెవ రెవ్వరొనర్చి యేయే ఫలమ్ముల నొంది తరించిరో ఆనతీవలయు ననుటయు సూతుండు తత్తద్వ్రతకర్తలఁ గొందఱి నిట్లు వక్కాణించె. 25

కం. ఒక బ్రాహ్మణుండు భిక్షా
టకుఁడై వృద్ధుండు తిరుగుటం గని సత్యం
డు కరుణకల్మిని దాను ము
దుకడై కనుపట్టె నలముదుకపాఱునకున్. 26

వ. అట్లు కనుపట్టి యా బ్రాహ్మణున కుపకరించు తలంపుతో నేదేని ప్రసక్తిం గల్పించికొని మాటలాడం దలఁచి యిట్లనియె. 27

కం. అరికాలిమంట శిరమున
బొరసెడి మిడియెండలోనఁ బురమెల్ల నిటుల్
దిరిగెద వేటికయా? భూ
సుర! యన క్షితిసురుఁడు ధరణిసురునకు ననియెన్. 28

తే.గీ. బ్రాహ్మణుండను వేదబుక్కారగుఁడను
బిల్లలును జెల్లలును గల్గు వృద్ధుఁడను గు
టుంబరక్షణమునకు భైక్ష్యంబు మంచి
వృత్తి యని యాయవారమ్ము నెత్తికొందు. 29

కం. దంభంబె "బ్రాహ్మణస్య ధ
నం భిక్ష" యనెడిమాట నానావృత్తుల్
కుంభిని నుండిన నెందు వి
జృంభింపదు నామనంబు శ్రీహరికరుణా 30

కం. జానెఁడుపొట్టకునై యె
వ్వానినొ సత మాశ్రయించి శ్వానములటె న
వ్వానియవాగువునందున్
మానస మిడి బ్రదుకుకన్న మరణము వరమౌ. 31

వ. ఎల్లరకుఁ గాకున్నను బాపభీతి గల సదాచార తత్పరునకు వేదశాస్త్ర నిరతున కింతకు మించిన వృత్తి యనఘంబైనది గానరా దని వెండియు. 32

తే గీ. ఎవరికిని నాదుభారం బొకింత లేదు
పిడికెఁ డస్మాదృశున కిడి పేదవడఁడు
వేద మెఱిఁగినవానికి బిచ్చమిడుట
కులము తరియింపఁజేయు న న్నలుకువినవె. 33

తే.గీ. స్మృతులు శోధించియే ఋతామృతములనెడి
వృత్తులు విధించి తెగడె శ్వవృత్తి నెత్తి
వేదవిదులె యవ్వానిని విడిచి యడ్డ
మైనవృత్తుల కెగఁబడ్డ ననెడి దేమి. 34

వ. అని వెండియు. 35

కం. ఏ నెంతయేనియుదరి
ద్రాణుఁడనగుకతనసంసరణపోషణముల్
బో నెట్టుచుంటి నిఁక నే
దేనియు సదుపాయ మున్న నెఱిఁగింపు మనన్. 36

వ. నిర్వ్యాజకరుణాసమేతుండు శ్రీమన్నారాయణుం డిట్లను. నోశిష్టాగ్రణీ! యిప్పటికి నీవంటి యనఘాత్ములగు ఛాందసుల కీ వృత్తియ యుత్తమము, దీన నేమాత్రమును దోసంగు పొసంగదనుటయు నిక్కంబ. దీని నవలంబించి చరించు యుష్మాదృశులపై గేస్తులెల్ల రకును నపారంబైన గౌరవంబును గలదనుట నిక్కువంబ. కాని. 37

చ. కొలఁది దినాలలోనఁ బ్రతికుత్సితుఁ డిందున కగ్గమై ధరా
తలము సమస్త మిప్పువినె దారసుతోదరపోషణానకై
యెలమి వహించినట్టులయి యిందలి గౌరవ మింకి పోవు గే
స్తు లపుడు పొమ్మపొమ్మనుచుఁ దోఁదు రిందుకు వచ్చునెల్లరన్. 38

వ. ఈ దురవస్థ వచ్చుట కింకను గొండొక కాలమ్ము వ్యవధిగలదు. అప్పటి కీపుణ్యభూమియగు భరతఖండంబు ఖండాంతరవాసుల పరిపాలనమ్మున కగ్గమగు. వారివారికిఁ బంపకమ్ములు కుదురక ఘోరమైన సంగ్రామమ్ములు చెలరేఁగి మనపురాణమ్ములం దెన్నఁడుఁ గని వినని మహాక్షామంబు లుప్పతిల్లు నప్పుడాహారమ్ము లేక చాలమంది నశింతు రయ్యెడ నీభిక్షాటకులగతి బొత్తిగా శోచ్యంబగు నది యటులుండె నీవు నావలెనే కడుంగడు వృద్ధుండవు. నీపడెడి పరిశ్రమమ్ము నకు నామనం బొప్పకున్నయది కావున నీవు నన్నుఁ గోరితివి కావున నాయెఱిఁగిన సదుపాయం బెఱిఁగించెద నయ్యది విన్ను భాగ్యవంతుం బొనర్పఁగలదని వెండియు. 39

తే.గీ. సత్యనారాయణస్వామి సద్వ్రతం బొ
కండు గలదు రహస్యం బఖండమైన
మహిమ గలయది యది చేసి బహుళమైన
సిరివి బడయుము నావుడు ధరణిసురుఁడు. 40

వ. మహాత్మా! ఆ వ్రతవిధానం బెట్టిది? దానికి వలయు పదార్థంబు లెయ్యవి? అద్దానికి యుక్తమగు కాలం బెయ్యది? యని ప్రశ్నించుటయు నాకపటభూసురుం డావృద్ధునకు సకలం బెఱింగించి యాతండు కనుచుండఁగనె యంతర్ధానం బగుటయు నమ్మహీసురవరేణ్యుండు.

కం. అకటా! యాతఁడు నావలె
నొక విప్రుఁడు గాఁడు విష్ణువో? శంభుఁడో? స్వ

ష్టికళానిపుణుఁడు ధాతయొ ?
నికటగతము విడిచినాఁడ నే మోక్షమ్ముఁ గాఁ. 42

వ. అతఁడు త్రిమూర్తులయం దొక్కరుండో ! లేక మూర్తిత్రయాతీతుం డగు పరమాత్ముండుగాని లేదా దైవతాసంభూతుండగు నొండొక దివ్యపురుషుండుగాని యగుట నిక్కువంబని యెందియు. 43

ఆ. వె. అట్లకాక యున్న నవగత మగుటెట్లు
ముందు రాఁగలట్లు చందమెల్ల
నన్నుఁ బోలు నొక యనదపాఱుఁ డనుకొంటి
ఛాందసునకు లోఁతుడెంద మున్నె. 44

వ. అని కొండొక విచారించి యీ గతజలసేతుబంధనమ్ము ప్రయోజనకారి గాదని నిశ్చయించి, నాఁటికి యథాపూర్వంబుగ నింటికిం జని, మఱునాఁటి యుదయమ్మున యథాప్రకారంబున భిక్షాటనంబున కరుగుచు మనంబున నిట్లు సంకల్పించె. 45

చ. వ్రత మొనరింపు మంచు నను బాఱువిరూపున వచ్చి ప్రేమసంగతముగఁ బ్రోత్సహించిన యకారణకారుణికుం డెవండు గా
కతఁడు వచించినట్ల వ్రత మాచరణం బొనరింతు నేఁడు నా
ప్రతిన యెఱింగి నాకు భగవంతుఁ డొనర్చును గాక సాయమున్ 46

కం. ఈవృత్తి తప్ప నాకిం
కేవృత్తియుఁ జేతగాద యిది నా కీనాఁ
డీవలయు వ్రతమునకుఁ దగు
నావస్తులు సేకరించునంతటి ధనమున్. 47

వ. ఇట్లు సంకల్పించికొని నిర్వ్యాజంబగు మనంబుతో నా వృద్ధబ్రాహ్మణుండు సాక్షాత్కరించు మాటలయాదిభిక్షుకుండో యనుతెఱంగున భిక్షాటనంబునకు బయలువెడలుటయు. 48

చ. వికిరము వెట్టుగేహినులు వెట్టిరి తండుల భైక్ష్యమే యతం
దకుటిలుఁ డింటి కేగి యవి యాత్మసతీమణి కిచ్చె నాపె కం
దొకట సువర్ణపుం గణిక లున్నటు గానఁగనైన నాపె భ
ర్తకు నవి చూపెఁ జూచి వనితామణి కాగృహమేధి యిట్లనున్. 49

వ. ఇవి భగవదనుగ్రహలబ్ధమ్ములు. గతదినమ్మున నాకు శ్రీమన్నారాయ
ణుండు వృద్ధబ్రాహ్మణరూపంబునఁ బొడకట్టి యొక వ్రత ముపదే
శించి యంతర్ధానంబునందె నేఁడు నేను భిక్షాటనంబున కరుగుతఱి
నిట్లు సంకల్పించుకొంటిఁ దత్ప్రకారంబు వినుము. 50

తే. గీ. ఈదినమ్మున భిక్షమం దేది దొరకు
దానితో సత్యదేవు నుదారకరుణు
నిహపరసుఖప్రదాత సమిద్ధచరితు
వ్రత మొనర్చి భజింతు నవంధ్యభక్తి. 51

వ. ఈసువర్ణంబు తత్సంకల్పలబ్ధంబు గానోపు; సాధ్వీమణీ! యిందు
లేశమ్ముగాని యితరమ్మునకు వినియోగింపక సర్వమ్మును వ్రతమ్మ
నకు వినియోగింతమని భార్యకుం జెప్పిన నాపెయు భర్త చెప్పిన
చొప్పునకు సమ్మతించెఁ బదంపడి నాఁడు సాయంకాలము కాక
మున్న తత్తత్పదార్థంబులు పాదాధికప్రమాణ ప్రమితంబులుగా సంగ్ర
హించి పాఱుల నాహ్వానించి యథావిధిగా వ్రతం బొనర్చికొను
సమయమ్మున. 52

ఆ. వె. వంటచెఱకు నమ్మ పాదఱుం దొక్కండు
తద్వ్రతం బొనర్చు తజ్ఞ విప్రుఁ
జూచి యడిగె ద్విజుఁడు శూద్రునకును వచి
యించెఁ దద్వ్రతంబు నెసక మెసఁగ. 53

తే. గీ. మంచికాలమ్ము రానున్న మనుజుఁడగుట
వాని కది నచ్చి వాఁడును స్వాంతమందు

నిట్లు సంకల్ప మొనరించి యేగెఁ గట్టె
లమ్మికొనుటకు సత్యుని నాత్మ నమ్మి. 54

చ. తనకుఁ గలంతద్రవ్యము వ్రతంబునకున్ వ్యయపెట్టవచ్చునం
చనె నల పందితుండుః పురమం దిది యమ్మిన నెంతవచ్చు నా
కనుగుణభక్తి దానిఁ గొని యావ్రత మేనును జేతుఁ గాకటం
చనుకొనుచున్ జనెం బ్రచురమౌ ధన మబ్బెను వాని కయ్యెడన్.55

వ. పదంపడి వాఁడును విత్తశాఠ్యంబు లేనిఫక్కిని సత్యనారాయణవ్రతం బొనర్చి యావ్రతప్రభావంబునంజేసి యీపాఱునట్లన ధనధాన్యపుత్ర పౌత్ర నిరామయాయు రారోగ్యభాగ్యంబులతోఁ దులఁదూగుచుండె నిట్టు లీవ్రతము లోకంబునఁ జాలమందికి విదితప్రభావంబయి వ్యాపించుటయు నొక్కనాఁడు. 56

తే. గీ. ఉల్కాముఖుఁడను నొక్కరా జువిదతాను
నదితటమ్మున సత్యు ననంతభక్తిఁ
బూజ సేయుచు నుండంగఁ బొరుగుటూరి
వర్తకుఁ డొకండు కనుఁగొనె వైశ్యకులుఁడు. 57

కం. కని భక్తిభావమున నా
యన కొండొక దవుల నిలిచి యనఘాత్మ ! యిదే
మనుఁగూర్చి చేయుచున్నా
మని ప్రశ్నించుటయు నృపతి యఖిలము తెలిపెన్. 58

తే. గీ. వర్తకుఁడు ధనధాన్యాది వైభవములు
గలిగి యుండియు సంతతి గలుగకున్న
కారణంబున మదిని సంకల్ప మిట్లు
చేసికొనియె సంతు గలుగఁ జేతు ననుచు. 59

వ. సంకల్పించికొన్న కొలఁదికాలమ్మునకె యావర్తకుని తలోదరీమణికి భగవదనుగ్రహమ్మునంజేసి గర్భచిహ్నంబు లేర్పడి యుక్తకాల

మ్మున సర్వలక్షణోపేతయగు కూఁతు రుద్భవించి మాతాశిశువులు సురక్షితంబుగ నుండుతటి నవ్వణిజునిభార్య యీవ్రతముంగుఱిచి జ్ఞప్తికిం దెచ్చెఁ గాని లోభగుణమ్మునంజేసి యావణిక్పుంగవుండు రాఁబోవు నామకరణాద్యుత్సవంబు దెల్పుచు నాలసించె నట్లు తత్కన్య కకు వివాహంబుగూడ జరిగెఁగాని ప్రతిశ్రుతంబైన వ్రతంబుచేయుట తటస్థింపదయ్యె. 60

ఉ. అంతట సత్యదేవునకు స్వాంతమునం దుదయించెఁ గోప మొ
క్కింత క్షమింపవచ్చు నిటు లెప్పటి కప్పుడు సేయుతప్పు ల
త్యంతము సైఁచుటెట్టులని యావణిజున్ శపియించె వీఁడు న
న్నింత యనాదరించు ఫలమెల్లఁ గొనంగలఁ డంచుఁ బిమ్మటన్. 61

వ. వర్తకుండును నల్లుండునుం గలసి ద్వీపాంతరమ్మునందు రత్న వర్తకం బొనర్ప నేగుటయు నక్కడిభేని యంతఃపురమ్మున జరిగిన చౌర్యంబు సత్యదేవుని శాపంబుకతన నిరపరాధులగు నీయల్లుండును మామయుం గుడువవలసినవారైరి. అట్టి తరుణమ్మున. 62

తే. గీ. ఇంటఁ గలిగిన సొత్తెల్ల నితరు లెవరొ
అపహరించిరి దారిద్ర్య మనుభవింప
వలసె వణిజునిభార్యకు నెలమి దక్కఁ
కూఁతురు కలావతియుఁ దాను గొనె భిక్షము. 63

కం. సిరి కలుగు టెంత పరమే
శ్వరుండు కరుణించెనేని యయ్యది సరగన్
సురుగుఁటయు నెంత పరమే
శ్వరుండు తా నాగ్రహించి శపియించినచో. 64

వ. వర్తకుండు లుబ్ధుండై వ్రతముంగూర్చి యనాదరించినను దత్కళత్రంబు సారెసారెకు జ్ఞప్తి గొల్పుచునే యుంటం జేసి సత్యదేవున కాపెయందును, గొమార్త కలావతియందును బూర్తిగ నను గ్ర

హంబు దప్పవికతన మరల నపరాధంబు క్షమించునుపాయంబొండు గల్పించె. 65

ఆ. వె. బిచ్చ మెత్తికొనఁగ బిడ్డకలావతి
యూరివెంటఁబోయి యొకటఁ జూచె
సత్యవ్రతము పేర్మి సల్పుచున్న గృహస్థు
నచట నాఁగి రాక యాలసించె 66

వ. పదంపడి ప్రసాదంబు గ్రహించి కొండొక సేపునకుఁ గలావతి యింటికి జనుటయుఁ దల్లి కొమరెం గాంచి నేఁ డింత యాలసించు టకుం గల కతమ్మ వక్కాణింపు మనుటయుఁ గలావతి కలతెఱం గెల్ల వివరించె నంత నాపె మాతకు లోఁగద జరిగిన తప్పిదంబెల్ల జ్ఞప్తిం దవిలి సత్యదేవుని స్మరించికొని దేవా! మహానుభావా! నాప డెడి యిప్పటి యిడుములును, మునుపటి నాపడసిన సుఖములను నీయొఱుంగనివి కావు నాభర్తయు నల్లుండును శీఘ్రముగ వచ్చున ట్లొనర్పు మట్లు కరుణించితివేని విన్నుశక్తికొలందిగఁ బూజింతు నని మ్రొక్కికొనుటయకాక తాత్కాలికంబుగఁ గూడ వ్రతం బొనర్పుటం జేసి నిర్వ్యాజకృపాశాలి యగు నా భగవాను నంతరం గంబు కరఁగి లోఁగద నేరాజు కారాగారమ్మున నల్లుఁడు మామ లిరువురును నిర్బంధింపఁబడి యుండిరో ఆచంద్రకేతునృపాలునకు స్వప్నంబునం బొడకట్టి. 67

తే. గీ. నీవు బంధించినట్టి వణిజులు నిరప
రాధు లవ్వారి నుదయాన రయమ వదలి
పెట్టు మవ్వారలధనంబు నీసమేని
గొనకు మిటు చేయకున్నచోఁ గనెదు శాస్తి. 68

వ. ఇట్లు శాసించి సత్యదేవుండు తిరోధానుండయ్యె. నృపాలుండు మేల్కాంచి గతమ్మువకు వగచుచు వర్తకుల నిరువుర సగౌరవంబుగఁ

బిలువనంపి యనునయోక్తుల దుఃఖోపశమనంబుచేసి యంతకుమున్ను వారలవల్లఁ గయికొన్న ధనంబు ద్విగుణంబొనర్చి యిచ్చి నూతన వస్త్రాదికం బొసంగి విందు చేసి యనుపుటయు నావణిజ్మణి. 69

ఉ. తానును నల్లుఁడుఁ గడు ముదంబునఁ బొంగుచు "సెట్టి లాభ మే
దేనియు లేక యేటఁ బడఁదే" యను సామెత కగ్గమయ్యె రా
జానుచరుల్ పొనర్చిన యపాయ మటంచుఁ దలంచికొంచు దే
శానకుఁ బోఁ దలంపున ససంభ్రములై తరి నెక్కి రియ్యరున్. 70

వ. అట్టు లోడ నెక్కి స్వదేశగమనోన్ముఖులై యేగుచుద్యమమ్మున నుండునెడ సత్యదేవున కొక యూహ పుట్టె నది యెట్టిదంటేని. 71

తే. గీ. ఇతని కిప్పటికేనియు నీయవస్థ
పచ్చుటకుఁ గాని యాదురవస్థ మరలఁ
బొలఁగుటకుఁగాని యేదిహేతువో? యొకింత
తెలిసెనో లేదొ? శీలింప వలయు ననుచు. 72

వ. ముదుసలిపాయుండుగా నగుపట్టి నడచుచున్న నౌకయం దమందానందమగ్నులై యరుగుచున్న యల్లునిని మామను గాంచి బిగ్గఱగాఁ బిలిచి. 73

ఆ. వె. అలఘులార! యోడయం దేపదార్థంబు
లున్న వేను విందు నోపి సుంత
చెప్పఁగలరె? యనుడు నప్పు డావైశ్యులు
నవ్వి యిట్టులనిరి క్రొవ్వు మిగుల. 74

శా. ఏదో యున్నది నీకు నెందులకయా? యిం దేదియున్ లేదు పో
రాదా? నీదగుత్రోవఁ బట్టుకొని; కట్టల్ బుట్టలుఁ దీవ లిం
కేదేనిం గల దెందు కిట్లడుగ నీ కేతం దధీకారముఁ
బ్రోదిన్ ముద్ర నిడంగ నిచ్చెఁ జనుమీ? భూమీసురగ్రామణీ. 75

కం. బిచ్చమ్మునకై యిచటికి
వచ్చితివో ? అట్టులేని వచ్చినచొప్పు
న్నచ్చంగఁ జెప్పఁ దోచిన
దిచ్చి పనుపమొక్కొ ? యితర మేటికిఁ దడవన్. 76

ఉ. పాఱులు వత్తు రెయ్యదియొ పట్టుక పోవుదు రంతె గాని యీ
తీరునఁ బృచ్ఛసేయు నొక దృష్టుని గాంచఁగ లేదు వృద్ధవై
యీరహి యుక్తముగా దెలియ వెప్పుడు నీకిఁక బుద్ధి వచ్చుఁ బో
పో రుచి నీవు నీపలుకుపోఁడుము లంచు హసించి పల్కెడున్. 77

తే. గీ. నావ తెప్పునఁ దేలె రత్నములు గావి
బంగరుపుగాని లవము గన్పట్టఁ బోక
వంట చెఱకుమయం బయ్యె వర్తకునకు
"నాలగోడును బాలగో" దయ్యె నంత. 78

వ. కపటబ్రాహ్మణ స్వరూపుఁడు సత్యనారాయణుండు తనంతఁ దాను
జనుచుండె. నల్లుండు మామ దురవస్థం దలంచి వందురుచు నిట్టు
లోదార్చె. 79

చ. వగచిన నేమిలాభమగు వచ్చిన యాపద లాభకారియై
దిగఁబడె నంచు సంతసిల దేవుఁ డెదో మఱియొందు గూర్చె నా
కగుపడె హేతు వాద్విజునియాకృతి మైమయిఁ దోఁప దెందుకున్
దగు నతఁ డాయనన్ బెలుచ దబ్బరలాడితి మీఁదఁబోవునే ? 80

కం. ఒకపాఱుని నెకసక్కెము
నకు నగ్గము చేసి సర్వనాశము గనెఁ గృ
ష్ణు కులము హేళన లెపుడూ
రక పోవవి ముప్పుదెచ్చు రమ్మయ్యనఘున్. 81

వ. క్షమాపణంబు చెప్పి సుప్రసన్నుం జేసికొందము మన కిప్పుడు

ఘటించిన విపత్తు తదవహేళనహేతుకంబ గాని వేఱొండు కాదని యెండియు. 82

తే. గీ. సులభకోపులు మేదినీసురులు మరల
సులభకరుణార్ద్రశీలనుచును బలుకువారు
విజ్ఞులని చెప్పి యల్లుండు విట్కులాగ్ర
గణ్యతో నేగి యద్దేవుకాళ్ళ కెఱఁగి. 83

ఉ. దాసు లొనర్చు తప్పులవి దండముతోడ సురుంగు నోమహా
భూసుర! నిన్ను హేళనకుఁ బూంచిన మాయపరాధ మెట్టులో
పాసి చనంగఁ దావకకృపారసముఁ జిలికింపు మయ్య ! వి
ష్కాసితరత్నమౌ తరిని గన్గొన నీమహిమంబు తెల్లమౌ. 84

తే. గీ. ఈపు భూసురమాత్రుండవేని యింత
యక్కజం బెట్లు పుట్టెడి ననఘ! నీదు
కతమున; జడాత్ములము నీదువిత మెఱుంగ
నెంతవారము మము క్షమియింపు మనఘ? 85

చ. ధనమునఁ బ్రీతి సర్వులకుఁ దద్దయు నుండెడి నందు మాకొలం
బునకు ధనంబె ప్రాణ మది వోయినఁ బ్రాణము వోయినట్లె మా
యనుచితకృత్యముల్ సయిచి యాగ్రహముఁ ద్యజియించి మాధనం
బును గరుణింపు మో యనఘ? బుద్ధి జనించెను నీకతమ్మునన్. 86

వ. ఇట్టు లల్లుండును మామయుఁ బరిపరివిధముల విలపించుచు క్షమాపణంబు చెప్పునప్పుడు కపటభూసురాకారుండు సత్యదేవుండు సదయాంతరంగుండై యిట్లు వలికె. 87

మ. విను మోహో? వణిజుండ? సత్యుఁడను నవ్వేల్పున్ యజింపఁ మన
మ్మున నేనాఁడొ ప్రతిశ్రుతం బది సుతన్ బుట్టించెఁ జేయంగ లే
దనుఁగుంగూఁతున కయ్యెఁ బెండిలి యొకప్డైనన్ వ్రతం బీవు చే
సిన పాపంబునఁ బోవు విఁ గని యెటుల్ జేజేలు సైరింతురో. 88

ఆ. వె. కొంత లోభితనము కొంత మత్తత రెండు
గలసి నిన్నుఁజెఱచి కస్తి గుడుపు
చున్న విందొకండె బన్నమ్ము గుడిపించు
రెండు చేరినప్పు డుండు బెట్లు 89

వ. అని వెండియు. 90

కం. నేనెపఁడనైన నగుదున్
మానిని నీభార్యబుద్ధి మంచిది యాపెన్
శ్రీనిధి సత్యుఁడు మనుపం
గా నీబంధనవిముక్తి గలిగించెఁ జామీ 91

కం. అని వారలు కనుచుండం
గనె పాఱుఁడు మాయమయ్యెఁ గంధిస్థము నా
వను బూరించె ధనము నె
మ్మనమున నల్లుండు చెందె మామయు ముదమున్. 92

ఆ. వె. అట్లు ముదము చెంది యావృద్ధు సాక్షాత్తు
సత్యదేవుఁ డనుచు స్వాంతమందు
నెఱిఁగి యెఱుక చాలకే చేసిన దోసంగు
సైఁపు మనుచుఁ బెక్కుపార్లు మ్రొక్కి 93

తే. గీ. ఇంట కేగిన తక్షణం బింతకాల
మాలసించిన తప్పిదం బఱఁగఁ బరఁగ
నీవ్రతం బొనరించి మనీషివరుల
సత్కరించెద నని ప్రతిజ్ఞను బొనర్చి. 94

వ. విత్తపూరితంబగు నౌక నధిరోహించి కతిపయదినంబులకుఁ దన
నివాసంబు రత్నపురంబు సమీపించి యొకదూతను దనయింటికిం
బంపుటయు వాఁడరిగి 95

కం. అమ్మా! దయచేసిరి సే
మమ్మగ నల్లుండు మఱియు మామయు నొకక్రో
శమ్మున గల దదె నౌక సు
ఖమ్ముగ సకలంబు దేవుకరుణ నెసంగెన్. 96

వ. అవి నొడువుటయు నాసాధ్వీవ్రతంసమ్ము పట్టరానిముదమ్మున బొంగి యీసుయోగంబునకు గతంబు తనయొనర్చిన వ్రతంబ యని తెలిసికొని "అధిక స్యాధికం బల"మ్మనుకొని మరల యధాశక్తిని వ్రతం బొనర్చికొని భర్తృసందర్శన లాలసంబగు మనంబుతో గొమిరెను వెనుక నుండి రమ్మని చెప్పి తా నోడరేవున కరిగి నౌకాగమనంబు నిరీక్షించుచుండె. 97

తే. గీ. కూతురు కలావతియు మది గుతుక ముప్ప
తల్లి వేగిర పెట్టగా దల్లి యేగు
త్రోవనే యేగె నాపె సత్యవ్రిప్రసాద
మాహరింపమి సత్యనారాయణుండు. 98

తే. గీ. రుష్టుడైన కతమ్మున రోషఫలిత
మాపె భర్త సముద్రంపుటలలబడిన
యట్లుగా దోచె నప్పటి యదరు చాల
శోచనీయంబు పిమ్మట సుఖముగలిగె. 99

వ. అట్టి మహావిపత్సమయంబున నీయపరాధంబు స్వల్పంబగుటం జేసి శ్రీ సత్యదేవుండు తనచిత్తమ్మున నుపశమిల్లి ఆకాశవాణీద్వారమ్మున నిట్లుపాయంబు దెలిపె. 100

ఉ. ఎందుల కూరకే వగతు రేమి ప్రయోజన మీపె యింటికిన్
గ్రందుగ బోయి భక్తి యలరంగ బ్రసాదము నాహరించినం
తం దనభర్త బొందెడిని దథ్య మటంచు వచింప వట్టు లా
చందనగంధి నల్పి పతిసంగత య్యె ముదంబు చిప్పిలన్. 101

వ. పదంపడి యవ్వణిక్ఛిరోమణి స్వగేహమ్మునకుం జనిన మఱునాఁడు లోగడ నొనర్చిన లోపములెల్లఁ దీఱునట్లు మహావైభవోపేతంబుగ సత్యదేవు నారాధించి యంతమాత్రంబ కాక తఱచుగ నీవ్రతం బాచరించుచు ననేకులకు మార్గదర్శకుండయ్యె. నీవ్రతమ్మునందు ముఖ్యముగా గమనింపఁదగిన యంశము ప్రసాదస్వీకరణము. అందేమాత్రము ననాదరంబు సంఘటింపఁ గూడదు. అట్లు సంఘటించినచోఁ బొసంగుచిక్కు కళావతికిఁ దొడరిన చిక్కువలననే యెల్లరకు విశదంబైనను వేఱొక్క యుదాహరణంబుగూడ నుటంకింతు వినుండు.

కం. తుంగధ్వజుఁ డనియెడి నృప
పుంగవుఁ డొకనాఁడు వనికిఁ బోయి మృగయ పే
ర్మిం గడు విహరించి యొకట
సింగార మ్మొలయు చెట్టుచెంత వసించెన్. 103

వ. అట్లు రాజన్యుండును దోడ వచ్చిన పరివారంబును మృగయావిహార పరిశ్రమం బపనయించికొనుచు నొకవటమహీరుహంబు చాయ నున్నసమయంబున. 104

ఉ. కొందఱు గోపబాలకులు గోధుమపిండియుఁ బంచదార పే
ర్మిం దగు తక్కువస్తువులు మిక్కిలి చక్కఁగ సేకరించి యా
లం దమమందలోఁ బితికి లక్షణయుక్తము గాఁగ సత్యదే
వుం దలపూన్చి భక్తిమెయిఁ బూవులఁ బత్తిరి గూర్చి పేర్చుచున్.

చ. ఒకఁడు పురోహితుం డొకరుఁడో? యజమానుఁడు గాఁగ సత్యదే
వుకత యొకండు సెప్పఁ బరిపూర్ణతరంబగు మూఢభక్తి న
వ్వికటమునందు భూపతి యనింద్యచరిత్రుఁడు చూచుచుండఁ ద
క్కక సకలంబునున్ వ్రతము గల్పమునం గలయట్ల చేసియున్.

కం. వసుధేశుఁ బిల్వఁ గలసా
హసమునకున్ బిల్వగలఁ బ్రయత్నించి పౌరీ
గుసగుసలు వోయి పయి సా
హసించి యొకపత్రపుటమునం దెలమి మెయిన్. 107

వ. సమృద్ధమ్ముగా శ్రీసత్యదేవ ప్రసాదంబు పొందుపఱచి యందఱు నొక్కని బురోగామిగా నలంకరించి వానిచేతికి నాపత్రపుటం బిచ్చి వినయవినమితగాత్రులై శ్రీసత్యదేవునిపైఁ గీర్తనలు పాడికొనుచు భజన చేయుచు నాట్యంబు సేయుచు నారాజన్యునికిఁ గొండొక దవ్వు దనుకం జని యందఱు నటనుండి చేతులు జోడించి సాష్టాంగదండ ప్రణామం బాచరించి తమతెచ్చిన ప్రసాదంబు వానిపాణితలంబున కందిచ్చునంతటి చొరవ లేమిం జేసి కొండొక సమీపప్రదేశం బుత్తరీయమ్మునం దుడిచి శుభ్రపఱచి యటనుంచి మూకీభూతవక్త్రులై భయకంపమ్ములతో యథాపూర్వమ్ముగుచోటికిన్ జని తక్కిన ప్రసాదంబు యథోచితంబుగఁ బంచికొని సాపడి యథేచ్ఛం జనిరి. 108

చ. నృపుఁ డది గాంచి సంతసము నెంతయు జెందెను గాని దత్తప
త్రపుటమునందు నుండిన పదార్థము తాఁ దినలేదు చూడలే
దపరిమితంబు రాజ్యమద మట్టు లొనర్పఁగఁ జేసె నప్పురం
తపు నది సత్యదేవునికిఁ దద్దయు నాగ్రహమున్ ఘటించుడున్. 109

ఆ. వె. అతనిపుత్రశతక మామయావిల మయ్యె
ధనము సురిఁగిపోయె ధాన్యమటె మ
ఱేమి చెప్ప నున్న దెన్నియో యాపదల్
వచ్చి చుట్టుకొనియె వసుమతీశు. 110

చ. జనపతి విజ్ఞుఁ డయ్యు దనస్వాంతము రాజ్యమదంబు దొట్టి చే
సిన దొసఁ గింత దెచ్చినది సేగి సురేశ్వరుఁ డంతవాఁడు శ
త్రువిహతుఁ డయ్యె నొక్కయెడ దోసము లిట్టి వొనర్చి: లెక్కయే
మనుజపతుల్: సురామదము మాద్రిది రాజ్యమదంబు సర్వథా. 111

ఆ. వె. విజ్ఞుఁడైన కతన వెంటనే తనదోసం
గెఱిఁగి సత్యదేవు నెడల నాఁడు
సల్పినట్టి తప్పె సర్వకష్టములకు
హేతువనుచు నచటికేగెఁ దెలఁచ. 112

వ. అట్లేగి ఘోషంబునం గల గోపగోపీజనంబుల నాబాలవృద్ధంబుగా
నయ్యెడకు రప్పించి తన్మధ్యంబునఁ దాను రాజ్ఞీసమేతంబుగఁ
గూర్చుండి యథాశాస్త్రమ్ముగ వ్రతంబు సల్పి వెండియు. 113

చ. కొమరులయామయం బుడిపి కొండొక కస్తియు సోఁకకుండ ధా
న్యము ధనముల్ స్వరాజ్యము సమస్త మనీతికమై యనీతిక
క్రమమున సుందకుండఁగ భరం బఖిలమ్మును నీవ తాల్చి న
న్ను మహినిమిత్తమాత్రము గనుంగొను వానిగఁ జేయు మచ్యుతా. 114

మ. కరి రక్షించిననాఁటి పేరిమి ధ్రువుం గాపాడునాప్రేమ ని
ర్జరులం బ్రోచిననాఁటిజాలి ద్రుపదక్ష్మాజాసుపుత్రిం బొరిం
బొరిఁ గోకల్ వితరించి మన్పు నలయాప్రోపు న్ననున్నేఁడు వి
జ్వరుఁ గావించునుగాక దైవతమతా! సత్యా! జగద్రక్షకా! 115

ఉ. నన్నును బోలురాజులు జనార్దన! యెందఱు చెల్లిరో మదా
ధ్యున్నతికల్మిఁ దోఁపక యయో! జనుషాంధులయట్ల చక్కనౌ
తెన్నునఁ బోక పోవుదు రెదే చెడుతెన్నున; బుద్ధి దప్పి నా
యున్నది గోలుపోతిఁ గృప నున్నది యున్నటులోము మచ్యుతా? 116

తే. గీ. నీదువ్రతసత్త్వమెల్లను నే నెఱింగి
కూడ నొప్పరికించితి గొల్ల లనుచు
గొల్లలందు నీకుం గల కూర్మి కంతు
లేదని యెఱుంగ లేనైతి లేకి నగుచు. 117

చ. నను సయిరించి ప్రోవవలె నందనులన్ గరుణింపఁగా వలెన్
మనుమల మన్పఁగావలయు మామకరాజ్యమునందు నెల్లెడన్

ధనమును ధాన్య మన్యమును దామరతంపర గాఁగ నుండు న
ట్లొనరుపఁగావలెన్ శుభమహోదయముల్ ఘటియింపఁగావలెన్. 118

వ. ఇట్లు పలుతెఱంగుల బ్రార్థించు నల తుంగధ్వజ నృపాలునియెడల నార్తత్రాణపరాయణుండగు శ్రీసత్యనారాయణుండు కరుణించుటంజేసి

సీ. కొమరు లామయమునకును దూరమై సుఖం
బెలమియుఁ జెల్వొంద నింపుగనిరి
మనుమలు మనుమరాండ్రును మునిమనుమలు
దోసతోఁటకు మించు వాసి గనిరి
గుఱ్ఱమ్ము లేన్గులగుంపులు నాలును
వృషభమ్ములును నభివృద్ధి గనియె
నెపుడు కావలెనన్న నపుడె వర్షించుటం
జేసి కేదారముల్ శ్రీల నీనె

తే. గీ. సత్యనారాయణుని వంటి సత్యమైన
దైవతము గాని యట్టి వ్రతమ్ముగాని
లేదనెడిమాట సర్వత్ర పాఁదుకొనియె
వింటిరయ్య? మునీంద్రులు వీను లలర. 120

వ. ఇంకొక్క విశేషంబు గలదు వ్రతము లేవియైన భక్తిశ్రద్ధాసమన్వితులై యొనర్చువారలకు సర్వాభీష్టప్రదంబు లగు నీకలియుగంబునందో. 121

తే. గీ. సత్యనారాయణవ్రతాచరణ మఖిల
సంపదల నిచ్చు నాపదల్ సమయఁ జేయు
నాయురారోగ్యపుత్ర పౌత్రాభివృద్ధి
గలుగఁజేసెడి వింత నిక్కమ్ము వినుఁడు. 122

వ. ఈ సత్యనారాయణవ్రతముచేయువారు సర్వదుఃఖవినిర్ముక్తులై సుఖాలవాలమ్ములై యిహమ్మునఁ జిరముండి దేహపాతానంతరము శ్రీనారా

యణసాన్నిధ్యంబు వడయుదు రనుటలో నేమి విశేషమ్ము గలదు. శుభప్రదంబగు నీవ్రతమ్ము చూచినవారు కథ రచించినవారు విన్న వారు వీరలెల్లరును నిరామయాయురారోగ్యవంతంబగు కుటుంబమ్ము గలిగి సుఖంబుందురని వెండియు. 123

సీ. బద్ధుండు వినెనేని బంధనిర్ముక్తుఁడౌ రుగ్ణుండు వినెనేని రుజనుబాయు
విద్యార్థి వినెనేని విద్య సంప్రాప్తించు నటులె కన్యార్థికి నబ్బుఁ గన్య
ధనధాన్యములుగోరు మనుజన్మునకు ధనధాన్యసమృద్ధి సంతతముగల్గుఁ
బాపావనోదనం బేపాటి వాంఛించు వాని కయ్యది దీనివలనఁ గలుగు

తే. గీ. కలియుగమునందు నీదృశం బలఘుతమము
వ్రతము గన్పట్టఁబోదు నారాయణుండు
నారదుండు గోరినఁ బురాణవ్రతముల
నరసి యరసి వచించె రహస్య మనుచు. 124

వ. ఈ వ్రతమ్మునకును సత్యనారాయణునకును భేదమ్ము లేదు. వ్రతమే సత్యనారాయణుండు; సత్యనారాయణుండె ఈవ్రత మని ఎఱుంగునది. యియ్యది యొసంగని భద్రంబు లెయ్యేవి లేవని సూతుండు శౌనకాదులకు వచింప నమ్మహాముకులు విని సంతుష్టాంతరంగులై సుఖంబుండిరి. 125

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుచుంటి నిన్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది

శ్రీ సత్యనారాయణవ్రతము

సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ మంగళగౌరీ వ్రతము.

కం. శ్రీవృషభవాహ ! హరిముఖ
దేవావళివంద్యమానదివ్యచరణ ? సం
భావితభక్తౌఘ ! మహే
శా ? విమలసుభావ ? మల్లికార్జునదేవా ! 1

వ. అవధరింపు మనంతరంబు పురాణశ్రవణ కుతూహలులగు శౌనకాది మహర్షిపుంగవులకు సూతుం డిట్లు చెప్పఁ దొడంగె నొక్కెడ పాండవాగ్రజుండగు ధర్మరాజు శ్రీకృష్ణభగవానునితో వ్రతంబులందెల్ల మహోత్కృష్టమైన వ్రతం బెయ్యది చెప్పుము నావుడు శ్రీకృష్ణుం డిట్లు వక్కాణించెఁ దదుక్తప్రకారంబున మీకు నేను వక్కాణించెద నాలకింపుఁడు. 2

తే. గీ. ధరణిఁ గుండినమనుపురవర మొకండు
కలదు కోమటి ధనికుండు కడుసుశీలుఁ
డప్పురమ్మున-ధర్మపాలాహ్వయుండు
వఱలుఁ దద్భార్యయొకనాఁడు భర్త కనియె. 3

చ. అనుదిన మేగుదెంచు భసితాంచితకాయుఁడు వృద్ధభిక్షుకుం
డనఘుఁడు బిచ్చమేనిడిన నందికొనం డతఁడేమొగాని చ
య్యనఁ బెడమోముగాఁ జనెడి నస్మదనంతర గేహమందుఁ గై
కొను నఘమేమి చేసితిమొకో ? మనమంచు విచారమయ్యెడిన్. 4

వ. నావుడు నావణిగ్వరుండు భార్యకిట్లను-రేపాభిక్షుకుం డరుదెంచి

నప్పుడు నీవు బంగారు నాణెములనే యతనికి బిచ్చం బిడుము
పిమ్మట నేమగునో? చూచికొందము నావుడు నప్పతివ్రతయు
నట్లొనర్ప నాభిక్షుకుం డానాఁడును బిచ్చంబు గ్రహింపక. 5

కం. ఇంతకు నోసతి! నీకున్
సంతతి లేదక్కట తమునఁ జనియెద. భిక్షన్
స్వాంతంబుగొన సహింపదు
సంతానమ్మిడు వ్రతమ్ము సలుపుము సాధ్వీ! 6

వ. అని వచించి చనియెడి యామహనీయు నంఘ్రులంబడి దీనాననయై
"స్వామీ! యేవ్రతంబొనర్చిన సంతానంబు గలుగునో యానతీయుం"
డని పలువిధంబులఁ బ్రార్థించుటయు, నాతండు సుప్రసన్నుండై యిట్లను
"నోసతీమణీ! లేనిపోని ప్రశ్నంబులడుగక నాచెప్పినచొప్పున నీ
భర్త యొనరించునేని మీకుసర్వంబును భద్రంబగు"నని వెండియు 7

తే. గీ. నీలవస్త్రమ్ము ధరియించి నీదుభర్త
నీలతురగమ్ము నెక్కి వనిని జరింప
వలయు నశ్వమెక్కెడ మోకరిలునో యచటఁ
ద్రవ్యవలయును బిదప భద్రమగు మీకు. 8

వ. ఇంతమాత్రము వచియించి యాభిక్షుక ప్రవరుం డరిగెఁ బిమ్మటఁ
దదుపదిష్టప్రకారమ్మున నాపె భర్తకు వచియించుటయు నావణి
క్పుంగవుండు దైవజ్ఞోపదిష్టంబగు సుముహూర్తమ్మున నీలవస్త్ర
ధారియై నీలంబగు నశ్వమ్ము నధిష్ఠించి వనంబున కరుగుటయు. 9

కం. కలకలమను పక్షులకూఁ
తలు చెవులకు విందుసేయఁ దరువులు ఫలముల్
గలయవి గలిగిన యటవీ
స్థలమొకఁ డగుపడియె వైశ్యసత్తముఁ డవలన్. 10

వ. దాని రామణీయకత్వంబున కక్కజంపడుచు జనుచుండ నతం డధి
ష్ఠించిన యశ్వంబు నిర్నిమిత్తంబుగా మోకరిలంబడుటయు, నతండు
ప్రయాణంబు చాలించి తనతోనున్న పరిచరులును దానును నాప్రదే
శంబును ద్రవ్వనారంభించుటయుఁ గొండొకలోఁతున. 11

మ. రమణీయంబగు దేవళంబొకటి యార్యాదేవి దేనాఁటనే
రమరంగట్టినదో ! విశాలతరమౌ ప్రాకారమొప్పార భ
ద్రము సూచించుచుఁ గన్పడన్ వణిజుఁ డారంగాంచి యాదేవిపా
దములన్ మ్రొక్కి నుతింప నయ్యుమయు నార్ద్రింబైన చిత్తమ్ముతో.

తే. గీ. ఏమి కోరికయో ! వచియింపుమనుడు
నంబ ? నాకు సమస్తంబు హస్తగతము
సంతుమాత్రము లేమిని జింతనొగులు
వాఁడ నననంబ యిట్లను వణిజుతోడ, 13

వ. ఎంత పరిశీలించినను నీకు నపత్యభాగ్యంబు పొడకట్టదు. కాని నాకు
నీవిప్పు డొనర్చిన పూజ మిక్కిలి వర్ణనీయమగుటంజేసి యిది వృథా
పోరాదు కావున నీకు నల్పాయుష్కుఁడగు కొమరుండు కావల
యునో, దీర్ఘాయుష్మంతురాలు సౌభాగ్యవిహీన కూఁతురు కావల
యునో కోరికొమ్మనపుడు వర్తకుండు. 14

కం. పితరులు తరియించుటకున్
సుతుం డుపకరించుఁగాని సుత లేశమ్మున్
బితరుల కుపకృతి సేయదు
సుతునే దయసేయుమనియె సూరి హితముగన్. 15

వ. నావుడుఁ బరమేశ్వరి వానికిట్లను "ఈ నాపార్శ్వమ్మున నున్న గణ
పతిఁ బ్రార్థించితివేని పరిపక్వఫలభరితంబగు చూతం బొండుకమపట్టు
దాని నుండి యొక్కఫలమ్మును మాత్రము కైకొని నీభార్యకిమ్ము

నీకోరిక నెఱవేఱుననుటయుఁ దదుక్తప్రకారమ్మున నావృక్షంబు పొదకట్టెనంత నావణిగ్గనుండు. 16

కం. ఫలములసొబగునకున్ మి
క్కిలిగాముది లోభమందఁ గెరలియనేకం
బులుగోసికొనియె ఫలములు
లలిఁదుద కొక్కటియె తత్ఫలములన్నిలిచెన్. 17

వ. అందుల కక్కజంపడి యసకృదావృత్తిగా నాచెట్టునుండి పలుఫలమ్ములుగోసి యొడిలో భద్రపఱచెఁగాని తుట్టతుద కొక్కండుదక్కఁ దక్కినవి మాయమ్మగుచుండె నంత నతండిఁకఁ గోసి ప్రయోజనంబు లేదని దానింగైకొని యటనుండి మరలె. గణేశ్వరుండు వాని యాశకుఁగనలి నీకుంబొడము పుత్రునకుఁ బదునాఱవయేట సర్పగండంబు ప్రాప్తమగునని శపించె నిందులకుఁ గారణంబు వర్తకుం దసకృదావృత్తిగా నెన్నిసారులు ఫలంబులు గోసినను నయ్యవి పదాఱుకు మించమియేయని యెఱుంగునది అనంతరం బాతండం బకు మ్రొక్కి స్వగృహమ్మున కరుదెంచి యాఫలమ్మ తనయర్థాంగి కొసంగుటయు నది యాపె నియమపూర్వకమ్ముగ భక్షించి గర్భవతియై శుభముహూర్తమ్మున ద్వాత్రింశల్లక్షణోపేతుండగు సుకుమారుంగనియె. వానికి జాతకర్మాదికం బొనరించి వణిక్ప్రేష్ఠుండు సుఖంబుండునంతఁ బదియాఱవయేఁడు దాపగుటయు నాతని భార్య వివాహంబొనరింపుమని భర్తను హెచ్చరించుటయు నతండు గండకాలంబు విన్నవాఁడు గావున దానిం దప్పికొనుటకుఁ బరమేశ్వరారాధనంబు సాధకమగునని యెంచి గూఢమ్ముగా భార్యకిట్లను. నీతమ్ముఁడీమధ్యఁ గాశీయాత్రంబొనర్ప నున్నవాఁడు. వీఁడు పరమేశ్వరీ కృపాలబ్ధజన్ముండగుటంజేసి వీనివి మేనమామతో బతఁజేసి కాశికిం బంపి యచ్చట శ్రీవిశాలాక్షీ విశ్వేశ్వరుల యనుగ్రహముఁ బడయు

వానిఁగా నొనర్చి పిమ్మట వివాహప్రయత్న మొనర్చుట క్షేమకరము. కారణము నీకింతనుకఁజెప్పక రహస్యముగా దాఁచిపెట్టితి. నిప్పుడు చెప్పక తీరమింజేసి చెప్పుచుంటి నాలింపుము. 18

చ. ఫలమిడినాఁడ నీకు నల పండొకఁడేయనుకోకు కోసితిన్
ఫలములు చాలనంబిక కృపన్ సెలవిచ్చిన దొక్కపండుకే
తలఁపున నున్నలోభమది తద్దయుఁ బ్రేరణచేసి నన్నువెం
గలినొనరించె విఘ్నపతి గ్రక్కున శాపమొసంగెనుగ్రుఁడై. 19

వ. లోభగుణమ్మునంజేసి నేను బరమేశ్వరియాజ్ఞ నుల్లంఘించి యెన్నో సార్లు పదాతేసిఫలములు గోసికొని యొడిలోఁ బదిలపఱచి యీవలికి వచ్చి చూచినంత నొడిలో నొక్కండుదక్కఁ దక్కినవెల్లో సురింగి మాయమయ్యెడివి. గణపతి యీపదాఱుసంఖ్యంబట్టి కాబోలుఁ బది యాఱవయేట సర్పగండంబురా శపియించెనదియునుంగాక. 20

చ. జననినినేను సంతతినొసంగుమటంచును గోరనాపె పు
త్రునొసఁగుచున్ జిరాయువునఁ దూఁగఁడు పీఁడనియానతిచ్చెఁద
త్తనయుఁడటుల్ శపించె నిది తద్దయునామది శల్యమట్లు కొం
కును గలిగించు నీశ్వరునిగొల్చి తరింపఁగవచ్చు నాపదల్ 21

ఆ. వె. భార్య యింతయంచుఁబల్క దల్పాయుష్కుఁ
డనియెఁగొడుకు తాఁబదాఱటనియె
మును మృకండు పుత్రుమనిచిన శివుడుప
దాఱునూఱుచేసి యనుపనేమొ. 22

కం. అనినాకుఁ దోఁచి కాశికిఁ
దనయుని బంపింపఁగానెదం దలఁచితి నీ
వనుమోదింపుము కొమరున
కనుగ్రహము పేయు నభవుఁడమితాయువొగిన్. 23

కం. తానన్నమాటనే భ
క్తానుగ్రహపరవశత్వమంది భవుండీ
శానుఁడు మార్చెనుగద? తన
సూనువినుడితప్పఁజేయఁ జూడఁడె తరుణీ. 24

కం. సర్వాధికారిగదా ఆ
శర్వుఁడు నూఱాయుసేయఁ జాలునునాయున్
బర్వేందువదన? నూటై
పర్వంగనౌనర్చు నెవరువలదనువారల్. 25

ఆ. వె. అలమృకండు సుతునుదంతమిప్పట్ల సా
క్ష్యంబొసంగు మనకు నఖిలమును శు
భంబయగును సుతుని బంపుదమచట మృ
త్యుంజయుండుగలుగ నొండుకొదవె. 26

తే. గీ. కలరు దేవతలెందఱో కలసిసర్వ
లోకకృతల శంకరుండు వేఱొకకృతల గఁ
దూఁపశంకరుఁ డెచ్చయితూఁగు నబలః
మనసుతు శతాయువుగఁ జేసిమనుచు నతఁడు. 27

తే. గీ. ఎన్నియోగాధలున్నవి యీశ్వరుండు
మనిచినవి యర్ధవాదము లనఁగరాదు
పంపుదము కాశికాత్మజుఁ దెంపుచేసి
యింత కొండుపాయమ్ము నేనెందుఁ గాన. 28

కం. ఫలియించిన ఫలియించును
ఫలియింపక పోయెనేవి పరమార్ధంబుగా
గలిగించు శివారాధన
కలికీ! యిద్దానిఁ బోలఁగలదేది భువిగా. 29

కం. శివ! శివ! శివ! శివ! శివ! శివ!
శివ! శివ! శివ! యనుచు నెవఁడు చిత్తమునందుఁ
శివు స్మరియించునొ? వానికి
శివుఁడు వశుండగుచు నిచ్చుఁ జిరజీవితమున్. 30

వ. అంతియకా దింకొక్క విశేషంబుకల దాకర్ణింపుము. 31

తే. గీ. ఎవఁడు శివనామమును స్మరియించుఁ దఱచు
వాఁడనామయ మాయుష్యమందు మాత్ర
గాదు వావిసంతానంబుఁ గాంచు దీర్ఘ
మైన యాయుష్యమని నమ్ము మాత్మ నబల. 32

కం. మెత్తని దేవరశివుఁడా
మెత్తఁదనం బిట్టిదనుచు మెలఁతరో! నేగిం
చిత్తును వచింపనేరను
నెత్తెఱఁగువనేని మనుచు నీమనకొామరున్. 33

తే. గీ. ఎందు కల్పాయువగు సుతునిచ్చితనుచు
నాత్మసతి మందలించును నాత్మజాతు
శాపమిదనేల? యని కొంత కోపపడి మ
రల్పఁగాఁ జేయునెట్లొ భద్రమ్ము గూర్చు. 34

కం. సుతుని న్వివిపించు సమ
ర్థతలేదో శంకరునకుఁ దనయర్థాంగిఁ
మతిఁ ద్రిప్పునంతటి సమ
ర్థతలేదో? శివుఁడిడుఁ జిరంబాయువెటో. 35

వ. అని భార్యకు ధైర్యంబు చెప్పి ధర్మపాలుండు మేనమామను దోడొ
సంగి మఱికొంత పరివారంబుతో నపారంబగు ధనంబుతోఁ బెండ్
లికిం బంపువిధంబునఁ బ్రయాణసన్నాహం బొనరించి శుభముహూ
ర్తంబునఁ గాశికి నంపుచుఁ దన స్యాలకుతో నిట్లు వక్కాణించె. 36

తే. గీ. త్రోవ నెన్ని క్షేత్రంబులు శ్రీ విరూప
నయనుఁడుండెడి వగుపట్టునయవిధాయ
కంబులన్నియు సేవించి కడుధనంబు
గర్చుపెట్టుఁడు పురవైరికరుణ వడయ. 37

తే. గీ. భస్మరుద్రాక్షధారులౌ భక్తవరులు
కనుపడినవారిఁ బోనీక కాన్కలొసఁగి
యాదరింపుఁడు శివునికి నల్లవారు
సన్నిహితబంధువులు సుఁడీ ? సత్యమింత. 38

తే. గీ. మించి పోయినదేదియు మీకు లేదు
తీర్థములఁ దీర్థవాసుల దేవరలను
గాంచుచును సేవఁజేయుచుఁ గాశికేగుఁ
డన్నియును మీకు భద్రమ్ములగుఁ కరుణ. 39

వ. అని బోధించి యనుపుటయు నాధర్మపాలుని స్యాలకుండు శివాభి
దానుండగు తనమేనయల్లునితోఁ దనబావ ధర్మపాలుం డుపదేశించిన
విధమ్మునఁ దత్తీర్థమ్ములఁ గ్రుంకులిడుచు దేవరల సేవింపుచుఁ
దద్దేవతాభక్తులకు ధనకనకవస్త్రాదుల నొసంగి వారల దీవనలు వడ
యుచుఁ గడుంగడు మెల్లఁగా నాయాక్షేత్రమ్ములు సేవించుచు నేగు
నెడఁ బ్రతిష్ఠానపురంబు త్రోవలోనిదగుటంజేసి యాపురంబు ప్రవే
శించి ఘంటాపథంబున నరుగుచున్నయెడఁ బెండ్లికీడయిన కన్ని
యలు కొందఱొక్కచో గుమిగూడి యాడికొనుచు నంతలోఁ
దమలోఁ దమకుఁ గలహంబంకురింప నందొక్క గయ్యాళి సుశీల
యను నొకవైశ్యబాలికపై దుమ్మెత్తిపోయుచు. 40

ఆ. వె. ఈవు విధవవయ్యెదిది నీకు శాపంబు
తప్పదెప్పటికిని దధ్యమింత

యన సుశీలనవ్వి యాతిట్టుఁబోతు గ
య్యాళికిట్టులనియె నతిసుశీల. 41

కం. మంగళగౌరీవ్రతమో
యంగన! మాయమ్మచేసె నక్కతమున మా
వంగడమున మాంగళ్యమె
సంగవిసతి పుట్టఁబోదు శాపమువమ్మా. 42

చ. ఎఱుఁగవునీవు కోపమున నేడ్తెఱనన్ను శపించి తావ్రత
స్ఫురణముకల్మి మాకులమపొంద ద భద్రము, లించుకంత మా
పరిచితియున్న నెల్లరును భద్రములందుదు, రీవుమాదు చు
ట్టఱికముగల్గు దానవగుటఁ జరహాయింతు చిరంబుభర్తతో. 43

వ. ఇట్లు సుశీల తన్ను ద్వేషించు గయ్యాళిని మాఱు శపింపక యాశీర్వ
దించుచుఁ బలికినపలుకు శివుని మేనమామ విని యక్కన్నియ తల్లి
చేసిన వ్రతంబుకతన నాపెకు నిత్యసుమంగళీత్వంబు సిద్ధాంతంబగు
టకు సంతసించి, అల్పాయుష్కుండగు తన మేనల్లుని కెట్లేని
యిక్కన్నియను భార్యగాఁజేయఁదలంచి తత్కార్యనిర్వహణంబు
దేశాంతరీయునకు దనకెట్లుసంఘటించునని యూహించుచు గొన్నాళ్ళ
క్కడ నివసించుటయె కార్యసాధకంబనితలఁచి యట్లొనరించెనంత.

ఆ. వె. ఆసుశీల జనకుఁడగు హరియనుగేస్తు
కొమిరెపెండ్లి సేతకుంగడంగి
అంబికాలయమునకరిగె నాపెకు విన్న
వించు కోర్కిమదిని వెల్లివిరియ. 45

వ. అట్లరిగి యమ్మహేశ్వరి నర్చించి ప్రణమిల్లి. 46

కం. ఈవిసువు నీవ్రతము మ
న్నావిని కావించుకతన మాకిచ్చితివీ

శావి ! వరుఁదగిన వానిన్
మానుగ ఘటియింపవలెఁ గుమారీ మణికిన్. 47

వ. ఇట్లు ప్రార్థించునంత నంబిక యశరీరవాణీముఖంబున నిట్లు వాక్రుచ్చె.

చ. వెదకఁగనేల ? నీవువరు, విశ్వజనీనగుణాఢ్యుఁ డందగాఁ
డదె మనయూర నిక్కడి తటాకమునొడ్డున నున్నవాఁడు సం
పదగలవాఁడు కాశిఁజనువాంఛను నిల్వడి వచ్చినాఁడు త
త్పదనమదే కనుంగొనుము చక్కని నీసుతకెంతయుఙా దగున్. 49

వ. అప్పలుకులు విని యంబిక తనభార్యయుఁ దాను నల్పు భక్తికి సంతసించి యిట్లు లాకాశవాణీముఖఁబున నానతిచ్చెనని సంతసించుచు మఱునాఁడు గొందఱు బంధుగులతో మంగళవాద్యపురస్సరంబుగ నాయింటనున్న శివుని మేనమామను సందర్శించి సబహుమానంబుగా సాంజలి బంధంబుగా నిట్టు లర్థించె. 50

కం. పరమేశ్వరి మీశివునిన్
వరుఁగా మాకన్నె కేరుపఱచి వచించెఙా
గరుణించి మీరలంగీ
కరించి మాకోర్కె తీర్పఁగావలె ననుఁడుఙా. 51

వ. అనవుడు శివుని మాతులుండు సగౌరవంబుగా సమ్మతిం జూపుచు, నార్యా ! మా మేనయల్లునికి మీకన్నియను బెండ్లిసేయుటకు సర్వథా సమ్మతంబ, మాయప్పగాని బావగారుగాని నామాట త్రోసిపుచ్చరు. నాకుఁ బుత్రసంతతియకాని పుత్రికాసంతతి యిప్పటికి లేదు–ఉన్నచో మన కులమర్యాద ననుసరించి యితరకన్యలం జేసికొనుట పాడిగాదని మీకుఁ జెప్పనక్కఱలేదని వెండియు. 52

ఆ. వె. నాకు నాఁడు సంతులేకున్న నేనేర్చి
కూర్చినట్టి పెండ్లికూఁతుఁజేసి

కొనుటయేని వారిమనమున కొండొక
సంతసం బొసంగఁ జాలుననఘ. 53

వ. నేటినుండి మన మన్నదమ్ములము; మీకొమరె నాకొమరె; ఇప్పుడు లఘువుగా వివాహమర్యాద నెఱవేర్చికొందము. కాశీవిశ్వేశ్వరు సందర్శించి వచ్చినపిదప మనమనవైభవంబులకుం దగినట్లు లాంఛనంబులు పొంపిరివోవ నొనర్చికొందమనిన నట్లకాకయని కన్యకాజనకుండు హరిసమ్మతించె. 54

చ. పదపడి కాశికేగి యలవైశ్యకుమారుఁడు మేనమామయున్
సదమలభక్తి శంకరుని శాంకరిసిన్ యజియించి విఘ్నరా
ట్పదనముమెట్టి యయ్యనఘుఁ జాలినభక్తిఁ బ్రహృష్టుఁ జేయుబల్
ముదమెదనొంది తాసడినముందటి శాపముగ్రమ్మరింపగన్. 55

వ. తలంపుపుట్టి నాఁటిరాత్రి స్వప్నమ్మునంబొడకట్టి "భద్రా! నీ తండ్రి సల్పిన లోభగుణప్రయుక్తంబగు నవివేకమ్మునకు నాకే పమ్మొదవ నేనుశపించిన శాపమ్ము నీవు నేఁడు నాకొనర్చిన పూజాపురస్కారమ్ములకు సంతసించిన నేను గ్రమ్మరించుచుంటి. నామమాత్రంబుగ నీవు సర్పదష్టుండవగుదువు. నీభార్యయందలి ప్రీతింజేసి మజ్జనని మహేశ్వరి దండధరుని దూతల నవ్వలికిందోలి నిన్ను బ్రదికించునని యంతర్థినందెఁ. బదంపడి కాశినుండి మరలి ప్రతిష్ఠానపురంబరుదెంచు నప్పటికి శివుని తల్లిదండ్రులును సపరివారంబుగా నటకరుదెంచి మంగళగౌరీవ్రత దీక్షితురాలుగా నున్న కోడలింగాంచి సంతుష్టాంతరంగులైరి యనంతరంబు, 56

తే. గీ. మేనయల్లునితోడను మేనమామ
కాశికాపట్టణమునుండి కదలివచ్చి
బావకప్పకు సంతసంబావహిల్లఁ
బెండ్లి నెఱవేర్చికొనిరి సంప్రీతి మెఱయ. 57

చ. కొమరువిగండము౯ గుఱిచి కోమటిబిడ్డఁడు ధర్మపాలుఁడే
క్రమమునఁ దప్పిపోవునని కాలగళున్ స్మరియించుచుండె నం
తమిహిరగోత్రపుత్రియలతన్వి సుశీలకు నొక్కరేయి స్వ
ప్నమున నిటుల్వచించెను గృపాపరిపూరిత లోచనాబ్జయై. 58

వ. సుమంగళీ! నీతల్లి చిరకాలంబు మంగళగౌరీ వ్రతంబొనర్చిన పుణ్య
శీల. అక్కృతంబున నాపెతో నేమాత్రము సంబంధమున్న కన్నియల
కేని వైధవ్యదుఃఖమువలని భయంబుండదు. పైఁగా నీకు వివాహం
బైనదిమొదలా వ్రతంబు శ్రద్ధాభక్తులతో నొనరించుచుంటివి. నీపతికి
నెట్టి యపమృత్యుభయంబును గలుగరాదు. కాని, మత్తనయుఁడు
శపించినది వృధపోవరాదు గాన నేఁటిరాత్రి నీపతిని సర్పంబుగఱచి
వెంటనే నేనువచ్చి బ్రదికింతు నీసుమంగళత్వంబునకు భంగంబు
గలుగనీనని యభయంబిచ్చి యంతర్ధినొందె. నంబికచెప్పినచొప్పున
భార్యాభర్త లున్న గదిలోనికెట్లో సర్పంబొండు ప్రవేశించి సుశీల
చూచుచుండగనే శివునిం గఱచి విగతజీవుంజేయుటయు సుశీలయం
బికావాక్యమ్ముల యందలి విశ్వాసమ్మునంజేసి కంటఁ దడిపెట్టక
జగదంబను స్మరించుచు ధైర్యమ్ముగాఁ జూచుచుండె నంతట. 59

ఆ. వె. నిదురనుండి లేచు పోటున శివుఁడు తాఁ
జచ్చి బ్రదికి తనదు జాయతోడ
కలనుగంటి ననుచుఁ గడచిన వృత్తాంత
మిట్లు చెప్పఁదొడఁగె నెనక మెసఁగ. 60

వ. మనోహారిణీ! నన్నొక్క మహాసర్పంబు గఱచినట్లును గతప్రా
ణుండనైన నన్ను దండధరుని దూతలు వచ్చి చుట్టుముట్టినంత జగ
న్మాతయగు మంగళగౌరి వారల వారించి నాప్రాణంబులు నాకిచ్చి
నట్లును గలగంటి ననవుడు నాపెయు నితరమేమియుం జెప్పక విని

యిట్టి స్వప్నంబు శుభప్రదంబ యని మాత్రము చెప్పి యప్పటికి మిన్నకుండి పదంపడి యత్తమామల కాయీవ్రతప్రభావంబును విధానంబును జెప్పె. వారలు పరమానందభరితులై శాశ్వత సుమంగళీత్వంబలరు కోడలితోడను దీర్ఘాయుష్మంతుండగు కొమరునితోడను దమపురం బరిగి సుఖంబుండిరని శ్రీకృష్ణభగవానుడు ధర్మజున కెఱింగించెనని సూతుండు శౌనకాదుల కెఱిగించి యీ మంగళగౌరీవ్రతంబు సౌభాగ్యప్రదంబకాక సంతానప్రదంబును నిరామయాయురారోగ్య ప్రదంబును నని వక్కాణించె. 61

కం. దేవా। యావత్తైలం
తావద్వ్యాఖ్యగద। దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుచుంటి నిన్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది
శ్రీ మంగళగౌరీ వ్రతము
సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ వినాయకచతుర్థీ వ్రతము.

కం. శ్రీకర। భక్తౌఘాఘని
రాకరణ చరణానుకంప। యఖిలాపద్దూ
రీకరణ। విన్ను గొల్తున
యా। కించలువోవ మల్లికార్జునదేవా। 1

వ. అవధరింపు మట్లు పురాణకధనోన్ముఖుండగు సూతుంగాంచి శౌన
కాదు లభినందించుచు నిట్లనిరి. 2

తే. గీ. వేదశాస్త్రమ్ములం గల వివిధములు ర
హస్యములు నీవచించు సమస్తకథల
గోచరించుచునున్నవి మాచదువున
కిపుడు సార్థక్యమబ్బె నిన్నెంచఁదరమె. 3

కం. ఏదోమాదిరి గ్రుడ్డిగ
వేదము సాంగమ్ముగఁ జదివిన లాభమురాఁ
బోదని నీవాక్యమ్ములు
సోదాహరణములు మాకు నుపదేశించెన్. 4

కం. ఒక్కొక్క వ్రతమునందునఁ
బెక్కు విశేషములు మాకు వినిపకొలందిన్
జక్కెరలుగఁ గన్పట్టెడి
మిక్కిలి ధన్యులము నీవు మిత్రుఁడవగుటన్. 5

తే. గీ. జన్మతశ్శూద్రుఁడవు నీవు జ్ఞానమందు
విన్నఁబోలెడి విప్రుఁడ నిజము మృగ్య
లక్ష్యతనఁగాదె! సుతుతో సహపఠనమునఁ
గలిపి సాత్యవతేయుండు గఱపె విద్య. 6

ఆ. వె. కొడుకుతోడఁ జదివికొనుట యల్లునితోడి
భోజనంబు ననెడి బుధజనోక్తి
కీవు ప్రథమలక్ష్యమెంతని వర్ణింతు
మనఘ! నీయదృష్టమనుపమంబు. 7

వ. మఱియొండు వ్రతవిశేషంబు నీవలన వినఁగోరెదము నావుడు
సూతుండు. 8

తే. గీ. వ్రతంయులన్నిటికన్నను భద్రదంబు
కృష్ణుఁడొనరించి మున్నపకీర్తి యాప
మగు కళంకంబువాసిన దలఘులార!
వినిచెద వినుండు విఘ్ననాధునివ్రతంబు. 9

ఉ. ఎందుకుఁ గృష్ణుఁడీవ్రతము నెక్కుడుభక్తినొనర్చెనో! తగన్
ముందు వినుండు, సూర్యునిఁ బ్రమోదితుఁజేసెను సత్యతంద్రి దా
నం దిననాధుఁడిచ్చెను గనద్రుచి భాస్వరమైనరత్న మా
నందముమై నతండు యదునందనుఁ జూడఁగవచ్చె నొక్కటన్. 10

వ. సత్రాజిత్తు సూర్యప్రసాదలబ్ధంబగు స్యమంతకమణి గళమ్మున
ధరించి తన్నుంగనవచ్చుటయు శ్రీకృష్ణుండు కుశలంబడిగికూర్చుండ
నియమించి గౌరవించి తదేకదృష్టితో నారత్నంబునెడఁ బ్రీతినెఱపు
టకు సత్రాజిత్తు శంకాకులహృదయుండై. 11

కం. ఈతనికీ రత్నమునెడఁ
బ్రీతి యవారిగజనించె రేపో నేఁడో

యీతఁడడుగు నీకున్నన
రాతినగుదునయ్యదియు భరంబగుఁ బిదపన్. 12

కం. బలవంతుల చూపువడిన
వెలగల యేవస్తువేని విడుచుటయే రి
క్తులకు నుచితమటుగామిని
గలహంబదికూర్చుఁ బ్రాణఘాతుకమగుచున్. 13

వ. అని యమ్మణిని దనంతనొసంగుటకు మనసొప్పక నాఁటికి మిన్నకుండి గృహంబరిగి యేమియున్ దోఁపక యిట్టు లాలోచింపఁదొడంగె. 14

కం. భగవదవతారమని చె
ప్పఁగఁనగు నీతనికి ధనము పట్టున నిటులో
భగుణం బగుపట్టినదీ
నిఁగడమువాఁ డెక్కుడుండ నేర్చెడి ధరణిన్. 15

తే. గీ. కంసు వధియించు నీతండు కంసు కన్న
నెక్కుడగు చుట్టమటంచు నెంచి నన్ను
బ్రదుకనిచ్చునె? పేరికిఁ బ్రభుపుతాత
గాని యీతఁడె ప్రభుపులోకమున కిపుడు. 16

కం. అత్యాసన్నులయినచో
క్షిత్యధిపతులీతులందుఁ జేదుమరిపుడా
వ్యత్యయమె నాకు మూఁడెను
గత్యంతరమేమి। మణిని గాపాడంగన్. 17

కం. ఎనిమిది బారువులిడి యి
చ్చును బంగారమ్మ దినము శుచియై పూజిం

చిన నాదిత్యునికృపకత
మునసిది లభించెఁగడు నమూల్యమ్మకటా। 18

ఆ. వె. దీని నొద్లకిచ్చి యేనెట్లు బ్రదుకుదుఁ
గృష్ణవృష్టిపడియె నిమ్మణిప్ర
వరమునందు సేయుపాయమ్ము దోఁపదు
తపము తుదకు నాపదను ఘటించె. 19

కం. ఇప్పటకుఁ జిత్తమొప్పదు
పొచ్చెమ్మొనరంతు నేసి పొలియించునితం
డిచ్చి బ్రదుకుటయె యుక్తమొ ?
చచ్చుట యుక్తంబొ ? యీక స్వాంత మెరిసెడిన్. 20

వ. అని వెండియు. 21

ఆ. వె. తపము సేయనేల। తపసు గుణించి వే
తేవొ గోరి కొనకయిట్టి ముప్పు
మూఁడు రత్నమునకు ముచ్చటపడనేల ?
ధనము పాపకృత్యమునకు నెలవు. 22

వ. అని పలువిధములఁ జింతించి చింతించి యేమియుందోఁపక తన
సహోదరుఁ బ్రసేనుంబిలిచి యారత్నం బతనికిచ్చి యిట్లనియె. 23

కం. ఇదిశుచియైగానిధరిం
పఁదగదు దిననాథుఁడిడెఁ దపంబునకుఁ దా
నెదమెచ్చి భద్రదము. సం
పదలిడియిడు నిచ్చు మేల్మిబంగారంబున్. 24

వ. అని యొసంగుటయు నతండయ్యది కంఠమ్మునధరియించి యరణ్య
మ్మునకు వేఁటకుంజనుటయు నొక్కసింగం బా ప్రసేనునధిష్ఠించిన
యశ్వమ్ముతోఁగూడఁ జంపి మాంసఖండంబను బుద్ధింజేసి వ్యమం

తకమ్మును నోటఁగఱచికొని యేగుటయుఁ దదరణ్యనివాసి జాంబ
వంతుం డల హర్యక్షమును వధించి యామణిని సంగ్రహించి తా వ
సించు గుహలోని సౌధమ్మునం దుయ్యేలకు నలంకారంబుగాఁ గట్టె
ననంతరంబు సత్రాజిత్తు. 25

మ. తనతమ్ముం గా వధియించి కృష్ణుఁడు స్యమంతమ్మున్ హరింపం బో
లునటంచు న్నిజమెంచ కచ్చటచటన్ లోకంబుతోపాటు వా
వినిగాఁ గృష్ణుఁదలంచియాడు కతనన్ శ్రీకృష్ణదేవుండు తా
విని యెట్లోయిది వాపికొంటయనుచున్ వేమాఱుచింతించుచున్. 26

వ. ఆప్రసేనుఁదేగిన యరణ్యంబునకుంజని జాడలుదీయునంత నచ్చట
జాంబవంతుండు వసించు గుహలోనికిఁబోయి చూతమని విచ్చ
వొడమె ననంతరంబు. 27

ఉ. ఆగుహలోని కేగుటయు నత్యధికంబుగనుండె ధ్వాంత మె
ట్లో గుహచాలభాగము మహోజ్జ్వలతేజుఁ దతిక్రమింప న
చ్చోఁ గనుపట్టెసౌధ, మదిచూచియె తీరవలెన్ బ్రపంచపున్
లోఁగిటలేవియేనియును లొచ్చుగఁ గన్పడు దానిముందటన్. 28

వ. అత్యాశ్చర్యపర్యాకుల చిత్తుండై యాసౌధంబు ప్రవేశించుటయు
నందొక్కచోట. 29

ఉ. చందనగంధి నీలకచ చంపక నాసిక యుత్పలాక్షి యిం
దిందిరదృక్కలాప స్మరదేవవిలాసపుఁ బుంజమో । యనం
గం దగుబోటి కన్పడియెఁ గాంచనచేలిన, కాలతాంగిపై
డెందముపర్వెనాపెకును డెందముపర్వెరమాధినాధుపై. 30

వ. అక్కన్నియ యెట్టకేలకుఁ దనమనోవికారంబు బయల్పడకుండ
నాఁగికొని శ్రీకృష్ణు నోరచూపులం జూచుచుఁ దన తమ్ముఁడున్న
యుయ్యేల నూఁపుచు మిన్నకుండె. 31

తే. గీ. చారుహాసినియగు నల్లజాంబవతిని,
గాంచికృష్ణుండు దరహాసకాంచదాస్యుఁ
డగుచుఁ దొట్టెలోనుండిన యర్భకుని గు
లించి యిట్టులువచియించె నంచితముగ. 32

చ. రతనముదాల్చిగ్రీవను దురంగమునెక్కి ప్రసేనుఁడిందురా;
హతునొనరించి వానిని మృగాధిపుఁ డీమణిసంగ్రహించె ను
ద్ధతుఁడల భల్లుకేశ్వరుఁడనంతరమా హరిఁజంపినీకు న
ర్పిత మొనరించె రత్నమిది వేడుకనాడికొనంగ బాలకా! 33

తే. గీ. ఆడికొను మేటువకు మంచు యాదవకుల
భూషణుఁడు కృష్ణుఁ డమ్మణి పుణికి పుచ్చి
కొనఁగ జాంబవతీసతి కొనకు వచ్చ
భల్లపతి విన్న సైఁపఁడు పదు మవలికి. 34

కం. అధవా! రత్నముగొన్నను
గ్రుధమై ఋక్షపతి బాహుబల రుద్రుఁడునిజ
వధియింపకమును చను మవి
తథబులుఁదెలుఁగవొకొ? మామతాతన్ సుభగా. 35

చ. అని మెలనవ్వు నెమ్మొగమునందు విలాసములెన్నియో పొరిన్
బనుపడఁజేయ నయ్యతివ పల్కుటకున్ జిఱునవ్వు నవ్వి చ
య్యన యదునందనుండు గుహయంతప్రతిధ్వనులీన శంఖమొ
త్తిన విని జాంబవంతుఁడొగి దేవకి సూనుని దాఁకె వీఁకమై. 36

వ. అట్లు తాఁకి యా యగాధంబగు గుహాగర్భంబున నిరువురు నొకరికొకరు తీసిపోక పెనంగుచుండిరి. ఈ విధమ్మున నేడు దినంబులు కడచినమీఁద గృష్ణుం డరిగిన మఱునాఁటనుండి బలదేవాదు లాయరణ్యంబెల్లెడ వెదకి వెదకి యెచ్చటను జాడదెలియమిని మృతుండై యుండుననియు నేఘోరమృగంబులో భక్షించుటంజేసి యేవిధమైన

గుఱుతును గానరాకున్నది యనియు నిశ్చయించికొని యౌర్ధ్వదైహి
కంబులకు సయిత ముపక్రమించి జరిగించుచుండిరి. పిడుగువంటి
యీ వార్తను విని హస్తిపురినుండి పాండవులును ధార్తరాష్ట్రులును
వచ్చి పరామర్శించి మరల వారివారి పొందుపట్లకుఁ జనిరి యంత
నిరువది యొకటవ దినంబున. 37

ఆ. వె. జాంబవంతు నొడలి సత్త్వంబు శౌరి స
త్త్వమ్మునకు నొకింత తగ్గిపోరు
భరముగాఁగఁ దోఁచి ప్రాజ్ఞుండతండు వి
జ్ఞానదృష్టి కలిమిఁ గాంచె నిట్లు. 38

కం. ఇతఁడు మహావిష్ణు ప్రా
కృతపురుషుఁడుగాఁడు పూర్వమేనల రామా
వతరస్థున్ సేవించితి
నతఁడే యితఁడెందు సంశయములేదనుచున్. 39

వ. నిశ్చయించికొని మహానుభావా! నేను త్రేతాయుగంబు నాఁటివాఁడను,
నీవు ద్వాపరంపురుషుండవు. నాతో నిరువదియొక్క దినమ్ములు పిఱు
తీకపోరుటయకాక యిఁక నీతోఁ బోరుట భరంబనిపింపఁజేసితివి. 40

తే. గీ. నాఁడు నన్ను హనూమంతు నలుగవయుని
సూర్యపుత్రు వేలిన మధుసూదనాంశ
మెఱుకగదిరె క్షమింపుమీ వెందుకిటకు
వచ్చితివొ? తెల్పుమని నమోవాకమిడగ. 41

వ. శ్రీకృష్ణుండాపరమభక్తుని యొడలినొప్పులు దీరునట్లు తన యభయ
హస్తమ్ముతో నిమిరి యా భక్తత్రాణపరాయణుండు జాంబవంతునితో
నిట్లువచించె. 42

కం. కనవో! సత్రాజిత్తును
దినమణికిఁదపించి యల్లదేవునికృపఁ జే

కొనియె స్యమంతకమది నీ
తనయుని యుయ్యాలకడకుఁ దాఁ జనుదెంచెన్. 43

వ. విషయమిటులుండ నేను లోభమ్మునంజేసి తనతమ్ముని వధియించి యీరత్నంబు నపహరించితినని యతండు నాపై నిరపనింద నొకటి మోఁపెనని వెండియు. 44

కం. అతఁడొకఁడె యైనచో నా
మతి గింకిరి పడదు సర్వమనుజులునాపై
నతుకఁదొడంగిరటులె సూ
నృతముంగనిపెట్టి యాడుటెందుంగలదే. 45

వ. అని వెండియు. 46

ఆ. వె. తగినవారిలోనఁ దలయెత్తి బ్రతికెడి
మానిసుల కబద్ధమైన దురప
వాదమోర్వనెట్లు వచ్చెడి భల్లూక
రాజ! దాని కైకరంబు గుంది. 47

వ. యధార్థంబు తెలిసికొని బంధులోకంబునకు బోధింపనెంచి యీయడవికి వచ్చి నీగుహం బ్రవేశించితి. నీ వీరత్నంబును సంగ్రహించి భద్రపఱచుటంజేసి నాకుఁ బరమోపకారం బొనర్చితివని వెండియు.

కం. నడికన్నఁ జావుమేలని
యెడి లోకోక్తి వినియుందు వీనాకీవి
ప్పుడు చేసిన యుపకారము
నుడుల కతీతంబు విన్ను నుతియింతునెటుల్. 49

వ. ఇట్లు నుతియించు శ్రీకృష్ణుని వచనంబులకుఁ జాల నొచ్చికొని దేవా! చరణదాసుండనగు నాయెడల మీరిట్టి వాక్యమ్ము లుపయోగించుట నన్నుఁ జిన్నంబుచ్చుటయె యగు, నాయందు మీకు ననుగ్రహంబు కలుగుట విక్రమయేని. 50

కం. కొమిరె యదె విన్నుఁగదుఁ బ్రే
మమునం దిలకించు నను మన్నించుటకై
రమణులలో నొకరమణిగ
రమారమణ ! చేకొనుమని ప్రార్థింతుహరీ. 51

వ. ఇట్లనుగ్రహించినచో నీవు నాసామివి మాత్రమకాక చతుర్దశ భువ
నంబులకు నధినేతవు కదా ! అట్టి నీతోఁ బఖువునగుటంజేసి సంగ
రమ్మునకుం దొదరిన యపరాధం బుపశమించుటయకాదు. 52

ఉ. పెండిలి యీడుదాఁటి తగుప్రేముడికాని వరింపనున్న యీ
యండజయానకున్ దగిన యల్లుని నెక్కడఁ దెత్తు నేను మూ
ర్ఖుండఁ బఖుత్వదుర్భగుఁడఁ గూఁతురు మాదృశురాలుకాదు నీ
యండకుఁ దగ్గదిట్టులు దయన్ గనఁజేయుముకృష్ణ ! నాయెడన్. 53

తే. గీ. అంధకారబంధురమగునట్టి యీమ
హా గుహాంతరమున సౌధమంచు నొకటి
గట్టి కాపురమున్న నాపట్టి కీవు
దక్క వరియింపఁదగినట్టి దయితుఁడున్నె ! 54

కం. "ఇందుఁగలఁడందులేఁ డని
సందియమెవ్వని గుఱించి జనులొందరొ ! అ
బృందారకమూర్తివి నా
నందనిపాణిన్ గ్రహించి నను మనుపుమజా !

వ. అని కొమిరెచే నమస్కరింపఁజేసి "తదేవలగ్న" మను సూక్తిం
బఠించి పాణిగ్రహణంబు నిర్వర్తింపఁజేసి పారిబర్హంబొసంగి
కూఁతుతో నల్లునితో ద్వారకాపురంబు ప్రవేశించునప్పటి దృశ్యంబు
వర్ణనాతీతంబై యొప్పె. 56

కం. నమసెనమకొన్న కృష్ణుఁడు
రమణీమణిమణియుఁగొని కరంబు ముదము పూ :

ప్రమదలకు బంధువులకును
నమరించె౯ భార్యలకును నచ్చెరువొదవన్. 57

వ. పదంపడి స్యమంతకమణిని బంధువులకెల్లరకును జూపి సత్రాజిత్తునకు వారలెల్లరుఁ జూచుచుండ నొసంగె. లజ్జావనతముఖుండై యతఁడద్దాని గ్రహించి యమ్మణి నెట్లేని కృష్ణునకొసంగ నెంచెం గాని మున్ను తానొనర్చిన యపనిందనుబట్టి పరిగ్రహింపఁడని యెంచి యుపాయంబుచేసి తన కూఁతు నుత్తమలక్షణోపేతను భార్యగాఁ గయికోవలయునని ప్రార్థించుటయు శ్రీకృష్ణుండందుల కంగీకరించెఁ బదంపడి యాదవులలో శతధన్వుఁడు నక్రూరుండు లోనగువారలెట్లేని యీమణి నపహరించు తలంపు గల్గియుఁ గృష్ణుని వలనిభయము కతన సమయంబు నిరీక్షించుచుండిరి. పదంపడి. 58

తే. గీ. పాండవులఁ జూడనేగెఁ గృష్ణుండు రాజ
కార్యవశమున నాతఁడక్కడనయుండె
నట్టితఱి శతధన్వుండు పట్టుబట్టి
చంపి సత్రాజితుని మణి సంగ్రహించె. 59

వ. ఈ ఘోరకృత్యంబు జరిగిన కొన్నాళ్ళకుఁ గృష్ణుండు ద్వారక కేతెంచిన సత్యభామ యావద్వృత్తాంతమ్మును నశ్రుపూర్ణమ్ములగు నేత్రమ్ములతో గద్గదస్వరాకులయై వచించుటయు. 60

ఆ. వె. కపటనాటకుండు గావునఁ గృష్ణుండు
మదిని సంతసించి మామఁ జంపి
నట్టి క్రూరుఁ జంపుమని సత్య నలరింప
నన్నతోడఁ జెప్పె నతఁడు పిదప. 61

వ. శతధన్వ వధింపఁబోవుతఱి నతండు స్యమంతకమణిని దాఁపుమని యక్రూరున కిచ్చి తాను జవంబుగల యశ్వమ్ము నెక్కి పలాయనం బొనరించె నట్టియెడ. 62

ఉ. ఎక్కడికేగె దీవు మణినెత్తుక భూమియకాదు స్వర్గమం
దెక్కడనున్న నిన్ను వధియింతు మణిన్ గయికొందునంచుఁ బే
రుక్కున సీరపాణి రథమొక్కటి నెక్కటి నెక్కి యేగెనే
దిక్కున యాదవుండరిగె దృష్టి యటే ప్రసరింపఁ జేయుచున్. 63

ఆ. వె. అన్నతోడఁ జెప్ప యతఁ దేగుచుండఁగాఁ
దానుగూడ నొకరథంబు నెక్కి
యన్నకన్నఁ గడురయమ్మున శతధన్వుఁ
దఱుముఁ జొచ్చె నోలి దరధరుండు. 64

వ. శతధన్వుండెక్కిన యశ్వరాజంబు మహోత్తమజవోపేతంబగుటం జేసి శతయోజనంబులఁ దనుకఁ బ్రయాణంబు సాగించి యశనాయాకులితంబై మార్గాయాసమ్మున మడియుటయు వాఁడు గత్యంతరమ్ములేక పదాతియై కొంతవడి పలాయనం బొనర్చి తుదకుఁ దన యశ్వంబు చూపిన తెఱంగున మడిసె. ననంతరం బచ్చటికి వచ్చి విగతప్రాణుండై పడియున్న శతధన్వు కట్టిన పుట్టంబుల నెంత వెదకినను స్యమంతకం బక్రూరున కిచ్చిన కతన నితనియొద్ద గోచరింపదయ్యె నంత బలదేవుండు. 65

కం. తమ్ముని తాత్పర్యము మణిఁ
దెమ్మనియున్ గూడ నుండె దేవేరి గదా।
తమ్మునికి సత్య ? యమ్మణి
యమ్మహిళకు హక్కు తండ్రిదగు హేతువునన్. 66

వ. అట్టిస్థితిలో నేను జంపకున్నను వీఁడు నావలన భయంబునం జేసి శక్తికిమించిన పలాయనంబొనర్చి విగతజీవుండయ్యె. నీపలాయన సంభ్రమంబున మణియెక్కడనేని పడియుండనోపునని యెంచి ద్వారకకున్ జనుదెంచుచుండఁ గృష్ణుండు మధ్యేమార్గంబున నన్నం

గలిసికొని యన్నతో నీకన్న మున్న నేను శతధన్వుం బరీక్షించితి నవియు మణివానియొద్ద లేదనియున్ జెప్పుటయు నమాయికుండగు బలదేవుండు, కృష్ణుండు శతధన్వునిమణి నిమిత్తమ్మునఁ జంపి మణిని గ్రహించి దాఁచియిట్లు కపటోక్తులు పలుకుచుండెనని తలంచి రోషారుణనేత్రుండై యిట్లు దూషింపఁ దొడంగె. 67

కం. ధనమే ప్రధానముగ నీ
వనువర్తించెదవు వీనినందులకే చం
పినయట్లులయ్యె మనభయ
మునసేకాకెట్లు చప్పుఁ బొరిఁబరుగిడుచున్. 68

ఆ. వె. మామఁజంపినట్టి మలినుండు వీఁడని
చంపితేని సరియె సత్యదూర
మైనమార్గమేల; యమ్మణి నెచటనో;
దాఁచిబొంకు టక్కుటా! హితంబె. 69

వ. ఇట్లు బలదేవుండు కృష్ణుని దూఱుటయు నతండెన్నియో యొట్లును సత్యములును నెఱపి యన్నకు యధార్థంబు దెలుపనుంకించెగాని బల వత్తరంబగు వేఱొండు కారణంబుంటంజేసి బలదేవునకా యధా ర్థోక్తులు లేశమ్మును మదికి నెక్కవయ్యె. 70

కం. పదపడి కృష్ణునిపై ఖరి
మదికిన్నచ్చని కఠానమనము విఱిగి కో
విదమాన్యుడు బలదేవుఁడు
విదర్భదేశమున కరిగె విడిచిపురంబున్. 71

వ. కృష్ణుండొక్కండ ద్వారకకువచ్చె. బలదేవుండు రాకపోవుటంజేసి పౌరులిట్లు లపవదింపఁ దొడంగిరి. 72

కం. ఇరువురకున్ మణికై సో
దరులకు వైరమ్ము పొసఁగి దక్షుఁడుకృష్ణుం

దఱిమితిఁబొమ్మనన గ్రజుఁ
దరిగెననుచుఁ జెప్పికొనుట హరికిం దెలిసెన్. 73

ఆ. వె. తెలిసియకట ? యెట్టికలియిది యపవాద
మీఁద మఱియొకండు మేకొనంగఁ
దొడఁగె దీనికేదొ దోసముండియెతీర
వలయునెట్లు దానిఁ దెలిసికొందు. 74

వ. శ్రీకృష్ణుండు భగవదవతారంబయ్యు మనుష్య భావం బాశ్రయించి యున్న కతన తదనుగుణంబగు భావంబు లనుభవించుచుండె. నక్రూరుండు శతధన్వుండు దాఁపనిచ్చిన మణింగొని కాశీపురంబు ప్రవేశించి తన్మణి ప్రసాదంబున ననుదినంబును బ్రవృద్ధంబగు నైశ్వర్యమ్మునం జేసి మహేశ్వరుని యాగంబులచే సంతుష్టుంగావించుచు సుఖంబుండె నాయీ సందర్భమ్ములెల్లఁ గృష్ణునకుఁ దెలియవలసియున్నను దెలియరామికిఁ గతంబు మున్న వివరింపంబడియెఁ బదంపడి కథను వినుండని సూతుండిట్లు చెప్పఁదొడంగె. 75

కం. అపవాదమీఁద నొండొక
యపవాదము మొగిసి తనదునాత్మకుఁ జింతం
గృపణతఁ గూర్పఁగ బాధా
చపలుండై కృష్ణుఁడున్న సమయమునందున్. 76

వ. నారదుం డరుగుదెంచుటయు నమ్మహాత్ముని యథోక్తప్రకారంబునఁ బూజించి సుఖోపవిష్టుం గావించిన యనంతరంబున నారదుండు కృష్ణుననంబు దిలకించి. 77

కం. ఆనందో బ్రహ్మశ్రుతి
యేనిత్యవచించు నతఁడవీవయ్యును నీ
యాననమువిన్నఁ బోవు ని
దానంబెయ్యదియొ ? నాకు దాపకచెపుమా. 7

కం. సేమమకద? బంధుగులకు
సీమహిళలకును యశంబు నిర్నిద్రమకా!
యేమూలమ్మున నెవ్వగ
నీమది గలగుండువెట్టె నే విననెంతున్. 79

వ. ఇట్లు గ్రుచ్చిగ్రుచ్చి యడుగు నమ్మునివరునకు శ్రీకృష్ణుం డిట్లను. 80

చ. మునివర! యెల్లవారి మనముల్ ముకురంబున యందుఁబోలె మీ
మనమున గోచరించెడిని మన్మనమేటికి గోచరింపదో
యనఘ? యటేని మీరడిగినప్పుడు చెప్పకతీరమిగా మనం
బునఁగల చింతఁ దెల్పెదనమోఘ ముపాయము దీనికేదియో? 81

కం. ఒక యపవాదము పైవే
ఱొకయపవాదమ్ము మూఁడి యూరకనన్నుఁగా
వికలాత్ముఁ జేయుచున్నవి
యొక దోషము నేనెఱుంగనో మునిచంద్రా! 82

ఉ. ఏనుస్యమంతకమ్ము హరియించితినంచు నొకండు దానినె
ట్లేనియు నీఁగితిం, బిదప నేను మదగ్రజులేవఁగొట్టిన
ట్లైనది యమ్మహాత్ముఁడదయత్వము నైనరిగెన్ విదగ్ధకో
మౌనివరేణ్య! దుర్యశము మానసముం గలఁగించుసారెకున్. 83

కం. దోసము చేసినచోనది
పాసిచనమి నిశ్చయంబ బ్రహ్మాదులునుం
దోసిలి దానికి నొగ్గుదు
రీసడికేనెట్లుసైతు నెటునను విడుచుం. 84

వ. ఇందులకుం గల కతంబెట్టిదియో? యెట్టిదైన నగుంగాక దీనికినివ
ర్తనోపాయంబున్నదియో లేదో వివరింపుమని నిన్నుం బ్రార్థింతు

నావుడు నారదుండు కొండొకజ్ఞాన దృష్టిన్ దిలకించి సకలంబు నవ
గతంబొనర్చికొని యిట్లనియె. 85

తే.గీ. భాద్రపదమున( జవితిని బహుళమందు(
గాదు శుక్లమ్మునన్ శశి(గాంచినట్టి
వారికపవాదములు వచ్చుతీరు పీవు
వినకచూచితివని మనంబునకువచ్చె. 86

వ. అట్లు నారదుండు వలుకుటయు శ్రీకృష్ణుండు జ్ఞప్తి నభినయించి. 87

ఆ. వె. చవితినా(ట నేమ సాయంసమయమందు(
బాలు ద్రావునపుడు పాలయందు(
బ్రతిఫలించి కాన(బడియె( జంద్రు(డు నాకు
నదియు(గూడ దోసమగునొ ? యేమొ ? 88

వ. పదంపడి వచియింపు మనవుడు నారదుండు. 89

చ. చవితిని మాత్రమే జనులు చంద్రుని( జూచిన దోసమబ్బ హే
తువు వివరింతు విఘ్నపతి తొండపుదేవరనా(డు పూజ్యు(డై
కవిజనమాన్యు(డై వలు( గావున నాతని కల్లనా(డు పం
డువుగద ? అక్కృతమ్మున( గనుంగొను భక్తులనెల్ల నయ్యెడన్. 90

తే. గీ. అతని పూజ త్రిమూర్తులు నాచరింతు
రవిన నొడ్లు పొనర్తురంచన(గనేల ?
భక్తజనపక్షపాతి యప్పార్వతీ కు
మారు(డానా(డు చను( బ్రతిమందిరంబు. 91

కం. సరసిజభవు సృష్టియు నల
సరసిజలోచనుని రక్ష సర్వశుభములు&
గరము నతవికతమువనే
నిరంతరాయముగ సా(గు నీవెఱు(గవొకో ?? 92

తే. గీ. అబ్ధిమథియింప మొదలిడు నప్పుడతని
నాదియందుఁ బూజించుట నాదరించు
కతమునం గాదె జనియించెఁ గంధియందు
హాలహల ముప్పతిల్లి భయంబుగొల్పె. 93

తే. గీ. బ్రహ్మమొదలగు దైవత ప్రభువులెల్ల
నతనికందఱు దేవతలందు నగ్ర
పూజకంగీకరించిరి భూప్రభృతి స
మస్తలోకమ్ములందిది మాన్యమయ్యె. 94

వ. తత్తచ్ఛుభకార్యమ్ములయందు వారువారు మాత్రమ పూజింతురు గాని భాద్రపదశుక్ల చతుర్థినాఁ డెల్లరును నాబాలగోపాలముగ నమ్మహితాత్ముని బూజించి యాతనికిఁ బ్రీతిపాత్రమ్ములగు నారికేళఫలమ్ములును మోదకమ్ములను సమర్పింతురు. 95

కం. ఒకయేటి చతుర్థిని గౌ
రి కుమారుఁడు చంద్రపదమరిగి యయ్యెడఁ బూ
జకులొనరించెడి పూజలు
సకలారాధ్యుండు గొనెడి సమయమునందున్. 96

వ. కడుంగడు వేగమ్ముగ నయ్యెభక్తుల గృహమ్ములకు మూషకవాహనారూఢుండై యరుగుచుఁ దిరుగుచుఁ దత్తద్భక్తులు నివేదించు మోదకంబులు భక్షించుకతన నుదాత్తంబగు జఠరంబుతో స్వేతస్విన్నంబగు నేనిక మొగముతోఁ గొండొక వికృతంబుగ నున్న త్రిలోకారాధ్య వేదాంతవేద్య గణనాథుంగాంచి చంద్రుండు సౌందర్యగర్వితుండు కొండొక యపహసించె. 97

కం. అది విఘ్నపతికిఁ గొండొక
మదికి నసహ్యముగఁదోఁచి మదమత్తుఁడు పీ

విదియన్ గనఁ దగదని బె
ట్టిదమగు శాపమ్ముఁ దావిడియెఁ జంద్రునకున్. 98

వ. ఆ శాపస్వరూపంబు వివరింతు. 99

ఉ. అందముఁ జందముం గలుగునట్టిఁడ నేనని పొంగఁబోకుమో
చందిర ! నీకళంకమది సర్వులకున్ విదితంబ డాఁచినన్
గందదిడాఁగఁజాలని వికారమటంచెద నెంచి ; దాని హ
త్తుందొలఁగించి శంకరుడెదోయొక సుంతగ్రహించె భూషగా. 100

మ. సరిమే విన్నిఁకఁజూచువార లెవరో ? సౌందర్యమేలాటిదో
ఆరయంజాలెద నేను విన్నెవఁడుచంద్రా ? చూచునో ? వాఁడు దు
ర్భరమౌ నేయపవాదకో గుఱియగున్ బ్రహ్మాదులీశాపమున్
మరలింపంగలవారలౌచు నిను మన్పంజాలినం జూచెదన్. 101

వ. అని వెండియు. 102

తే. గీ. దేహకందచందమ్ములు తృప్తికరము
లనుచు నెంచితివేమొ ! విద్యావివేక
ముఖ్యములు భూషణమ్ములిమ్ముల నెఱుంగు
మింక నేవియు. ననిచెద వెన్నటికివి. 103

వ. ఈ శాపవృత్తాంత మ్మెఱింగిన చంద్రుండు తన్నింక నెవ్వరును విదియనాఁడు "నవోనవోభవతి" శ్రుతిపాఠం బొనరించి గౌరవింప రని యెఱింగి యయ్యవమానంబునకు నలందురుచు జలంబున జొచ్చి యందలి కుముదవనంబు నివాసంబొనర్చుకొని యదృశ్యుం డగుటయు. 104

కం. సకలౌషధీప్రకాశము
వికలంబై రోగముడుపు వెజ్జులు చెడి రెం
దుకుఁ గొఱగా కమరులు తిం
డిక మొగమున్ వాచిమిగులడీల్పడిరి వగన్. 105

వ. ఆయీ విపత్తు దొలంగు నుపాయం బరయువారై నిలింపు లెల్ల
రును బ్రహ్మకడకుఁ జని మొఱపెట్టుకొనుటయు నచ్చతురాన
నుండు. 106

చ. ఇది గణనాథుశాప మతఁడే సముపాయము చూపఁగా వలెన్
మదమునఁ జంద్రుఁ డట్టులవమానమొనర్చి ప్రపంచకానకీ
పొదగలిగించెఁ దా నగుత ; సుందరుఁ డాగణనాథు శాస్త్రకో
విదులు బహూకరింత్రు తనువేత్తలటుల్ యజియింత్రె యెయ్యెడన్.

క. కరమును నపచారంబు బొ
నరించె నజ్ఞానమున మనఃప్రభవుఁడు తా
నెఱుఁగఁడొ ; "విద్యారూపం
విరూపిణా" మనెడినుడి వివేకమువలదే ? 108

కం. తాను గళావిధియగుఁగా
కాసిఖిలేడ్యునకుఁ దనకు నంతరమెంతో
లోనెఱుఁగవలదె ? గణపతి
మేనెల్లను విద్యలే యమేయుఁడతఁడగుటన్. 109

తే. గీ. నావివాహంబు నలరమానాథుపెండ్లి
యింద్రుఁడాదిగఁగల నిలింపేంద్రుల శుభ
కార్యము లతండకాదె ; విఘ్నములు వారయ
కుండఁ గాపాడె విశ్వాసముండవలదె ? 110

తే. గీ. అతని నారాధనము చేయనట్టి క్రతువు
గాని గృహనిర్మితియుగాని కడకు నేది
గాని తుదనెగ్గినట్టు లొక్కఁడు వచింపఁ
గలఁడె ? పూజ్యావమానంబు కట్టికుడుపు. 111

వ. ఇట్లు చతురాననుండు బహువిధంబులఁ జంద్రుం డొనర్చిన యవ
మానంబునకు నొచ్చికొని గణేశశాపంబు గణేశుండె మరలింపవల
యునని యెంచి సుపర్వసమేతంబుగ గణేశు నికటమ్మున కరిగి విను
తించినచో నతండు సుప్రసన్నుండగునని యింద్రునకు బోధించి
అట్లు చనుటకు ముందు చంద్రునిచే భాద్రపదశుద్ధ చతుర్థినాఁ డమ్మ
హాత్ము నర్చించుట కార్యసాధకం బనుటయు దేవతలు చంద్రునకు
బోధించి యట్లొనర్పఁజేసి తత్సహితంబుగఁ గైలాసంబున కరిగి
నుతించి సుప్రసన్నుం జేసికొనిన పిమ్మటఁ జంద్రుండు. 112

చ. మదమున నిన్ను నవ్వితి క్షమాపణ కోరుచునుంటి సర్వకో
విదజనమాన్య నిన్ను నవివేకి యెవండొ ! యొకండు నవ్వగా
కదియల వానియజ్ఞతకెయౌ గురుతంతియకాని నీకు న
య్యదగలిగించులోపము రవంతయునుండ దెఱుంగరే! ఘనుల్.

కం. ఎఱిఁగియొ ? యెఱుఁగకొ ! చేసిన
పొరఁబాటు క్షమించినను విబుధజనుల దృగం
కురములకు లక్ష్యమగునటు
గరుణింపుము దేవదేవ ! గణగణనాథా ! 114

వ. ఇట్లు పలువిధముల సన్నుతించి క్షమాపణ వేడుకొనునంత విఘ్నే
శ్వరుండు సుప్రసన్నుండై తన యిచ్చిన శాపంబొక భాద్రపదశుద్ధ
చతుర్థికి మాత్రమే వర్తించుననియుఁ దక్కుదినములలో యథా
పూర్వంబుగ నిన్ను నెల్లరుఁ జూడవచ్చునని శాపంబు సడలించి
వెండియు. 115

కం. అపుడేనియు నాయిడు శా
పపువిధమును దానికైన పరివర్తనమున్
విపులముగనున్న కతవిను
సుపుణ్యులకు నిన్నుజూచుచో లేవెగ్గుల్. 116

వ. ఇట్లు చంద్రుని నతనికి బాసటగా నేతెంచిన యింద్రాదులను గౌర
వించి విఘ్నేశ్వరుండు తన సహజకృపాళుత్వమును బ్రకటించె. 117

కం. కతవిని శిరమున నాయ
క్షతలు ధరించి శశిఁగాంచు జనులకు దోసం
బతుకదు నీవటుసేయ మి
వెతకగ్గంబై తికతము విస్పష్టంబే. 118

తే. గీ కొలఁది దినములలోననే గలదు భాద్ర
పదపుఁగృష్ణేతర చతుర్థి భక్తి భావ
మున భజింపుముగణనాధు, ముదితుఁడగుచు
విరప వించలు త్రుటిలోన నిన్ను విడుచు. 119

కం. నారదుఁడిటు బోధింప ర
మా రమణుఁడు కృష్ణుఁ డట్లుమాతనయువిదా
నారాధించుటయును గన
నైరహిగణపతి వచించెనయ్యలఘువితో. 120

వ. నీవునాకుఁబొనరించిన పూజాపురస్కారములకు మచ్చిత్తంబుహెచ్చుగా
సంతసించె. నీకు వలయు వరంబు వేడికొమ్మనుటయు శ్రీకృష్ణుండు.

తే. గీ. దేవ! నీకు నాయెడఁ గలదేని కరుణ
యీ స్యమంతకమణీ కధ, యీభవచ్చ
రిత్రమును జంద్రుశాప చరిత్రమును వి
వినను నక్షతల్గొవినను నెగులులేమి. 122

వ. కరుణింపవలయునని కోరుటయు గణనాధుం డట్లయగుఁగాక యని
యనుగ్రహించెనని వక్కాణించి సూతుండు. 123

కం. మునులార! వింటిరేకద!
యనఘమ్ము గణేశ్వరుని మహత్త్వమ్ముఁ జతు

ర్దివి నతవికిఁ జేసెడి పూ
జను మణిచరితంబుఁ గలుషసంతారకముల్. 124

తే. గీ. మానసికమైన కష్టమేదేని యెద్దతె
గనిది తారసమైన నీకథను జదివి
కొన్నచో విన్నచో శివుకొమరుఁ డట్టి
కష్టమును దొలఁగించు నిక్కమిది వినుఁడు. 125

వ. ఈ వ్రతంబునకు సంకష్టక చతుర్థీవ్రతమను పేరుగూడ వచ్చుటకున్
గతంబు పూర్వోక్తంబయని యెఱుంగునది యని చెండియు. 126

కం. అపవాదలు దొలఁగించుల్
విపులానందమ్ము నొసఁగు విఘ్నపతి వ్రతం
బెపుడేని చేయఁగానగు
నపుడిపుడను నేమమేల ? యనఘ మనీషుల్. 127

వ. ఇట్లు శౌనకాదులకు సూతుండు పక్కాణించె. 128

కం. దేవా ! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద ! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుమంటి ని న్నను
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది
శ్రీ వినాయకచతుర్థీ వ్రతము
సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః
శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ కేదారేశ్వర వ్రతము.

వ. శ్రీ మద్విజయవాటీపురీనికటస్థపర్వతోపత్యకావాసా।
కృత్తివాసా। అవధరింపుము. 1

శా. సూతుం గన్గొని శౌనకాదులు మునిస్తోత్రార్హ। కేదార వి
ఖ్యాతిం జెన్నడినట్టి సద్వ్రతము మేమాలింపఁగా నెంతుమా
పూతంబౌ వ్రతమేరుచేసి విభవమ్ముల్ గాంచిరద్దాని మా
చేతమ్ముల్ పరిపూతమౌ గమనికన్ జెప్పంగదే నాపుడున్. 2

వ. సంతసించుచు సూతుం డిట్లను. 3

కం. కోరితిరి మంచికత కే
దారవ్రత మొక్కప్రక్క దాకొల్పి మహో
దారములు వ్రతము లోకవై
పారోపింప నవి తూఁగ వదియే మొగ్గున్. 4

సీ. బ్రహ్మదేవుఁడు జగత్సృష్టియై ప్రఖ్యాతి
వడసెఁ గేదారసువ్రతము కతన
విష్ణుదేవుఁడు సర్వవిశ్వరక్షాశక్తి
వడసెఁ గేదారసువ్రతము కతన
వింద్రుండు దుర్దానవేంద్ర బాధాముక్తి
వడసెఁ గేదారసువ్రతము కతన
తక్కు దిక్పాలకుల్ తమతమ పదవులు
వడసిరి కేదారవ్రతముకతన.

తే. గీ. సూర్యచంద్రులఁ గట్టియవార్యమైన
ధామమల్ల కేదారవ్రతప్రభావ
మొసఁగె సత్యమే నుడువ నత్యుక్తిపగిది
మీరు దలఁతురో ! యేమొ ! కేదారమహిమ. 5

కం. వ్రతములఁ దపములు మఱిదై
వతములఁ దీర్థమ్ములన్ నవమ్ములను మునీ
శితులార ! శ్రోతృజనముల
మతినమ్మికఁబట్టి ఫలమమర్చెదినెందుఁ. 6

కం. సాక్షాత్పరమేశ్వరుఁడుగ
దా ! క్షోణింగల్గు నీవ్రతమ్ములనెల్లన్
వీక్షించి నొడివెఁ ద్రిజగ
ద్రక్షకు రసనయు నసత్యతత్పరమగునే ! 7

మ. తనసంతానము లోకమెల్ల నదిమోదంబున్‌గనన్ దండ్రియె
ట్లనుమోదించునొ, యీశ్వరుండు నటులే ఆమోదమున్‌గఁజెందు భూ
జనులీ సంసృతిఁ ద్రుంగి ద్వంద్వములనిచ్చల్ బాములన్‌జెంద వా
నివిదప్పింపఁదలంచి యీశ్వరుఁడువిన్చెన్ సద్వ్రతోపాయముల్. 8

తే. గీ. ఆస్తికులు పరమేశ్వరు నాశయం బె
ఱింగి యిహమునఁ దత్తదరిష్టవార
కములఁబరమార్థ సంధాయకములునైన
వ్రతజపోపవాసాదులు వదలరెపుడు. 9

తే. గీ. ఐహికంబెంత ! యదిత్రుటినంతరించు
"పైవియున్నయది ముసుళ్ళపండు" వనుచు
నెఱఁగి యాస్తికులగు వారలీశ్వరేశ్వ
రువియజించి తదనుకంపగవి సుఖింత్రు. 10

చ. బ్రదికిన నాల్గునాళ్ళరక భక్షణమందు విహారమందుఁ గో
విదులు విధించు నేమములు పీసము చిత్తముఁ జొన్ప. కిచ్చకున్
గుదిరినదెల్ల గైకొనుచు గోడున కగ్గముగాఁగ మీఁది యా
పదగడవంగఁ బెట్టుట కెవండగుఁ బూఁటవచింపనేర్తుమే. 11

కం "ఒదలెఱుఁగని శివ" మనియెడి
వడువునఁ జరియించి చెడక వ్రతములు జపముల్
మడిమైలలెఱిఁగి నియతిగ
నడిచినవారలకుఁ బరమునఁ జా సుఖమబ్బున్. 12

ఆ. వె. బడికినేగి యయ్యుపాధ్యాయు శిక్షలో
నడఁగి మడఁగియుండు నర్భకుండు.
పెద్దయైన పిదపఁ దద్దయుఁ గైకొను
గౌరవంబుఁ బోలుఁగా? పరంబు. 13

వ. వత్సరంబునకు ఘుస్రంబులు మూఁడువందల యఱువది, వ్రతంబుల సంఖ్యయో ! దీనికిఁ గొన్నిరెట్లధికమే యుండెడి నెవరికేవ్రతంబున నెక్కుడు ప్రీతిగుదురునో వారలదియే చేసికొని పరమార్థము గడించుకోవచ్చును. ఈవ్రతంబులనునవి యైచ్ఛికంబులుగాని సంధ్యావందనాదులంబోలె నకరణంబునందుఁ బ్రత్యవాయజనకంబులు గావని యెఱుంగునదియని వెండియు. 14

శా. కేదారేశ్వరుఁ డీశ్వరుండె యతఁ డుత్కృష్టంబు వ్రాత్రుచ్చెనీ
కేదారవ్రత మమ్మవారడుగ ! నాకిప్రఖ్యలాలించిరే
భూదారుండొ పౌనర్చి భాగ్యముగనెన్ భూదారుఁ డింకొక్కఁడెం
తోదారిద్ర్యముఁ బొందె శ్రద్ధమెయి నాతోరంబు గాపాదమిన్. 15

వ. ఆ భూదారులలో నొక్కండు కామాక్షీప్రధానపీఠంబులలోఁ బ్రధానంబుగాఁ బరిగణింపంబడు కాంచీక్షేత్రంబు రాజధానిగా దక్షిణదేశంబు నెల్ల నేకచ్ఛత్రంబుగాఁ బరిపాలించు కాంతారవిష్ణుండను మహారాజు.

రెండవవాఁ డుత్తరదేశంబునెల్ల నేకచ్ఛత్రంబుగాఁ బరిపాలించు నుజ్జయినీ నగర పరిపాలకుండు విక్రమాదిత్యుండను మహారాజు, వీరల కీవ్రత ముపదేశించినవాఁడు కశ్యపప్రజాపతి, అతనికి శతానందుం డీవ్రతమును లోకమునందలి యనుగ్రహముంజేసి ప్రచరింపఁజేయుమని యానతిచ్చె, నా యీ ఱేండ్లిరువురును దోడియల్లుండ్రు. కాంచీనేత భార్యపేరు పుణ్యవతి, ఉజ్జయినీనేత భార్యపేరు భాగ్యవతి, వీర లిరువురును బతివ్రతా శిరోమణులు. పార్వతీపరమేశ్వరులను గేదారవ్రతంబున నర్చించిన పుణ్యశీలలు. 16

చ. నృపతుల కెందులోపమగునే ౹ రతనంబులు హేమభూషల
చ్చపలమృగాక్షు లిర్వురకుఁ జాలగనుండుట చెప్పనేల ౹ యం
దపగతగర్వపుణ్యవతి యాపె సహోదరి గర్వయుక్త యొ
క్కపు డలరాణికిఙ్ హృదయమందిటు తోఁచె వికారవైఖరిఙ్. 17

ఉ. బంగరుచాయ నాదుకరపద్మమునం దెసలారుఁ రత్నముల్
బంగరుగూర్చిచేసిన యభంగురముల్ వలయంబులీకరం
బుంగయిసేసెడిఙ్ గరము పూలకువాసనయట్లు లెందుకిం
దుంగల నూలుతోరమని తోఁచిత్యజించె వ్రతంపుదోరమున్. 18

వ. 'వినాశకాలే విపరీతబుద్ధి' యను తెలుంగునం బొడమిన చెడుబుద్ధిజేసి కేదారవ్రతమ్మునకెల్ల జీవంబనఁదగు తోరంబు నల భాగ్యవతి తెంచి నికటమ్మున నున్న యెండు కాఁకరపాదుపయిం బడవైచి యనాదరించె. నైశ్వర్యమత్తతచే నాపె కనిపెట్టలేదుగాని యాతోరపు సంపర్కంబునంజేసి యాపాదు కొలదిదినమ్ములలో. 19

కం. కోలుకొని పచ్చఁబడి పలు
పూలుఙ్గాయలును గలిగి పొలుపు మిగిలి ల
క్ష్మీలీలకుఁ దానకమై
వాలాయము కన్నుగవకుఁ బండువొనర్చెన్. 20

కం. ఘోరముఘోరమ చనె నా
భూరమణుని రాష్ట్రమెల్ల బొలుపఱె పతి పృ
థ్వీరమణుఁ డయ్యెఁ గ్రమముగ
దారిద్ర్యపరీతుఁడై సదనమున మ్రగ్గెన్. 21

తే. గీ. ఏమిచెప్పుదు దురవస్థ యెచటిదచట
నేసిరినశించె హేమంతఋతువునందు
దామరకొలఁకువోలె నాధరణినాథు
రాజ్యమెల్లను విప్పచ్చరమ్ము గుడిచె. 22

కం. కారణమిది యిత్థంబని
భూరమణుఁడు గాని యతని పొలఁతియుఁ గానీ
యారయక యురకసంతత
దారిద్ర్యపరీతులగుచు దశతొలఁగి యిటుల్. 23

వ. కొంతకాలమ్ము చిక్కులపై చిక్కులుగా నెట్లెట్లో గడపునెడ-నంత యాపె వ్యాధిగ్రస్తురాలైన కతంబున—గర్భవతి యనియేని గరుణింపక ఱేఁడు శుద్ధాంతమ్ము వెడలనడచె. పదంపడి కొంతకాలమ్మునకు నారాజ్ఞి భాగ్యవతి యగుటంజేసి యానామంబునకును నాపె పడు దురవస్థకును సందర్భం బించుకయు లేదని యానిర్వ్యాజబంధువునకుఁ బరమేశ్వరునకుఁ దోఁచెనో యన్నట్టు లాపెకు మనంబున నొక యుపాయంబుఁ గల్పించె నది యెట్లన్న. 24

ఉ. అక్క సమస్తసంపదల కాకరమై తులఁదూఁగుచుండెనే
నక్కమలాక్షి యుద్వరము నంబకు నొక్కతెకే జవించినా
రిక్కయదెట్టిదో తుదకు రిక్తతకున్ గుఱియైతి నాకు నీ
యిక్కటువాపుఁ గాంచిపురి యేలికసాని కెఱుంగఁజేయుచో. 25

వ. భావిభాగ్యోదయంబునంజేసి యుజ్జయినీ మహారాజ్ఞి కిట్టియూహ పొడమి తనకొడుకుఁ గుఱ్ఱం బిలిచి. 26

తే. గీ. నాయనా। కాంచిపురియందు నాదు నప్ప
గలదు పుణ్యవతీసమాఖ్య రహిమించు
నాపెకడకేగి నీవు నాయాఖ్యచెప్పి
మంతనమ్మున నొడువుము మనయవస్థ. 27

వ. ఇంత మాత్రమ్ము నీవొనర్పనేర్తువేని మనకు సర్వంబును భద్రం బగునని తల్లి వచించుటయు నాబాలకుండు తల్లికి మ్రొక్కి యింతి యకదా। యిందేమి కష్టమున్న యదియని యుత్సాహమ్ముచూపిన నాపెయు సంతసించి కొమరు నాశీర్వచించియనిపె. నబ్బాలకుండు పెదతల్లింగననేగి దౌవారికులతో నేను మీరాణిగారి చెల్లెలి కొమ రుండ మాతల్లిపేరు భాగ్యవతీదేవి. యని చెప్పుటయు వారలరిగి యాపెకు నివేదించుటయు నమ్మహారాజ్ఞి తనకడకుం దీసికొని రాన నుజ్ఞయిచ్చి కుశలంబడిగి మిక్కిలిగాఁ బేర్మిచూపినయనంతరంబునఁ బ్రసక్తానుప్రసక్తమ్ముగా నాబాలకుని కతనవారల దారిద్ర్యదశ నెఱింగి యాపుణ్యవతీదేవి కడుంగడు విచారించి. 28

ఉ. బంగరువిచ్చి రత్నములపారముగా విడి వస్త్రరాశినే
నుంగులమీఁదఁగట్టి యిటు నూఱులువేలును గోట్లుగాఁ గఁదోఁ
లంగను సర్వమున్ గ్రహబలంబదిలేమి నెటోసురుంగున
య్యంగజవైరి పేర్మిగనకబ్బునె। సంపద లబ్బనిబ్బనే। 29

వ. ఇట్టులు పెద్దతల్లి తన చెల్లెలియందలి పేరిమింజేసి రెండు మూఁడు సారులు సిరినొసంగి పంపుటయు మధ్యేమార్గమ్మున నది యెట్లో యంతర్ధానంబగు కతన నక్కజంబుగాఁదోఁచి యప్పుణ్యశీల భగ వద్భక్తిపరాయణ గావునఁ గొండొక యోజించి యాబాలకుతో నిట్లనియె. 30

చ. శివుని భజింతురే। శివుయజించెదరే। శివలీలలెంతురే
శివునభిషేకముల్ తఱచుసేయుదురే? శివరాత్రులుందురే।

కవిత శివుం గురించినది గట్టినవారల సత్కరింతురే ।
శివుని పురాణములిద్దని భజింతురె । శ్రీగళుసుప్రసాదమున్. 31

సీ. భవునాలయంబున భజనలు జరుగుచో
నరిగి వీక్షింతురే । అప్పుడపుడు
శివుదేవళంబున సేవలు జరుగుచో
నటకేగి చూతురే । అప్పుడపుడు
అభవునిఁ గోటిబిల్వార్చనంబులకేగి
యరసి పాల్గొందురే । అప్పుడపుడు
శంకరు కళ్యాణసంభ్రమంబులకు ద్ర
వ్యంబులర్పింతురే ? అప్పుడపుడు.

తే. గీ. కలఁడు మీప్రోలిలో మహాకాళనాధుఁ
డదిశిరోమణి భువిలోని యన్నితీర్థ
ములకు । మీతండ్రి వేఁడిదుకొలకుఁ గార
ణంబు శివపూజలేమి యన్యంబులేదు. 32

వ. మీయమ్మయు నేనును నొక పేదవైశ్యగృహస్థుని కొమార్తలమై చిన్ననాఁడు శ్రీకేదారేశ్వరు నారాధించు వ్రతం బొనర్పు కుతూహలముతో మాతండ్రి ననుజ్ఞ యిమ్మని వేడుటయు నయ్యనఘుండు. 33

కం. ఏదినమున కాదిన మెటు
లో దినవెచ్చమ్ము గడపుచుండెడి నేనా
కేదారేశు వ్రతంబున
కేది యొసఁగువాఁడఁ దెచ్చి కృపణుఁడఁ దల్లీ । 34

వ. అని దీనదీనంబుగాఁ బలికి, అమ్మా ! మనయెడల నాయవ్యాజకరుణాశాలికి ననుగ్రహము కలిగి యేకొంచెమేని సిరి గలిగించుచో నప్పుడు తప్పక యమ్మహాదేవు నర్చించికొందురుగాక యనవుడు మా తండ్రితో మేమిట్లంటిమి. 35

మ. జనకా! శక్తికొలందిగా నభవుఁబూజన్ జేసి మెప్పించుచో
ధనధాన్యంబులు గల్గఁగాని దినమున్ దారిద్ర్యమున్ గుద్చుచో
ధనధాన్యంబులొసంగునే! శివుఁడు, విత్తంబబ్బుపై హెచ్చుగాఁ
బొనరింపంగలమంచుఁ గాలమువృథాపుచ్చన్ సిరుల్గల్గునే! 36

తే. గీ. పిచ్చికుదిరినమీఁదటఁ బెండ్లి, పెండ్లి
యైనమీఁదటఁ బిచ్చితానంతరించు
నన్నపెద్దలనుడిగల దట్టులగుట
వలవదన్యోన్యమును ముడివైచుటెఱుఁగు. 37

వ. పార్వతీపరమేశ్వరుల ప్రసంగమ్మున నీకేదారవ్రత మాహాత్మ్యంబు నందికేశ్వరుండు విని యయ్యది పరమశివభక్తుండగు చిత్రాంగదుం డను గంధర్వరాజున కుపదేశింప నాగంధర్వాధిపతి—"ఏకస్స్వా దునభుంజీత" యనియెంచి భూలోకమ్మునందుఁ బెక్కురు దారిద్ర్య పీడచే నొగులు వారలు గలరుగదా! వారలిక్కతన ననామ యాయు రైశ్వర్యోపేతులగుదురు గాకయని యెంచి భూలోకమ్మున కరుదెంచి మనదేశంబేలుచేని కొమరున కుపదేశించి చనియెనఁట! ఆతండు శ్రద్ధాభక్తులతో నిద్దాని నాచరింపఁబూను కతంబునఁ దండ్రి సామా న్యపు జేఁదయ్యు నీయనఘుండు చక్రవర్తియయ్యెనని తజ్ఞులుచెప్పఁ గా వింటిమియని వెండియు. 38

ఆ. వె. ఈవనుజ్ఞ యిచ్చితేని కేదారేశ
వ్రతము నెట్లొ సలుపువార మేము
వలయు పరికరములు వామదేవుండె తా
సేకరించి యిచ్చుఁ జింతవలదు. 39

వ. ఇట్లు మాతండ్రివి మీయమ్మయు నేనును సారెసారె హెచ్చరింప భావిభాగ్యోదయవశంబున రిక్తుండయ్యును మాజనకుండు భక్తితప్పరుఁ డగుటంజేసి యందుల కనుమతి యొసంగి సామగ్రీసంపాద

నంబునకై యత్నింప నా దీనబంధుండు పరమేశ్వరుం డాయన యొనర్చు వర్తకంబునఁ బూర్వముకంటెఁ గొండొక యధికలాభం బగు పట్టునట్లు కరుణించె. మేమిరువురమును శ్రీకేదారేశ్వరుని వ్రత మారంభించి యొకటి రెండేండ్లు సేయునంతలో. 40

తే. గీ. ఈశ్వరుండు ప్రత్యక్షమై యెసక మెసఁగ
నచ్చరలకన్న మిన్నగా నందచంద
ములు కటాక్షించి యంతర్ధిమొనసి చనియె
నక్కృతనఁ గాదె! తేండ్ల కిల్లాంద్రమగుట. 41

వ. అని వెండియు. 42

తే. గీ. నీవు రాకొమరుండవు నీకు నేమి
తెలియు నీగాథ వైశ్యపుత్రికల మేము
ఆడిగితివయేని చెప్ప మీయమ్మ మరచి
యుండ దనపుడు నబ్బాలకుండు వలికె. 43

వ. అమ్మా! నాకీగాథ లెయ్యవియుం దెలియవు. నేను మాయమ్మ గర్భంబునంబడ్డ కొలఁదినాళ్ళకే మాతండ్రి యాపెపై విరక్తి వొడమి యంతిపురి వెడలించి యవమానించుకతమున నాయవమానంబు సహింపరామి నేమృగంబుల వాతనేవిం బడి యసువులు దొరంగు తలంపుతో నడవుల నడయాడుచుండఁ గొండరాజగు నొక బోయ కులీనుం డాయమ నాదరించి పుత్రికంబోలెఁ బ్రేమించి మనిచె. నేనచటన పొడమితి. నన్నుఁ జూచి యాబోయ లప్పుడప్పుడు. 44

ఉ. ఈతఁడు చక్రవర్తిసుతుఁ డెంత యదృష్టవిహీనుఁడో! కటా
జాతుఁడు గాకపూర్వమె రసావతితల్లిని వెళ్ళగొట్టె న
ర్వాతిశయంబుగా బ్రదుకునట్టి సిరుల్ గల తేనిపుత్రుఁడై
యీతటి విద్వనీస్థలికి నీగతిఁ జేరి వసించుదీనుఁడై. 45

వ. ఇట్లు నన్నుం జూచి గుసగుసలు వోవుచుందురు. నేనయ్యవి విని మాయమ్మ నడిగినను నామె కన్నీరు నించి యిది యంతయుఁ బురాకృతంబని విరమించుఁగాని యంతకు మించి వచింపదు. నేడు నీవు నొడువుకతన సకలంబు నెఱింగితి ననవుడు నాపె కడుంగడు వగచి యాకుఱ్ఱని బుజ్జగించి తండ్రీ! మీకు మంచిదినమ్ములు రానై యున్నవి. అందులకు మీయమ్మ విన్నిచ్చుటికి నంపుటయే సూచకంబు. ఆపద లెప్పటికి నిల్వట్టి కాపురం బొనర్పవని వెండియు. 46

కం. తనకరమునఁ గల తోరముఁ
గనఁజేసి కుమార! అమ్మకరమున నిద్దా
నినిబోలుతోరమునుగనుఁ
గొనియుంటివె! చెప్పుమనుడుఁ గొడుకిట్లనియెన్. 47

ఆ. వె. ఆపెహస్తమందు నరయఁగాలేదు నీ
వేల? దీనిఁదాల్చి తెలుఁగఁజెపుమ!
అనుడు నాపెకఖిలమవగతంబయి కట
కటఁబడుచు మిగుల వగలను బొగిలి. 48

వ. తండ్రీ! యీతోరంబు సకలైశ్వర్యంబునకును గారకంబగు శ్రీకేదారేశ్వరువ్రతంబునకెల్లి జీవాతువగు చిహ్నంబు. మీయమ్మ చక్రవర్తికి భార్యయై యైశ్వర్యమత్తతచే నీతోరంబు త్యజించి యిట్టి దురవస్థకొనితెచ్చికొన్నట్టు లిప్పటికినాకు నవగతంబయ్యెఁ గొలఁది నాళ్ళలో నీయిడుమలు తొలఁగునుపాయంబుగలదు. అందనుకవిచ్చుటనయుండుమని యాఁపినంతట శరదృతువు సంపన్నంబగుటయు నాపట్టమహిషి యథాపూర్వంబుగఁ గేదారవ్రతము నాచరించి యా రాకొమరుచేఁ గూడ నాచరింపంజేసి కేదారేశునెదుట నిలువంబడి తనచెల్లెలి యపరాధంబు క్షమింపుమని యిట్లు ప్రార్థించె. 49

ఉ. దైవతమౌళి! మాసలుపు తప్పిదముల్ గణియింతురయ్య నీ
సేవకతానఁగల్గు సిరిచెద్దియములెన్నియొ భంగు, లందులో
నావెఱిసోదరీమణి పొనర్చిన చైదియొకండు, దాని నీ
భావముసైఁపకున్న నృపుభార్యయెటుల్ సయిరించుకాములన్. 50

తే. గీ. బీదకోమటిబిడ్డలఁ బేదరాండ్ర
నెక్కఁజేసితి మేరువు నొక్కత్రుటిని
గతమెఱిఁగి చరియింపదుగాక యామె
అంతమాత్రనఁ గోపింతురయ్య దేవ! 51

చ. ఎఱిఁగిన పూరుషోత్తములనే సిరి వంచనఁజేయనెంచి బల్
గరువపుఁ జైదముల్ సలుపగాఁ బురికొల్పుట నీవెఱుంగు దీ
శ్వర! యబలాజనంబునకు జ్ఞానము గల్గునె! కల్గఁగాక సు
స్థిరముగనిల్చునే! యదియు, దేవర! తప్పిదముల్ గణింతురే. 52

తే. గీ. ఆపెమగనికి సార్వభౌమాధిపత్య
మిచ్చినట్టిఁదవీవె యయ్యింతినతని
యాలిఁజేసినయట్టి దయాళుఁడీవె
యిడుమఁగుదిపించు వాఁడవునీవెదేవ. 53

కం. నీకిది విలాసమగుఁగా
కాకలికి భరింపఁగలదె! యనదయగుచు లో
కైకవిభుభార్య గుందుట
నీకరుణకుఁ దప్పుగాదె! నిగమవతంసా! 54

కం. ఇచ్చెదవు సిరులనందే
పొచ్చెమ్మనులేదు వానిభోగించువిధం
బెచ్చటనో తక్కనచో
సచ్చరితులె యెఱుఁగరవినఁ జానలవశమే! 55

కం. సురవంటిదిగద । సిరి దే
వర । యద్దానియెడ మంచివర్తనగల వా
రరుదని నీవరసియు నిటు
పరీక్ష సల్పనెడ నాఁడువాండ్రాగుదురే । 56

వ. అని పెక్కు విధమ్ములం బ్రార్థించి క్షమాపణంబు చెప్పి యవ్వాలు నకు నొకతోరంబుగట్టి వేఱొక తోరంబు తన చెలియలికి నొక్క బంగారు బరిణియందు భద్రపఱిచి యిచ్చి, ధనధాన్యవజ్రవైడూర్యాది సమస్తవస్తువులును నవ్వారిగా నొసంగి తగుపరివారంబు తోడొసంగి యవ్వాలకుం బంపిన నాకుట్టుండు పరమానంద భరితుండై కతిపయ ప్రయాణంబుల నుజ్జయినీ పురంబు చేరుట కించుక పూర్వమే పర మేశ్వరుండు పేనికిఁ గలలోఁ బొడకట్టి యిట్లుపోధించె. 57

శా. పాతివ్రత్యనిధానమైన పడఁతిన్ వ్యావ్యంకితత్వం బొగిన్
హేతుస్ఫీతిగఁ జూపి పోవిడుతురే । యీవ్యాధి నీకబ్బుచో
నీతోఁ బొందిఁక నాకుగూడదని యానీరేజపత్రాక్షి భూ
నేత న్నిన్నుఁ బరిత్యజింపఁ గలదే । నీకిద్ది ధర్మంబెటుల్. 58

వ. అని వెండియు. 59

తే. గీ. ఆపె కేవ్యాధియును లేదు భూప । సిరియె
వ్యాధిగల్పించె నది బాములందఁ జేసెఁ
గష్టకాలంబు తొలఁగె సౌఖ్యపడుకాల
మేగుదెంచిన దాతవ్వి నేలికొనుము. 60

కం. సిరివంటి చుట్టమ్మునులే
దెఱుఁగుము సిరివంటి శత్రువెందును లేదో
నరవర । తెల్పఁగ విప్ప
చ్చరమును గల్పించినాఁడ సరసిజముఖికిన్. 61

తే. గీ. బీదకోమటికిం బుట్టి పెరిఁగి నన్ను
వ్రతముచేఁ దృప్తు నొనరించి వైభవమున
కెక్కియై వ్రతపుం దోరమెల్లిదముగఁ
బాఱవైచిన కతమున బాములబ్బె. 62

కం. వ్రత మఖిలమ్మొకయెత్తీ
వ్రతపుం దోరమొకయెత్తు వ్రతమొనరుచు ధీ
యుతు లిది తెలిసికొనుటకో
క్షితిపా? నాసలిపినట్టి చెయిద మెఱుఁగుమా! 63

కం. ఒడలెల్లను బంగారపుఁ
దొడవులు రతనములుదాపు తొడవులునై యా
నడుమనొక తోరముండినఁ
జెడెనే! యందమ్మునీదు చేడియకధిపా. 64

తే. గీ. దేవతాప్రసాదంబు జందెంపుఁబోచ
లట్టులె విభూతిరుద్రాక్ష లెట్టిసిరిని
దూఁగువారును గర్వంబు రేఁగివిడువ
రాదనివచించు భూప! తోరంపుఁజరిత. 65

కం. ఈ నియమంబెఱుఁగని జడు
లేనియతిన్ వ్రతముఁ జేసిరేనియు వృధయౌ
నానయుడినాఁడ నీ వి
ద్దానిం బ్రచురింపు రాజధాని మఱెందున్. 66

వ. ఇట్లుపదేశించి పరమేశ్వరుండు కనుమొఱంగినట్లు స్వప్నంబుగాంచి ఱేఁడు మేలుకొని మేలుకంటినని సంతసింపుచు భిల్లునిఁబ్రోలికి నందలంబునంపించి యంతఃపురమర్యాదలతో మహిషిని రప్పించుకొను నప్పటికిఁ గొమరుండుచని గతంబఖిలమ్ము నాడిని తల్లికిఁ దోరం బొసంగ నాపె తనదోషంబునెఱింగి పరమేశ్వరునకు క్షమాపణంబు

చెప్పి సక్రమమ్ముగఁ దోరంబు ధరించి సుఖంబుండి ప్రతివత్సర మ్మును నీవ్రతంబాచరించుచు నితరులకు బోధించి యాచరింపించు చుండె. నీవ్రతంబు సర్వేష్టదాయకంబు. దీని మహిమం బవాఙ్మానస గోచరంబని వెండియు. 67

తే. గీ. భృంగిచేసిన యవమతిహేతువగుచు
నంబికాదేవి యీవ్రతమనఘుఁడైన
గౌతముఁడు చెప్పఁగావిని కాంతు నర్ధ
దేహమునుగొనెఁ జేసినసందేహమేల। 68

కం. ఈకత ననేకవిధముల
వాకొనినారమ్మనులు వ్రతముపచరించువిధం
బేకమె వ్రతమిడుఫల
పాకంబును నేకమెఱుఁగవలయు మునీంద్రుల్. 69

కం. శ్రుతులు విభిన్నము లరయుఁడు
స్మృతులును భిన్నములె యాచరించునెడ ఫల
శ్రుతిలో భేదంబుండదు
కతలెల్లను నర్థవాద కల్పితము లగున్. 70

తే. గీ. అర్థవాదములనినంత యసలు కృతికి
నించుకయు లోపమబ్బఁబో దెఱుఁగుఁ డయ్య।
యెట్లు భగవంతుఁ బూజించిరేని సుకృత
మబ్బునను నిశ్చయమ్ము తబ్బిబ్బుగాదు. 71

వ. ఈ కతలోఁ బుణ్యవతీభాగ్యవతుల నామధేయంబులం గుఱించియు వారలేలు ప్రదేశంబులం గూర్చియుకాక భాగ్యవతి నంతిపురిమండి వెడలనడఁచిన పదపడి యాపె నాదరించిన యాయవన్ గూర్చియు నొకచో నొకవిధంబుగను వేఱొకచో వేఱొక విధంబుగను నున్నను

ప్రధానంబగు వ్రతమ్మునకుఁ గాని తత్ఫలితంబునకుఁ గాని యాభే
దంబు బాధకంబుగాదని విజ్ఞులగు మీకు వక్కాణింపవలసి యుండ
దని వెండియు. 72

కం. కేదారేశు వ్రతంబున
కేదైవతపు వ్రతమేని యీడసరాదో
భూదేవులార! యీకత
యేదిగులున్ బాపి యొసఁగునెల్ల శుభములున్. 73

కం. కేదారేశుని నోమిన
భూదారంబేని తుదకు భూదారుఁడగుఁ
గేదారేశుని నోమని
శ్రీదారుండేని తుదకు శ్రీదూరుఁడగున్. 74

కం. కేదారేశు భజించెదఁ
గేదారేశ్వరు యజింతుఁ గేదారేట్ఛ్రీ
పాదముల నాశ్రయించెదఁ
గేదారేశునకు మ్రొక్కుఁ గేలర్పింతుఁ. 75

వ. అని శౌనకాదులకు సూతుండు వక్కాణించె.

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుమంటివి న్నను
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది

శ్రీ కేదారేశ్వర వ్రతము

సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ కార్తికసోమవార వ్రతము.

కం. శ్రీనగజా ప్రాణపతీ ।
మౌనిగణస్తోత్ర వంద్యమానవిభవ । భ
క్తానీకార్చిత పద ప
ద్మా । నిర్మలభావ । మల్లికార్జునదేవా । 1

వ. అక్కథకుండు రౌమహర్షణి శివప్రసాదమహత్త్వంబు
శౌనకాదుల కిట్లు వక్కాణింపం దొడంగె. 2

చ. కలఁ డొక బ్రాహ్మణోత్తముఁ డఖండతపస్వి పరాత్మవేది ని
స్తులగుణరత్నభూషణుఁడు సూరిజనస్తవనీయుఁ డాతఫే
యులకు శిరోవతంస మతియోగ్యుఁడు తత్సతిగూడ నన్నిటన్
దుల నిడఁ దూఁగు నాతనికిఁ దొయ్యలు లాపెకు సాటి రా రొరుల్.

కం. ఆచారపరులు సుకృత
ప్రాచుర్యము వొల్పువారు పరమోత్తములౌ
నాచారుశీలురకు లో
టేచక్కం గాన రా దహీనులు వారల్. 4

తే. గీ. రాజపూజ్యత గలదు మర్యాద గలదు
పాఁడి పంటయుఁ గల దూరివారలెల్ల
వారిసంపత్తిఁ జూచి యవారి ముదము
నందుచుందురు వారిపెం పట్టి దగుట. 5

తే. గీ. ఎఱుఁగఁడు దురన్న దుర్దాన హీనకృతుల
నెఱుఁగఁ దఘ మెట్టిదియు శిష్యు లెపుడుఁ గొలువ

వేదశాస్త్రసద్గోష్ఠి నా విప్రసత్త
ముండు కాలమ్ము గడపును మునియుఁబోలె. 6

కం. సంతానము లేదనెడి కొ
అంత యొకటిదక్క నా ధరాసురునకు నే
చింతయు లే దక్కతన ని
రంతర మయ్యనఘుధార్య వ్రతము లొనర్చున్. 7

సీ. నాగప్రతిష్ఠను నాగమోక్తప్రకా
రమునఁ గావింప వ్యర్థంబె యయ్యె
నశ్వత్థవృక్షాన కార్యోక్తవిధిని ప్ర
దక్షిణమ్ములును వ్యర్థములె యయ్యె
నాంజనేయస్వామి నారాధ్యుఁగా నెంచి
వ్రతమొనర్చినను వ్యర్థమ్మె యయ్యె
సంతానగోపాలు సాఁగిలి మ్రొక్క సం
తానమ్ము గోర వ్యర్థమ్మ యయ్యెఁ

తే. గీ. గాని విసు వన్నమాటయే గాన రాద
అమహామహు నిల్లాలి కనుదినమ్ము
నేదియో యొండు సంతతి కాదరమున
వ్రతమనెడి పేరఁ జేయు నప్పరమసాధ్వి. 8

వ. ఇట్లు వ్రతోపవాసాదులతోఁ గొండొక కాలమ్ము గడచె నంతట నాపుణ్యదంపతులకు వార్ధకవయస్సు దాదాపుగఁ గనుపట్టె నట్టితఱి నొక్కెడఁ బార్వతి పరమేశ్వరునితో నిట్లు వక్కాణించె. 9

కం. ఎఱుఁగుదురో ! యెఱుఁగరొ ! యు
ర్వరలో నొకవిప్రసాధ్వి పలువ్రతములు దే
వరల నొకరి ననవేటికిఁ
దరువుల సయితమ్ము నోముఁ దనయునికొఱకై. 10

తే. గీ. ఆపె పడుచున్న కష్టి మీ కవగతంబు
కాదుగాక మాసమున కొక్కదినమేవి
రెండుపూటలు దినదు పరుండు స్థండి
లమున జాలిగ నుండు నయ్యమతెఱంగు. 11

కం. మనల గుఱియించి యాద్విజ
వనితామణి చేయకున్న వ్రతములు పెక్కుల్
పొనరిచె నేవేవియొ । స
ర్వవిలింపాత్మకులు మీరు వంచన తగునే । 12

ఉ. కొందఱు సూర్యునింగుఱిచి కొందఱు చంద్రుగుఱించియున్ శతా
నందుగుఱించి కొందఱును నన్ను మదంశము గీర్వధూటి నా
యిందిర నాపెభర్త నిటు లేరికి నెందు లగించుఁ జిత్త మం
దందున నిల్పి నోతురు సమస్తము దేవరకే ఘటించెడిన్ 13

తే. గీ. ఆకసమునుండి పడెడిఁ దోయమ్ము చాల
వఱకు సంద్రమ్ములోఁ గొంత వారిమాత్ర
మక్కడక్కడఁ గురియు సమస్త మవల
నద్ధికే చేరు దేవర కఖిల మెఱుక.

కం. ఫలదాతలు మీరలు మి
మ్మలనే సేవింతు తత్త్వము నెఱింగిన యో
గు, లితరు లితరులఁ గొలుతురు
ఫల మిద కెటు తప్పు మీకుఁ బరికించినచో. 15

వ. ఇట్లు లంటిక యాబ్రాహ్మణోత్తము నిల్లాలిం గుఱిచి పరమేశ్వరు
వితోఁ బ్రసంగించుటయు నమ్మహాదేవుండు. 16

చ. కలికిరో । నీవు చెప్పెడిప్రకారము సర్వము న్యాయ్య మెవ్వ రి
మ్మల నెవరింగుఱించి తపముం బొనరించిన నాక చెందు నీ

వలసిన భార మున్నయది వారలకోరిక నాకు, విక్కమే
పలికితి వీవు, బ్రాహ్మణునిభార్య మహోత్తమురా లెఱుంగుదున్. 17

తే. గీ. సంతుఁ గోరి తపించెడి సంతుగాని
యేదిగాని పురాకృత మెఱిఁగి యీయ
వలయు నీవేని నేనేని కలికి! ప్రకృత
మట్టు లొనఁగిన వారల కబ్బు వగపు. 18

కం. తెలివియుఁ దేటయు మిక్కిలి
గలవాఁడే యయ్యు వాఁడు గణికాజనముల్
వలచి చెడి పేరు చెఱుచుల్,
ఖలుఁడగుఁ బ్రాక్కాలకర్మగతి యటులుండెన్. 19

ఆ. వె. దానిఁ దప్పఁ ద్రోయఁగా నేను నేరను
గర్మగతికి భుక్తిఁ గాక యన్య
థా విముక్తి లేదు తరళాక్షి! యాజంప
తులఁ దలంప నాకుఁ గలుగు జాలి. 20

వ. అందులకై యోజించుచుంటి నట్టులే కాకయున్న వింతకుమున్నే
యమ్మహాసాధ్వికోర్కి నెఱవేర్చి యుందు ననపుడుఁ బరమేశ్వరి
పరమేశ్వరున కిట్లను. 21

చ. ఎఱుఁగనివాంఛతో నొడువుఁ దిట్టివి దేవరసత్త; కర్మ మె
వ్వరికిని భోజ్య మన్ననుడి వాస్తవమే యగుఁగాక మీకు నీ
శ్వరబిరుదంబు వర్తిలెడి సర్వసమర్థులు మీరు మిమ్ము న
ద్దరు హరిముఖ్యు లెయ్యది గడంగి యెటుల్ తలక్రిందొనర్చినన్. 22

కం. కర్తు మకర్తు మితరథా
కర్తుం శక్తులరు మీరు గరిమమ్మును ము
మ్మూర్తు లెఱుంగరు కొందొక
నేర్తున్ మీగరిమ మెఱిఁగి నేర్పున మెలఁగన్. 23

ఉ. మీ రెది యెట్లొనర్చినను మిన్నక చూచుచె తప్ప వేల్పులం
దేరును "గి" మ్మటంచనమి యేఁ గవిపెట్టితి మౌనిసూతికిన్
గూరిమిఁ గల్పకల్పములకుం జెడకుండెడి యాయు విచ్చు మీ
పేరిమి నెవ్వ రాఁగి రతివేలము మీకృప కద్ద మున్నదే? 24

వ. మీనిరుపాధిక కారుణ్యముం గొనియాడ నే నెంతదాన నది యటు లుండె నిప్పుడీ విప్రసాధ్వీమణికి నొసంగు కొమరుండు దుష్ప్రవర్తనుం డగుటకుంగల కతంబు వినఁగోరెద నావుడుఁ బరమేశ్వరుండు.

చ. వినుము తలోదరీ! మఖము విప్రుఁ డొనర్చెను బుత్రుకోస మం
దున నొకఋత్విజుండు స్వరదోషము రా మను వుచ్చరించె దా
నిని యజమానుఁ డారసి యనింద్యుని నాతని దూఱె నంత నా
యనఘుఁడు క్రుద్ధుఁడై ద్విజవరాగ్రణి నిట్లు శపించెఁ గ్రన్ననన్. 26

వ. అయ్యా! నాకు మంత్రోచ్చారణమ్మునెడఁ గల్గిన స్వరదోషంబునకుఁ గతం బనివార్యంబగునాపులింతగాని నాప్రమాదంబు గాదు నీవు తత్త్వమ్మును గమనింపక నన్ను మూర్ఖయని దూఱితివి కావున. 27

శా. నీకుం బుట్టు తనూభవుం డగు జగన్నింద్యుండు మూర్ఖుండు దు
ర్భీకుండున్ విటుఁ డంగనాజితుఁడు నీతేజంబు కుంచించు వాఁ
డేకాలుష్యము లేని నన్నురక నీ వేమేమొ దూషించి తా
పాకం బూరకపోదు కట్టికఁడుపున్ బల్మాట లింకేటికిన్. 28

వ. నావుడు నమ్మఖకర్త పశ్చాత్తాపంబు నొంది నాయొనర్చిన తొందరపాటు క్షమింపు మని యమ్మువికొళ్ళపయిం బడి యనునయించుచు.

ఆ. వె. ఎవఁడుగాని మూర్ఖుఁడేని పూజ్యత లేదు
విప్రుఁడైన వేఱ పెదకవలెనె!
పశువురీతి శూద్రుభాతి మూర్ఖుండైన
బ్రాహ్మణుండు కర్మబాహ్యుఁ డరయ. 30

కం. ఏరా జేలెడి భువిఁ బెం
పారుఁగ మూర్ఖుండు పూజ్యుఁడై విప్రుఁడు భూ
దారుం డాతఁడు నింద్యుం
డారాజ్యము విడుచు టొప్పు ననఘులు విజ్ఞుల్. 31

కం. తనదేశమ్మునఁ గల మూ
ర్ఖుని విప్రుని రాజు దున్నుకొనువానింగఁ జే
యనగున్ బన్నిడుశూద్రునిఁ
గనుగతి నవ్వానిఁ జూడఁగాఁ దగు నెందున్. 32

కం. భూసురశూన్యంబుగఁ దాఁ
జేసిననుం గర్మ మొకటఁ జేయఁగవచ్చున్
బో! సేయరాదు మూర్ఖుని
బోసేయఁగఁ బెట్టి యెట్టి ముప్పుననేనిన్. 33

కం. జడుఁడైన విప్రునకు నె
వ్వఁడు నేమియు నీయరా దవశ్యమయే నె
క్కుడుగ నిడక పొట్టకు సరి
పడునన్నము వెట్టి పంపవలయుం బ్రాజ్ఞుల్. 34

ఉ. భూపతిచేత మన్ననలు పొందఁగ నర్హుఁడు గాఁడు దైవతా
శాపరిపూర్తికిం దగినసత్కృతికిం గొఱగాఁడు పైతృకో
ద్యాపన మాచరించుటకుఁ దజ్ఞులు పిల్వఁగ సమ్మతింప రిం
కేపని సేయఁగావలయు నిట్టిసుతుం గవి ఋత్విగుత్తమా? 35

తే. గీ. అయ్య! ఋత్విజ! సంసారమందు మూర్ఖ
పుత్రతకు మించుకష్టమ్ము పుడమిఁ గలదె?
అంతకన్నను జావు మే లన్య మేది
యేనియు భరింపనగుఁ గృపఁ బూను మనఘ! 36

వ. అని యెదతెగని సంతాపంబున వేదు నయ్యలఘునియెడఁ గరుణించి
యాఋత్విక్సత్తముం డిట్లను. 37

ఉ. తొందరమై ననున్ గినిసి దూఱితి వేనును నిన్ను నట్టులే
తొందరమై శపించితి సుతుం డతిమూర్ఖుఁడె యయ్యెఁ బిమ్మటన్
గందు సమస్తముం దొరఁగి కాంచువిముక్తిని వంశమెల్ల దా
నం దరియించుఁ దప్పదిది నానుడి వేదము నమ్ము మెమ్మెయిన్. 38

వ. ఇట్లు ఋత్విగుత్తముం డతనియెడఁ గరుణించె నక్కతమ్మున సీవిప్రునకు మన మొసంగు పుత్రుఁ డైహికానందమునకు లేశము నుపకరింపఁడని యోజించుచుంటి ననవుడు నంబిక యిట్లనియె. 39

కం. కౌలము తరించుటకే కద ।
తలఁపిడి సంతతిని గోరుఁ దజ్ఞుఁడు తాదృ
క్ఫలమున్నయపుడు మీరిటు
విలంబన మొనర్పనేల । విశ్వేశానా ? 40

వ. ఇట్లు జగదీశ్వరి ప్రోత్సహించుటయు నవ్విప్రదంపతులకు నీశ్వరుండు కొమరు ననుగ్రహించె నక్కొమరుండు శుక్లపక్షపాకరుం బోలె దినదినప్రవర్ధమానుండై యలరారె. వానికి యజ్ఞదత్తుండని యన్వర్థంబగు నామంబిడి గర్భాష్టమకాలంబున నుపనీతుం బొనర్చి తండ్రి వేదంబు చెప్ప నుపక్రమించెం గాని యాబాలకుండు లేశమును బఠింపక తండ్రికి లోఁగక యాటపాటలకు మరఁగి యెందులకుం గొఱగాక తిరుగం జొచ్చె. 41

కం. కల దందముఁ జందమ్మును
గల దెంతయు బుద్ధిమత్త కలుషితమై యా
తెలివి సమస్తము నాటల
నెలమిం గలిగించి చెఱచె నేమన వచ్చున్. 42

ఆ. వె. లేకలేక పొందము తోక మ్మగుటఁ జేసి
గార మెక్కుడుగను గడలుకొల్పి

తల్లి కవచరీతిఁ దనయుఁ గాపాడుటఁ
జేసి వాఁడు మిగులఁ జెట్ట యయ్యె. 43

ఆ. వె. విప్రబాలకుండు వెదురుబొంగును వంప
కున్న యెడల రాచమన్ననలకుఁ
గాక దొమ్మరాటకత్తియ * పద్ధతి
కగ్గమగు నటంచు రార్యు లెందు. 44

కం. కావున బాల్యమునందున
ధీవరులు తనూజు నెఱిఁగి ధీ గఱపినచో
దేవప్రియుఁడగు నొండెన్
దేవానాంప్రియత గూరి దృప్తుండ యగున్. 45

కం. గారమ్ము కుఱ్ఱలకు నప
కారమ్మొనరించు శిక్ష గఱపినచో సం
స్కారమ్ము గల్గియది యుప
కారమ్మొనరించు నెఱుఁగఁగాఁ దగు గేస్తుల్. 46

వ. ఆబ్రాహ్మణుండు సర్వమ్ము నెఱింగినవాఁ డగుటంజేసి సర్వవిధ
మ్ములఁ గొమరు విద్యావంతు నొనర్పయత్నించెంగాని తల్లి వాని
పట్టుగా నుండి సంజ వార్చకున్నను వార్చెననియుఁ బాఠమ్ము చదువ
కున్నను జదివెననియు భర్తకుంజెప్పి వానికి శిక్ష లేకుండఁ జేయుఁచు
గాలమ్ము గడపందొడంగె. నిట్లు యుక్తకాలం బతిక్రమించె. 47

మ. పదియాఱేఁడుల ప్రాయ మంతటను సంప్రాప్తించె వేశ్యా జనా
స్పదముల్ దూరుట వాంఛకన్నియలతో సంబంధబాంధవ్యముల్
మదిరాస్వాదన మాదిగా సకలదుర్మార్గమ్ము లాయీడు కో
విదనింద్యుం బొనరించి నేర్పఁదొడఁగెన్ విప్రుల్ గడున్ రోయఁగన్.

* టిప్పణి : పద్ధతి = రీతి. (పద్-హతి) కాలిబాటకుడు.

ఆ. వె అంకినంతవట్టు నమ్మకుఁ నయ్యకుఁ
దెలియకుండ నింట దేనినేని
గొనుచుఁ బోయి వేశ్య కూఁతుల కిడుచుండెఁ
దల్లి యెఱిఁగికూడ దాఁచుచుండె. 49

తే. గీ. ఏకపుత్రవిషయమిటు లెల్లగతుల
గారమునకుఁ గారణమయి కడకు విప్ర
బాలు నన్నివిధమ్ములఁ బాడుచేసి
యిహముఁ బరమును లేకుండునెగ్గు గూర్చె. 50

తే. గీ. అగునుగా కొక్కఁడే కొడు కకట। "గడ్డ
పారతో ముక్కు గుట్టించువారు" గలరె।
అనుచు బందుగు లితరులు నాడఁదొడఁగి
రిట్లు గతియించెఁ గాల మొక్కింత పిదప. 51

కం. జనకునకు రాజుగా రి
చ్చిన పచ్చల యుంగరమ్ము చేఁజిక్కుడు దా
నిని దెచ్చి వేశ్యకన్యక
కు నొసంగెనెఱుంగఁ డతఁడు కొడుకుచెయిదమున్. 52

శా. "పుత్రం మిత్రవ దాచరే" త్తనువయస్ప్రా ప్తిన్ గుమారుం డిటుల్
శత్రుండై చరియింపఁ దండ్రి మిగులన్ సంతాపముఁ జెంది యే
మాత్రమ్మో కలిగించుకో జనని సంబాళించు నిట్లొటఁ జా
రిత్రం బెంతయుఁ బాడువాటి కడు దుర్వృత్తుండు వాఁడై చెడెఁ. 53

వ. అంత నొక్కనాఁడు తండ్రిస్నానార్థం బరిగి వచ్చుచుండఁ గొందఱు
కొడుకు నీడువాం డ్రొక్కెడ గుంపుగాఁ గూరుచుండి యేకసక్కె
ముగాఁ దమలోఁ దా మొనర్చుకొను ప్రసంగమ్ములో నీపచ్చల
యుంగరపుఁ బ్రసక్తిం దెచ్చి యయ్యది యీబ్రాహ్మణుని హస్తమ్మున

నుండి వెలిబూదితో నలందురుటకన్న రోకన్నెమిన్న హస్తం బలంకరించుటయె సమంజసంబని యొకఁడును, వేశ్యాకందు జేని కీయుదంతంబు దెలిసినచోఁ బాప మీబ్రాహ్మణోత్తమునకు మాట వచ్చునవియును బ్రసంగించుకొనుచుండుట చెవిం బడి యావిప్రసత్త ముం డింటికిం జని చనినతోడన భార్య నిట్లు ప్రశ్నించె. 54

చ. నృపవరుఁ డల్లనాఁ డొసఁగెనే ; యొకపచ్చల మేల్మియుంగరం
బపరిమితప్రదీప్తి భర మయ్యది నీ కిడినాఁడ నీవు భ
ద్రపరిచితే ; యనంగ నది తద్దయు గుప్తము చేసితిన్ సరే ;
యిపు డలదానితోడఁ బనియేమి ; భుజింపుఁడు ప్రొద్దు వోయెడిన్.

వ. అని యాసాధ్వీమణి గంభీరంబుగా నుత్తరం బొసంగెఁ గాని భర్త స్నానార్థం బరిగి వచ్చినతోడనె దానిఁగూర్చి ప్రశ్నించుటకుఁ గార ణం బుండకపోదని యనుమానించి వెలవెలవోవుచు మదిలో నున్న కలశంఁ దనపేటిక దెఱచి చూడఁబలుగామి భర్తకు దేవతార్చనకు వలయు నుపకరణంబులు సమకూర్చుచుండె నట్టితఱి నామహానీ యుండు మరల నిట్లు ప్రశ్నించె. 56

చ వెలవెలఁ బోవుచుంటి వది వేశ్యకుఁ జిక్కెనదంచు నూరిలో
పల నది రేఁగె నీకొడుకు వారితలోదరులందు దేవికో
వెలగల యుంగరంబు పృథివీపతి యిచ్చిన దిచ్చెనేమొ ; నీ
వలనన వాఁడు పూర్తిగ నపాత్రశిరోమణి యౌచుఁ బాడఱెన్. 57

చ. నది యది విన్నదే మొదలు చాల మనంబు తపింపఁ జొచ్చె నీ
కొడుకుకతాన వంగడము గుందెడు నేడుతరమ్ము లిట్టటుల్
చెడు విటు గారమున్ సలుపఁ జేడియరో ; యన నాలకింప వి
వ్వుడు సకలంబు నానుడులు బుద్ధికి నెక్కెనె ; లాభ మే మికన్.

తే. గీ స్వామిబలెఁ జూడఁగా వచ్చు బాల నైదు
వత్సరమ్ములు పిమ్మట వత్సరదళ

కమ్ము దాసునిబలెఁ జూడఁగావలెనని
యూరకే చెప్పరే ! పెద్ద లువిద ! వినవె. 59

కం. చెవి విల్లు గట్టుకొని నీ
కువిదరొ ! గార్దమ్ము వలని యుత్పాతంబుల్
దవిలి వచించితి వినవై
తివి కుఱ్ఱఁడు చెడియె నిపుడు తెలిసిన నేమొ. 60

వ. నావుడు నాయిల్లాలు గలంగక ధైర్యంబు దెచ్చికొని. 61

తే. గీ. ఊరిలో నోర్వలేక యయోగ్యు లెవరొ
మీరు విన నేదియో పల్కఁ గ్రూరులైన
వాంఛనుడి నమ్మి పసికుఱ్ఱవాని కనువు
గాని చెయ్వుల నమ్ముట గలదె యెందు. 62

చ. చదువఁడుగాక యెల్లరును శైశవమందునె ! విజ్ఞులైరె ! మం
చిదశలు జాతకమ్మునకుఁ జిన్నతనమ్మున వచ్చినప్పుడే
చదువు లభించు నం చెవరిజాతకమో గని మీరు చెప్ప నే
నది విని యుంటి మీసుతున కట్టిద రాకెటు వచ్చు సిద్ధియల్. 63

చ. ఇరువదియేండ్లు వచ్చునఱ కెందఱొ మూర్ఖులుగాఁగ నుండి య
ప్డటిముటిఁ గాశి కేగి విబుధాగ్రణులై చనుదెంచి రంచు నె
వ్వరినిగుఱించియో యెపుడొ వాకొనియుంటిరి మీరు పుత్రకుం
డరుదుగ నట్టులే విబుధుఁ డయ్యెడినేమొ ? సుకాల మబ్బుచో. 64

తే. గీ. ప్రొద్దు వోవుచున్నది భోజనాన
కవుడుఁ గుఱ్ఱనిచదువుమా టరయ వచ్చు
దేవతార్చన గానిండు దేవునియను
కంపయే సర్వమునకును గారణంబు. 65

వ. ఇట్లు తొందరపెట్టు నిల్లాలికి యజమానుం డిట్లను. 66

తే. గీ. తండ్రి ఋణ మొనరించుచోఁ దనకు శత్రు
వట్టులే వ్యభిచారిణి యైనతల్లి
అందకత్తె యిల్లాలును నట్లె పండి
తుండు గాని కొమరుఁడు శత్రుండు వినుము. 67

ఉ. పండితులైన విప్రుల సభాజితులం బొనరింప నబ్బు నా,
ఖండలలోకసౌఖ్య మని క్ష్మాపతు లెంచి ధనంబు రత్నముల్
మండనముల్ మొదల్ మనకు మన్ననమై నొసఁగంగ బోగపున్
రండలఁ జేర్చ గౌరవము రాజుల కుండునె ? విప్రజాతిపై. 68

కం. దానము చేయని ధనికుల
కేనంబును లేదు లేద యితరము చెడుగౌ
మానిసికి దాన మిచ్చిన
వానికి నరకంబు విధిగ వచ్చుం జుమ్మీ। 69

వ. నేను బాత్రుండ నని యెంచి ఱేఁడు నాకు ననర్ఘంబగు నుంగరమ్ము గారుత్మతమణిమయం బొసంగ నయ్యది నీయజాగ్రత్తంజేసి వేశ్యాగృహమ్ము చేరుటకన్న వింకొకశోచ్యదశ యుం గలదే ? "ఆత్మావై పుత్రనామాసి" యని యుంటంజేసి యీదోషంబు సర్వదా నాయందు సంక్రమించి నట్లయినది. ఇందులకు నీవు కారకురాలవు. 70

ఆ. వె. నీకు జంకి నేను నిగమమ్ముగాని శా
స్త్రంబుగాని యెట్టిచదువుగాని
చెప్పఁజాలనైతిఁ జెడుగయ్యెఁ గొమరుండు
సానిపిల్ల కేను శ్వశురుఁడైతి. 71

తే. గీ. నాకు దేవతార్చనకు మనంబు చొరదు
భోజనంబు నొనర్పఁగ బుద్ధి చొరదు

నన్నుఁ గని యూరిజనములు నవ్వుచుండి
రేది? యుంగరమును జూపు మిగురుఁబోఁడి. 72

కం. "యో ఒయోనొ" శ్రుతివాక్యము
నాయందె సమన్వయించె నాపితరుల కీ
దాయాదుకతన నరకం
బోయతివా! తప్పు బెట్టులోకద! యింకన్. 73

తే. గీ. ధర్మశాస్త్రమ్ములందు గార్దలను సూక
రముల వేశ్యల మను లోకరాశిలోనఁ
జేర్చి తద్వ్యక్తి కొకబె పాచితము నొడివి
రేమెఱుంగుదు గారమే యెఱుఁగు దీవు. 74

వ. ఇట్టు లేవపడు భర్తకుఁ గోపోపశాంతి సేసి యాసాధ్వీమణి యుంగ రమ్ము కలదనియు నయ్యది చాల భద్రమ్ముగా దాఁచితిననియు నెవ్వరో యావేశ్యకూఁతున కట్టి యుంగరమ్ము నిచ్చియుందు రేమో యనియు మానిసిం బోలు మానిసింబలె వస్తువుంబోలు వస్తువులు నుండవచ్చు ననియు నెట్టెట్టులో సమాధానంబు చెప్పి దేవతార్చన యొనర్చునట్లును నభ్యవహారంబు సల్పునట్లును దననేర్పుకతన సంఘ టించి పదంపడి పెట్టె వెదకిన నందుంగరంబు లేమికిఁ జింతించుచు మరల మరలఁ జూచినదే చూచుచుండ నాబ్రాహ్మణోత్తముం డచ్చో టికి వచ్చి యాపెముఖకళం బట్టి యథార్థంబు గుఱితించి. 75

ఉ. ఇప్పటికేవియున్ దెలిపెనే! సుతు నేగతిఁ బాదొనర్చితో,
ముప్పొనఁ గూర్చు గార మవి మొత్తికొనన్ వినవైతి లాలనం
బెప్పుడు బిడ్డలం జెఱచు వించుక తాడన మున్నకుజ్జులే
గొప్పసభాస్థలంబులమ గోవిదమాన్యులు గాఁగలా రిలన్. 76

తే. గీ. ఉంగరము వోయె నంచు నే వంగలార్వ
నప్రతిష్ఠకుఁ గలికి! నే వంగలార్తు

నిహముఁ బరమును జెడుకుట్టు నేలకంటి
నంచు నే నంగలార్తు నేమనఁగలాఁడ. 77

చ. చదువని యొక్కఁ డున్నయెడ జారుఁడొ చోరుఁడొ యయ్యు వాఁడు కో
విదజనమాన్యమైన పదవిన్ బడుఁ గొంతగతించుపిఁద నె
య్యదియును దెల్వి లేని విటు నాగణికల్ గడుఁ జుల్కఁ జేసి నె
ట్టుదు రవమాన మెయ్యది జడున్ గొడుకుం గనుకన్న మానినీ. 78

తే. గీ. ఈశ్వరుంగూర్చి తపియింప నిట్టికొమరు
నిచ్చె నీకున్న మేలగు నింతకన్న
సంతు గలవార లెందఱు ! సంతు లేని
వార లెందఱు ! జగమున వామనయన ! 79

వ. ఇట్లు విచారించు పెనిమిటికి నాసాధ్వీమణి యేమియుం బ్రతిచెప్ప నేరక మిన్నకుండె గోడచాటున డాఁగిన యజ్ఞదత్తుండు తలిదండ్రుల యారాటం బెల్ల నాలకించి తండ్రివలని భయమున నింటికిఁ దిండికి సైతము రాక గ్రామంబునన యుండి యెట్లో కాలమ్ము గడపుచుండె.

తే. గీ. తల్లి కొమరునికొఱకునై యుల్ల మెరియఁ
జింత సేయుచు భర్తకుఁ జెప్పనోడి
పరితపించుచు నుండె నా బ్రాహ్మణుండు
గడువిరక్తిని మది రాయిగాఁగ నుండె. 81

ఉ. పచ్చలయుంగరమ్ము గొనుపంకజలోచన కొంతకాల మే
యొచ్చెము లేనిపక్కి మరునూడిగ మొక్కటెకాక భుక్తికిన్
వెచ్చముగూడ నిచ్చి యలవిప్రసుతున్ గఱఁగించె నంత వి
ప్పచ్చర మేటికంచు నలవారవిలోచనతల్లి యల్లనన్. 82

వ. అల్లుపిం జేరంబోయి హితం బుపదేశించునదియుంబోలె నిట్లనియె.

కం. నీతల్లియు నీతండ్రియు
మాతెఱవంగూడి యిచట మంతనమున నా

చేతోజాతుని వశమగు
నీతత్త్వము దెలియ కెందు నెమకి పదపడిన్. 84

వ. హతాశులై విచారించుచున్నట్లు వినవచ్చినది. అది మొదలు నాకుఁ గడుంగడు దుఃఖంబు వొడముచున్నయది నాకు నాకొమిరెయందున్ బలె నీ తల్లిదండ్రులకు నీయందుఁ బ్రేమం బగ్గలమ్ముగదా? నీవెప్పటట్ల మీయింటనుండి నిదుర కిక్కడికి వచ్చుట నాకిష్టంబు అట్లు గాకున్న వారలయుసురు మాకుఁ దగులక మానదు. 85

చ. తపసులలోన నుత్తముఁడు త్వజ్జనకుండు భవత్పవిత్రితో
నుపమకు వచ్చుసాధ్వి లెట నుండఁగఁబోరు ధరిత్రి వారియు
ల్లపుఁబరితాప మయ్యెది తలంచిన నామది గంపమొందుఁ ద
త్కృప యది మాకుఁ గావలయు నింటికి నేగుము రమ్మ పిమ్మటన్.

వ. వేశ్యమాత మృదువైన నిష్క్రమణోపాయంబు చింతించి యిట్లుపదేశం బొనర్చుపగిదిఁ బలుకుచుండినను గొన్నిదినంబులదనుకఁ దన ప్రియురాలి యనురాగభరంబు సడలకున్కి నెచ్చటనో భుజించియు భుజింపకయు నటకు వచ్చుచుం బోవుచుఁ గాలంబు నెట్టుచుండె నంతఁ గార్తికమాసంబు తారసపడుఁడు గార్తికనక్తవ్రతంబు లొనర్చువారును దీపారాధనంబు లొనర్చువారును సోమవారవ్రతంబు లొనర్చువారలునునై పురంబు పరమేశ్వరసభాజనమయంబై విలసిల్లుచుండె యజ్ఞదత్తునకుఁ గడుపునిండఁ దిండి లేనికతనఁ గాలంబు చాల దుర్ఘటంబుగ జరుగుచుండె. 87

తే. గీ. జ్వరము లేవి లంఘనములఁ జాల నవసి
యున్న యజ్ఞదత్తునకు నాఁ డన్నరాశి
యీశ్వరుని దేవళమున నదృష్టవశత
దృష్టిగోచర మగుడు నింకేమి చెప్ప. 88

వ. కార్తికసోమవారవ్రత ప్రయుక్తంబగు సంతర్పణంబునకుఁగా నేర్ప
డిన మృష్టాన్నంబు వండ నారంభించినది మొదలు యజ్ఞదత్తుం
డాదేవాలయమ్మునంద కాచికొని సమయమ్ము వేచుచుండె. 89

సీ. ఒకమాఱు దేవళానకుఁ బ్రదక్షిణముగాఁ
దిరుగువారల వెంటఁ దిరుగుచుండు
నొకమాఱు నచటఁ గార్తికపురాణము చెప్పు
పౌరాణికద్విజుపజ్జ జేరు
నొకమాఱు శ్రీకంఠునకు నభిషేకించు
న్యాసమంత్రములు విన్నటు నటించు
నొకమాఱు దర్శనానకుఁ బోవుజనులతో
గర్భాలయము సొచ్చి కాంచు శివుని.

తే. గీ. నేమి చేసిన నన్నంబు నెపుడు దొంగి
లింప వీలగునో ! యనులేకిబుద్ధి
తప్పు లేశము సద్బుద్ధి తనకు లేక
యజ్ఞదత్తుండు మెలఁగె నయ్యభవుగుడిని. 90

వ. అంతఁ గొండొకసేపునకుఁ బ్రొద్దు గ్రుంకె నభిషేకంబుల యలజ
డియు నీశ్వరు సందర్శింపవచ్చువారల యొత్తిడియును దగ్గె నిఁక
బ్రాహ్మణభోజనంబె కడమగా నుండునెడ నాయన్నరాశి యున్నదేవ
గృహంబు ద్వారంబున కడ్డంబుగా నవశంబగు నిద్రతోఁ బాచకుండు
పరుండి యుండె నంత యజ్ఞదత్తుండు. 91

ఉ. పంబిన యాఁకటన్ బడలి పాచకు నిద్రితు దాఁటి చేత న
న్నంబును దక్కువస్తువులు నక్కి యటఁ దిసపాఁగె ముందుగాఁ
త్ర్యంబకమూర్తి కెట్టెటులొ హస్తము చూపి అనంతరంబు ని
ద్రం బడియున్నపాచకుఁడు తత్తఱపాటున లేచి చూచుచున్. 92

వ. అటు నిటు నెటుఁగాని సురింగి పోవుట కవకాశంబు చిక్కమింజేసి యెట్లో పాచకుం దప్పించికొని యేగుచుండ వెంటఁబడి పాచకుండు తన కందుబాటులోనున్న యాయసపుదర్వితో నొక్క మోఁదు మోఁది నంత నాబ్రాహ్మణపుత్రుం డాలయప్రాకారంబునన నాదెబ్బతో విగత ప్రాణుండై పడియె నయ్యెడ యమదూతలరుదెంచి వానిం గొనిపోవ నుద్యమింప వారల నవలికి నెట్టి శివదూత లాయజ్ఞదత్తుని గైలాసం బునకుం గొని పోవఁ బరమేశ్వరుం డాదరించి ప్రమథగణంబులతో పాటు గౌరవించుట విని ధర్ముండు చిత్రగుప్తసహితంబుగా నీశ్వర నికటమ్మున కేతెంచి నమస్కరించి చిత్రగుప్తుండు లిఖించిన యజ్ఞ దత్తుని పాపంబును బ్రత్యక్షరంబును వినిచి యిట్లు ప్రశ్నించె. 93

తే. గీ. ద్విజకులమ్మునఁ బుట్టె సందె యొకనాఁడు
వార్చినట్టులు లేదు దేవళమునందు
దేవరకు నుండియుంచిన దీదివిని గ
ళంకితముఁ జేసి వీఁడయ్యెఁ బంకిలుండు. 94

ఉ. ఏమి మహాత్మ! వీని కెటులిచ్చితి దివ్యపదమ్ము వీఁడెటుల్
నీమది కెక్కె వీఁడు కడునింద్యుఁ డయోగ్యుఁడు బోలెఁడుండె నీ
పామరు పాపముల్ తెలుపవచ్చితి దేవరకిట్టులైనచో
సామి! యఘంబుసల్పుటకు జంకెడి ప్రాణిజగాననుండునే! 95

కం. ఏమంత్రము జపియించె మ
హేమహనీయులకు సేవ నీతఁ డొనర్చెన్
బామరుఁ డతితరవేశ్యా
కాముకుఁ డివ్వాఁడు ముక్తి గైకొనుటెట్టుల్. 96

కం. దూతల పొరఁబాటని మ
చ్చేతమ్మునఁ దోఁచి యిటకు శ్రీంఠ! కడున్

భీతిలుచు మనవి సేయుట
కేతెంచితి సైఁపవలయువిటఁ దప్పున్నన్. 97

వ. నావుడుఁ బరమేశ్వరుండు మందహాససుందరముఖారవిందుండగుచు
దండధరున కిట్లనియె. 98

తే. గీ. పెద్దపాపమ్ము లేవియు వీఁడొనర్పఁ
దట్లనఁగనేల ! చేసెనే యనుము కార్తి
కమున సోమవారమున నేమమున వీఁడు
పోషణ మొనర్చె నాసాయమును గడంగి. 99

కం. నను సేవింపఁగ వచ్చెడి
జనములసహవాస మబ్బె సాయంకాల
మ్మున మెక్కె భక్తమును నా
కు నివేదన చేసి తెలిసి కొంటివొ ! లేదో. 100

తే. గీ. ఆలయావరణమ్మునం దసువు లూడ్చె
నన్నిటికి మించినట్టి పాపాపహంబు
సోమవారోపవాసంబు సురిఁగె దాన
వీనిపాపమ్ము లన్నియు వీఁడు సుకృతి. 101

చ. ఎఱుఁగడుగాక వీఁడు ఫల మిట్టిది గగ్గెడు నంచు నాఁకటన్
బొరలుచుఁగూడ నా కిడక భుక్తి యొనర్చినవాఁడు గాఁడు దు
శ్చరితుఁడె యయ్యు భక్తుఁడయి సన్నిధిముక్తికి నర్హుఁ డయ్యె నీ
నిరయము వీని కెక్కడిది ! నేరక వచ్చితి ధర్మసూక్ష్మముల్. 102

తే. గీ. కొన్ని యుత్సర్గములు శాస్త్రకోటి నుండుఁ
గొన్ని యపవాదములు వాని నెన్నునపుడు
బాధ్యబాధకభావంబు బాగుగా నె
ఱింగి శిక్షింపవలయు ధర్మిష్ఠుఁ డెపుడు. 103

కం. వ్రతములు జపములుఁ దపములుఁ
పతితులను దరింపజేయుపనికి జనించెన్
గృతపాతకములనెల్లన్
హత మొనరిచి యవ్వి ముక్తి కర్హులఁ జేయున్. 104

వ. వీఁడు మాత్రంబకాదు వీనిజననంబుకతన వీనివంశంబెల్లఁ దరించెఁ గార్తికమాసంబెల్లఁ బరమపవిత్రం బందు సోమవారంబు నాకు మిక్కిలి ప్రీతిపాత్రంబని యెఱుంగనగు నను శంభునకు నమస్కరించి దండధరుండు తనలోకంబున కరిగి తనయనుచరులతో వికనెన్నఁడును గార్తికసోమవారవ్రతపరుల దరికిఁ బోకుండునది యని శాసించె నిది కార్తికసోమవారవ్రతమహత్త్వంబు దీని శ్రవణమననాదులు పాపాపనోదకంబులును శ్రేయోదాయకంబులు నని సూతుండు శౌనకాదులకు వాక్రుచ్చె. 105

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుమంటి నిన్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది
శ్రీ కార్తికసోమవార వ్రతము
సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ స్కాందషష్ఠీ వ్రతము.

వ. శ్రీమద్విజయవాటీనివాసా। కృత్తివాసా। మల్లికార్జునదేవా। మహానుభావా। అవధరింపు మనంతరంబు సూతుంగాంచి శౌనకాదులు. 1

తే. గీ. ఎన్నితపములొనర్చిన నెన్నిజన్న
ములనొనర్చినఁ బున్నామము నరకంబు
పుత్త్రుఁ గన్నవారలకె పరత్రిసుతర
మన్యథాదుస్తరంబని యంద్రుగాదె। 2

ఉ. సంతతిఁ గన్నమాత్రమునఁ జాలదుతండ్రి గతించుదాఁకనే
సంతతి నిల్పు నయ్యదియ శాస్త్రవిదుల్ గణియింత్రు సంతుగా
వింతులలోన నెందరికొ యీసుకృతంబు ఘటింపదెట్లిఁకఁ
గాంతురు పుణ్యలోకములు కర్మఠులో యనఘాత్మ। తెల్పవే. 3

కం. పదివిధముల వంధ్యలలో
నెదియో యొకవిధపు వంధ్యయే గేస్తునకుఁ.
బొదలుఁ గళత్రంబై సం
తదిగన దొక్కంటఁ గనిన నది వ్యర్థముయౌ. 4

తే. గీ. ఎవ్వరో నూటనాఁటఁ దామీవిపత్తు
నోఁకకుండినవారు గేస్తులను నున్న
యంత నేమయ్యెఁ బలువురీ యామయమున
కగ్గమగువారె దీని కుపాయమేది। 5

కం. పరిశీలించి వచింపుము
దురంత మీదోషమెట్లు తొలఁగునొ। నీకుఁ

గరతల బిల్వము లీదృశ
పరమరహస్యమ్ములనుచుఁ బ్రశ్నింతుమిటుల్. 6

వ. నావుడు సూతుండు మీరు సర్వధర్మవేత్తలు మీయెఱుంగని వ్రతంబులు తీర్థంబులు జపంబులు తపంబులు లేవు. మీరిట్టి వారయ్యు. 7

ఉ. లోకము నుద్ధరించుటకు లోఁదలపోసి ననున్ గణించి సు
శ్లోకులు పేర్మి నిట్లడుగఁ జూచెద రీవెడుదోషమెందు సు
శ్రీకులఁ జాలబాధితులఁజేసి కలంచెడి దోషవారణం
బేకతనన్ ఘటించునది యీరు వినుండు వచింతు శ్రద్ధతో. 8

తే. గీ. ఈశుపుత్రు సుబ్రహ్మణ్యు నెవరు సర్ప
మూర్తిగాఁగఁ బ్రతిష్ఠించి ముదమునింతు
రల్లవారికి దశవిధంబైన గొడ్డు
తనము వెనువెంట నణఁగు సంతతియు నిలుచు. 9

వ. ఆదివంధ్య. గర్భవంధ్య. గర్భేవంధ్య. మృతప్రజావంధ్య. కదళీవంధ్య. కాకవంధ్య. దైవీవంధ్య. పుష్పనాశినీవంధ్య. స్త్రీప్రజావంధ్య. భర్తృద్వేషిణీవంధ్యయునని వంధ్యలు దశవిధంబుగలవారు.

సీ. ఆది వంధ్యయనంగ నాఁడుచిహ్నములుండి
యగుపింపఁబోని దుర్భగ. యొకంటఁ
జూలునిల్చియు హరించు వనితగర్భవం
ధ్యయగు గర్భేవంధ్యయగును స్రావ
పాతాదిదోషముల్ ప్రబ్బుచో. మృతవంధ్య
యైదేండ్లలో నపత్యముహరించు.
గదళికావంధ్యకొక్కఁడుపుట్టి వెన్క నొ
క్కఁడు వోవుముండును గాకవంధ్య

తే. గీ. కొక్కఁడేపుట్టి నశియించు నుండ దవులఁ
గాన్పు దైవవంధ్యకుఁ జూలుగానుపింప

కుండు దయ్యెమ్మి కతన: వేఱొండువంధ్య
పుష్పనాశిని తచ్చిహ్నమును వచింతు. 11

వ. ఈ వంధ్యకుఁ బుష్పంబు గర్భమునంద స్తంభించుటంజేసి రజోభాగ్యంబు లేకుండును గాన నార్తవనిమిత్తకంబగు నపత్యోదయంబు లేకుండెడి, నిఁక దొమ్మిదవ వంధ్యకు సంతానభాగ్యం బుండును గాని యయ్యది సర్వమును స్త్రీ మయము యగుటంజేసి పున్నామనరక త్రాణంబునకుఁ గొఱగామిం జేసియు ఆపె స్త్రీప్రజావంధ్యనాఁబడు, మఱియుం బదియవవంధ్య భర్తృవిద్వేషిణీ వంధ్యయనబడు నీపెకు స్త్రీజనసహజమగు భర్తృసమాగమేచ్ఛ లేకుండుటంజేసి యేదియో మిష గల్పించికొని తఱచు భర్తతోఁ గలహించుచుండు నేవంవిధ దశ వంధ్యాదోషంబులకును ప్రధాన ఫలితము సంతానము లేకుండుటయే. ఆయీ దోషములనెల్ల పోకడచునది సుబ్రహ్మణ్య ప్రతిష్ఠయే. అయన షణ్ముఖుండయ్యును ద్వాదశబాహుకుండయ్యును నన్నియ నేత్రములు గలవాఁడయ్యును. ఆయనకు సర్వాకారమునందెక్కుడు ప్రీతిగనుకఁ దద్రూపంబగు ప్రతిమను నిర్మింపించి ప్రతిష్ఠసేయవలయు నావుడు మునులు సూతుంగాంచి. 12

ఉ. అందముఁ జందముం గలిగినట్టి కుమారున కాత్మరూపక
న్నందమి సర్వరూపకమునన్ లగియింపఁగనేలఁ శూలిదా
ల్చుందనువెల్లభూషలుగ శుద్ధవిషాహుల రత్నభూషలన్
దెందముఁజొన్పఁ దీతవిక టేయవి యయ్యెనెఁ ప్రేమపాత్రముల్. 13

తే. గీ. ఆత్మజనకుండు మన్నించునట్టి వియను
కారణంబొండు దక్కఁ గుమారునకువి
షాహులందుఁ బ్రేమంబబ్బునట్టి దెదియుఁ
గానఁబడదేమి సెప్పెదో మౌనివర్య. 14

వ. సూతుండిట్లు వక్కాణించె, నియ్యది తండ్రికి సంబంధించిన ప్రేమమును బురస్కరించి పుట్టినప్రేమముగాదు. సర్వమును నతకరించు

దయితాను రక్తికి సంబంధించినది. ఈతండు లవలియను విషాద రాజపుత్రికను గాంధర్వమ్మునఁ బ్రేమించె. నాపెకు నీతవియందు ప్రేమంబగ్గలంబ, ఆట్లు కతిపయకాలంబు వనంబునందలి కేదారోదార వాటికలయందు రహస్యమాగమంబు జరిగిన పిదప విప్రలంభహేతువుదయించి యది భరింపలేక తన్నుంబలెఁ గంటికి నిద్దురలేక వందురు ప్రియురాలింగలియుటకై. 15

కం. భుజగాకృతిగైకొని తా
బొజుఁగై యాచెలినిజేరి భోగించివెసఁ
విజరూప మివలఁదాల్చున్
నిజాంగనానికటమునకు నెఱినటు చేరున్. 16

వ. ఇటీవల గాంధర్వం బార్షంబుగా మాఱి నిర్వ్యయోపభోగభాగ్యంబుగల్గినను గాంధర్వంబునాఁటి విప్రలంభశృంగారరసంబునందలి యనురక్తి గనుపట్టమింజేసి బాహులేయునకు నప్పటి వెయ్యేలయుం దనురక్తి యెప్పటికిని మనంబున నాటికొని యింద్రునకు నధ్వరంబుల యెడల నాహ్వానించునపుడు "అహల్యాయై జార ?" అను పిలుపునందుఁ బ్రేమం బగ్గలంబయి కనుపట్టినట్లే సర్పరూపంబగు మూర్తియం దర్పించుట ప్రేమపాత్రం బగుచుండుటంజేసి యెల్లరును గుమారునట్లే యజించి కోర్కులు వడయుచుందురు. 17

చ. అతిగహనంబు కాముగుణమయ్యది పెద్దల సమ్మతిఁ లవం
బతికి చరింపదాది నది యన్యవధూటిగఁ దోఁచిమీఁదటన్
సతి తనకైనఁ దప్పఁదన సాధ్విగనాదివిదోఁచు పట్టునన్
మతిలగియింపదా విధపు మాధురిగన్పడదంద్రు తద్విగుల్. 18

చ. అతితరమైన యత్నమున నన్యులు చూతురొ ! యేమొ ! యంచు నే
సతి గవయంగనేగు నలసాధ్వస మీవలికాలమందెటో
స్మృతిగనుపట్ట నయ్యది యమేయసుఖంబొడ గూర్చు దానికిన్
మితిగనుపట్టదందురు మనీషులు కామకలావిచక్షణుల్. 19

వ. అక్కతమ్మునఁ గార్తికేయునకుఁ దననాఁటి యవతారమ్మునఁ బ్రేమ మ్మగ్గలంబనునది వక్తవ్యాంశంబు ప్రకృతంబు వంధ్యాత్వదోషంబున పనయించుట కొక్కవిప్రుఁడొనర్చిన నాగప్రతిష్ఠంగూర్చి వినిచెదనాలింపుఁడు. ఉజ్జయినీనగరంబున శంఖనిధియను నొక్క విప్రుండు కర్మఠుండు గలండు. అతండు పితృపితామహార్జితంబగు సంపదగలవాఁడు. తల్లిదండ్రులు యుక్తకాలమ్మున వివాహంబొనర్చిరి. భార్య కాపురమ్మునకువచ్చెఁ గాని యాదివంధ్యయందలి లక్షణంబులకు లక్ష్యంబయ్యెఁ బదంపడి సంతానార్థియై యతండు వేఱొక్క కన్యం బరిణయంబయ్యె. నాయమగర్భవంధ్యయయ్యె. నిట్లు పదిమందిని బరిణయంబయ్యెంగాని వారలందఱును నొక్కొక్కతె యొక్కొక్క వంధ్యాత్వమ్మునకు గుఱియగుటంజేసి తుదకాయన యనపత్యతా దోషభాజనుండు గావలసివచ్చె నంతియకాక పదవభార్యచేఁ గొట్లును దిట్లునుగూడఁ దినవలసివచ్చె యాపె నామంబు సార్థకంబగుటఁ గన్పట్టుటచూసి యయ్యది వంధ్యాత్వదోష ప్రయుక్తంబుగాదనియు వయసు గొండొక మరలుతఱి వివాహంబొనర్చికొన్న దోషంబని యనుమానించి. 20

ఉ. సీ॥ యిటువంటి భార్యకు వశీకృతమైన మనంబుతో సదా
హేయపుఁగూతలుం గసరు లీడ్పులు తాడనపీడనంబులున్
బాయక నేఁ బడంగలనె। పాపపుసంసృతివీడి యేదకో।
పోయెదఁగాక యంచరిగెఁ బ్రొద్దుట లేచి యతం డరణ్యమున్. 21

వ. అట్లరుగుచు నతండు తనలో. 22

ఉ. ఒక్కతెగాదువో। పలువురుగ్మలులుండిరి కొంపలోననా
కెక్కడి తెవ్వితక్కువిది యెందఱొ యుండఁగనేల। సంతుదా
నొక్కతె యోగముండఁగను నొండొకచందమయేని కామినుల్
పెక్కురు గాంచరే నరక బేలతనమ్ముగఁగొంటి నెందఱున్. 23

ఆ. వె. సంతులేదు సరియె సంతమాదిరికొంప
మాపెఁ దగవుదీర్ప నేరు శక్తు
లెపుడు తిట్లుఁ గొట్టు లియగుఁ బొరుగు గేస్తు
లెల్లఁ జెప్పికొందు రింటితీరు. 24

కం. జీవత్కళత్రములతో
భూవిభులే వేగలేరు భూసురుఁడనునే
నేవఁగ నీవగ సైతున్
జావుసుఖం బింతకన్నఁ జర్చించినచో. 25

కం. సంతతికోసం బని యా
యింతులెఱిఁగికూడ నన్ను నేలిదముగ భా
వింతురు దూషింతురు తుది
కాంత మఱియు నన్ను నలుసుగాఁ గనఁదొడగెన్. 26

కం. తొమ్మండుగు రొక యెత్తి
కొమ్మ మఱొక యెత్తు దీని కోపాగ్నికి ని
ధ్మమ్మయితి పీడవలసె గృ
హమ్మిది తాడనము సైత మారంభించెన్. 27

కం. కనుఁగాక సంతతిన్ దాఁ
గనకే యుండెడిని గాక కాంత యొకతెవిం
టను బెట్టుక పేఱొక క
న్యను గట్టికొనం దలంచుటది నారకమౌ. 28

తే. గీ. ఒకతెగాదు తొమ్మండుగు రుండికూడ
నీపెఁ గొని తెచ్చికొంటి నాకిదు నపత్య
భాగ్యమని లేదపత్యంబు పడఁగవలసెఁ
దిట్లుఁ గొట్టులు ముచ్చటఁ దీరెఁ జాలు. 29

వ. అని గొండొక యోజించి. 30

ఉ. ఏగృహమందు నున్నయపుడే కలహించెడి వాండ్రు వీండ్రునేఁ
దేగతినూరకుండెద రిఁ కేమయినన్ వగపేల నాకు నా
సాగరమీఁదలేక యిటుసాఁగితి నే గహనంబునందొ స్వే
చ్ఛాగతినుందుఁగాక యలశంకరుఁగూర్చి తపంబొనర్చుచున్. 31

వ. ఇట్లు పరిపరివిధమ్ములఁ దలపోసికొనుచుఁ దటస్థించినపుడు కాయో పండో దుంపయో జలమో మెక్కి క్షుద్బాధ నపనయించుచుఁ గతిపయప్రయాణంబు లొనర్చు మీఁద నొక్కచో నొక్క మహాలింగమ్మును నిత్యంబును దదర్చనైక మనస్కుండగు నొక సిద్ధుండును బొడకట్టుటయు శంఖనిధి కపూర్వంబైన యానందమ్ముప్పతిల్లె ననంతరంబు. 32

చ. వినయముతోడ సిద్ధునికి విప్రుఁడు వందన మాచరించి యా
తవి దరిదాపునం దచటఁ దండములై పడి యున్నవారలం
గనుఁగొను చాతఁడొక్క త్రుటికాలము వెళ్ళఁగబుచ్చె నెల్లరున్
దనవలెవచ్చి రేదొపరితాపము మైననితోఁచెనంతటన్. 33

వ. ఆయోగి త్రికాలజ్ఞుండగుటంజేసి యాయా సంసారులు వారివారికిం గల చిక్కులను జెప్పికొనుచుండిరి. అతండా యాయి చిక్కులకుగల కారణంబులను వివరించుచుఁ దన్నివర్తనోపాయంబులను వ్యాకరించుచుండెను. శంఖనిధియుఁ గొండొకసేపు నిరీక్షించి తనకుంగల సాంసారికపుఁ జిక్కునువివరించుటయు నాసిద్ధుండు నవ్వి యిట్లనియె.

కం. కలవాఁడపౌటఁ బెక్కురు
కళత్రములఁగట్టికొంటి గతజన్మమునన్
సలిపిన నీదుష్కృతి నా
కళత్రములు దీర్చువారె ? కర్మమఱు పెటుల్. 35

వ. సంతానంబు నిలుచు నుపాయంబు బహుకళత్రసంపాదనం బెన్నటికిని గాదు. నీజాతకమ్మున కట్టిదోషంబుంటంజేసి నీవెందఱం బెండ్లిడియా

నను వాండ్రందఱ కొక్కొక వంధ్యాత్వంబుండుటయే తటస్థించె. వంధ్యాత్వమునకుఁ బ్రధానంబు రజోదోషంబు. కావుననే తత్కాలము నందంగనలు చాల భద్రముగాఁ గాపాడఁబడు చుందురు. పచ్చని పాఁదులు చెట్లు లోనగువానిని రజస్వలలు తాకరాదు. దూరముగాఁ దొలఁగుట యుక్తము. ఆ నాలుగు దినములును స్నానముచేయరాదు. భర్తవంకఁ జూడరాదు. రహస్యముగా నుండవలయును. రజోమాలిన్యము సోఁకిన గుడ్డలనెచ్చటఁ బట్టిన నచ్చటఁ బాఱవేయరాదు. అట్లు పాఱవైచినచో నెరుకలేని పక్షులు వానిని గొనిపోయి తమ కులాయములందుఁ బొందుపఱచి గుడ్లనుబెట్టుచోఁ దత్సంపర్కమ్మునంజేసి ఆగుడ్లు పిల్లలుగాఁ గాక కమిలిపోవును. పరంపరాప్రాప్తమగు నీదోషము వంధ్యాత్వమునకుఁ గారణమగును. ఇంతియకాదు. తఱచు రాజసంస్థానములలో నంతఃపురములలోఁ జిలుకలు లోనైన పక్షులను వినోదార్థము పెంచుట యాచారము. అవి పంజరములందే గుడ్లనుబెట్టుటయు సంభవించును గాని యయ్యవి పిల్లలగుట అరుదు. ఆదోషముకూడ సుఖసుఖాలఁ బోవునదికాక రాజభార్యల వంధ్యాత్వమునకుఁ గారణమగునని యెఱుంగునది యని వెండియు. 36

కం. తఱచు దరిద్రులకన్నను
నరపతుల కళత్రముల కనారతమీ దు
ర్దురితము పొసంగుకారణ
మెఱుఁగుము పూర్వోక్తమని మహీసురతిలకా. 37

వ. ఇఁకఁ బూర్వభవంబున నీయొనర్చిన దోషంబు వినుము. నీలధ్వజుండను రాజోత్తముండు కృతమాలయను నదియొద్దున నున్న చంద్రికాపురము రాజధానిగఁ జేసికొని పితృపితామహక్రమాగతమగు తన రాజ్యము నేలుచుండెను. ఆయనవద్ద నీతండ్రి మంత్రి. నీకు నామంత్రి పదవి నీతండ్రి యనంతరమున సంక్రమించినది. రాజమహిషి పేరు

చంపకగంధి. ఆపె మిక్కిలి చక్కనిచుక్క. ఆపె జనన నక్షత్రము రేవతి. ఆ నక్షత్రమునకుఁ గొండొక శాపమున్నయది. ఆకారణము చేతను, ఆపె రజస్వలయైన లగ్నమునకు శని దృష్టిదోషము తగులుటచేతను, ఆ దంపతుల కన్యోన్యవైషమ్య మేర్పడెను. ఆవైషమ్యము కలుగుటకు నీవు గొండొక హేతువైతివి. తత్స్వరూపంబిట్టిది.

చ. జనపతి రాణితోడ వినుసాధ్వి! నీపతి నిన్మొరంగి యే
వనితనొ పొందుచుండె ననవద్యగుణాకరపీవు జేనినె
మ్మనమున కెక్కితమ్మనను మానివి! నచ్చకపోతి వెంత చె
ప్పినను వినందు నాదొసఁగు పీసములేదు నిజంబు చెప్పితిన్. 39

వ. ఇట్లు నిష్కలుషుండగు జేనిం గుఱించి రాణికి బోధించి జేనితో. 40

కం. అంతిపురమ్మున మెలఁగెడి
యింతులు చెప్పికొను కతన నెఱిఁగితినో భూ
కాంతశిరోమణి! నినుశు
ద్ధాంతము దూషించుచుండునఁట! యేమిటికో! 41

వ. ఇట్లన్యోన్యమ్మును నమ్మంబలికి వారల మైత్రిం జెడగొట్టు కతన నీవు దోషివైతివి. నీదోషమ్ము కతమ్మన నీవెందఱుం బెండ్లియాడినను నందఱును నేదో యొకవిధమగు వంధ్యాత్వదోషమునకు గుఱియగుటయే తటస్థించుచు వచ్చినది. నీవు పెండ్లాడిన పదుంద్రలో నీవపకారిణిగాఁ దలంచుచున్న తుదికళత్రమే నీకుఁ బరమోపకారిణియని యెఱుంగుము. 42

చ. అఱువదిదాపు నీకు వయ సాపెకనన్ బడియాఱు వత్సరా
లరుసము నీయెడం గలుగకాతరుణీమణి నిన్ను రోయుటల్
దురితముకాక యుండినను దొయ్యలి యట్టి నిమిత్తమూని వి
న్నెరుసుగఁ జూడదాపె మది విచ్చయెపుట్టదు వంధ్యయౌటచే. 43

వ. అజాతివంధ్యకు మగవిం గొట్టుట తిట్టుట లోనగు గొనమ్ములు సహజంబులగుటంజేసి నీయెడల నాపె యట్లు ప్రవర్తించినది. నీవాపెతో

వేఁగఁజాలక యిట్లరుదెంచి మంచిచేసితివి. నీకును నీకళత్రము లకును శుభకాలంబాసన్నం బగుకతన నీకిట్టి బుద్ధి పుట్టినది. దీనికి బాహ్యకారణంబు నీదశమకళత్రధూర్తత్వం బగుటంజేసి యాపెయే నీవంశప్రతిష్ఠకు మూలంబని వెండియు. 44

తే. గీ. ఎన్ని వంధ్యాత్వదోషమ్ము లిలనుగలవొ
అన్నిటికిఁగూడఁ బాచితమ్మరయు మొకఁడె
అల్లషాణ్మాతురుని బ్రతిష్ఠాదికముల
నర్పసలుపుము నీకపత్యంబు నిలుచు. 45

ఆ. వె. సర్వమూర్తియందు షాణ్మాతురునకుఁ బ్రే
మంబుహెచ్చుగాన మంత్రవిదులు
తత్ప్రతిష్ఠ నాగతనువునఁజేయంగ
వలయు ననిరి చేయవలయు నల్లె. 46

వ. మంత్ర తంత్రాదుల విషయమున సంప్రదాయజ్ఞులెట్లు విధింతురో కార్యార్థి యట్టులేగుటిగలిగి యొనర్పవలయుఁగాని మాఱువలుక రాదని యాసిద్ధవర్యుండు నారద పురాణంబు నందలి విధానమ్ము నెల్లఁ దూ-చా తప్పకుండ నయ్యలఘున కుపదేశించి యాశీర్వదించి పంపె ననంతరంబు. 47

సీ. చంద్రతారాబల సంయుక్త లగ్నమ్ము
నందాగమజ్ఞులనఘమతుల
ఋత్విజుల్గా నేర్పఱిచి విత్తశాఠ్యదో
షమ్ముసోఁకకయుండ సర్వమును స
మంజసమ్ముగఁజేసి మహితు సుబ్రహ్మణ్యు
నాగమోక్తవిధి నయ్యాలయమున
సుప్రతిష్ఠితుఁజేసి సూరిహితుఁడు శంభు
నిధితత్కృపంజేసి నెగడెమిగుల.

ఆ. వె. భార్య కొకొ్కకతెకుఁ బదిమందివంతునఁ
గొమరులుప్పతిలిరి కొమిరెగూడఁ

గలిగె నొకతె యిల్లు కలకలలాడుచు
దోసతోఁట సొంపుతో నెసంగె. 48

కం. కలిగిన యైశ్వర్యమునకు
బలకరమై సంతు ప్రబలి పరిణయములు వ
ర్గులు శోభనమ్ము లెల్లెడ
నొలయఁగ శంఖనిధి గేహమొప్పెసలారెన్. 49

కం. నాగప్రతిష్ఠ మహిమం
బాగమ సమ్మతము వంధ్యతాఘాపహమో
ధీగణ్యులార! యియ్యది
రోగహరం బనుచు మీరెఱుంగుండెలమిన్. 50

కం. పలుపురుగల రీవ్రతమును
సలిపి యపత్యమును గాంచి సౌఖ్యమ్ములతోఁ
దులదూఁగువారు దీనికిఁ
దులయగువేఱొ వ్రతమ్ము తొలి నేఁ జూడన్. 51

వ. ఈ నాగప్రతిష్ఠను జేసినవారు మాత్రమకాక యాయీచరిత్ర చదివిన వారు వినినవారు లోనగు నెల్లరును జిరతరాయుష్యంబును ననామయంబును భాగ్యపరీతంబును నగు సంతతితోఁ దులఁదూఁగుదురని సూతుండు శౌనకాదులకు వక్కాణించె. 52

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుచుంటి ని న్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది
శ్రీ స్కందషష్ఠీ వ్రతము
సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీసావిత్రీగౌరీ వ్రతము.

కం. శ్రీవలసిన వారలు వి
ద్యావిభవము వలయువా రనామయమాయు
శ్శ్రీవలయువారు విన్న శి
వా। వలయున్ గొల్వ మల్లికార్జునదేవా। 1

వ. అవధరింపు మనంతరంబు సూతుండు శౌనకాదులకు సావిత్రీగౌరీ దేవీ వ్రతంబుంగూర్చి యి ట్లుపన్యసించె. 2

తే. గీ. కలదు సావిత్రి యనియెడి కన్య రాచ
కూఁతు రాపె జనకుకడఁ గూరుచుండి
తద్దయును మోదమిడుచున్నతఱిని నార
దుండు చనుదెంచె నన్నరేంద్రుండు పెలుచ. 3

వ. సింహాసనమ్మునుండి లేచి యథాక్రమమ్ముగ నమ్మునికిఁ బూజాపురస్కారమ్ములు నెఱపి యుచితాసనమ్మునఁ గూర్చుండఁజేసిన పిదప నేవియో గోష్ఠులతోఁ గొంత కాలక్షేపంబు జరిగిన పిమ్మటఁ బెండ్లి కొమరులం గూర్చిన ప్రసక్తి ప్రస్తుతం బగుటయు నారదుండు సత్య వంతుండను రాకొమరుండు సుగుణగణాఢ్యుండనియు సుందరుం డనియు వేయేల। తాదృశుండు భూతభవిష్యద్వర్తమానకాలంబులఁ జాలమ్మృగ్యుండనియు మిక్కిలిగా వర్ణించునంతఁ దండ్రి వికటమ్మున నుండి యామువి వచనంబు లాలకించు సావిత్రికి నాసత్యవంతుని యందు మనంబు దవిలె. మనోవాక్కాయంబులు తదధీనంబులై యాపె తప్పక యారాకొమరుని వరింప నిశ్చయించికొనియె.

తేఁడును దనమనంబునఁ దనకట్టి సుకుమారుండు గుణగణాఢ్యుం డల్లుం డగుట మహాభాగ్యంబని సంతసించె ననంతరంబున నమ్ముని వరుండు వెండియు. 4

ఉ. ఊరుపుచ్చి యింత సుగుణోచ్చయమున్ ఘటియించి యేటికో!
సారససంభవుం డతనిఁ జక్కఁగఁ జూడఁగలేక యేమొ! సం
సారపు సౌఖ్యమున్ గనెడి చక్కని కాలమునంద మృత్యువుం
జేరెడివానిఁగా సలిపెఁ జెప్పెడిదేమి నరేంద్రచంద్రమా. 5

చ. అనుటయు రాకొమార్త హృదయంబు పెటిల్లునఁ బేలినట్లయై
వెనుకొనుచింత మోము నెడ వ్రేలఁ దొడంగెనుగాని రాజనం
దనయది యాఁగి యాతని మనంబు వరించిన యప్పుడేమియై
నను దనకాతఁడే హృదయనాథుఁ డటంచు వినిశ్చితాత్మయై. 6

వ. సర్వమ్మునకును దన తల్లిదండ్రులే జగజ్జనని నుపాసించి తదుపాసనాఫలంబుగఁ దన్నుఁ బడసిరో ఆపెయే కలదనియు నేవిధమైన లోపంబును రాదనియు, నుపాయమ్మున కపాయమ్మును నపాయమ్మున కుపాయమ్మును నుండి తీరుననియు మనమ్మునకు నచ్చం జెప్పికొని మిన్నకుండె నిఁక నృపాలుండు. 7

ఉ. నారదుఁజూచి, దేవమునినాథ! గుణమ్ములు మీరు పేర్మిచె
న్నార వచించినప్డు తనయన్ వరియింపఁగఁజేయు నిచ్చనా
కూరెనుగాని పైఁగలుగు నొచ్చెముదెల్పుటఁజేసి యంతలోఁ
దీఱె మనోరథం బతనితేఁకువసర్వము వ్యర్థమౌటచే 8

తే. గీ. అన్నిసుగుణమ్ము లొక్కచో నలవరించి
యాయువీకున్న నేగతినవి రహించు
"నాయుషోఽస్తి పరంభాగ్య" మనెడిమాట
సృష్టికర్తకుఁ దెలియదో! యేమొ! యకట! 9

కం. కులమర్మము మీవలనఁ
దెలియుకతన మాకుఁ దప్పెఁ దెలియక యెవరో
వలచి మహాపదరాఁ జిం
తిలుదురుగద యట్టి యోగ్యునిన్ విడుతురెటుల్.   10

వ. ఇట్లు తండ్రి ప్రసంగించునెడ సత్యవంతునియెడ నిశ్చితమనస్క యైన సావిత్రి తన మనోరథంబు దాఁచుటకిది సమయంబుగాదని యెంచి. స్త్రీ జనోచితమైన— అందునను ముగ్ధాజనోచితమైన సిగ్గు నెట్టకేల కవలికినెట్టి సవినయంబుగఁ దండ్రికిట్లను.   11

మ. జనకా! నామది సత్యవంతునియెడన్ సంసక్తమయ్యెన్ జిరం
బనఘుండాతఁడు పొల్చుఁగాక అథవా, అల్పాయువౌఁగాక, యొ
క్కని గాదంచుమఱొక్కఁడుఁ మఱియునొక్కండున్ మగండౌనటుల్
మనుచో నయ్యదిగూడ నాఁడుదియె! సామాన్యల్ గదా! తాదృశల్.

కం. మునివరుఁడాతని గొనములు
వినుచుతఱి న్మామనంబు వివిధగతులనా
యనఘుని యంద, నిషక్తిం
గనె నేనయ్యలఘుఁ దప్పఁగామింపనొరున్.   13

తే. గీ. చదువుఁ జెప్పించితివి తండ్రి! చదివికొంటిఁ
ద్రికరణమ్ముల మనసెవరేణ్య మని మ
నీషులు వచింతురది వరియించు మగని
గాదని వరింతునే! యన్యుఁగాంతుఁగాఁగ.   14

కం. మానసికమైన పెండిలి
యీనారదమునివరేణ్యుఁడె పురోధగ నా
కైనది యిఁక బాహ్యంబును
మానుగ నెఱవేర్పుమనఁగ క్ష్మానాథుండున్.   15

వ. చిన్నప్పటినుండి యాపె సుగుణంబు లెఱింగినవాఁడగుటం జేసి తాను గాని తల్లిగాని యేమి చెప్పినను ధర్మవిబద్ధమగు నాపె మనోరథంబు

మరల్పుట పొసంగదని యెఱింగిన కతన నేదో లోకమర్యాద ననుస
రించి కొండొక బోధించి కృతార్థుండు గాఁజాలక చింతాదంతురి
తాంతరంగుండై. 16

ఉ. ఎందుకు నారదుం డిటకు నేడ్తెఱఁ దానరుదెంచె వచ్చుఁగా
కెందుల కీప్రసక్తిఁ దనుఁ బృచ్ఛయొనర్పని నాకుఁ జెప్పె నా
నందన కా నృపాలవరునందనుపై మనమేల నిల్చె నీ
కుందెటు దీరునంచు మది కొందలమందెడి నేమిసేయుదున్. 17

వ. అని యితికర్తవ్యతామూఢుండై యేమియుఁ దోఁపక యలందురు
నాద్యుమత్సేననృపాలునకు నారదుం డిట్లను. 18

కం. నీకొమిరె సదుద్దేశము
నాకు ముదంబొనరఁ జేసె నారులు లేరే।
లోకమున నీకుమారికి
నేకాంతయు దీటువచ్చునే। కోటులలో. 19

తే. గీ. మనసులో నెన్నిపుట్టవు మంచిచెడ్డ
లనుఘటించెడి కోర్కులే యతివగాని
పూరుషుఁడుగాని యవ్వానిఁ బుణికిపుచ్చ
కాచరించియె తీరు టత్యద్భుతంబు. 20

వ. ఈపె మీజంపతులకు మీయొనర్చిన సావిత్రీ మంత్రజపఫలంబుగా
బొడమినందులకును నీశీలవతి నిష్ఠాగరిష్ఠత్వమ్మునకును నాహృదయ
మ్మున నింత యంత యనరాని సంతసం బుప్పతిల్లు చున్నయది
నీవిక్కన్నియను విశ్శంకమ్ముగా వానొడివిన సత్యవంతునకే యిచ్చి
వివాహమ్మొనర్పుము. పదంపడి సర్వమును నాపరమేశ్వరి కతమ్మున
భద్రమ్ముగాఁ బరిణమింపంగల దదియెట్లందువేని వినుము. సావిత్రీ
గౌరీవ్రతంబను నొక్క వ్రతంబుగలదు. తద్వ్రతప్రభావం బీమె
కతన నేతల్లోకవాసులకుఁ దెల్లంబగుట కీసమస్య సంఘటించినది.

సంగ్రహమ్ముగా నావ్రతం బీపె కిప్పుడ నే నుపదేశించుచుంటినని
వెండియు. 21

కం. పరిణయ మేవత్సరమున
జరిగెనొ యావత్సరంబె సావిత్రిన్నీ
వెఱఁగిభజింపుము నీపతి
దరికిన్ మృత్యువదిరాదు తథ్యమ్మబలా. 22

తే. గీ. దరికి నొకవేళ మృత్యువు తారసించుఁ
గాక యేతద్ర్వతమ్మునఁగలుగు పుణ్య
మునఁ దుదకుఁ గొన్నివరము లమూల్యములు పొ
సంగఁజేసి తరలిపోక సంభవించు. 23

వ. ఇంక సంగ్రహమ్ముగాఁ దద్వ్రతోదంతంబు వినుతు సావధానంబుగ నాలకింపుము. మకరరాశియందు సూర్యుఁడు ప్రవేశించిన మఱు నాఁడు గాని మూఁడవనాఁడుగాని ప్రాతఃకాలమున నదియందొండెఁ దటాకంబునందొండెఁ గూపంబునందొండె స్నానంబొనరించి ధౌత వస్త్రంబుగట్టుకొని తోడి కన్నియలతోఁ గుమ్మరియింటికి మంగళ వాద్యంబులతో నేగి వాని సారెయందలి మృత్తికతో సావిత్రీప్రతి బింబంబు లొనర్పంజేసి గృహమ్మునకరుదెంచి తొమ్మిదిరోజులు ధ్యానావాహనాదులచే యథాశక్తిని బూజించి తొమ్మిదిముళ్లువేసిన తోర మ్మును గట్టుకోవలయును. తొమ్మిదవనాఁడు సావిత్రి కుద్వాసనము చేయవలయును; ఇట్లీవ్రతమ్ము జరిగించిన కాంతకు. 24

ఆ. వె. జన్మజన్మములను సాఁగు నైదువుతనం
బనఁగ నొక్క జన్మమందునైదు
వుతనమబ్బుటెంత యతివరో ! యీవ్రత
మహిమకింతెకాదు మఱిఫలంబు. 25

వ. పుత్రపౌత్రానామ యాయురారోగ్య భాగ్యంబులకుఁ గొఱతలేకుండు

విందు కొక్క యితిహాసంబు గలదు. కృష్ణానదీతీరమ్మున మంగళగిరియను నృసింహక్షేత్రంబు గలదు. ఆక్షేత్రమ్మును రాజధానిఁజేసికొని ధర్మవర్మయను ఱేఁడు తనపేరు సార్థకంబుగ నామండలంబేలుచుండు. నారాజేంద్రుని పురోహితుండు వేదమ్మునను న్న క్రతువులలో నేకొంచెమో కడమగా నెల్ల క్రతువుల నొనర్చిన కర్మిష్ఠుండు. ఆ సోమయాజిభార్య యీ సావిత్రీవ్రతంబు కల్పోక్తప్రకారంబుగాఁ దొమ్మిదేఁడులును జరిపి యుద్యాపనముచెప్పికొను సందర్భమునఁ దలంపని తలంపుగా నా రాజమహిషికొక దురూహకలిగె నది వివరింతు 26

తే. గీ. ఈపెతలుముగ వ్రతములనే యొనర్చు
వానివలన సమస్తమ్ము తాను నిర్వ
హింపఁగలనని గర్వమ్ము నెనయుచుండు
నీపె గర్వమ్మునేఁడు పరీక్షసేతు. 27

వ. పుణ్యాత్మురాలయ్యును, ఆస్తికురాలయ్యును నారాజపత్ని కిట్టియూహ పుట్టి యాపె కొమరుల శీర్షమ్ములు నఱికించి మొండెమ్ములును బుఱ్ఱెలును వెవ్వేఱుగ నాసోమిదేవిచేయు వ్రతమ్ము కడకు నంపించె. 28

చ. కొడుకుల తుండెముల్ గనియుఁ గొండొకదీక్ష తొలంగకున్నయా
బిడఁగని సభ్యులెల్లరును వింతయుఁ జింతయు సంవడింప నొ
క్కఁడు మఱియొక్కనిం దొరి నెగాదిగఁ జూచుచునుండిరంత నా
బిడ తనయక్షతల్ తనదుబిడ్డల మొండెములందుఁ జల్లుడున్. 29

ఆ. వె. మొండెములును శీర్షములు యథాపూర్వమ్ము
గాఁగ నతికికొనియెఁ గనెడివారి
కక్కజంబుగలిగె నధిపురాణికి శ్రుతం
బయ్యె వచ్చె నాపె నడరుగదుర. 30

వ. వచ్చి సోమిదేవి కాళ్ళపయింబడి తన యొనర్చిన యకార్యమ్ము

క్షమింపవలయునని పలువిధముల వేడికొనుటయు నాదీక్షితురాలాపె కిట్లను. 31

తే. గీ. ఏను తఱచుగ మీతోడ నీవ్రతంబు
గుఱిచి చేయు ప్రశంసను దఱచిచూచు
తలఁపుతోఁజేసితిరి మీరు తప్పిదంబె
యయ్యెఁ గొండొకక్షంతవ్యమగునుగాక. 32

తే. గీ. ఇంత కఠినపరీక్ష మీరిపుడొనర్చు
కతన నీవ్రతసత్త్వంబు గానఁబడియె
నింతులెల్లరు నీవ్రతం బెఱిఁగి యాప
దలు దరించుటకున్ మంచిదారి దొరకె. 33

వ. అని రాజపత్నియను కారణమ్మున నాపె నెట్టెట్టులో యభినందించుటకు నారాజ్ఞి సంతసింపక తానొనర్చిన పని సర్వథా నింద్యంబయని వక్కాణించుచుఁ దన కీ వ్రతవిధానం బుపదేశింపుమని యాయమను సారెసారెకుఁ బ్రార్థించుటయుఁ బూర్వోక్తప్రకారంబున సకలంబు నెఱిఁగించె, నుద్యాపనంబు ప్రత్యక్షమ్ముగా నారాణి వీక్షించినను, ఆపెవలన వినుటయే సమంజసంబని యెంచి కోరుడు సోమిదేవి యిట్లు వచియించె. 34

సీ. తొమ్మిదియేఁడులు తొలఁగని భక్తితోఁ
వ్రతమాచరించి యాపైని పదవ
యేటఁ దొమ్మిదిజోళ్లు చేటలు దెప్పించి
పదునెన్మిదింటను బసపుఁ గొమ్మ
లును వక్కలాకులు ననుపుగాఁ దొమ్మిది
లెక్కను జోటికిఁ జక్కనుంచి
పండ్లు నదేరీతిఁ బదిలమ్ముగా నిడి
ముత్తెదువులకు నామోద మెసఁగ

తే. గీ. దక్షిణాసహితమ్ముగ దానమిడుట
యందు రుద్యాపనం బని యది సమస్త
మిపుడు మీరు చూచుచునుంటి రీవ్రతమ్ముఁ
బోలు వ్రతములు లేవెందు-భూమియందు. 35

వ. ఇట్టు లాసోమిదేవి యారాజపత్ని కుపదేశించుటయు నాపెకూడ శ్రద్ధా భక్తులతోఁ దనయైశ్వర్యమ్మున కనుగుణమ్ముగా నావ్రతం బొనరించి కృతార్థురాలయ్యెఁ గావున నో సావిత్రీ! నీవు నీ మనోవాంఛ ననుసరించి సత్యవంతునే వరించినను నతఁ డల్పాయుష్కుండే యయ్యు నీవ్రతంబుకతన దీర్ఘాయుష్కుండగు సందియంబుతోఁ బని లేదని వచించి నారదుం డరిగెఁ బిదపఁ గొమిరె సంకల్పమమోఘమ్మగుటంజేసి నృపాలుం డా సత్యవంతున్ గూర్చి విచారించుటయు నెఱింగి వచ్చిన వారలు. 36

ఉ. అతఁడు తల్లిదండ్రులును నన్యనృపాలజితాత్మరాజ్యులై
కాతరతన్ వనంబునెడఁ గస్తి నలందురుచున్న వారలం
చాతనితోడఁ జెప్పుటయు నాత్మజకుణ్ వివరించెఁ దండ్రియా
నీతిమదగ్రగణ్యయతనిన్ వరించుట తప్పదంచనెన్. 37

వ. అప్పుడు తల్లిదండ్రులును నాప్తులును నాపెనుద్దేశించి 38

ఉ. ఆయువు తక్కువైననగు, నాయువుగల్గిననాళ్ళనేవి నీ
కో యెలనాగ! అన్నమున కొచ్చెములేవి వరుండుగాఁడ ఆ
ధీయుతుఁడెట్టులిచ్చెదము తేఁకువదక్కుచు నట్టివాని క
మ్మా! యిది పాడిగాదు జనమాన్య మఱొక్కరువిన్ వరింపుమా?

కం. చిన్నతనమయిన కతనణ్
దెన్నెఱుఁగక యొరులబుద్ధి తీరెఱుఁగక యు
త్పన్నమగు మందబుద్ధిఁ జ
నన్నేమది త్రిప్పకుండినణ్ దొసఁగవుగా. 40

వ. నావుడు సావిత్రి మీరు నాహితంబుగోరి వచించు నుడులన్నియు మాన్యంబులు. నాపెనిమిటి యాయుష్యంబునకుఁ గొలంత కల్గవి యుపాయంబు బ్రహ్మ మానసపుత్రుండగు నారదుండే యానతిచ్చెఁ గదా ? యిక నైశ్వర్యమునుగూర్చియా ? చింతించుచున్నారు. 41

చ. సిరిత్రుటివచ్చుఁబోవునది చేరునుపాయము లెన్నియున్నవో ।
తఱిఁగియడంగ నన్నియును దారులుగన్పడుఁ బ్రాణమన్న నె
వ్వరికిని బోయిరాదనుట వాస్తవమందుకుఁ గూడ నామదిన్
బొరయదుభీతి. యమ్మహితుఁబొంది తరించెదనెల్ల యాపదల్ 42

కం. పాతివ్రత్యంబని ప్ర
ఖ్యాతంబగువ్రత మొకండుగలదేని సమ
స్తాతంకమ్ములు నాకల
పాతివ్రత్యవ్రతంబె బయటికినెట్టున్. 43

కం. కరణత్రయమున నంతః
కరణమెమాన్యంబు. పతివిగా నదివలచెన్
గరమునల నృపతిసూనున్
బెఱవానికినెట్టులేను బెండ్లామగుదున్. 44

ఉ. భారతదేశమందుఁ బ్రథివంబును గాంచిన దాన మేటి సం
సారికిఁబేనికిఁగా మిగుల సాధ్వికి క్షత్రియవంశమందుఁ జె
న్నారితిఁబుత్రినై ; హృదయమక్కట । యేగతి డాఁపనేర్తు వి
స్సారపుజీవనంబునకు స్వాంతము సమ్మతిఁజూపదెమ్మయిఁగా. 45

వ. ఇట్లు త్రిప్పరాని సంకల్పమ్మునం బొదలు నప్పైదలికి నెవ్వారేమి చెప్పినను ఆపెసంకల్పము ధర్మ్యంబగు కతన నిష్ప్రయోజనం బయగునవి యెంచి ఆపె మనోరధంబు గమనించి వనవాసంబునం దంధులకు శుశ్రూషసల్పుచున్న యాసత్యవంతునకు నతవిమాతాపిత

రుల యనుజ్ఞంబడసి సావిత్రినిడి వివాహంబొనరించిన పిదప నాసా
విత్రి నారదోక్తప్రకారంబున నావ్రతంబాచరించుచుఁ బతికపాయంబు
గలుగురోజుకూడ నెఱింగియున్నదియ కావున నానాఁటికి మూఁడు
దినమ్ములకుఁ బూర్వమ్మునుండి యుపవాసంబున కుపక్రమించె. 47

కం. పదపడి జముఁ దేతెంచుట
అదనదిగుఱితించి యాపె యాత్మపతిని దో
యదమును మెఱపున్ బలె నా
పదదాఁటు తలంపుతోడఁ బతిఁగొనితేరన్. 48

వ. వెంబడించి తనతో ననాయాసమ్ముగ నలవోకగా రాఁగల్గుటకు నత్యా
శ్చర్యపర్యాప్తచిత్తుండై యాయముండు తనలో. 48

తే. గీ. ఇంతకాలమ్మునుండి నే నిందునుండి
ప్రాణులను జంపుమంటిఁ దద్బంధువర్గ
మెవరుగాని వెంటంబడి యిట్లు వచ్చు
టెఱుఁగనిది క్రొత్తయగునట్టి దృశ్యమనుచు. 49

వ. సగౌరవంబుగ సావిత్రిం జూచి కుమారీ! యిది నాకవశ్యకర్తవ్యంబు
విన్నుం జూడ నాకు జాలి వొడముచున్నను నాయుద్యోగధర్మముం
బట్టి ప్రవర్తింపక తప్పదు. ఇందనుక నీపాతివ్రత్యమునం జేసి
రాఁగల్గితి వింకముందు రాఁజాలవు. నీవలసిన వరంబు పతిజీవితము
దక్కఁ గోరికొని యద్దానిం జేకొని మరలు మనుటయు నత్తమామ
లకు గన్నులును రాజ్యప్రాప్తియు గోరికొనిన నట్లయగుఁగాక యని
శమనుం డరుగుచుండ మరల యథాపూర్వంబుగఁ దనపాతివ్రత్య
ప్రభావంబున నశ్రమమ్ముగ నరుగుచుండె, నంత నంతకుండు దయా
ళుండై మఱియొండు వరం బొసంగి సంతుష్టి ఘటించి పంపు తలం
పుతో యథాపూర్వంబుగఁ బలికె, నాపె తనతండ్రికిఁ బుత్రసంతతి
లభించునట్లు కరుణింపుమని కోరి యావరంబునుగూడఁ గయికొని

మరలమరలక ధర్ముని వెంట నేగుచుంటయు నాతండు మఱియు నక్కజంపడి మృదుస్వభావంబుతో నిట్లనియె. 50

చ. కలరు పతివ్రతల్ శతము కంజదళాక్షిరో! నిన్నుఁ బోలువా
రలు గలరే! ననున్ దరిమిరాఁగల సాధ్వినిబొందితోడ నే
నిలఁ గనుపెన్నఁడుం గనను దృశ్యము నూత్నముగంటిఁ గోరికొ
మ్మెలమి వరంబునింక నొకఁడిచ్చెదఁ ద్వచ్చరితంబు లిట్టివే. 51

ఆ. వె. ఏవ్రతంబొనర్చి యిట్టి సామర్థ్యంబు
గూర్చికొంటివమ్మ! కొమ్మ నిన్నుఁ
గన్నవారలెంత ఘనులో! ఆర్యావర్త
మెల్ల నీకతమున నీద్యమయ్యె. 52

వ. అని యిట్లు వినాకరణంబులేని వాక్యంబు నొడువుటయు. 53

కం. కలికి ముదమందుచును నిటు
వలికెఁ ధర్మస్వరూప! పతిప్రాణము లి
మ్ముల నిమ్మన నిచ్చితి నని
పలికెఁ శమనుఁడు హర్షపరవశుఁడగుటన్. 54

ఆ. వె. నిదురవోయి లేచు నీటున సత్యవం
తుండు లేచె నంతఁ దోయజాక్షి
పతియుఁ దాను జనిరి వనినుండి యింటికి
వృద్ధదంపతులకు దృష్టిగలిగె. 55

వ. తమకు హఠాత్తుగాఁ గన్నులు గలుగుటకుం గతంబేమని యోజించు నత్తమామలకుఁ దనపతిగూడ వినుచుండ గతవృత్తాంతమ్ము సావిత్రి వివిచె. నయ్యది విని కోడలి నభినందించునంతలో శత్రుజితంబగు రాజ్యంబు మరల జయించి స్వాధీనపఱచికొంటిమనియు నెల్లుట బట్టాభిషేకంబునకు సర్వమ్మును సిద్ధపఱచి మిమ్ముఁ దోడ్కొని చనుటకు వచ్చితిమనియు మంత్రులు స్వయమ్ముగా వచ్చి విన్నవించి

కాంచనరథారూఢులంజేసి స్వకీయరాజధానికిం దోడ్కొని చని పట్టాభి షిక్తుం బొనరించిరి. 56

ఉ. కాలము చెడ్డదైనపుడు కాంచన మంటిన మంటిముద్దయౌఁ
గాలము మంచిదైనపుడు కాంచనమౌనొగి మట్టిముట్టినన్
గాలము సర్వమున్ సలుపుఁ గాలమె దైవము మంచిచెడ్డలన్
గాలమె నిర్వహించు నెఱుఁగందగు దాని మహత్త్వ మెట్టిదో. 57

వ. కాలవైపరీత్యంబు తాండవించినపుడు మానవుండూరక మీనమేషములు లెక్కించుచు మిన్నకుండక పరమేశ్వరు నారాధింపవలయు స్కాందమ్మునం దెట్టి విపత్తినేని తొలగించి మనుజుల మనుపం జాలిన వ్రతంబులు లోకసంరక్షణార్థంబు వ్యాకరింపబడియున్నవి. ఇపుడుపన్యసించినది సావిత్రీ గౌరీదేవీ వ్రతము. దీనివలన సావిత్రి తనపుట్టినింటిని మెట్టినింటినిగూఁడ దరింపఁజేసి తులలేని పుత్త్రపౌత్త్రులతో రాజ్యవిభవముతోఁ జెల్వారెనని వింటిరిక దా! యింత కన్నను నత్యద్భుతంబగు వ్రతంబొండు గలదు దానిపేరు "పతి సంజీవన వ్రతంబందురు. పతిసేవనవ్రతంబనియు భీమేశ్వరవ్రతం బనియు దీనికి నామాంతరంబులు గలవని వెండియు 58

తే. గీ. కలఁడు బ్రాహ్మణుఁడొక్కండు కడుదరిద్రు
సోమపుఁడటందు రాద్విజు, సోమయాజి
ఘనుఁడతని పెద్దభార్యకుఁగల దొకర్తు
కూఁతురాపె శీలమ్మునకు సరిలేదు. 59

తే. గీ. పెండ్లికీడయియుండె నాద్విజుకొమార్తె
ఆపెపేరు సంజీవిని అంబికావ
రమ్ముకతన నాకన్నియఁ బిహజవించెఁ
దండ్రి రిక్తుండు కడుఁగష్టదశకులోఁగి 60

వ. ఎట్లెట్లో కాలమ్మపనయించుచుండె. దరిద్రులకు సంతానమెక్కుడుగ నుండు ననుట కుదాహరణమ్ముగ నాబ్రాహ్మణునకు రెండవభార్యకు మఱి యేడుగురు పుత్త్రులుకూడఁ గలరు గర్భదరిద్రుండగు నాపాలు నకు నిరువురు. జీవితక్షేత్రంబు లెందులకుండవలసెనో ! వివరిం చుట కిటనావశ్యకత లేదు. 61

కం. సకలము కర్మాధీనము
ప్రకటించుఁ గర్మమెట్టిభాగ్యమునేనిన్
వికలత్వమ్మును నదియే
ప్రకటించున్ దానిరీతి బహుగహనంబౌ. 62

వ. ఆబ్రాహ్మణుఁడున్న దేశంబును బాలించు ఱేనిపేరు కార్త్రికవర్మ అతనికిఁ గొమరుం డొక్కండు మాత్రమేకలఁడు. రూపగుణ సంపన్నుండు అతఁడు పదియాఱేండ్లు నిండుప్రాయంబున మృతుండగుటయుఁ దండ్రి వివాహంబుసేయు తలంపుతో సర్వసిద్ధమ్ముగనున్న కాలమగుటంజేసి వానిమృతి మఱియు నెక్కుడు శోకకారణంబయ్యె నాశోకంబు కేవల మంతతో నాఁగక కొండొక క్రొత్తమార్గమ్మునకు దారిదీసె. 63

కం. పరిణయమొనర్చు నాయా
ష్పరికరములు తోరణములుఁ బందిళ్ళవి ఱేఁ
డరసి యిటఁ గొడుకుకెట్లో
పరిణయముఁ బొనర్తుననుచుఁ బ్రతినం బట్టెన్. 64

కం. నాకే ముచ్చటదీరఁగ
నేకొమరుఁడు లేఁడ యొక్కఁడే జనియించెన్
వీఁక శవమునకె పెండిలి
శోకముడిగి చేయువాఁడ సుదతినొకర్తున్. 65

ఆ. వె. శవమువంటి వృద్ధజనులకుఁ గన్నెల
విచ్చువారు గలరు పృథివినెందు
నట్టివారు తగినయంత ద్రవ్యంబీయ
శవమునకును సుతనొసంగువారె. 66

వ. మున్ను హరిశ్చంద్రుండు జలోదరవ్యాధి నివృత్తికై నరమేధం బొనర్పనెంచి పశుసంపాదనంబునకు వలయునంత ధనం బిచ్చి మంత్రులం బనుప నజీగర్తుండను బ్రాహ్మణుండు తనకొడుకులలో మధ్యముని శునశ్శేపుఁడను వానిని వలసినంత ధనంబు గైకొని యమ్మెనని విందుము. క్షత్రియజాతి కన్యకయే కావలయునని ప్రయత్నించినచో నిది నెఱవేఱదు. తక్కుంగల జాతులందును శవమునకుఁ గన్యనిచ్చు తల్లిదండ్రు లుండరుగావి. 67

ఉ. ఉత్తమజాతియే యయిన నుందురు బ్రాహ్మణులందు హెచ్చుగా
విత్తము నిచ్చుచోఁ గొమిరె విల్చెడి వారటుగాన మంత్రులం
బుత్తు ధనంబునిచ్చి యవి పుచ్చెదు సోమపుఁడమ్మెఁ గన్నియన్
విత్తము చాలినంతగొని; విత్తమొనర్పఁగలేదె! యేపనిన్. 68

వ. ఇయ్యది యనులోమవివాహంబుగాదని శంకించుటకు రాజు దుఃఖార్ణవమగ్నుండై శవీభూతునకుఁ గొమరునకుఁ బెండ్లిసేయుమండ నెవ్వాఁ డాక్షేపింప సాహసించెడివి. 69

తే. గీ. మఱియు రాజానుమతము ధర్మంబుగాఁగఁ
జెల్లునను సూక్తిచే జేవి యుల్లమెట్లొ
అప్లె యెల్లరు తలలూఁపిరయ్యెఁ బెండ్లి
సోమపుని లోకులెల్లరు శోచ్యుఁడనిరి. 70

వ. అట్లనుటగూడఁ జాటుచాటుననే కాని పైకి ననుటకు నెవ్వరికి గుండె లుండెడి. నేకాలమ్మునఁగాని రాజశాసనమ్ముం గాదను ధీరులు మృగ్యులు. అదియునుం గాక. 71

ఉ. వచ్చినవావి పెండిలికి శాస్త్రపు సమ్మతియుండి వానికిం
దెచ్చినకన్నె బ్రాహ్మణి వినిందితకాదను శాస్త్రముండదే।
హెచ్చినయాపదల్ వొలయునెప్పుడునుఖా మరియాదలందు వి
ద్వచ్ఛ్రయమాదృతిఖా విడుచుఁ దజ్ఞులు సామయికుల్ వివేకులుఖా 72

తే. గీ. నామమాత్ర వివాహంబునకు దురంత
మైన దుఃఖంబునందున్న యధిపుఁడేదొ
చేయుచున్నయప్పుడు మంచిపెద్దలను గు
ఱించిన ప్రసక్తి రాదని యెంచుటొప్పు. 73

కం. ఆకన్నె శీలమెట్టిదొ
వాకొనఁగా వశముగాదు వధువుగదా। ఆ
రాకాచంద్ర నిభానన
శోకంబు లవంబుపడమి చోద్యంబు కడున్. 74

వ. అప్పగింతలు లోనైన మరియాదలన్నియు ముగిసినవి. లోకులు పెండ్లికూఁతు తండ్రిచేసిన యకార్యమ్మునకు నక్కజపడుటకన్నను బెండ్లికొమిరె నిర్వికారప్రవృత్తికి నక్కజం పడుచుండిరి. కారణం బేమన నియ్యది నామమాత్ర వివాహమ్మగుటంజేసి తండ్రి। తల్లి। నాకు నీవలనఁ గలిగెడి ధనలాభంబు గలుగనిమ్ము పదంపడి నీకుఁ దగినంత సొమ్ము వెచ్చించి గొప్పకట్నం బొసంగి మరల వివాహం బొనర్చెదనని బోధించె ననుకొనుటకును వలనుగాదు. కారణంబేమన.

తే. గీ. పృధ్వినాధుకొడుకు పెండ్లియాడిన యింతి
వితరుఁ డెవఁడు గొనఁగ మతిని జొనుపు
పెండ్లి దాఁకివలదు పెండ్లాడెద నటంచు
నృపుఁడు వలుక దాని నెవఁడు గొనఁడు. 76

వ. ఆ యీవిషయం బెంతటి బుద్ధిమంతులకు నగోచరంబై యయో మయంబుగనుండెఁ, గొందఱీదుర్బ్రాహ్మణుఁడీ రాజుదేశంబువిడిచి

యన్యత్ర నివాసంబేప్పఱచికొని యీకన్నియ కన్నియమే యని వేఱొక పెండ్లిచేసిన సద్దువారెవరను వాయను. మఱికొందఱో! ఈపెండ్లికడుంగడుఁ గ్రొత్తరీతిదియగు కతన దీని నెందఱెన్ని భాషలలోఁ గవులు పాటలుగను బద్యమ్ములుగను రచించియుందురో యీ కన్యకాదాత యెచ్చటికేగినను నీకళంకంబు బ్రహ్మహత్యం బోలె వెంబడించునదియే యనువారునునై "పంచశుభం, పంచాశుభంబు" గా గుసగుసలు వోవుచుండ నాకుణపంబును దహనార్థంబు శ్మశానంబునకుఁ గొంపోవుతఱి నాపెండ్లికూఁతురు నిర్వికారచిత్తంబుతో భర్తవెంట ననుగమించె ననంతరంబు చితియందు నాకుణపంబు నుంచుటయు. 77

తే. గీ. పసుపుబట్టలతో నూత్నవధువుకూడఁ
జితనుగలభర్తతో నధిష్ఠించెనంత
నేగ్నుతుండంపులావున వృష్టిగురిసె
నెన్ని దుక్కాలో చెప్పఁగ నెవరితరము. 78

కం. రవియస్తమించె వర్షం
బవిరళగతి గురియుచుండె నాపెవినా యం .
దెవరును నిల్వక చలిచే
దవుడలు నవయంగఁజనిరి ధామంబులకున్. 79

కం. ఆకన్నియచితపైఁ దా
నేకాకినియగుచు భర్తకేద్చి క్రమముగా
శోకంబువిడిచి నెమ్మది
నాకాశికిఁదలఁచి యిట్టులఱిముఱిఁబలికెన్. 80

ఆ. వె. ఏనుమేను దొరఁగుచే మాత్రమును నీకు
సమ్మతంబులేమి స్పష్టమయ్యెఁ

జితకు నగ్నిరగులఁజేయుచో నింతటి
వర్షమరయ నీప్రభావమంబ. 81

ఆ. వె. భర్త బ్రదుకులేక బ్రదుకనునేనని
నీదు చిత్తమెఱుఁగు నృపతనూజుఁ
డెట్లు బ్రదుకు దావికేయుపాయముసేయ
వలయుఁ జెప్పుమమ్మ భద్రకాళి! 82

తే. గీ. నిన్నుఁబూజించి మాయమ్మ నన్నుఁగనియె
రిక్తతాదోషమునఁజేసి తేనికమ్మి
కొనియె నాతండ్రి నీపూజకుఫలమైన
యేనువైధవ్యమును బొందుటెట్లుతల్లి. 83

కం. బ్రతికించెదవా! యిరువుర
బ్రతికింపుము లేదయేని భర్తతోనాకున్
జితయొకటియె విధియింపుము
సితిగళురాణీ! నినున్ యజింతు భజింతున్. 84

వ. ఇట్లు పితృవనంబున నేకాకినియై శవైకసహాయగాఁ దన్నుంగూర్చి తపించు నాసంజీవిని పాతివ్రత్యపరాయణత్వంబున కక్కజంపడి యా యావిశేషంబు పరమేశ్వరున కెఱింగించుటయు నాయనయు నియ్యది కడుంగడు గ్రొత్తవిశేషంబ. ఆసాధ్వీమతల్లికి నీ వే యుప కృతి గావింపఁ దలఁచినను నేను నీతోడిపాటేయని ప్రోత్సహించు టయుఁ బరమేశ్వరి ముందు త్రోవదీసినట్లు దీయుటయు. 85

తే. గీ. త్రాటితో దబ్బనముగాఁగఁ దరుణచంద్ర
ధరుఁడు పదచారియైయేగె, దంపతులిరు
వురునుబెండ్లికూఁతునకు నాదరముపొంగి
పొరలఁ బ్రత్యక్షమై రెంతపుణ్యమొకొ. 86

తే. గీ. భయపడకు మేనుగల్గఁగ భయము నీకు
లేదు భీమేశుఁ బూజింపు లేమ ! నీదు
భర్త బ్రదుకును నీదుసౌభాగ్య భాగ్య
మునకు లోటువాటిల్లదు పుణ్యశీల. 87

వ. దీనిపేరు భీమేశ్వరవ్రతం బందురు. దీని నాచరింపఁదగిన కాలమ్ములు గొన్ని కల్పోక్తంబులు గలవు అం దర్ధరాత్రం బొకటి. అది దైవవశంబున సంఘటించినది బంగరుతోఁ జేసిన దీపస్తంభం బొండువలయు. నయ్యది యిప్పుడు లభ్యంబుగాదు దానికేదో యుపాయం బొనర్పెద. నదియునుంగాక ప్రతివ్రతంబునకును నిర్దిష్ట పదార్థంబులు విత్తశాఠ్యము లేకుండ సేకరింపవలయుననియే కాని కనకమనినఁ గనకమే వలయునను నియమములేదని యెఱుంగుము. ఆ దీపస్తంభంబునందు నావు నేతితో దీపంబు వెలిగించి పతియందు భీమేశ్వరబుద్ధిం గల్పించికొని ధ్యానావాహనాదుల నర్చింపవలయు. నీవ్రతము వివాహముకాని కన్నియలును, వివాహమైన కన్నియలును జేయఁదగినది. భర్తకు ననారోగ్యమేర్పడినతఱి నియ్యది యవశ్యము కర్తవ్యం బని చెప్పి జగదంబిక యచటనుండు మఱ్ఱిచెట్టుక్రిందరాలిన మఱ్ఱిపండ్లు నైవేద్యమునకును తోరమ్మునకు మఱ్ఱియూడలయందలి దారమ్ములను సేకరించి దీపస్తంభమ్మున కక్కడనున్న వెదురుకఱ్ఱ నేర్పఱచి యిట్లే సర్వమ్మును యథాప్రాప్తమ్ముగ సేకరించి పరమేశ్వరు మొగంబునఁ జిఱునవ్వుతోడి దృష్టిం బఱపి యిట్లను. 88

కం. నాతోపాటుగ నుపకృతిఁ
జేతుననుట కర్థమేమి చేయమిదియె యొకో !
పాతివ్రత్యము యుష్మ
చ్ఛేతమునకు నచ్చెనేని చేయుఁ డుపకృతిన్. 89

చ. అనవుడు శంకరుండు గిరిజాననముం గని పల్కె నర్వమీ
వానరుపఁ జూచి యేను ముదమొందుదు నాపని కోడలేదియో

పొనరుప నత్తయయ్యెడకుఁ బోయి కరంబిడనేల ! నీకు మిం
చిన దెదియేనియున్న నది సేయుటకేను సర్వసిద్ధమే. 90

వ. నావుడు నంబిక యీవ్రతంబు నడుపుటకుఁ బురోహితుండు కావల
యునని మీయెరుంగనియది కాదుగదా! 91

ఆ. వె. అర్ధరాత్రమందు నడవికి నడవి యీ
కాటియందు మీరుగాక వీఁక
నేపురోధ దొరకు నీపెకుఁ గాన మీ
రట్టిలోటు దీర్పుఁడందు నేను. 92

చ. అనవుడు శంకరుండు నగియట్లనె యేనొనరించెదన్ సువా
సినియును నీమహావ్రతము సేసెడి సాధ్వికి నుండఁగావలెఁ
గనుకఁ దదర్థమీవనుడు గౌరి యిదే అది నేనెయుంగుదా
ననె యనె నిర్వురున్ వ్రతమున న్నియమించిరి యావధూమణిన్. 93

ఆ. వె. మంత్రములు పఠించె మహనీయుఁ డీశుండు
గౌరివినుచునుండెఁ గడకుఁ శపము
విప్రనుండిలేచు నీటునలేచి కూ
ర్చుండె నంబయేగె శూలిగూడి. 94

వ. పదంపడి నిశాశేషంబు నానూత్నదంపతు లిరువురును నాయీశ్వరో
ద్యానంబునకు దగ్గఱనున్న మఱ్ఱిక్రిందఁగడపిరి. 95

కం. అంత నుదయించె రవిభూ
కాంతుఁడు పరివారమేగి కన్గానఁ గొడుకున్
జింతావిరహిత కోడలు
నెంతో ముదమొనఁగి రఖిలమెఱుఁగఁ బలుకుచున్. 96

వ. అప్పుడా రాజదంపతులయు నాపౌరులయు నానందం బెట్టిదియో
యయ్యది మనోమాత్రగోచరంబకాని వాక్కులకందునది కాదుగదా!
యని వెండియు. 97

చ. గతమునసైన పెండ్లి సరిగాదని తేఁడువివాహమున్ సమం
చితగతిఁ జేసి పండితులు శిష్టులు సత్కవులైన వారికిన్
మితికి నమేయమైన కడుమేటి బహూకృతు లాచరించె నీ
కతవినువారికెన్నడును గస్తిఘటింపదు భద్రమబ్బెడుఁగా. 98

వ. ఇయ్యది విలోమవివాహంబయ్యును దేవయానీ యయాతిభూపతుల
వివాహంబున్ బలెసమర్ధనీయంబని వెండియు. 99

కం. సావిత్రికి మించిన యీ
పావనశీల చరితంబు పఠియించిన సం
జీవిని యీయమ నెఱిఁగిన
నేవెతయును లేక వెలఁదు లెనయుదురెలమిన్. 100

కం. సావిత్రి చరితమే మో
దావహమగు నంతకున్ సహస్రగుణము సం
జీవిని చరితం బిర్వురు
భూవలయమునందుఁ బేరుపొందిరి సతులన్. 101

కం. వీరల చరిత్రముల నె
వ్వారల్ పఠియింత్రువారు బహుంభద్రముల
వ్వారిగ దీర్ఘాయుర్భా
గ్యారూఢులుగాఁగ మందు రామయమెదలన్. 102

తే. గీ. వ్రతము లీరెండు స్త్రీలకుఁ బతికనామ
యాయురాదిక మిడుటకై యవతరించె
వీని నాచరించెడి యరవిందగంధు
లెట్టికష్టమ్ములను బొంద రిదిధ్రువంబు. 103

వ. ఇట్లు సూతుండు శ్రీ సావిత్రీగౌరీవ్రతంబును, భీమేశ్వరవ్రతంబును
సోదాహరణంబుగా వినిచినంత శౌనకాదులు సంతుష్టాంతరంగులై
యయ్యలఘు నభినందించిరి. 104

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుచుంటి నిన్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది

శ్రీ భీమేశ్వర వ్రతసహిత - సావిత్రీగౌరీ వ్రతము

సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ శివరాత్రి వ్రతము.

కం. శ్రీకమలానాథార్చిత ।
స్తోకార్చనతస్సమస్తదోషహరణ । ద
ర్వీకరభూషణ । వేద
వ్యాకృతసద్భావ । మల్లికార్జునదేవా. 1

వ. అట్లు పురాణకథనోన్ముఖుండగు సూతుం గాంచి శౌనకాదులు ప్రియతరంబులగు వాక్యమ్ముల నభినందించుచు నిట్లనిరి. 2

కం. పారాశర్యమునీంద్రుఁ ద
పారకృపారసము నీదుపట్టున నొలికెఁ
గారాపుశిష్యుఁడవు నీ
వాఋషిచంద్రునకు నీకు నఖిలము దెలియున్. 3

ఆ. వె. వ్రతము లన్నిటికన్న శివవ్రతములు
మిన్నలనియును నందును మిన్నయై ప్ర
భాసిలెడి శివరాత్రియన్ పలుకఁ నిందు
మెక్కటమ్మన దానికి నింతఘనత. 4

వ. అనతీయవలయు నావుడు సూతుం డమ్మునుల కిట్లను. 5

కం. శివరాత్రి వ్రతమున కీ
యవనిన్ వేరొండు తుల్యమనుకొనకుఁడు వై
భవమిడు శివమిడు మోక్షప
దవినిడు నొకదినము దీక్షదవిలిన మాత్రన్. 6

వ. ఆదీక్షకూడ జ్ఞానపూర్వకంబ కావలయునను నేమంబు లేదు యదృ
చ్ఛాలబ్ధంబైనను బ్రయోజనకారి కాఁగలదు. వినుం డొక్కబోయ
వాఁడు మృగమాంసమాత్ర జీవనోపాధికుండు వనంబెల్లఁ గ్రుమ్మరి
నను నొక శివరాత్రినాఁ డేవిధమైన మృగంబును జిక్కదయ్యెఁ
బగలెల్ల నరణ్యంబునఁ బర్యటించుటంజేసి ధూళిధూసరితంబగు
మేను జలాశయమ్మున నాపాదమస్తకంబు గడిగికొని దానియొద్దున
యాదృచ్ఛికంబుగఁ బడియున్న వెలిమిడిని శీతబాధాపనోదనంబునకై
యుద్ధూళించికొని తత్తీరంబున నొక్కట నొకవల పన్నికొని యట
నేదేని మృగము జలపానార్థంబు రాకుండునా ? యను నూహతో
సన్నద్ధశస్త్రుండై పన్నుండ నెంచి తత్తీరమ్మున నున్న బిల్వవృక్షమ్ము
నుంచి కొన్ని చిఱుమండలు విఱిచి వానిచే దా శయనింపనెంచిన
చోటు చక్కఁగా దుడిచి బాగుచేసికొని యామండల నాసమీపమ్మునఁ
బాఱవైచె. నయ్యవి యేయుగమునందో స్వయంవ్యక్తమై శిరోమా
త్రంబుపై కొక్కింత గోచరించు శివలింగమ్మునం బడుకతన వాఁడు
జన్మజన్మంబుల నొనర్చిన పాపంబులోఁ గొంతభాగము నశించి వాని
మనోవృత్తియందలి క్రూరత్వం బించుక సడలె నట్టియెడ గర్భిణి
యగు నొకలేఁడి యయ్యెడకు జలపానార్థం బరుదెంచుటయు సంధిం
చిన బాణం బద్దానిపై విడువ నుద్యమించుటయు నావిందు చూలాలు
మనుష్యభాషణంబుల నిట్లనియె. 7

కం. ఎందులకు నన్నుఁ జంపెద
వెందువలన నీకునున్నదే యుపకృతి ? యే
మందుఁడు ప్రయోజనములే
కెందుఁ బ్రవర్తించుచుండ దెఱుఁగుదొ ? లేదో ? 8

వ. ఇట్లు మనుష్యభాషతో యుక్తియుక్తంబుగ న్యాయబద్ధమ్ముగమాటాడు
నమ్మృగికి నావ్యాధుండు పరమాశ్చర్య పర్యాకులచిత్తుండై యిట్లు

త్తరం బొసఁగె, నేను జిన్ననాఁటనుండియు జంతువుల వధించు
చుంటింగాని నీవలె మనుష్యభాషణంబు లెఱిగినదాని నేజంతువును
జూచియెఱుఁగను. నీకుఁ గొండొకగడువిచ్చితిఁ గావున నీజన్మాది
కంబు నొడువుదువే యనుడు నాహరిణి వానికిట్లనియె. 9

ఉ: ఏను బురాభవంబునెడ నింద్రునిలోకమునందు నప్సరో
మానినులందు నొక్కతె, నుమాధవు రాజతశైలవాసున
నూన్యపుభక్తిమైదినమునోలి భజించెడి దాననాట్యమీ
శానుఁడు సల్పునత్తఱిని, సర్వనిలింపుల వెంటనేగుచున్. 10

వ. అట్లు నియతంబుగఁ బ్రతి సాయంసంధ్యాకాలమ్మునందును మహా
దేవు నాట్యం బారయనేగు నేనొక్కనాఁ డట్టులేగక యాలసించి
నాట్యంబు ముగియునప్పు డేగుటకుఁ బరమేశ్వరుండు కొండొకకినిసి
యిట్లు ప్రశ్నించె. 11

చ. అనుదిన మప్సరోంగనల యందొక సంఖ్యను బూరణంబొన
ర్పనెలఁత నీవు నేఁడిటులు సుందరి! మందత దక్కుహేతువే
మనుటయుఁ గంపముప్పతిలి యచ్చరలేఁ జిగురాకుఁబోఁడి శం
భునకు యథార్థమిట్లు దెలుపుం బొలుపొందెడి వాక్చమత్కృతిన్. 12

వ. పరమేశ్వరా! హిరణ్యాక్షుండను రాక్షసేశ్వరుండు నాకు వలపు
మగండతడు నాయింటికిఁ దఱచు వచ్చుచుఁ బోవుచుండువాఁడు నేఁడు

తే. గీ. సంజవేళకించుక మున్ను స్మరువి ప్రేర
ణమునఁ జనుదెంచుటయు మనోనాథు నతనిఁ
బొమ్మనఁగ బుద్ధిపుట్టక పొందుసలిపి
పంపివచ్చితి క్షమియింపవలయుఁదప్పు. 14

వ. ఇట్టు లయ్యచ్చర మచ్చెకంటి పొచ్చెమ్ము విడిచి యున్నదున్నయట్లు
వచించుటకుఁ బరమేశ్వరుండు సంతసించియుఁ జేసినకృత్యమ్ము

దొసఁగగుటంజేసి తద్దయితుఁడు హరిణమ్ముగా జన్మించునట్లును నయ్యది హరిణిగాఁ బుట్టునట్లును నుభయులకును దాంపత్యంబు సంఘటించునట్లును శపించి మృగజన్మంబునందున్నను జాతిస్మరత్వంబు ప్రసాదించి యా యీ శాపంబునకుఁ బంద్రెండేండ్లలో విముక్తియగుటయ కాక యాత్మసాలోక్యంబు గూడఁ గలుగునట్లనుగ్రహించెనో వ్యాఘ్రాగ్రణీ! నేనమ్మిథునంబునందలి హరిణిననిచెప్పి వెండియు. 15

ఆ. వె. ఏను గర్భవతి నొకింతలోఁ బ్రసవింప
నున్నదానఁ గాన నొడలఁదగిన
పుష్టిలేదు నీకుఁ బొలసు మంచిది దీనఁ
జిక్కుఁదింక నొకటి చెప్పుదాన. 16

తే. గీ. వేఁటకాండ్రకునైతము విధినియమము
లున్నయవి గర్భిణినిఁజంపనుత్తములగు
మృగయులీ యంశమును నీవునెఱిఁగి యుందు
వనఘ! ననుపీడు మిప్పటి కవలవత్తు. 17

వ. ఏను నాపెంకికిం జని ప్రసవించి యానిసువును సఖుల కప్పగించి నీకడకుఁ జనుదెంచెద, రేపు నీకుటుంబమ్మునకు నన్ను నాహారంబుగాఁ జేసికొందువుగాక యని వెండియు. 18

కం. ఆఁకలి కల్మని నేఁటికి
నీకొడుకులు పీదుకాంతనెగులువడి కడుఁ
జీకాకు చెందకుండఁగ
నీకడ కేదేవి హరిణి నీటికి వచ్చున్. 19

ఆ. వె. అది మదించియుండు నాపన్నసత్త్వగా
కున్నకతన నొండె నొండుహరిణ

మేని యేగుదెంచునింతలోఁ గలవుగాఁ
బోదు ధర్మమార్గమునను బొమ్ము. 20

కం. తప్పక సూర్యోదయమగు
నప్పటికే వచ్చి నీదు నంగణమున ని
ల్చెప్పగిది నిల్చితినొ విను
మప్పగిదిన్నిల్తు నన్నృతమాడ నెఱుగుఁదే ? 21

తే. గీ. అనృతమాడి జీవించుటకన్న నఘము
వేఱొకండుండఁబోదు వివేకశూన్యు
లెవ్వరో ! అట్లు బ్రదుకుదురేను దావృ
శులను రోయుదువారలు శోచ్యులనఘ ! 22

వ. ఇట్లు ధర్మ్యంబుగఁ బల్కు నాహరిణి వాక్యంబుల కక్కజంపడుచు వ్యాధుండు క్షణకాలంబు స్తబ్ధహృదయుఁడై యేమియుం బలుకక మిన్నకుండి దానితో నిట్లను. 23

తే. గీ. రేపు లభియింపనున్న బర్హిణముకన్నఁ
బ్రస్తుతము చిక్కినది మేలుపావురంబు
నిన్ను విడిచిపుచ్చితినేని నీవు రాక
మృగమొకండు దొరకకున్న నేమిసేతు. 24

తే. గీ. అప్పు డుభయతోభ్రష్టుఁడ నగుదునేను
నాదుపిల్లలు జెల్లలు నవసియాఁక
టను గృశింతురు శపథమ్ము లొనరిచి పద
పడిచనుము రమ్ము సత్యము పాడినెటిఁగి. 25

కం. ఎవరిచట సాక్షులను కొనఁ
గవలదు పృధివియును దిక్కగములు నభము ని

య్యవికాక మఱియునున్ వా
యువు గ్రహములు సాక్షులెఱుఁగుమో హరిణీ! మదిన్. 26

వ. సర్వతోద్రష్టృత్వముగల పృథివ్యాద్యంతస్థితమ్మగు దేవతాత్మత్వ
మ్మెఱింగి తగిన శపథమ్మొనరించి పోయివత్తువుగాక యనుటయు
నాలేఁడి సంతసించి యిట్లు శపథమ్మొనరించె. 27

తే. గీ. ఈవు ధర్మాత్ముఁడవు వ్యాధులెందఱేని
నీ తులకుపత్తురే! యిట్లు నీతులకు మ
నంబువశపెట్టి చేఁజిక్కిన పలలంబు
విడుచు నినుమెచ్చ జిహ్వలు వేయివలయు. 28

చ. విను మొనరించు నాప్రతిన, విప్రకులమ్మునఁ బుట్టివేదమం
దునఁ గృషిలేమి యొందెఁ గృషితోరముగా నొనరించియర్థ్వాతఁ
గనని దురాత్ములన్ యజనకర్తలఁ జేయుట, యిట్టిపాపమున్
బొనరుచుపాపి దుర్గతికిఁ బోదును బ్రొద్దుటరాక తక్కినన్. 29

శా. పాఱుండై జనియించి సంజయెడ వార్వంబోకస్వాధ్యాయవి
ద్యారంభంబునులేక సత్యమున యందాసక్తిఁ గైకోక వ్యా
పారంబంచని తోళ్లలోనయిన లాభంబిచ్చు వాణిజ్యమే
క్రూరుం డాస్థనొనర్చుఁ దద్గతిని గైకోఁ బోదునేఁ దప్పినన్. 30

సీ. దుష్టబుద్ధికినెట్టి దోషమ్ము ఘటియించు
గ్రామకంటకునకే కలిఘటిల్లు
ధూర్తునకెటువంటి దోషమ్ముప్రాప్తించుఁ
బరదారరతునకే దురితమెనయు
శీలశూన్యునకెట్టి కాలుష్యముదయించు
నాగమక్రేత కేయఘము మూఁడు
పరమాత్మ వస్తువు పరిశిష్ట మొక్కండు
నాస్తియన్ వాఁడెట్టి కస్తిగుడుచు

తే. గీ. మఱియు రెండవ సూతక మరుగకుండు
వానియింట భుజించెడి వానికెట్టి
పాతకముచుట్టుముట్టు నప్పాతకముల
కేనులక్ష్యంబనగుదు నిష్టేగిరామి. 31

తే. గీ. ఇంకనొక్కటివిను మెవఁడేనిదాత
యిచ్చుచోఁ దత్ప్రవృత్తికి నింతొ అంతొ
పానకమునందుఁ బుడకయన్ పగిదినడ్డు
వైచువానిదోసమ్ము నన్నేచురామి. 32

తే. గీ. మృగయ ! వినుముదేవద్రవ్యమేని గురుని
ద్రవ్యమేనియు బ్రాహ్మణద్రవ్యమేని
యెవ్వఁడు హరించు వాఁడొందు నెవ్వగకు ను
దాహరణ మౌదునింట నేనాఁగిరామి. 33

కం. మృగముల దానముఁబట్టుట
మృగయోత్తమ ! శయ్యదానమీఁగొనుటయు నె
ట్టి గతికిఁ దార్చెడినేను న
రిగి రామిని నన్ను నాదురితము పరించుఁ. 34

కం. అలఘుమనీషా ! వినుమిది
తలిదండ్రులయెడఁ గృతఘ్నతంజూపనివా
రలు వొందెడి నరకమునను
గలఁచునన్నియుంటికేనుగా రాకున్నన్. 35

తే. గీ. ఇంక నొక్కటి వినుమయ్య ! మృగయ ! దీప
మెవఁడు దీపాన వెలిఁగించునేను వాని
పాపమునఁ బోదు నీతోడఁ బల్కినట్టి
పలుకునకు నన్యథా గతి గలిగెనేని. 36

కం. ఒక పాదంబొక పాదము
నకుఁ జొనుపుచు శాసనం బొనర్చెడి జను పా
తకమునకు నగ్గమై నా
రకమేగుదు విపుడువోయి రాకుండినచో. 37

సీ. విష్ణుభక్తుఁడుగాని విజ్ఞుఁడు దాంభిక
త్వంబున వర్తించు దైవహతుఁడు
వింద్రియజయిగాని హీనుండు పరదోష
ములను వ్యాఖ్యానించు కలుషబుద్ధి
పరపీడ నొనరించువాఁడు సదాచార
హీనుండు బకవృత్తిఁ దెలిఁగి తప్పు
సాక్ష్యమిచ్చెడి వాఁడు సాక్షాత్కృతఘ్నుండు
కన్యకా విక్రయకారకుండు

తే. గీ. శుష్కతర్కంబులకు బుద్ధిఁ జొనుపువాఁడు
కొండెగాఁడును గాంచెడి కుత్సితంపుఁ
బాపములకేను దప్పక పాలుపడుదు
విప్పుదేగి రాకుంటినయేని రేపు. 38

కం. తలిదండ్రులఁ జంపియు వి
ప్రులఁ గెడపియు విషమువెట్టిపొరిఁ బొరివేఁటల్
సలిపెడి జనులొందెడి దు
ష్కలుషము నన్ గట్టి కుడుపుఁగాకేరామిన్ 39

కం. ఇరువుర భార్యలుగాఁ దాఁ
బరిణయముఁ జేసికొని యపగతనయుండై
సరిగాఁ జూడని దుర్జను
దురితమునే రాకయున్నదోరించుననుఁ. 40

తే. గీ. కూఁతు నొక్కని కీనెంచి కొసకుఁదగిన
కారణములేకయే యెదో వైరమూల
మునమఱొక్కనికిచ్చిన జనుని పాత
కమునకే నొదునేగి రాకమసలునెడ. 41

తే. గీ. పుణ్యకథ కథకుండుచెప్పునెడ నటకుఁ
జనివృథగ నంతరాయంబు సంఘటించు
మోఱకులుగాంచు నాయాయినారకముల
కేనుబాత్రంబ నగుదు నిప్డేగిరామి. 42

కం. పతినిందంబొనరించు వ
నితయును వేదములు సతమునిందించెడియ
ప్రతితుఁడును బొందు దుర్గతి
గతినాకగునేగి మరలఁ గనరాకున్నన్. 43

కం. ప్రేతశ్రాద్ధపుభోక్తయు
శ్రోతృహితపురాణముల నసూయగొనెడివ్యా
ఖ్యాతయునొందెడి యఘ్యే
పాతకములకేను బాలుపడుదున్ రామిన్. 44

తే. గీ. గర్భయాచకునింటను గళ్మలుని గృ
హమ్మునందును మూర్ఖు నుదవసితమ్ము
నందుఁ గుడిచినవారల యఘముగుడుతు
నిపుడు వోయిరాకుంటినయేని యేను. 45

వ. మఱియు నేనిపుడు వోయి వినుఁగికురించి రాకుంటినేని వినుము-
క్రయవిక్రయోపజీవులును పాషండులును నగు ద్విజులయొక్కయు,
భార్యాపుత్రుల వర్జించి యేకాకిగా నాహారంబు గుడుచు గేస్తు
యొక్కయు, సుగుణసంపన్నురాలును నందగత్తెయు నగు కూఁతు

సదృశమైన వరునికిడి పెండ్లిచేయని గేస్తుయొక్కయు దుర్గతికిం
బోవంగలదాననని పలువిధమ్ములు శపథమ్ములు వలుకు నావిండు
చూలాలివి హరిణినిజంపుటకై సంధించిన బాణమ్ముపసంహరించి
వ్యాధుండు శీఘ్రమ్ముగబొమ్ము ప్రొద్దుటఁ దప్పకవచ్చి సత్యమును
నిలిపికొమ్మని విడిచిపుచ్చుటయు నాలేఁటితన మన్కికింజనియె. 46

ఉ. చేతికిఁజిక్కుప్రాణి విడిచెన్ శివునర్చయెఱింగికాదుగా
కాతఁడుచేసె బిల్వముల నావలికిన్ విసరంగ నాపురా
రాతిశిరమ్మునంబడిన యక్కతనన్, శివరాత్రి కూడనాఁ
డేతగఁగూడెవాని కథమెక్కడి దంతయుఁబోయె మాయమై. 47

కం. ఎఱుఁగని మోఱకునకు నల
యెఱుకునకున్ బ్రాగ్భవపు సుకృతమో! యేమో!
యెఱుక యొకసుంతయును దాఁ
బరిపక్వంబయ్యెఁ బ్రథమ ప్రహరమిటు చనెన్. 48

వ. అంత రెండవ యామంబు ప్రారంభమయ్యె మృగయుండు క్షుత్పీడి
తుండై క్షుద్బాధాకులంబగు కుటుంబమ్మునకై యెదనెద వగచుచు
జంతువుల రాకకు నిరీక్షించుచు నేమియు నుబుసుపోనితఱి బిల్వపు
మండల నుండి దళమ్ములు చిదిమి యటనున్న స్వయంభూలింగ
మ్మున నెడనెడవైచుచుఁ గాలమ్ము పుచ్చుచుండె నా దళమ్ములప్పర
మేశ్వరు దక్షిణకాయమ్మునం బడియెనట్టి తఱిని. 49

చ. మృగిమదమత్తురాలు సురతేచ్ఛమెయిన్ దననాథు మీఁదటన్
దగిలిన మానసంబెదియుఁ దట్టఁగనీవి విరాళిఁ బెంప నీ
రుగలుగుచోటటం చచట రోయుటకై చనుదెంచి పొట్టవిం
డఁగ జలమాహరించెడి యెడన్ మృగయాక్షులకయ్యె లక్ష్యమై. 50

వ. బాణంబు విడువనున్న మృగయున్ గాంచి భయత్రస్తయై యితికర్త
వ్యంబు దోఁపక కరుణంబుట్టి పదవిట్లను. 51

ఉ. ఇంతకు మున్ను గర్భవతి యీ పథమంటియు వచ్చె నక్క జం
త్వంతక నాకు నాపె, నిజమా । యిదికాదో వచించి మీఁద న
న్నంతము నొందఁజేయుటయొ । ఆదటఁ బ్రోచుటయో పౌనర్భ్వమ
న్నంతనలుబ్ధకుండు మదికక్కజమెక్కి కుదించె నస్త్రమున్. 52

వ. మనుష్యభాషణంబులు నేర్చిన లేఁడిని నేనొక్కదానినే చూచితినను
కొనుచుండ నిపుడింకొకటి సంప్రాప్తించె దానిని వధింపక విడిచి
పుచ్చినను వెనువెంట నియ్యది యాహారార్థంబు దైవప్రేరితమై యిట
కరుదెంచెనని సంతసించుచుండ దీని భాషణంబులు నా యత్నమ్ము
నకు నంతరాయంబు గలిగించుచున్నవని యోజించుచు వెండియు. 53

సీ. ఆమృగియేయిది అన్నప్రతిజ్ఞను
నెఱపవచ్చిన దననిక్కమెట్టు
లదినిండు చూలాలియటు మాటలాడె రో
జుచు నిది మాటాడు సొంపు వేఱు
అది తన యక్కయంచిది చెప్పుచుండె న
య్యది కూడ వేఱొక్కటరుగుదెంచు
మృగియువి చెప్పెనేమిది చిత్ర మియ్యది
కపట నాటకముగాఁ గావిపించు

తే. గీ. నెట్టిదైనను నగుఁగాక యింటియొద్ద
నాఁకటంగుందు చున్నట్టి యాఁలుబిడ్డ
ల కిది యాహారముగఁ జేయులాగె బాగు
గాఁగఁ దోఁచెడినని వాఁడు కరుణవిడిచి. 54

కం. ఇంతకుమున్నే నీవలె
సంతసమిడు మాటలాడు సారంగిని బి
ట్టంతర్వత్నిని విడిచితి
నంతమ్మొనరింతు నిన్ను నాఁకలికొఱకై. 55

కం. వలవని ప్రసంగమేటికిఁ
దలఁచికొనుము నీదువిష్ట దైవతముల నాఁ
కలికదుపు మాడ్చుచున్నది
పొలియింపక తప్పదెటకుఁ బోఁగలవింకన్. 56

వ. నిష్కారుణుండయ్యు నిట్లు లోక్కొంత మెత్తని పల్కులాడు నా మృగయునకుఁ గరుణ వుట్టించుచుఁ బతివిరహసంతప్తయగు నా పడుచుహరిణి యిట్లను. 57

ఆ. వె. ఆలుమగల పేర్మి యన్ని జంతువులకుఁ
దుల్యమేను మగనితోఁ రమించు
విచ్చఁ జేసి యీవనిని రోయుచుండి నీ
బారిఁ బడితిఁ జంపవచ్చునన్ను. 58

తే. గీ. కావి నాకోర్కి దీరిన పైని నాదు
మాంసము రుచించుఁ గావి కృశాను కన్న
మిన్నయగు విరహంబున సన్నగిలెడి
నాదు మాంసంబు రుచి లేశమీదు నీకు. 59

ఉ. ఆఁకలిదప్పికల్ విడిచి యన్నియుఁ దన్మయమై రహింప నా
కేకద నేని దోఁపఁడొకొ ? హృత్కమలేశుఁడటంచు సర్వథా
యేకమనస్కనై తిరుగునీననుఁ జంపినఁ జత్తుఁగా కదే
నాకు సుఖంబు నాయెఱచి నాలుక కెక్కదునీ కెఱుంగవో. 60

కం. ఆలోచించుకొనుము నీ
యాలికి నీవెట్లొ నాకు నట్లే ప్రియుపై
లోలత్వమ్మది తీర్చక
వాలాయమువత్తు రేపు వదలుమునన్నున్. 61

వ. ఇట్లొనర్చితివేని యింతలో దైవవశమ్మున నేదేని మృగంబు నావ
లెనే నీ బారింబడి విన్నుఁ గృతార్థుం జేసినఁ జేయునని వెండియు. 62

కం. ఏవాంఛతోఁద జంతువు
జీవమువిడుదానినెటులొ చెల్లించికొనం
గావలయుఁగాన జన్మం
బావశ్యకమెఱుఁగ వో రహస్యము మృగయా. 63

ఉ. చావునకేమి యెప్డయినఁ జావులుదప్పవు జీవకోటికి
న్నీవుననుఁ వధించెదవు విన్నెవఁడో వధియించు నొండె లే
దావెదలింపరాని రుజకగ్గముగా నది చంపితీరునేఁ
జావునుదప్పికోఁ దలఁచి నల్పుప్రసంగముగా దెఱుంగుమీ 64

కం. చావన్నదొక్కపరియే
జీవికి జనికిఁ ఘటించుఁ జేకఁ అవెన్నో
చావులొక జీవి కింతయు
నీవెఱుఁగవో ! నేనెఱుఁగనో ! నెగులేమిటికిన్. 65

తే. గీ. నీకునీయాలిపైఁగల నెమ్మిదలఁచి
నాకునాప్రియునందలి వీఁకబోధ
పఱచుకోఁగలిగితి వేని పంపు నన్నుఁ
గామమునుదీర్చికొంచు రాఁగలనుధ్రువము. 66

మ. అనృతంబాడి శరీరపోషణముచేయం జూచుకన్నఁ విషం
బును మెక్కుందగు నగ్నిదూఁకనగు నంభోరాశిలో మున్గనౌ
విను మా జన్మముకన్న వింద్యములెటఁ వీక్షింపనుండంగఁ బో
వనృతమ్మొక్కటి సర్వపాపములు సేయంజాలువేమేటికిఁ. 67

కం. నమ్మిక నాయెడనీకు ల
వమ్మైనియు నున్ననన్నుఁ బంపుము మఱ్ఱా
మమ్మును దీర్చుకవత్తుఁ బ
లమ్మున కర్పింతునీకు లలినాతనువున్. 68

తే. గీ. ఎందుకుం గొఱగాని నన్నిపుడు చంపి
యేమిలాభంబు దొనఁగబ్బునింతెనీకుఁ
దీఁదాఁకలి సొరెకుఁ దెలివిఁజొనిపి
అదియెటులుసెప్పు నటుచేయుమయ్య వ్యాధ. 69

వ. ఇట్లు యుక్తియుక్తమ్ముగా ధర్మబద్ధమ్ముగా ధీరమ్ముగా గంభీరమ్ముగా మనుష్యభాషణమ్ముల నుపన్యసించు నాలేఁడి వచనమ్ముల కక్కజం పడుచు నాలుబ్ధకుండు తనలో. 70

చ. ఇదిపశువైననేమి । లగియించెడిరీతిగ మాటలాడుఁ గో
విదులగు వారు దక్కనిటు వీఱెఁడిమానిసులాడ నేర రీ
వదనము దీని కేజనితపంబున నబ్బినదొక్కొ । అచతు
ర్వదనుని చైదముల్ తెలియుపాటి వివేకమునాకుఁ గల్గునే. 71

వ. అని కొండొక జాలిగలిగి విరహాతురయగు నాహరిణి కిట్లనియె. 72

చ. వదలెదఁగాని నిన్ను బలవత్సమయంబులొనర్చి నాదు నె
మ్మదికిడినమ్మికన్, జనుము మానసికంబగు కోర్కిదీర్చికొ
మ్మెద బెదరింక వీడు మెటులీవు వచించితి వట్లుసేసి నా
యెదకుముదంబు గొల్పుమన నిట్టులు వెట్టెను నొట్టులద్దియుణ. 73

తే. గీ. క్షత్రియకులమ్మునందున జననమంది
సమరమేతేంఁగాఁ జాటుచాటు చోట
దాఁగు భీరుఁడు చెందెడి యాగమునకు
నగ్గమగుదు నిప్డేగినే నవులరామి. 74

వ. ఇట్లు కొన్ని సమయమ్ము లొనర్చుటయు నా వ్యాధున కద్దావిపై నమ్మికకల్గి పొమ్మ నీ క్రియ నన్వేషించికొని నీకోర్కి తీర్చికొని రమ్మని పంపిన నయ్యది కడుపునిండ నాతటాకంబు నందలి జలంబు గ్రోలి వ్యాధుని మనసు మెత్తఁదనమ్మునకు మెచ్చికొనుచుఁ బ్రియా

న్వేషణా యత్తచిత్తయై యరిగె మృగయుండు క్షుధార్తిమై నాబిల్వ
వృక్షమ్ము మొదల నేమియుఁగాదోఁపక. 75

చ. శివ! శివ! యంచునప్పుడు శ్రీగళునామము సంస్మరించుచు
న్నవనవమైన బిల్వముల నచ్చటి లింగముమీఁద వైచుచున్
శివ! యిది వెట్టి పుట్టనిది నేఁడెటులాహృతి నాకుఁ జిక్కునం
చు వెలికి నే మృగంబయినఁ జూడగఁ జిక్కునొ? యంచుఁ జూచుచున్.

కం. రెండవజామున్ గడపెను
దిండిదినక శివుని నెమ్మదిం దలఁచుచుఁ బ
న్నుండియును జెప్పవాల్పక
గొండొక పుణ్యంబు లబ్ధకుఁడు గడియించెన్. 77

కం. మృగములు తటాకమున నీ
రుగొనఁగ నేతెంచునట్టి త్రోవ దెసనె లో
కగురుని లింగమ్ముండుట
మృగయుని చూపభవుమీఁద మెలఁగుచునుండెన్. 78

తే. గీ. ఈశులింగమ్ము నలమెడి దృష్టి కడుపు
మంటచే శివశివ! యని స్మరణసేఁత
తోఁచితోఁచక బిల్వముల్ ద్రుంచి శూలి
మీఁదవైచుట సకలమ్ము మిళితమయ్యె. 79

వ. ఇట్టులా మృగయుండున్నతటి నింతకుమున్ను ప్రియునన్వేషించి
కొనుచు నేతెంచి బాణపాతంబునకు గుఱియై మృగయు ననుగ్రహ
మ్మునకుఁ బాత్రంబై శపథంబు చేసి చనిన హరిణికి మగండయిన
హరిణంబు తన ప్రియురాలి నన్వేషించుకొనుచు నెచ్చటను గన
రాక విసువుచుఁ దుదకు మృగయుని చూపునకు గుఱియగుటయు. 80

ఉ. ఇప్పటికేని యీశ్వరునకేను దలంపున కెక్కినాఁడ బ
ల్పొప్పెడి లేఁడి నిక్కడికి నొండయినన్ మఱిపంపుపెట్టులం

చొప్పరికింప నేలయని యొండొకతూపును వింటఁ గూర్చ భీ
యుప్పతిలంగ నాహరిణ మొయ్యనఁ బల్కె మనుష్యభాషతో. 81

వ. మాంసాహారివైన యో వేఁటకాఁడా! యీ నీ బారికింతకుమున్ను రెం
డాఁడులేఁడులు వచ్చియుండెడిని అందొకతె మాత్రమ కాదు. ఇరువు
రును నాప్రియురాండ్రు. అరెంటిని నీవు చంపియుంటివా? లేక
యెట్లో నీబారికిఁ దక్కి యెటకేనియున్ జనియుండునా? చనక
నీకాహారమే అయినయెడల నన్నునీవు చంపెదవని లేశమును నేను
జంకను; నీవు చేయబూనిన పని ఘోరమైనను నాకది యుపకారమే.

ఆ. వె. భార్యలేక యొంటి బ్రదుకుటకన్నను
చావు వేయిరెట్లు సౌఖ్యకరము
భార్యవంటి ప్రాణపదమైన వస్తువు
లేదు త్రిజగములను లేదు లేదు. 83

ఆ. వె. వృక్షమూలమేని వెలఁది తోడున్నచో
వేడుకొసఁగు మేటి మేడకన్న
నాపెతోడు లేని యప్పుడు మేడయు
నడవికన్న దుఃఖమదరఁ జేయు. 84

వ. ధర్మార్థకామమ్ము లనఁబడెడి త్రివర్గమ్మునందును భార్య సహాయు
రాలుగదా! పురుషుండు కార్యవశంబునఁ బరదేశంబరిగి యున్న
పుడు తన యింటిని గాపాడఁదగిన విశ్వాసపాత్రురాలు భార్యగాక
మఱియెవ్వరు? 85

తే. గీ. భార్యవంటి బంధువుగాని భార్యవంటి
సుఖముగాని లోకమ్మున నున్నవాఁకి
అఖిలదుఃఖరోగార్తున కౌషధం బ
టండ్రు భార్యను విజ్ఞానులైన కవులు. 86

ఆ. వె. ప్రియము పలుకు భార్య గృహమున లేదేని
వాఁడరణ్యమేగ వలయువాఁడ
అడవికన్న నింట నధికసౌఖ్యంబేమి
యుండునపుడు భార్య యుండకున్న. 87

కం. ఇరువురను జంపియుం దొ
క్కరితయుసుసమాన వేఱొకర్తుక వినుమో
కఱకు టెఱుక ! ప్రాణము లిడి
పరిచర్య యొనర్చు నింక బ్రదుకేమిటికిన్. 88

వ. కలనిజంబు వక్కాణింపుమని నిరోధించి పృచ్ఛసేయు మృగము
నకు లోఁగి యా మృగయుఁడీ లేఁడియు నేదో దేవతకావలయుం
గాని మృగమాత్రంబు కాదు. ఆ యీ సకలంబును మిగుల నక్కజం
బును గల్గించుచున్నది యని యంతర్గతంబున నెంచి హరిణమ్మున
కిట్లనియె. 89

ఆ. వె. ఒకతె గర్భవతియు నొకతె కామార్తయు
వచ్చి నాదుబారిఁ బడియు నిన్ను
నాకుఁ దెల్పి చనిరి నాయింటి కుదయాన
వత్తుమనుచుఁ జేసి బాస లెలమి. 90

కం. అవిచెప్పిన యట్లనె నీ
వవసరమున కరుగుదెంచి తప్రమ్మువినున్
దవులక విడువదు తలఁపుము
శివునో ! హరినో ! బ్రహ్మనో ! మఱి జీవమిఁకఁ జనున్. 91

వ. నావుడు హరిణంబు దయాళువైన యో మృగయావతంసా ! నా
ప్రియురాండ్రం బోలె నన్నుఁగూడ శపథమ్ము లొనర్పంజేసి గృహ
మ్మరిగి ప్రాతఃకాలమ్మునకు నీయగ్రమ్మునకు వచ్చునట్లు గడు
వొసంగుము. 92

కం. ఋతుమతిసుమి రెండవ మ
త్పతి యాపె మనోరథం బెసక మెసఁగం దీ
ర్చితనయుఁ బ్రసవించు మొదటి
సతిఁగని నిసుపుఁగని వత్తు సత్యము మృగయా! 93

కం. కాంతయు సంతానంబును
సంతోషించి భుజియించు సందర్భము ని
న్నంతకుఁగా మృగములకు న
నంతఁ జరియింపఁజేయు టరయుము మదిలో. 94

శా. భార్యా పుత్రులయందు రక్తియును ద్రవ్యంబందు నాసక్తి యే
యార్యుల్ చెందరు, చెందుమాత్రమున నేమాయెన్ మనంబందు నై
శ్వర్యం బస్థిర మాత్మజాతులరు, లీజన్మంబు తుచ్ఛంబ స
చ్ఛర్యల్ త్యాజ్యములం చెఱుంగఁదగు నీషత్తైని వ్యాఘ్రాగ్రణీ. 95

వ. నీకు నేను నీతులు గఱపుటకు వచ్చినట్లెంచకుము. నీకుంగల యప
త్య ప్రేమమ్ము నుదారప్రేమంబును నాకుఁగూడ నుండునవి నీకుఁ
దోఁచినచో మత్కాంతల నెట్లు పోయి రందంటివో నన్నుంగూడ
నట్లే పోయిరమ్మని సెలవిచ్చి పంపుము. నావుడు మృగయుండు. 96

కం. కాముకుఁడవైన నిను నే
నేమని నమ్మంగలాఁడ? మృత్యు ముఖము నె
ట్లో మఱపించి చనుటకై
యేమాయలొ పన్నుచుంటి వెవఁడవి నమ్మన్. 97

వ. అయినను నీ యొనరించు శపథంబు లెట్టివో వినిచితివేని పిమ్మట
నాకుం దోఁచినట్లు సేయంగలవాఁడ ననుటయు నాహరిణంబు. 98

సీ. భర్తను వంచించి పరపురుషునిఁబొందు
పొలఁతియే పాపానఁ బోయికుందు
తమ్ముఁ బోషించు నేతను గికురించు భృ
త్యుండెట్టి దుర్గతి నొందినవయు

జ్ఞానమిచ్చిన గురు గర్హించునట్టి దు
ష్టుండెట్టి నరకంబుఁజొచ్చి మఱుఁగు
నంబు పూర్ణములు జలాశయంబులు ద్రెంచు
కష్టుఁడే కష్టానఁ గ్రాఁగిలోఁగు

తే. గీ. మిత్రువంచించు దుష్టుండు మేకొనెడి వి
పత్పరంపర యెట్టిదాపగిది కష్ట
ములకు నే నగ్గమౌదు నిమ్ములకు నేగి
మరల రాక వంచించెడి మాడ్కి యేని. 99

వ. మఱియు స్నానసంధ్యా విహీనులై, మద్యపాన నిరతులై, పరస్త్రీ లంపటులై, వేదశాస్త్ర శూన్యులై, క్రయ విక్రయ వ్యాపారులై, సంతత ప్రవాస శీలురై, పరనిందా నిరతులై, పరులపైఁ గొండెములు చెప్పువారలై, శూద్రాన్నభోక్తలై, వేదనిందకులై, దారపుత్ర పరిత్యాగులై వర్తించు విప్రుల గతికిఁ బాల్పడుదు. నేను జెప్పిన చొప్పునకుం దప్పితినేని యని వెండియు. 100

తే. గీ. తనకు విధి లబ్ధమగు ద్విజోత్తముల సేవ
యెదల నాదరమును మానునే చతుర్థ
జాతి యది వొందునట్టి దోషమున కేను
నగ్గమయ్యెద నిటరాక యచట నున్న. 101

వ. మఱియు నేనన్నమాటకుఁ దప్పి మరల రాకుంటినేని వేదవ్రత పరాయణులై పాషండమతానుయాయులై విప్రనిందాపరులైన శూద్రుల గతికి లక్ష్యమగుదునని వెండియు. 102

కం. పంచాయతనమ్మును బూ
జించ కితరదేవతలయజించు గృహికి నే
వంచన గలుగునొ। నాకా
వంచన ఘటియించు నిన్ను వంచించునెడన్. 103

వ. మఱియు మద్యమాంసమీనసీలవృషభాది విక్రేతలు శూద్రులు వొందు దుర్గతి విన్ను వంచించు నాకుఁ గలుగుఁగాక। 104

తే. గీ. అంఘ్రిచే నేజడుఁడు దన్ను నావు, నర్కుఁ
డుదయమందు తఱిని నిద్రనొందు నెవ్వఁ
డొక్కఁడును మృష్టమగు మధురోదనంబుఁ
గుడుచు నెవ్వఁడు తదఘంబుఁ గొనఁగ నెంచి. 105

వ. ఉన్నవాఁడెవ్వఁడో వాఁడె పౌనర్భిన శపథంబునకు నన్యథాగాఁ బ్రవర్తింపంగలవాఁ డంతియ కా దెవ్వండు కన్యాశుల్కంబువలన జీవించునో, దేవబ్రాహ్మణ నిందకుండగునో, గోగ్రాసంబునందును నతిథి పూజనమందును పురోడాశమ్మునందును శ్రద్ధగలిగి యెవ్వండు వర్తింపఁడో, యెవ్వండు వంగ, సొర, పొట్లకాయలు లోనగు కాయ గూరలను, నుల్లి మొదలగు దుంపకూరలను భక్షించునో, వానివాని పాపంబునకుఁ బాల్పడునప్పుడకదా? యేను నిన్నుఁ బ్రతారించి ప్రాతఃకాలమ్మున నీయగ్రంబునకు వచ్చి నిలుచకుండుట. 106

తే. గీ. ఎవఁడు లోభంబుచే శూద్రునింటఁ గుడుచు
శూద్రసంపర్కముననె వించును మనంబు
నట్టి వేదాధ్యయనపరు నఘము నన్నుఁ
బొందు నిపుడేగి రాకుండఁ బోదునేని. 107

వ. మఱియు లెక్కలువ్రాయు నుద్యోగులు, చిత్రకారులు, నక్షత్రసూచులు, వైద్యులు, కూటసాక్షులు లోనగువారును, వేశ్యాసక్తులు మృషావాదులు పరద్రవ్యతస్కరులు లోనగువారును, రూపయౌవనగర్వితలై దైవవశంబున నాధివ్యాధి పీడితుండును గురూపియు నగు భర్తననాదరించు స్త్రీలును నేగతినొందుదు రట్టి దుర్గతికి సిద్ధపడివపుడే నీతో బల్కిన సమయమ్మునకు నన్యథా ప్రవర్తించుట యని వెండియు.108

తే. గీ. పూర్వవిద్ధ నేకాదశి నిర్వచించు
బుధులు మఱియు మాఘబహుళమునఁ జతుర్ద
శిని నటే నిర్వచించెడి శిష్టులొందు
దుర్గతిని బొందుదును రాక తొలఁగుపట్ల. 109

కం. ఎవరు శివకేశవులయెడ
నవమతి యొక్కంటఁ జూపి యన్యత్రసుగౌ
రవముం జూపుదురే నా
యవివేకుల పాప మొందనా! రానియెడన్. 110

వ. నీకడకు నాచెప్పిన చొప్పున నేను రానైతినేని వినుము. తప్తచక్రాం
కితులును లింగాంకితులును నగు ద్విజులయొక్కయు, జగత్తసత్త
నియు బ్రహ్మంబు సత్యమనియుఁ జెప్పుచు నిర్గుణబ్రహ్మంబునందు
గుణంబులను గల్పించువారి యొక్కయుఁ బారమార్థిక సత్యత్వము
లేని జగత్తునకు సత్యత్వమును జెప్పుచు నిర్గుణబ్రహ్మమునందు
గుణకల్పన సేయువారియొక్కయు భస్మలింగధారణ శూన్యుల
యొక్కయుఁ, బిష్టపశుయాజులయొక్కయు. వేదదూరులగు ద్విజుల
యొక్కయుఁ బాపమ్మునకు నగ్గమగుదునని వెండియు. 111

చ. ఒకనుడి నేవచింతు విను మూరక పేయి వచింపనేల? లు
బ్ధక! భవదీయమౌ గృహముదగ్గఱకే నుదయంబు రానిచో
సకలము మున్ను నానొడువు సత్యము నీయెడ సంక్రమించు నిం
తకు మఱి నాయొనర్పగల త్యాగము వేఱొకఁడేది యుండెడిన్. 112

కం. తుది నాఁడుమాటబోయకు
మదికి ముదంబొదవఁజేసి మంచిదిదే పో
మ్ముదయమున రమ్మనుచుఁ దన
ప్రదర మ్ముపసంహరించి పంపెన్ లేఁడిన్. 113

వ. హరిణమ్మును గడుపునిండ జలమ్ముద్రావి మృగీద్వయం బరిగిన త్రోవంబట్టి చనియె. వ్యాధుండు యథాపూర్వస్థలంబున యథాప్రకారమ్ముగ క్షుద్బాధావశమ్మున శివశివా యనుకొనుచు నిదురరాక జాగరణమ్మొనర్చుకొనుచుండ సూర్యోదయం బయ్యె. 114

కం. మృగయున కకామలబ్ధం
బుగ జాగరణవ్రతంబు పూర్ణంబై యొ
ప్పెఁ గడుపుమండఁ దొడంగెన్
మృగియప్పుడ యేగుదెంచె మెల్లన శిశుతోన్. 115

వ. అట్లు వచ్చుటయు నకామప్రాప్తశివరాత్రివ్రతంబుకతన నపాస్తసమస్తదురితుండై క్షుద్బాధాపరిభూతుండగు మృగయుం డామిషార్థియై యద్దానిపై శరంబువిడువ నుంకించునంత నయ్యది కటకటంబడి యిట్లను. 116

మ. అయయో! ధర్మము వమ్ముగాఁగ నిటులేలా! అఁకటన్ లోఁగి నా
పయి నారాచమునించె దారయవో! మత్పార్శ్వమ్మునందున్న యీ
దయనీయంబగు లేవిసుంగు మృగయుల్ ధర్మజ్ఞు లెవ్వారు దు
ర్నయు నిన్నున్ క్షమియింతురే! వినుము ధర్మంబేను వాక్రుచ్చెదన్.

తే. గీ. సురతసంసక్తమగు దాని సుప్తమైన
దాని శిశువుతో వచ్చెడి దాని వ్యాధి
పీడితంబగు దానిని వేత్తలైన
మృగయులేనాఁడుఁ జంపరీ వెఱుఁగవేమొ! 118

వ. కాదు కూడదు నాకీ ధర్మంబులతో లేశమ్మును బనిలేదు చంపెదనందువా! అట్లే చేయుదువుగాక. కొండొక గడువొసంగుము. ఇయ్యది సద్యఃప్రసూతయగు కతన నింకను నొడలి తడియేని బాగుగ నాఱనిది. కావున నీకడకరుదెంచు నన్ను వెంబడించినది, దీనిం గొనిపోయి నాయూథమ్మునందలి చెలులకు నొప్పజెప్పి. 119

కం. ఇచ్చట నుండినయట్టులె
వచ్చెద నొక గడియ తాళి వధియింపు మిటన్
బొచ్చెమ్ములేము నీదగు
సచ్చరితము జగము సారెసారెకు మెచ్చున్. 120

వ. వలసినచోఁ గొన్ని శపథంబు లొనర్చి పోయివత్తునని యా బాలింతరాలిట్లు శపథమ్ములొనర్చె, వ్యాధుండు దాని ధర్మోపన్యాసంబున కక్కజపడి పోయిరమ్మని పలికె. మృగి శిశువుతో నరిగి తోడి లేఁడులకు బిడ్డ నొప్పఁజెప్పి తన శపథమ్మునకు భంగపాటు కలుగకుండ వచ్చు ప్రయత్నమ్ములో నుండె. 121

ఉ. బోయయు లేళ్ల వాక్యములు బుద్ధికి నక్కజమౌచు ఘటింప నీ
న్యాయము నెందుఁగాననగు నాధ్యులు మానవులందు, పీవి నే
నాయుధపాణినై దునిమి యాత్మ కుటుంబముఁ బెంచుచుంటి న
న్యాయము దీనికన్న నొకఁ డన్యము వేఱెటఁ గాంచఁగా నగున్. 122

తే. గీ. అన్ని మృగములు నాయింటికన్న మాట
తప్పకుండఁగ వచ్చెడే తథ్యమనుచు
మృగముల గొనమ్మలెన్నుచు మృగయుఁ దప్పు
డున్నచోటును విడి యింటితెన్నుఁబట్టె. 123

వ. చనుటయు నింటికడఁ బెండ్లమును బిడ్డలును నుపవసించుటం జేసి కృశించిన పొట్టలతోఁ దమకేదియో మాంసాహారమ్ము తెచ్చునని గంపెడాశతో నెదురేగి శుద్ధశూన్యంబగుటకు డిల్లవడి చూచుచుండిరి. వ్యాధుండు రేయెల్ల మృగములరాక నిరీక్షించుచు వచ్చిన మృగముల శపథమ్ములు వినుచుఁ గాలక్షేపంబు సేయుకతన నిద్రాహారమ్ములు లేక, కంటి కొనలు జేగురింప నిట్టూర్పు పుచ్చుచు మృగంబుల సత్యతత్పరత్వంబున కెక్కుడ లేనిది యిదియని యక్కజంపడుచుఁ దదేక దృష్టితో నయ్యవి వచ్చు మార్గమ్ము ప్రతీక్షించుచుండె నంత నా మగలేడి తన ద్వితీయస్త్రీతో దనకును మృగయునకును జరిగిన వృత్తాంతమ్ము చెప్పి ఋతుకాలంబునఁ దన్నభిలషించు భార్య

నొప్పరికింప రామింజేసి నీకై వచ్చి భ్రూణహత్యాదోషమ్ము నుండి విముక్తినందితినని యద్దానికోర్కిఁ దీరిచి వెండియు. 124

తే. గీ. అతఁడు నారాక కెదురుగా సతముఁ జూచు
నేగవలె నీవు నీయప్ప యీ పసువులఁ
బెద్దపులి వాఁతబడకుండఁ బెంచికొనుఁడు
నాదు సాయంబు లేదింకమీఁద మీకు. 125

వ. ఇట్లు మగలేఁడి వచించి గమనోన్ముఖంబగుట నాదులేళ్ళు తమకును మృగయునకును జరిగిన వృత్తాంతమ్ము నొడివి మాకు నటకేగుట యవశ్య కర్తవ్యంబయనియు నిట్టినిమిత్తం బొందు దైవంబు సంఘటింపకున్నను నీతోడిదెలోకంబైనను మేము నీవెంటవచ్చి కష్టమో, సుఖమో, యనుభవించుట తక్క నన్యథా యెట్లు ప్రవర్తింపఁగలమనియుఁ గరుణంబుట్టిపడంబలికి వెండియు. 126

చ. వెలఁదికి భర్తతోడిదియె విశ్వము సర్వము. భర్తలేనిచోఁ
గలిమియుఁ బుత్రులున్ గలుగు కల్కియుఁ దా దురదృష్టవంతురా
లిలఁగల యే సుఖమ్మయిన నింతికి భర్తృసుఖంబుతోడుతన్
దులయనఁబోల దాత్మధవుతోఁ జనుటే యుచితంబు సాధ్వికిన్. 127

ఆ. వె. పుత్రశతముఁ గన్న పొలఁతియే యగుఁగాక
అధికధనముగూడ నలరుఁగాక
భర్తవంటి వెవియుఁ బడఁతికిఁ గాఁబోవు
కానఁ బతిని విడిచి కలికి మనునె? 128

తే. గీ. తంత్రిలేనట్టి వీణచందమునఁ జక్ర
శూన్యమగు స్యందనముపోల్కి సుతశతవరి
వృతయునై భర్త నెడఁబాసెనేని కలికి
సుఖము గొననేర దత్యంతశోచ్యయగుట. 129

వ. ఇట్లు లనేకవిధములఁ దన యనుగతియందు కృత నిశ్చయంబుతో

నలందురు తన యర్ధాంగుల ప్రేమపాశంబునఁ గట్టువడు మనంబుతో
నాహరిణం బిట్లు మనంబున యోజించె. 130

తే. గీ. వ్యాధుతో నాడు సమయమ్ము వమ్ముఁ జేసి
దారలకు బిడ్డలకు లోఁగి పారమార్థి
కమ్ము చెడఁగొట్టుకొని నరకమున కేగు
నాఁడు వీరల సాయమ్ము నాకుఁ గలదె? 131

కం. తనయార్జించిన దేదియుఁ
దనతో రాఁబోదు ధనము ధర్మ మధర్మం
బును మాత్రమ త్రాడును ద
బ్బనమును ననునట్లు వెంటఁబడి వర్తించున్. 132

తే. గీ. సత్యమున సూర్యచంద్రులు సంచరింత్రు
సత్యవంతులు జమునకుఁ జంకఁబోరు
సత్యవంతు మొగమునఁ దేజంబు వొలుచు
సత్యవంతున కెవ్వాఁడు సాటిగాఁడు. 133

తే. గీ. సత్యమొకప్రక్క నూఱుయజ్ఞములు నొక్క
ప్రక్కనిడి తూఁప సత్యమే ప్రక్కనుండె
నదియ ములు సూపె మొగ్గియుటంద్రు బుధులు
దానిఁ దప్పి చరింపరు ధర్మపరులు. 134

వ. కావున వ్యాధునకడ నొనర్చిన ప్రతిన నెఱవేర్చి సత్యంబు నిలిపి యని
త్యంబగు నికాయంబు త్యజించి యుత్తమలోకంబున కరుగుటయ
శ్రేయంబని వెండియు. 135

చ. అనృత పదంబునందు దిగి యాడిన మాటకు స్వస్తిచెప్పి యి
త్తనువును నేఁడు మన్పుటది ధర్మవిగర్హితమౌటె కాదు పె
ల్చననిది యెప్పుడో యెటులో లాఁతి విధాన నశించి తీరు నె
మ్మనమునఁ జింత సేయ లవమాత్రము నాఁడు ఫలమ్ముగల్గునే. 136

కం. అపకీర్తి నరకమిడియెడి
నపవర్గంబిడు సుకీర్తి యమృతంబునకుఙా
ద్రపగానవి జన్మమదియే
వపుజన్మము, దానికిహామం( బరముంగలదే. 137

వ. అని చనుట యంద నిశ్చయం బొనర్చి చను నాహరిణంబుతో నర్ధాంగులును తత్సంతతియుంజని యాబోయ యెదుట నిల్చినంత నంతకు మున్న సహజంబగు లుబ్ధకత్వంబు శివరాత్రి వ్రతప్రభావంబునం జేసి దూరీకరించి యస్త్రసన్యాసంబొనర్చి భూతిభూషిత సర్వాంగుండై శివస్మరణం బొనర్చికొనుచుం దపస్వియై యున్న యా జాతిమాత్ర మృగయుండు డిల్లవడి శీతలంబులగు చూపులతో నాహరిణ కుటుంబమ్ము దిలకింపం దొడంగె నట్టి సమయంబున. 138

కం. మృగమిట్లులనియె ననఘా!
దెగంజూడుము నన్నుం బిదపం దెగంజూడుము నా
మగువల నావలనిట్టులం
దెగంజూడుము సంతుం బిదపందినుండీరెల్లఙా. 139

ఉ. ఏల విలంబముఙా సలిపెదిప్పని దోసముగాదు మీకు, మ
మ్మూ లయకర్త మీ జఠరమందుం బడఙా సృజియించె, సత్యముఙా
బాలనసేయు హేతువునం బాయక స్వర్గము మాకు వచ్చు స
చ్ఛీలుండ వీవు లుబ్ధకులు చిక్కిన ప్రాణిని వీడుటున్నదే! 140

కం. నీవిచ్చిన గడువది యె
న్నో విధముల మమ్ము మనిచె నోదకుమింక నీ
దేవేరి నీవు బిడ్డలు
మావలనం దృప్తిగనుండు మనుండు సుఖముగన్. 141

వ. ఇట్లు మరణంబనం బెండ్లియుంగావి తెఱంగున సంతోషదంతురితమ్మగు మొగంబుతోం హెచ్చరించు నాహరిణంబునకుం బ్రతిచెప్ప

టకు వెఱచుచు సిగ్గుపడుచు నాలుబ్ధకతపస్వి గోచిపెట్టినదాది తానొన
ర్చిన జీవహననంబులు తలంపునకు రాఁ బశ్చాత్తాపంబునొందుచు
నిట్లను. 142

తే. గీ. లేదు నాకు మాంసంబుతో లేశమేని
కర్జమెటులో సంసారమ్మ గడచుఁగాక
యింటికేగుఁడు నీవు నీయింతులు తను
జాతులిచట విలంబమ్ము సలుపనేల। 143

వ. హరిణం బిట్లను. 144

ఉ. నిన్నటినుండి లేదుగద। నీకును బిడ్డలకామిషంబు। నీ
యన్నను నీవు బిడ్డలును నాఁకలి కల్మిఁ గృశింపనేల। మీ
కన్నశినాసనుం డిడినయట్టి పథంబున జీవనంబుచేఁ
తన్నరకంబు రాదిదియు ధర్మ్యము: యేటికి సంశయించెదో। 145

కం. నావుడు మృగయుండను నా
కీవే బంధుగవు గురుఁడవీవే సాక్షా
ద్దేవుఁడవు తల్లిదండ్రులు
నీవే జనియించె బుద్ధి నినుగను కతనన్. 146

కం. సుతులెవ్వరు సతులెవ్వరు।
సతీపతుల కబ్బునట్టి సంబంధముతో
మతిమంతు లెల్లకాలము
సతమని పడియుందురె। అసజ్జనులక్రియన్. 147

వ. ఎవరికర్మంబున వారు పోవలసినయదికాని యొండొరులకేటి సంబం
ధంబని వెండియు. 148

ఆ. వె. చేసినవ్నినాళ్లు చేసితిఁ జెడుపని
చేయరానిదనుచుఁ జిత్తమెఱిఁగె,
నింకఁ జేయఁగలనె యెన్నటికేనియు
బాపకార్యముడుగువాఁడు సుకృతి. 149

తే. గీ. వెనుకఁ జేసినదేకదా యనుచు నరుఁడు
పిదప మానక దొనఁగున కదయుఁ దగుచు
సిద్ధపఁబోవఁ దఘమని చిత్తమెప్పు
డెఱిఁగె నప్పుడవ్వానికి నెదచలించు. 150

వ. అని తనవింటిని విఱిచి తూపులతోఁగూడ దూరమ్ముగాఁ బాఱవైచి యాహరిణమ్మునకు భయభక్తి సంభ్రమమ్ములతోఁ బ్రదక్షిణించి నమస్కృతు లొనర్చుచు క్షమాపణమ్ము చెప్ప నత్తరుణంబున. 151

తే. గీ. ఆకసమునుండి కుసుమముల్ వ్యాధుశిరము
నందు మొదలెల్లనిండె మహోత్కటమగు
భేరివాద్యంబు విననయ్యె వేల్పులవెల
వెలదు లొనరించుగానమ్ము వినఁగనయ్యె. 152

వ. అంతట దేవదూత యొక్కండు విమానమ్ముతో నరుదెంచి లుబ్ధకు నభినందించుచు నిట్లను. 153

తే. గీ. సర్వసత్త్వమ్ములను జంపు సత్త్వమలరు
వాఁడవయ్యును నీ చేయు పాపమెల్లఁ
బోయె శివరాత్రినాఁడు నీవు వొనరించు
వ్రతము కతమున రావయ్య! భవునికడకు. 154

తే. గీ. ఎట్టులో నీకు నుపవాస మేరుపడియె
జాగరణము రేయెల్లను సంభవించె
జాము జాము శివార్చన సంఘటిల్లెఁ
గామకృత మదిగాకయుఁ గలదు ఫలము. 155

తే. గీ. ఎఱిఁగి యగ్నిని ముట్టిన నెట్లుకాలు
నెఱుఁగకున్న నట్టులె కాలు నీవెఱింగి
చేయవేదియు ఫలసిద్ధి చెందెనిన్ను
రమ్ము శివునాజ్ఞ కాదనరాదు వినుము. 156

వ. ఇట్లు లుబ్ధకు నభినందించి భార్యాపుత్ర పరివృతంబగు హరిణంబుం జూచి యభినందించుచు. 157

చ. అనృత భయానఁ బ్రాణముల నర్పణ సేఁతకు వచ్చినట్టి నీ
జని కడు ధన్య, మాకసము చక్కని నీవొకరిక్క వౌదు నీ
దు నికటమంద భార్యలును దోఁచెదరట్లె యపత్యమున్, భవ
ద్ఘనతకు నిట్టి శాశ్వత పదంబు నొసంగెఁ బురారి తుష్టుఁడై. 158

వ. సకుటుంబముగా మహేశ్వరు నాజ్ఞచే నేర్పడిన యారిక్కను మృగశీర్షయని దైవజ్ఞులు నేఁడు మొదలు వాడికొందురుగాక యనివెండియు.

కం. శివరాత్రి నుపవసింపక
యెవఁడు విషయభోగి యగునొ ! యేగునతఁ డుమా
ధవు శాసనమున నరక ము
పవసించిన వానికబ్బు భవుపద మనఘా. 160

వ. మేము దేవతాంతరభక్తులము గావున మాకు శివరాత్రి నుపవసింపం బనిలేదనికాని యేవియో వ్యాజములు పెట్టుకొనిగాని మానువారలను బరమేశ్వరుండు క్షమింపఁడని యెఱుంగునది, బాలవృద్ధాతురులకుఁ దక్క నీశాసని యీశాసనం బనుల్లంఘనీయంబని వెండియు. 161

కం. శివరాత్రినాఁడు చేయు ను
పవాసమును జాగరణము భవుపూజనముల్
వివిధాఘములఁ దొలంచును
బవిత్రులం జేయు నెట్టి పాపాత్మకులన్. 162

వ. ఈ శివరాత్రికి నింతటి ఘనతగల్గుటకుం గలకారణమేమన— మహేశ్వరుండు జగదనుగ్రహహేతుకంబుగాఁ గలియుగమ్మున నాత్మనిడికొని మాఖబహుళ చతుర్దశినాఁడు నిశీథమ్మునఁ దానొక లింగంబుగా నవతరించె. 163

తే. గీ. హరుఁడు బీజంబు హరి యోని యజుఁడు పీఠ
మఖిలజగ మపత్యంబగు నల్ల లింగ
మునకు నుండెడిచోటు సముద్రజలము
మఱియుఁ దన్నామధేయ మేమఱక వినుము. 164

వ. శివనారాయణాహ్వయంబున నష్టుహాలింగంబు చెల్వారు. దాని దక్షిణ భాగమ్మునుండి విష్ణువును వామభాగమ్మునుండి బ్రహ్మయుఁ బీఠ మూలమ్మునుండి నిఖిలదేవతలను, పాదములనుండి చరాచరాత్మకం బగు నీయాపజ్జగమ్మును నుద్భవించె. దాని స్వరూపంబు సంగ్రహమ్ముగ నొడివితి. 165

కం. శివరాత్రి సువ్రతము మా
ధవ్రుఁడున్ గీర్ధవుఁడుఁ జేసి తమతమ కృతులన్
సువివేకము గణియించిరి
శివరాత్రికి సాటియొండు చెప్పఁగనేరఁ. 166

వ. అనే కాశ్వమేధంబులు వాజపేయంబులు శివరాత్రి వ్రతంబునకు దీటుగావు. కోటిహరివాసరోపోషణమ్ములును, సహస్ర వర్షకృత వారాణసీ నివాసమ్ములును, లక్షజన్మాష్టమీవ్రతంబులును నొకశివరాత్రి వ్రతంబునకు దీటుగావని యెఱుంగునది; తలుమ పురాణమ్ము లందర్థ వాదమ్ములుండుట కలదు. నేను శివరాత్రి వ్రతమును గూర్చి వచించు నక్షరమ్ములయందొక యక్షరము గూడ నర్థవాదంబుగాదు. ఆస్తికు లెల్ల రీ శివరాత్రి వ్రతంబొనర్చి తరింతురుగాక। యని యా శివదూత ముక్త కంఠంబుతో నుడివి - ఆ మృగయుని మృగమును సకుటుంబముగా విమానంబెక్కించుకొని చనియెనని సూతుండు శౌనకాదులకు వచించె. 167

కం. దేవా। యావత్తైలం
తావద్వ్యాఖ్యగద। దేహదార్ఢ్యముతగ్గన్
సేవించుచుంటి నిన్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది

శ్రీ శివరాత్రి వ్రతము

సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ నందికేశ్వర వ్రతము.

వ. శ్రీవిజయవాటీ నిత్యనివాసా। కృత్తివాసా। నిరవధికప్రభావా। మల్లికార్జునదేవా? అవధరింపుము. సూతుండు శౌనకాదుల కిట్లు వక్కాణించె.

కం. ఉపదేవుండను నొక్కఁడు
తపస్విగలఁ దుర్జయునిని దారిద్ర్యంబె
ల్లపుడును పీడించిన ఖే
దపదం దతఁ డించుకేని తపమె ధనమనున్. 2

తే. గీ. తినినఁ బోవును దినకయుండినను బోవుఁ
గాలఁమాఁగదు పొట్టకై తూలి యొరుల
నాశ్రయించుటకన్న దైన్యంబులేద
టంచుఁ దలపోయు నెవ్వని నడుగఁ బోఁడు. 3

మ. కలవారెందఱు రిక్తులెందఱిపు డిక్కుంజాతభూసృష్టి నా
ద్యులు బంగారము మెక్కి మృత్తికతదన్యుల్ మెక్కుచున్నారె? యి
క్కలుముల్ నిక్కములో। వయస్సుసతమో। కాయంబునాపాయమో।
కలయేనిక్కలయో। మఱేల। ధనికుల్ గర్వింతురీ మాత్రకున్. 4

శా. కామాద్యంతరరిప్రకాండకలనన్ గల్పించి ప్రాణిన్ దురా
శామాంద్యమ్మున ముంచివైచి తుదకున్ జాంచల్యరాహిత్యసం
ధామేయంబగు నారకమ్మున కెటో దారిం బ్రకల్పించు వి
స్సీ। ముప్పిట్టి ధనంబుకోస మెవఁడున్ శిష్టుండు యాచించునే। 5

కం. అడుగకయ యుండఁగావలె
నడుగుటకున్ సిద్ధపడిన నాశకు మేరె

క్కడఁ గనుపడు। నదిగావున
నడుగక యుండుటయె యుక్తమని తలపోయుఁ౯. 6

కం. కడుపెఁడు బిడ్డలు గలరా
బడబానల సదృశునకు విపశ్చిన్మణి కే
వడువున సంసార మ్మా
బిడగడపున్ గేస్తురాలు విత్తములేమిన్. 7

ఆ. వె. చారుశీలయనెడి సద్వృత్త సార్థక
నామధేయ ప్రాణనాథుఁ గాంచి
వినయమెసక మెసఁగ ధనధాన్యములు వ్రత
మేది సేయగలుగు నెఱుఁగఁ జెపుఁడ. 8

తే. గీ. అనుచు భర్తమదికి నొప్పిదనుక నీక
యతని సత్తనెఱుంగు నయ్యతివ గోర
నందికేశ్వరవ్రతము నొనర్చు పేసి
గలుగు ధనధాన్యములు రత్నములును ననియె. 9

కం. అని యడిగినంతనే చె
ప్పిన నాపెయు సంతసించి పెనిమిటి నిటులే
మనుపేగోరిన నింతకె
ధనధాన్యము సింటినిండఁ దాండవమాడుఁ౯. 10

తే. గీ. విస్పృహాండగు నమ్మహనీయుఁడు ధన
మబ్బు సదుపాయము లెఱుంగునట్టిఁ డయ్యు
నందుకుఁ బ్రయత్నమొనరింపఁడయ్యెఁ గాక
అడిగినంతనె చెప్పె నాయడలు చూచి. 11

వ. అని సంతసించుచుఁ దనకు నానాఁడె ధనధాన్యముల్ గలిగినట్లు
భావించుచు నప్పరమపతివ్రత యావ్రతవిధానం బానతీయవలయునని

ప్రార్థించుటయు నాగృహమేధి సక్రమంబుగా నదియెల్ల వివరించు
నంత నావ్రతాచరణం బొనరించెఁ బిమ్మట దత్ప్రభావంబునం జేసి.

కం. ఎచ్చటఁ జూచిన ధనమే
యెచ్చటఁ జూచినను ధాన్యమే రత్నములే
అచ్చతురాస్యుని తల్లియుఁ
బొచ్చెములే కతనిభార్య పొలిచిరి యచ్చో. 13

వ. ఇట్లు తద్వ్రతప్రభావమ్మున నఖండైశ్వర్యమ్మునఁ దులఁదూగు నాచారు
శీల యెంతటి సుశీల యయ్యును నైశ్వర్యప్రయుక్తంబగు నాలస్యాది
దోషంబుల కించుక చోటొసంగవలసినదయ్యె నంత నొక్కనాఁడు.

కం. పొరుగింటి గేస్తురాలొగి
నరుదెంచి యొకింతనిప్పు నడుగుడుఁ దాబం
గరు దోలనూగుచును న
య్యరవిందదళాక్షి యాపెకనె సిరీతిగా. 15

తే. గీ. నీళ్ళపొయిలోన నున్నది నిప్పు నీవు
దానిలోఁ గట్టియలు గొన్నిదాపి కొంత
ప్రజ్వలింపఁగఁజేసి జాగ్రత్తగ నొక
యింత నిప్పునుగొని పొమ్ము కాంతయనుఁడు. 16

వ. ఆపె వల్లెయని చారుశీల చెప్పిన చొప్పున నొనరించె. 17

చ. సిరిఁ దులదూఁగు నిల్లగుటచే విరుగుం బొరుగెందుకోసమో
తలచు బనుళ్ళకంచు వనితల్ చనుఁదేరఁగఁ జారుశీలయా
గరితల కేదియో పనిని గల్పనచేసి తదర్థితం బనం
తర మొనఁగూర్చుచుండు వనితామణి బంగరుదోల నూఁగుచున్. 18

ఆ. వె. ఇట్లు చాలఁగాలమేగెను నారదుం
డెల్లలోకములకు నేగి యచ్చ
టచటి మంచి చెడ్డలరయు వాఁడీవారు
... ృత్త మెఱిఁగి జాలిచెంది. 19

ఆ. వె. అన్నవస్త్రములకు నతికష్టమందెడి
యీపెకిచ్చె లచ్చి యీశ్వరుండు
కనులు నెత్తికెక్కి గర్వంబు మితిమీఱె
సిరిగుణం బదెంత సేయలేదు. 20

ఉ. తాను దరిద్రురాలగుచుఁ దన్విగృహంబున నుండునప్పుడే
రే నతిథుల్ గృహమ్ముకడ కెప్పుడు వచ్చిన నున్నయంతలో
మానిని వారికిం దగిన మన్ననసేయు వినీతయై మహా
శానుఁ డొసంగినట్టి సిరిసాధ్వి కపాకృతిసేసె నక్కటా! 21

సీ. నిప్పునకే తేరఁ బప్పును దింపియె
నిపి తీసికొనుమను నీరజాక్షి
ఉప్పుప్పునకు నేగ నున్న దచ్చటఁ జూచి
కైకొమ్మనుచుఁ జెప్పుఁ గమలగంధి
చల్లవోయు మటన్న నల్లదె పెరుగు చి
లికి చల్లగొనుమను లేమమిన్న
తండులాల్ బదులన్న ధాన్యమ్ము దంపికై
కొనుమంచుఁ బనిచెప్పుఁ గోమలాంగి

తే. గీ. తూఁగుటుయ్యెల దిగ చెలనాగకు "నద
మంతరపు" సిరియెంతటి మైకమునకుఁ
గారణంబయ్యెనవి నిరాటారి వగచి
నారదుండేగెఁ గైలాసనాథుఁ జూడ. 22

వ. పరమేశ్వరుండు గౌరవించి నారదా! వచ్చి చాలఁ గాలమైనది. ఇంతకాల మెచ్చట నెచ్చట నేమేమి విశేషమ్ము లారయుచు సంచరించుచున్నాఁడవు. నావుడు మునివరుండు. 23

చ. కలవు విశేషముల్ శతము గాంచినవే, నలవాని లోన నా
తలఁపునఁ బాయకున్న దొక తన్విని గూర్చిన యక్కజంబు, నీ

వలన నఖండమైన సిరివట్టినదాపెకు, మున్పు తిండియుం
కలుగదు నేఁడు బ్రాహ్మణికి గర్వ మఖర్వమిఁకేమి చెప్పదుఁ౯. 24

చ. కటికి దరిద్రురాలగుచుఁ గాంతుఁ దపస్వి జనాగ్రగణ్యునా
ౕెటు సిరిగల్గుఁ జెప్పుమన నీమన నంది వ్రతంబు సర్వసం
కటహరమున్ వచించె నది కాంత యథావిధిగా నొనర్చి మి
క్కుటమగు లచ్చికిక్కయయి కోమలిగాంచదు క్రింద మీదను౯.25

తే. గీ. సిరికి వినయమ్ము లేకున్నఁ జేటుదెచ్చు
ననెడి మాటయే యెఱుఁగు దాయమయదేమొ
ఇంటికెందుల కేగిన నేదియొపని
చెప్పి చేయించు నల్ల లక్ష్మివినయితము. 26

చ. కలిగిన కొంపయొాకతనఁ గాంత నెదేనడుగంగఁ బోవునే
కలికియొ! "అప్పున"ప్పనుచుఁ; గంజదళాక్షి యొసంగుఁ గాని య
క్కలికికి నేదియో పనివి గల్పనచేసి పొనర్పఁజేసి య
వ్వల విడుఁ దూఁగుటుయ్యాల నహర్దివమూఁగుచునుండు వేడ్కమై.

తే. గీ. కలరు వంటలక్కలు, పనిగలిగెనేని
చేయుటకు నూదిగపువాండ్రు చేతివిందఁ
గలరు, పనివడి యేగిన కలుకులకు వ
చించుటది గరువపుఁ జెడ్డచెయిదిగాదె! 28

తే. గీ. సిరి యనాదిగనుండిన గరువమంత
గడలు కొల్పదుగావి రిక్తదళనుండి
యుండి సిరిగొన్నవారివి గొండమీఁది
కెక్కఁ గాఁజేయునని తెల్పెనీపెవిధము. 29

తే. గీ. స్వామి! నీబంటు నందికేశ్వరుఁ డొసంగె
నాపెచేసిన వ్రతమునకలరి, యట్టి
సిరిని నీవిచ్చినట్టె యాగరితగరువ
మరయ వెగటయ్యె హరియింపుమయ్య! మరల. 30

కం. హర! శంకర! యిలలోఁ బలు
తెఱఁగులు రోగములు; మందెదేవియు వానిన్
మరలించు సిరిఘటించిన
దొరతనపున్ రుజకు నౌషధులు లేవెందున్. 31

కం. అయియీ రోగమ్మరఁచెడి
ప్రాయశ్చిత్తమ్ము లేమివంటిది వేఱొం
డేయదియు లేదు గావున
నాయమకది గూర్చ నిన్ను నభ్యర్థింతున్. 32

వ. ఇట్లు నారదుండా చారుశీలయందితర దుర్గుణమ్ములు మందునకేని వెదకినఁ గానరావని యెఱిఁగియు "నడుమంతరపు" సిరివలనఁ గలిగిన గరువంబునకు నేవంబు వొడమి పనిగట్టికొని కైలాసంబేగి పరమేశ్వరునకు నెంతగావచించినను భక్తపరాధీనుండు మహాదేవుండు వినీవినని యట్లు నటించి మిన్నకుండెఁ గాని పరమేశ్వరి పార్వతికి నారదుని వచనంబుల యందెంత సత్యమ్ముగలదో పరీక్షించు తలఁపువొడమి యొక్కనాఁడు. 33

సీ. ఉదయించుచున్న సూర్యునికన్న స్ఫుటముగా
మోమునఁ గుంకుమబొట్టు వెట్టి
ముప్పాళ్లు నెరసిన ముదువుగన్పడు కొప్పు
నందుఁ బుష్పంబొండు పొందు పఱచి
అందెలుఁ బావడా లవిగాక కడియాలు
కాళ్ళయందున సొంపుగదురఁ దాల్చి
కోడేరువంటి ముక్కున నద్దబానయు
ముత్తెమ్ము నెసకమ్ము మొలవఁదాల్చి
తే. గీ. అద్దపుంబనిరైకయు నద్దకంబు
చీరయు ధరించి హిమవత్కుమారి పేద

ముత్తయిదువ నాబ్రాహ్మణి ముంగిట నిలఁ
బడియెఁ జారుశీలయు నాపెఁ బాఱఁజూచె. 34

చ. తెలియదుగాక యాపె పరదేవతయే యని వృద్ధురాలు తే
జలరెడి బ్రాహ్మణాన్వయజ యంచని స్పష్టముచూచినంత న
క్కలికి యుయేలడిగ్గి యెది కార్యమిటంజనుదేరనంచుఁ దాఁ
బలుకదు పల్కినంతఁ దనభాగ్యపు గౌరవమేమి పోవునో. 35

వ. ఆ మాయాబ్రాహ్మణవృద్ధపురంధ్రి యాపె యుయ్యేల కెదురుగఁ గొండొకసేపు తదేకదీక్షగా నిలువంబడి యమ్మా! యిఁక నేవెళ్ళుదునా? యన నప్పుడేని మీరాకకున్ గతంబేమి? మీరెవరు? మీదేయూరు? పేరేమి? యనియేని అడుగక బెల్లముగొట్టిన రాయివలె మిన్నకుండుటకు జగదీశ్వరి కెక్కుడను లేనికోపం బుప్పతిలెంగాని దానినెల్ల నెట్టులో లోనన యాఁగి జగదీశ్వరుడైన భర్తి కెఱింగింపక తానేమి స్వతంత్రించి చేసినను నయ్యది యాక్షేపణీయమగునని యోచించి విశ్వేశ్వరునితోఁ జెప్పి తగిన యపకృతి చేయఁదలంచి మరలి కైలాసమ్మున కరుదెంచుటయుఁ బరమేశ్వరుండు క్రోధాకులంబగు నాపె ముఖకాంతివలన సర్వంబు నెఱింగి సస్మితంబుగా నిట్లు ప్రశ్నించె.

చ. అరిగితె! చారుశీలగృహ మాపెయొనర్చిన పూజ నన్వినా
కరణమొనర్చి యొక్కతవ కైకొనుటొప్పునె! స్త్రీస్వతంత్రతా
చరణము గల్గియుండుటకు జ్ఞానఘనుల్ మునులొప్ప, రో మహే
శ్వరి! విను మొజ్జబంతి విటుసల్పిన నెల్లరిటుల్ పొనర్పరే! 37

ఆ. వె. భర్త యాజ్ఞలేక భగవదర్చకుసైత
మాఁడువాండ్రకుండ దధికృతియని
యీవెఱుంగు దెఱిఁగియే యేగితివి చారు
శీలసేయు పూజ చేకొనంగ. 38

వ. ఇట్లు మేలమాడు నప్పరమేశ్వరుం గాంచి యప్పరాశక్తి తానును గొండొక మేలమాటగా నిట్లను. 39

ఆ. వె. ఆఁడువాండ్ర చెయ్యులరసి వచ్చుటకేగు
నాఁడుదానికేల ? యధిపుతోడు
పేరఁటమునకేగు నీరేజపత్రాక్షి
తనదుపతిని వెంటఁ గొనుచుఁ జనునె ? 40

వ. నాయొనర్చిన యిప్పనిలోఁ దప్పిదంబులేదని యిప్పటికేని మీచిత్తమ్మునకు వచ్చియుండు నేనొక్కటి మిమ్ముఁ బ్రశ్నింతు మీరుత్తరంబు చెప్పఁగలరేమొ ! చూచెదంగాక. 41

చ. అనఘులు మీరలేమిటికొ ! అమ్మొయి నొంటరిగాఁగ దారుకా
వనమునకేగి యుంటిరి వివాహితభార్య వినాకరించి ము
క్తిని గననేగుటొప్పు వికదేనికి నేగుట కొప్పుగాదు నె
త్తిని జెయిపెట్టి చేసినది దేవుఁడెయౌత మతిక్రమించునే ! 42

వ. ఇట్టులు పరమేశ్వరి మేలమాడుటలో నంతకుమునుపున్న కోపకళ తగ్గి రసంబు రసాంతరంబుగా మాఱుట కీశ్వరుండు సంతసించుచు నాపె యడిగిన ప్రశ్నంబు నిరుత్తరంబగుకతన నేదియో లగింపని యుక్తి చెప్పుటకన్న మిన్నకుండుటయె యుక్తంబని తలంచి యందులకు యతింపక మరలఁ బ్రధానాంశంబునకు వచ్చి యిట్లనియె. 43

ఆ. వె. చారు శీలవంటి సత్పతివ్రత యాపె
భర్తవంటి మేల్తపస్వి యెందు
లేరటంచు నెల్లవారందు రందుకు
నీవు సమ్మతింతె ! నీరజాక్షి. 44

వ. నాపుడుఁ బరమేశ్వరి యర్ధాంగీకారమ్ము బయల్పడ నిట్లను. 45

కం. ఆపె పతివ్రత, భర్తయొ !
తాపసి యయ్యలఘు నేను దర్శింపఁగలే

దాపెం గాంచితి నైశ్వ
ర్యోపేతయగాని గర్వమున్నది యెంతో. 46

తే. గీ. ఏను లక్ష్మి సరస్వతి యింద్రురాణి
యెఱుఁగనంతటి గరువ మాయింతిసంత
రించినది పిన్నపెద్దలు మంచిచెడ్డ
లంచు గరువమ్ము గలవార లెంచగలరె। 47

తే. గీ. "అల్పునకు సిరియబ్బిన నర్ధరాత్రి
గొడుగుతెమ్మనె" ననియెడి నుడికి నాపె
వృత్తమిప్పుడు లక్ష్యమై వెగటుగొల్పె
నరసినది చేయలేదు మర్యాద నాకు. 48

ఉ. యాచనకేగుదెంచు మగనాలను కొన్నదో। యేమొ। లేకయే
నీచుని యింటియాలుగ గణించినదో। యల చారుశీల నఁ
గాచముకన్న బిట్టలుసుగాఁగనె ముత్తెము లేమి రాలునో।
ఆచతురాస్య వంశజకు నాదృతిమై ననుఁ బల్కరించినన్. 49

ఆ. వె. వింతయయ్యె నాకు విశ్వేశ। యాపెచం
దంబు దోలదిగమి తప్పుగాక
పోవుఁగాక కాళ్ల ముదుసలి నాదరి
వచ్చునట్టులూఁగవలెనె। చెపుమ. 50

కం. ఇది యెక్కుడి యైశ్వర్యపు
మదమని నామదిని మాటిమాటికిఁ దోఁచెన్
గుదురుపవలె నీగర్వము
మదనాంతక। నీదు ముదల మఱి వాంఛింతున్. 51

కం. వెనకయ్యతోడఁ జెప్పెదొ।
తనయున్ జినవాని గుహుని దగఁ బంచెదొయి

ప్పని స్వయముగఁ దీర్చెదో! న
న్ననుగ్రహించెదవొ! గరువమది యడఁగింపన్. 52

కం. తొలిజన్మ మందకాని
యిలనీజన్మమునఁ గాని యీశ్వర! నిన్నున్
గలుషహరుం బూజించినఁ
గలిమి గలుగుఁగాక యింతగర్వము చనునే! 53

తే. గీ. కలిమి గలుగుట కష్టమక్కలిమి నిలిపి
కొనెడి గుణసంపదయుఁ గూడఁ గూడకున్న
నది యెటులు నిల్వనేర్చు నా కానతిమ్మ
వినెద విశ్వేశ! వీనుల విందుగాఁగ. 54

ఆ. వె. "దశమువేసి పుట్టెదరు భాగ్యవంతులై
తద్రహస్యమెఱుఁగు దారి" పిన్న
పెద్ద తారతమ్య మద్దియెఱుంగని
జాల్ములంగన న్విచారమొదవు. 55

కం. మెఱుపుల మిలమిల లెట్టివొ!
సిరి తళతళ లట్టివే! దుసికిలి చనెడి యీ
సిరి నెదనమ్మికొని యిహముఁ
బరముం జెడఁగొట్టికొనెడి వర్తన తగునే. 56

కం. ధనమెంతయర్థికిచ్చిన
మనమిచ్చిన యీవివంటి మరియాదకు భా
జనమది గానేరదు దీ
నినెఱింగి గణింపవలె విసీతిని దాతల్. 57

వ. వేయిమాటలేల? చారుశీల వర్తనమునం దేవిధమైన లోపమును లేదు. తనకుఁ గలిగినంతలో నిరుగుపొరుగువార లేమియడిగినను లేదనక యిచ్చును. అతిథ్యభ్యాగతుల నారాధించును గాని. 58

చ. సిరి సురవోలె మత్తతనుజేసి కలంచునటన్నమాట సు
స్థిరమనిపించు నీయమకు దీనతగొల్పు నకించనత్వమె
క్కరణి ఘటించునో । అరసి కారుణికత్వముఁ జూపకున్నచో
నరకనివాసమున్ సిరియొనర్చిన యట్లు ఫలించునాపుడున్. 59

వ. శంకరుండు గొండొక యోజించి. 60

ఆ. వె. భర్త చెప్పినట్లు వ్రతమాచరించె నీ
సాధ్వి నంబి సంతసంబునంది
సిరి నొసంగెనంత సరిపోయెఁ బదపడి
తప్పునకును వలయు దండనంబు. 61

కం. మంచికి మంచియుఁ జెడ్డకు
నెంచఁగఁ జెడ్డయును రెండు నేర్పాటుగ సే
వించక తప్పదుగావున
వంచింపక తప్పు దీపెవలని దొసంగున్. 62

వ. అని వెండియు. 63

ఆ. వె. అనుభవించె సాధ్వి అతిదరిద్రత్వమ్ము
వ్రతమొనర్చి కాంచె భాగ్యగరిమ
దోసతోఁటవోలె భాసిల్లెడిఁ గుటుంబ
మెట్లు లేమినిడిన నీఁదు నీపె. 64

ఉ. ఉన్నయకించనత్వమునె యుంచిన నంతగఁ జిక్కులేదు సం
పన్నత గల్గఁజేసి వెస బ్రాహ్మణి కిచ్చితిమేని లేమి యా
పన్నత బ్రుంగి కస్తిపడి పాఱుతధీరత గోలుపోవుచున్
వన్నెదొరంగు నెట్లొనరుపన్వలెనో । మదిఁదోఁచకుండెడిన్. 65

కం. అగుఁగాక విష కుజంబది
తెగనఱకఁడు పెంచినట్టి ధీవరుఁ డీపా

ఉగరిత కిదియొక్కటియ దొ
సఁగు వేఱొక దొసఁగులేమి తధ్యంబరయన్. 66

ఆ. వె. ఏయుపాయముననొ యించుక మందలిం
చిన సుశీలగాన చెడుగొనంబు
స్వాతిశయము దొరఁగి చక్కంగఁ బడున ట్లొ
నర్తుఁగాకటంచు నగవిభుండు. 67

కం. గౌరికి నిటు చెప్పకయ కు
మారున్ విఘ్నేశుఁబిలిచి మాతయనుజ్ఞా
సారంబు దెల్పి యాపె య
గారంబున కేగుమనుఁడు గణపతియంతన్. 68

ఆ. వె. ఎలుక వాహనంబు నెక్కి కొండొక మేర
యరిగి తిరిగివచ్చి యంబ కభవు
నకును మ్రొక్కి తండ్రి। నాచేత నగునయ్య
గాని కార్యమెట్లు పూసనేర్తు. 69

చ. అనవుడు శంకరుండు వినయావనతుణ్ సుతుమందలించి యి
ప్పనియనఁ గొండలెత్తుటయొ। బండలుమోయుటొ। కష్టమేమి యుం
డు నిచటఁ గల్మికల్మినిగడున్ దులఁదూఁగెడి చారుశీల వం
చనమొనరించుటే కద। యసాధ్యమె। యియ్యది నీకుఁబుత్రకా. 70

తే. గీ. ఆపెధనమత్తతఁజేసి యవమతియొది
యేని యితరులతోపాటుగా నొనర్పు
నీకు, వెంటనె శపియించి వీఁకఁదిరిగి
రమ్ము శాపమ్మువిప్పచ్చరమ్మొసఁగు బె. 71

కం. ధనమత్తతయనురోగం
బునకున్నిప్పచ్చరంబ మోఘౌషధమొ

యయ్యననది వాడిన రుజచ
యయ్యనమరలున్ వేఱులేదుపాయముపత్నా. 72

వ. నావుడు గణనాధుండిట్లను. 73

చ. ఇపుడలసాధ్వి నాకు నెదియే నవమానము సేయుఁగాక ము
న్నపరిమితమ్ముగా నిడియె నాయమయుంద్రములర్పలిచ్చి యీ
యుపకృతియెట్లుగా మఱచునుల్లము. తిన్నది తేన్పురాదె। యీ
కృపణత నాకుఁబెట్టవలదెవ్వరి నేనియుఁ బంపవేడెదన్. 74

కం. కృతముమఱచి నేవృథగాఁ
గృతఘ్నతకుఁ బాలుపడినయెడ మీరే నఱ
బతితుఁడనుచు దూషించెద
రితి కర్తవ్యమ్మనకుఁ పంపుఁడేరినా। మీరల్. 75

వ. నావుడు శంకరుండు కొమరుని కృతజ్ఞతకు డెందంబున నానం
దించుచు నాచారుశీలకు నైశ్వర్యంబొసంగినది నందికేశ్వరుండె
కావున నతని మీఁదనె యీకార్యభారంబుంచుట యుక్తియుక్తంబుగ
నుండునని యెంచి యతనిరావించి పార్వతివిన నిట్లనియె. 76

ఉ. ఇచ్చితివీవు బ్రాహ్మణికి హెచ్చుగ సంపద లాపెయుందు వి
ప్పచ్చరమందుఁ జాలగుణవత్తకు విక్కఁగసంచరించె ని
ప్పచ్చరమీవు పాపి కడు భాగ్యమొసంగితి మంచిదే సిరుల్
హెచ్చిక్రమమ్ముగా సుదతియెల్లర నేలిదమొప్పఁజూచెడిన్. 77

వ. తపో యొపో నీయొనర్చినది నీవే సవరించికొనవలయుంగాన
నది యెట్లు సవరించి కొందువో। సవరించికొనుము. "విషస్య
విషమౌషధం" బనియు, "వజ్రంవజ్రేణభిద్యతే" యనియు నభి
యుక్తోక్తులు గలవక్కఁతన నీయంద యీ కార్యభారంబు పెట్టితి
ననవుడు నందికేశ్వరుండు నీళ్లునమలుచుఁ గొందొకసేపేమియు
నుత్తరంబీయనేరక యెట్టకేలకు ధైర్యంబుదెచ్చికొని సప్రశ్రయం
బుగా నంజలి జోడించి యిట్లు విన్నవించె. 78

చ. సెనగల నైదుమానికెల శీలవతీమణి చారుశీల నా
కనువుగఁ బూజలన్ సలిపి యర్పణఁజేసినదేను దింటినే
మని యిపుడట్టియాపెకు నపాకృతి యేనొనరింపనేర్తున
న్యనెవనినేని పంపుటయె యుక్తము దేవర విన్నవించితిన్. 79

చ. పదపడి కాలభైరవుని బంపఁదలంచి హరుండు రమ్ము ర
మ్మదనుదయించెఁ గర్జమొకఁడబ్బెను నీవిపుడేగి నంది స
మ్మదపడి యిచ్చినట్టి సిరి మైకముగ్రమ్మిన చారుశీల యె
ల్లిదములు పాపఁగావలయు లేమికి నిక్కయొనర్చి వ్రేల్మిడిన్. 80

ఉ. నావుడుఁ గాలభైరవుఁడనంగ హరున్నతిఁజేసి పల్కెనే
నావిమలాంగి కేగతి నపాకృతిసేయుదు ! గారెలప్డు నా
కావిబుధేంద్రు భార్యయిడె నర్పలొనర్చి; మఱొక్కనిన్ భవ
త్సేవకు నప్పనిన్ సలుపఁ జెప్పుము దేవర ! నీకు మ్రొక్కెదన్. 81

చ. అతఁడిటులాడఁ బొమ్మని యనంతరమర్కుని బిల్చి శూలి పా
ర్వతి వినుచుండఁ గార్యపుభరం బఖిలమ్మును వ్యాకరింప నా
సితిగళుమ్రొక్కి నాకు నిది సేయఁగరానిది యాపెకే నపా
కృతి యెటుసేతుఁ బాయసము నెక్కుడు మెక్కితి నాపెపెట్టఁగన్.

ఉ. పిమ్మటఁ జంద్రునిం బిలిచి భీముఁడు వేగ మవంతి కాపుర .
మ్మిమ్మెయి నేగి నందియిడె నేమెకుబల్సిరి యాసుశీల భా
గ్యమ్మఖిలమ్ముఁ బోనడఁపుమా ! యనఁ జందురుఁ డాపెనాకు రు
చ్యమ్ములు పెట్టినట్లు తిని యాపె కపాకృతిసేయ నేర్తునే ? 83

తే. గీ. ఆంజనేయుని బిల్చి యిట్లనియె నవుల
హనుమ ! నీవేగి భూలోకమందవంతి
కాపురము కాపురముగాఁగఁ గలిమినెలమిఁ
దూఁగుచును బంగరుయ్యాల నూఁగుచారు
శీలభాగ్యమ్మడంచి చెచ్చెరను రమ్ము. 84

చ. అనపుడు దేవరా! తమకు నన్నేము( బున్నేము గోచరించు నే
మని యల బ్రాహ్మణీగృహమునందలి భాగ్యము( బోసడంపనే(
జనియెద ! నాకు నాపెయిడె( జాలినయన్ని యహూపముల్; మనం
బున మఱివాని మంచిరుచి పోదిపుడుణ్ స్మృతి పాదుకొల్పెడిన్. 85

కం. అంత మహాదేవు(డు వా
క్కాంత( దల(చినంత వచ్చి కావించి నతిన్
వింత ననురమ్మనిన వృ
త్తాంతము సెలవీయు(డనుడు నభవు(డు వలికెణ్. 86

కం. ఉపదేవు(డనెడి విప్రుని
దపస్వినెఱు(గుదువకాదె ! తద్గేహిని మే
టిపతివ్రత నంది గుఱిచి
తపమొనరిచెనత(డునిదె నదభ్రంపుసిరుల్. 87

చ. సిరిగొన మీవెఱింగినదె, చెప్ప(గనేటికి ! నీకులేనిబల్
గరువములోనుగా( గలుగు కానికుచేష్టలు నేర్పునాపె, యా
దురితమడంచు నౌషధము దుర్గతిదక్క మఱొండులేదు నీ
వరిగియవంతి కాపెకది యబ్బునటుల్ పొనరింపు మింతియే. 88

చ. సితిగళు(డిట్టు లానతిద( జిత్తముగొందొక చొన్పియానర
స్వతిప్రతిచెప్పె నిట్టులపి; శంకర ! సర్వమెఱింగినన్ గృత
ఘ్నతకొడిగట్టికొమ్మవిన( గాదనకే గతినిచ్చగింతు ! నా
సతియిడెనాకు( జల్మిడిని జాలినయంతయు మెక్కిసొక్కితిన్. 89

కం. ఏమొగముపెట్టుకొని యిపు
డామె సిరి హరింప(బోదు నభవా ! మదిలో
నామెయిడిన చలిమిడిరుచి
యీమెయిజ్ఞాపకము దవులు ఋతమింతశివా. 90

వ. అనియంత నా(గక. 91

ఉ. ఏగుదుఁగాకనీదు నుడియే నిగమమ్మను బుద్ధిఁజేసి, త
ద్భృగరిమంబడంచి యిటుచెచ్చెర వచ్చెదఁగాక, నామొగం
బేగలుపల్గనంగల రహీనవిభూషణ! నీకె నామొగం
బౌగుణశూన్యమౌ కతన నారయనర్హముగాని దీశ్వరా. 92

కం. ఏమిసెల, వేగుమనెదవొ!
యేమనెదో! నేనెవర్త నీకుఁడ పీవే
ప్రామాణ్యస్థాపకుఁడవు
నామటిమాటాడనోదె నగజాపతియుఁ. 93

కం. మఱుమాటలేనిభర్తఁ
గిరిజాసతి చూచి పలుకు, గిరిశా! నీవే
చంచరఁజని యుపదేవుని
తరుణిసిరి హరింపు సర్వదక్షుఁడవనుడున్. 94

చ. ఎలనగవున్ విచారమును నీశ్వరుఁడమ్మొయిదోఁపఁబల్కనో
చిలుకలకొల్కి నాసలుపుచేఁతయె యయ్యదియైననిందలన్
బిలిచివచింపనేల! తిలపిష్ఠము బెల్లముతోడ నాకు న
క్కలికి నివేదనఁ సలిపెఁగంఠముదాఁక భుజించితేపితిన్. 95

ఆ. వె. మఱచిపోదమన్న మఱపురాకున్నది
నాకుఁజిమ్మిలియన నీకుఁదెలియు
నెంతప్రీతిగలదొ! యీపనినీవేగి
చక్కఁబెట్టుకొనుము చానమిన్న. 96

కం. ఏనొకటిచెప్పెదను విను
వేనినొప్రతిమాఱుకన్న వెలఁది తనపవిన్
దా నిర్వహించికొనుటయె
ధీవిధులు సమంజసమని తెలుపుదెఱుఁగవే. 97

తే. గీ. అపెమెడనీకుఁ గలిగిన దత్యమర్ష
మది సమంజసమే తగినంత హేతు

వున్నకతమున; నితరులు చన్నలాభ
మున్నటులులేదు స్వయమేగు ముత్పలాక్షి. 98

తే. గీ. వెంట రమ్మన్నవచ్చెద నింటిదనుక
నెనుటికీవేగు మేను రావించువదన।
తిన్నవాఁడ నగుటఁజేసి సన్నుతాంగి
మొగము చెల్లమి నిట్లంటి నగకుమారి? 99

చ. వగచినయట్లు వాఁతిడినవై ఖరి శూలి యిటుల్ వచింప నా
యగజకు జ్ఞప్తికిం దగిలి యాపె పురాకృతపూజ పుల్గమే
నొగిఁదినియుంటి దానిరుచి యున్నది నేఁటికి నాంసజ్ఞ నో
నగపతి। యెట్టులేగుటకు నాకు మొగంబది చెల్లుఁజెప్పవే. 100

ఆ. వె. నిన్ను నన్నెకాదు నిఖిలదేవతల నా
విప్రుభార్య యేదొ పేదు పెట్టి
తనుపుచుండు మున్నుదనిపె నీపైఁ గూడఁ
దనుపు నింతయును యథార్థమిభవ? 101

తే. గీ. ఒక్కఁడే దుర్గుణంబు గర్వోదుపర్వ
తాధిరోహిణియౌట యీయవగుణం బు
పేక్షసేయఁ దగ్గదికాదు పెద్దదొసఁగు
కావున నుపాయము వచింపు కాలకంఠ। 102

వ. నావుడుఁ బరమేశ్వరుండు పరమేశ్వరి కా పతివ్రతయం దుదయిం చిన యమర్షంబు కృపకు నపరపర్యాయంబ కావి యన్యంబుగాదని సంతసించి యభినందించుచు నిట్లను. 103

చ. అతివరో। నీకు సత్పతులయందలి పేర్మికి సంతసించెనా
మతి; యలబ్రాహ్మణీసతి సమక్షము నీవును నేను నేగి కు
త్సితమిది తప్పిదం బనుచుఁ దెల్పినఁ జాలును జారుశీల జీ
వితమునవెన్నఁ డాదొసఁగువెంటఁ జరింప దిటుల్ హొనర్తమే. 104

వ. అనుటయు మీచిత్తంబట్లు పౌనర్త్రముకాక యవియె, శంకరుండు మన మితరరూపంబులతో నటకేగి యుపకరించుటకంటె స్వస్వరూపంబులతో నేగుటయె యాపె కనుగ్రహంబుచేసినట్లగు నేమంటివేని.

కం. ఎవరో వచ్చి వచించిన
నవలా తావినక నిందనము లాడిన నా
పువుఁబోడి తప్పిదంబున
కువన్నె రెట్టించినట్లగును మనచెయ్వుల్. 106

వ. పరమపతివ్రతాశిరోమణి పిఖిలదేవతార్చనాసక్తురాలు, నిరతాతిథ్యభ్యాగత పూజాపరాయణురాలు నగు నాపెకు మనము ప్రత్యక్షదర్శనం బిడుట కేమిసందియమని పార్వతీపరమేశ్వరు లొక్కెడ నాపెకుం బ్రత్యక్షమై యాపె సుగుణమ్ములు ప్రశంసించి యభినందించి పదంపడి యవగుణంబు నిరూపించి యాగొనం బిన్నిగుణమ్ములకును గళంకంబని బోధించుటయు నాసుదతి తనదొసంగు నెఱింగి క్షమాపణంబువేడి మరల నిట్లనియె. 107

చ. అవగుణమొండు నాయెడల నబ్బి యపాకృతిసేయకెట్టులో
భవదుదయత్కృపాకలన భాగ్యమ పండఁగఁజేసె లేనిచో
భవములనెన్నిటన్ బడయఁబాల్పడనేరని మీదుదర్శనం
బవుటయెటుల్ ఘటించెడి దయామయులానతియిండు శంకరుల్. 108

తే. గీ. మీకనుగ్రహమున్నచో నాకు గుణము
లేవిదోషంబులవమును గానఁబడదు
భవదనుగ్రహమది లేనిపక్షమందు
నాగుణంబేమిసేయు దైన్యహరులార. । 109

వ. ఇట్లు సభక్తికంబుగను సయుక్తికంబుగను దమ్ముమతించు నాయమ భక్తికి సంతసించి యాపె యొసంగిన ఫలాదులనారగించి పిల్లజెల్ల

లతో దోసతోటంబలెనలరు నాపె కుటుంబమ్మును నిరామయాయు
రారోగ్యభాగ్య సమన్వితంబగునట్లు లాశీర్వదించి యంతర్ధానంబు
నొందిరి. చారుశీలయు. 110

చ. సిరికి విభూషణం బతిథిసేవయు గర్వములేమియంచుఁ దా
నెఱిఁగి యదే మొదల్ వినయమెంతయు దంతురితంబుగాఁగ భూ
సురుల సువాసినీ జనులఁజూచిన యంతనలేచి మన్ననల్
జరుపుచు జీవితమ్మును యశస్కరమౌనటు మార్చి వర్ధిలెన్. 111

వ. ఆపెవలన నెఱిఁగి యీ నందికేశ్వర వ్రతంబును బలువురు సాధ్వీ
మణు లాచరించి బహుభాగ్యాయురారోగ్యంబులు తామరతంపరగా
నలరారుచుండిరి. ఇయ్యది నందికేశ్వర వ్రతప్రభావంబు. దీని వినిన
వారికిఁ బఠించినవారికిఁ గావ్యముగా రచించినవారికి రచింపఁ బ్రోత్స
హించినవారికి నెల్లరకును నిరామయాయురారోగ్యభాగ్యంబుల కెన్నఁ
టికిని లోటు వాటిల్లదు. ఇయ్యది శిలాక్షరంబని సూతుండు శౌన
కాదిమునులకు వక్కాణించె. 112

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుచుంటి నిన్నును
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది
శ్రీ నందికేశ్వర వ్రతము
సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః
శుభమస్తు - అవిఘ్నమస్తు

# శ్రీ కులాచారావన వ్రతము.

కం. శ్రీవల్లభ ముఖ్యామర
సేవిత నిజపాదపద్మ ! సేవకసులభా !
పావనచరిత్ర ! సౌభా
గ్యావహ ! కవిజీవ ! మల్లికార్జునదేవా ! 1

వ. అవధరింపు మనంతరంబు సూతుండు శౌనకాదుల కిట్లనియె. 2

కం. పరమేశ్వరు వ్రతములు విం
టిరి గొన్నిటి, వింకఁ గలవనేకమ్ములు శ్రీ
కరములు శుభకరములు శం
కరములు మఱియొకటి వినుతుఁ గర్ణామృతముగా. 3

కం. కలఁడొక్క రాజచంద్రుం
డలఘుం డాతండు లింగమందున మృత్స్నా
కలితమగు దాన నిత్యము
సలుపున్ శివపూజ సర్వసంపన్నముగన్. 4

ఉ. ఆయన భక్తి తత్పరత కాయనయే సరివచ్చుఁగాని యొం
డేయనఘుండురాఁడు మహినేలుట కేతరమాదియో ! అదే
యాయభవార్చకుల్ మొదలటందురు వంశపరంపరాగతం
బై యలరారు పూజకుఁ దదాత్మజుఁ డేవము పుట్టినట్టిఁడై. 5

కం. వ్యతిరేక మతస్థుల తో
ధతగిలి లింగార్చనమునఁ దద్దయు నేవం

బతికి తుదకు వైష్ణవ ప
ద్రతికిన్ సకలంబు మార్చి తత్పరుఁడయ్యెన్. 6

కం. జనకుఁడు లింగార్చకుఁ డ
య్యును వైష్ణవపూజయందు నొక్కింతయు నె
మ్మనమున ద్వేషంబూనఁడు
తనయుండటుగాక శత్రుతంగొనె హరుపై. 7

కం. మారేడు నెదల పైతం
బాతేనికొడుకు కసహన మంకూరితమై
యేరేని వీడుము పీల్చెడి
వారది రొండినిడి రాఁగవైరులుగఁ గనున్. 8

ఉ. భూతివిభూతి శబ్దములు బూడిదవాచకతాప్రసిద్ధిఁ బ్ర
ఖ్యాతము లౌకతాన నటఁగల్గు భకారముగూడ ద్వేష్యమై
యాతనికట్టి యక్కరమునంటిన శబ్దములవ్ని శత్రుతా
స్యూతములయ్యెనట్టి మధుసూదనభక్తులు లేరు పూర్వులన్. 9

కం. తన ధర్మకర్తృ్రతకు లోఁ
గిన విష్ణ్వాలయములందుఁ గింకరులౌ వా
రివి గుమ్మరులన్ శాసిం
చెనతండు ధరింపుఁడంచు శ్రీచూర్ణంబున్. 10

వ. అట్లు శాసించుటయు స్వకులోచితంబును జిరకాలాభ్యస్తంబును నగు విభూతిధారణంబు త్యజించుటకును గ్రొత్తగా దిరుమణి తిరుచూర్ణములను దాల్చుటకును రోసి తత్కుంభకారకులస్థులును జంగమకులస్థులును నేకాంతమున నొక్కెడకుంజేరి కులవృద్ధు నొకని నధ్యక్షుగా నేమించి తమతమ కష్టసుఖంబులు తలపోసికొనుచు నిట్లు ప్రసంగించికొనిరి. 11

ఉ. పోయినఁబోవుఁగాక కులపున్మరియాద, ధరింతమల్ల దే
వాయతనానకేగునెడ నయ్యవిధించినయట్ల తిర్మణిన్
గాయమునందుఁ జూర్ణమును, గాదనిమానితిమేని వృత్తులే
పోయెడిఁ గూడుగుడ్డలకుఁ బొక్కపడన్వలయున్ గుటుంబముల్. 12

కం. పృథివీశుమతముఁ బట్టి య
పథమేని సుపథమునేని ప్రజలునడచుచే
బుధహితము "యథారాజా,
తథాప్రజా" యండ్రుగాదె తజ్ఞవరేణ్యుల్. 13

తే. గీ. ఇంటిలో మనమెంత ముక్కంటిపూజ
చేసికొన్న విభూతిని బూసికొన్న
తేఁడుగనవచ్చెనే । మనవృత్తి విల్పి
కొను నుపాయంబు చూచికోఁ జనును ముందుఁ 14

కం. వ్యతిరేకించిన వైష్ణవ
మతమందలి వారికి మనమాన్యములెల్లఁ
వితగాఁబోయెడిఁ బిమ్మట
బ్రతుకుదెరువులేక బాధపడఁ గావలయున్ 15

చ. మతమునకేమి । యెట్లయినమార్చికొనంజను తేఁడు శైవస
ద్మతమునువీడి వైష్ణవమతమ్మునకేగినయట్లె పూర్వపుం
బితరుల సన్మతమ్మువిడి వేఱొక సన్మతమున్ గ్రహింతమా
మతమును మంచిదేయతఁ డుమాధవుఁ డీతఁడు మాధవుండగున్. 16

వ. అస్మదుక్తప్రకారంబున కంగీకరించితిరేని మనకు రానైయున్న క్షామంబునకు లేశమ్మును భయపడవలసిన పనియుండదని యుపరమించుటయు మఱియొక్క మతావేశంపు జంగముఁడు లేచియిట్లుపన్యసింపదొడంగె. 17

కం. ఆమతమును మంచిదియే
యీమతమును మంచిదెయని నృపుతో మనమి
ప్తామత చిహ్నము బూనిన
చో మఱియొకఁడు వచ్చుచో నపుడెట్టుల్. 18

వ. ఇతరదేశస్థుల మాటట్టులుండ మన భరత ఖండమ్మునందు యెవరో పీఠస్థులు సమ్మతించిన యాఱుమతంబులు మాత్రమకాక యింకను నెన్నియో మతములు కనుపట్టెడి రాజ్యలక్ష్మికి నొకమతమని కాని యొకనీతి యని కాని జాతియనికాని యడ్డంకి యున్నదని యెవ్వరను కొందురు। మొన్న నెవ్వరో చెప్పఁగా వినియుంటిని. 19

కం. కలదొక సంస్థానము బో
యలదఁట ? యదివచ్చునంట । అఱువదిలచ్చల్
కలరఁట బ్రాహ్మణవిద్వాం
సులుఁ గవులుఁ మంత్రులును యశోధనులందున్. 20

కం. వారలనాగరికత్వము
వారలయందంబు మఱియు వారలచందం
బేరికిలేదఁట । తచ్ఛృం
గారవతులతోడ దీటుగారచ్చరలున్. 21

కం. ఆకారమున్నచోటనె
శ్రీకలుగునటంద్రుగాని శ్రీకలచో నే
ఆకారము గలుగునటం
చేకతన వచింపరాదొ । యేవిట్లందున్. 22

వ. ఇంతకు నావచించునది యేమనగా ? రాజ్యలక్ష్మి గడియకొక్కని వరించుచుండు వాని మతంబెట్టిదైనను బ్రజలు తన్మత చిహ్నంబులు దాల్చి వర్తింపవలయుననుట అంత యుక్తిసహంబునుగాదు శాస్త్ర సమ్మతంబును గాదని నేననుకొందుఁగావున విహపరంబులురెండును

జెడని విధంబున కనుకూలించు వేఱొకమార్గంబునకుఁ గడంగుట
యుక్తంబనుటయు మఱికొందఱు మొదటివాని కనుకూలమ్ముగను
నిఁకఁ గొందఱు రెండవవాని కనుకూలమ్ముగను నుపన్యసింపం
దొడంగిన నుభయపక్షములకును బలంబు తుల్యంబగుటంజేసి యధ్య
క్షుడు నాఁటి కేమియుఁ దీర్పుచెప్పక తనకొకరోజు గడువొసం
గినంగాని యేమియుం జెప్పఁజాలనని సభ్యులంగోర వారట్లకాకయని
సమ్మతించిరి పదంపడి మఱునాఁ డధ్యక్షుండు. 23

చ. వినుఁడు మతస్థులెల్లరును పీలుగ నాకొకత్రోవ దేవుఁడే
యనుకొనుఁ డాత్మకుం దెలిపె నయ్యది యిట్టిది వైష్ణవోచితం
బునకు మతానకుఁ జనుట ముందెటు తప్పదుగాని తల్లక్రిం
దనుగతిఁ బంగనామముల నందఱుఁ దాల్తము చూతమాపయిన్. 24

వ. పదంపడి మనకిది యనభ్యస్తంబగుట నట్లు సంఘటింపంబోలునని
వారు సమ్మతించిరా। చిక్కుండదుగాని యట్లుకాదేని అపుడు మరల
మార్గాంతరంబు చూచికొనవలసి వచ్చును, అట్లుగాక ప్రశ్నించినచో
నప్పుడేదియో తేలఁగలదు, అదియునుం గాక. 25

కం. మనమేని యనాథలమను
కొనరాదు కుమారవిభునకుఁ వ్యతిరిక్తం
బును పెద్దప్రభువుగారికి
ననుకూలంబైన యదియు నస్మన్మతమున్. 26

వ. అట్లగుటంజేసి యుక్తియుక్తంబుగఁ గన్పట్టునెడల వృద్ధరాజుగారు
మనకుం గొంత దోహదంబు గల్పింపకపోరని చెప్పుటయుఁ గుల
స్థులు తమలో. 27

తే. గీ. ఇట్లు తలక్రిందుగాఁ బెట్టనేల ? యనుచుఁ
బ్రశ్నవచ్చిన నితఁడెట్లు పలుకునొక్కొ
వినినయప్పుడుగాని యీయన మనీష
దెలియదిద్దనియుండిరి తలల నూఁపి. 28

వ. పదంపడి వాద్యభాండముల వింద( దిరుమణీ చూర్ణంబులు, ముఖము మొదలు తత్తత్ప్రదేశంబులనెల్ల( దిరుమణి తిరుచూర్ణంబులనై యేగుటకు రాకొమరుండు సంతసించెం గావి. 29

ఆ. వె. ద్వాదశోర్ధ్వపుండ్రధారణంబది యధః
. పుండ్రధారణముగ( బొల్చుటకును
సందియమ్ము గలిగి సపరిహాసమ్ముగా
నిట్టి వ్యత్యయంబదేమి యనుడు. 30

వ. కుంభకారవృద్ధుండు మెల్లఁగా వణఁకుచు "అతివినయం ధూర్తలక్షణమ్" అను నార్యోక్తికి( బ్రధానోదాహరణమ్మగుచు నిట్లువక్కాణించె.

ఉ. ఏము విభూతి( బూసికొనుచే యలవాటగువాండ్ర మద్దియె
ట్లో మెయివింద( బూసికొనుచుండెడి వాండ్రము పంగనామముల్
ప్రామికొనంగ నేర్పుటది పైపయినున్నదె। యెంతకాలమో
సామొనరించి నేర్చికొన( జక్కఁగ( గన్పడు నూర్ధ్వపుండ్రముల్.

వ. అని వెండియు. 33

ఉ. దేవరయాగ్రహింపరని దెల్పెద నింకొకమాట వైష్ణవం
బీవిధి( దల్లక్రిందగుట కేమి కతంబన( జిత్తగింపుమో
భూవర। నేఁటికిఁ ముదిరిపోయి యిటుల్ గననయ్యె నంచు మీ
భావమునం దలంపుఁడవి ప్రార్థనమున్ బొనరింతు సైఁపఁగన్. 34

వ. నావుడు రాజకుమారుండు మతిమంతుం డగుటంజేసి యందలి వ్యంగ్యార్థంబు గ్రహించి విగ్రహామగ్రహమ్ములు తన కరగతంబులుగా నుండియు నధికారంబు దుర్వినియుక్తంబుగావి చందంబున మిన్నకుండె నాయీ వృత్తాంతంబు తత్రత్యులు భృత్యులరిగి విపేదించుటంజేసి వృద్ధభూపాలుండు కుంభకారవృద్ధుని ధైర్యస్థైర్యంబులకును వైదగ్ధ్యమునకును స్వమతాదరమ్మునకును సంతసించి కొమరునకు స్వమత సమాదరంబుగల్గు భాగ్యంబు చేకూరునెడల నీవ్వ

ద్దుండుగూడ దేశికులలోఁజేర్చికోఁదగి యుండునని మిన్నకుండి రాత్రి విదురించునెడల నిట్లు మనంబున వితర్కించికొనుచు శివుం దలంచికొనుచు నిద్రించె. 35

ఉ. తాతలుఁ దండ్రి తాతలును దాతలతాతలు వారితండ్రులున్
జేతులనిండ నీదు పదసేవనముఁ బొనరించి రుత్తమల్
చేతమునిండ నీస్మరణఁజేసి తపించి తరించినారు వి
ఖ్యాతియు ఘాతియున్ గలిగి యందుకు నిందుకుఁగూడనష్టమై. 36

ఆ. వె. నిన్నుమించినట్టి నిఖిలలోకేశుండు
లేఁడనంగనేల ! లేఖులందుఁ
గలఁడె యంద మట్లు గల్గిన స్వమతంబు
విడుచుటొప్పుకొనడు విజ్ఞుఁడభవ. 37

కం. కొమరునకదేరి బోధయొ !
కమలాపతియందుఁ గుదిరెఁగడు నాస్థ యడన్
గుమతంబుగాదు మాన్యమ
స్వమతంబును వీడరామి శంకింతుభవా. 38

కం. పలుమతములాగలవన్నియుఁ
దులఁదూచి గ్రహింపఁజాలు ధూర్వహుఁడెవ్వం
డిలఁ దాతతండ్రులుండిన
యలమతమున నున్నవాని ననరేరు బుధుల్. 39

కం. ఓయి ! "స్వధర్మే నిధనం
శ్రేయ" యటంచున్ వచించె శ్రీకృష్ణుం, డా
జ్ఞాయత్తుఁడైన క్రీడికి
వేయేటికి నతనిపల్కు వేదంబకదా ! 40

తే. గీ. అతఁడుసైతము శివభక్తుఁడైన యట్లు
భారతమ్మున వచించుఁగంఠారవమున

భవతు. వేఱొండు విధమునఁ బలుకుఁగాక
స్వమతము ద్యజింపనేల ! మావాఁడుదేవ. 41

తే. గీ. ఏమిలోపమ్ముగనిపెట్టె నీమతమున
నింతకంటెను దానియం దేగుణమ్ము
వీఁడుగనిపెట్టె నదిగాక ద్వేషమేల !
గలిగెసద్దాన నీకదితెలియునభవ ! 42

కం. స్వమతాసక్తునిగా నా
కొమరుఁ గరుణించి నాదు కొండలమునకున్
శమము ప్రసాదింపుము వం
శము సర్వము త్వత్పదాబ్జ సంసక్తమజా. 43

వ. ఇట్లు పరమేశ్వరుంగూర్చి ధ్యానించుచుఁ దెలవాఱుజాముపలుకు నిదు
రింపక యప్పుడ యించుక కన్ను మొగుడ్చుటయు. 44

సీ. జటలయుష్ణీషంబు సరిగంచుపాగ క
న్నను పేఁబురెట్లు విన్నాణమొలుక
లేఁతచంద్రుడాలు నూతనపత్రాల
సరిఫేషుకన్న నచ్ఛముగ వెలుఁగ
వ్యాఘ్రచర్మపుఁగొటి వన్నెచిన్నెలతోడి
పట్టుసేలుపుకన్న బాదలిర్పఁ
గరకంఠగత సర్పసురుచిరభూషణా
వళి రత్నములకన్నఁ దళుకుఁగులుక

తే. గీ. స్వచ్ఛపుగు బూదిపూత శీర్షగతమైన
గంగకన్నను దెల్లనికాంతులీన
గరళకంఠుండు కలలోన గరుణతోడ
నల్లభూపాలు నెదుటఁ బ్రత్యక్షమయ్యె. 45

వ. అట్లు ప్రత్యక్షంబై యిట్లు వక్కాణించె. 46

కం. ఈవెఱఁగివ సంగతులే
యేవచియింపంగనేల యిరువురమొకచే
శ్రీవరుఁడు నాకు మిత్రుఁడు
భావింపఁగ నొకరికొకరు బంధులమనఘా. 47

కం. మాలోనలేనిభేదము
లేలోకులో తెచ్చిపెట్టి యెందులకకటా।
లోలోఁ గలహింతురు నృప।
చాలననర్థమ్ముగూర్పఁజాలెడి వివియున్. 48

కం. నా నామమ్ములకర్థము
ధీనిధియగువాఁడు శ్రీపతికి బోసఁగఁగ వ్యా
ఖ్యానింప నేర్చునటు శ్రీ
జానివి నా కన్వయించుఁ జతురుండేనిన్. 49

తే. గీ. ఇటు లభేదమ్ముగల్గు మాయెడల నీకుఁ
గలుగు చింతకు నేను విక్కముగ సంత
సంబుగాంచితి స్వమతంబు జాఱవిడిచి
చనుట యుక్తంబుగామియు సత్యమనఘ। 50

ఉ. కొమరుఁడు బుద్ధిశాలి యనుఁగుం జెలికాఁడొక వంచకుండు స
క్రమముగ బోధసేయక వికారపుధోరణితోడఁ జేసె వి
ష్ణుమతపుబోధ తన్మతపు సూరులలోఁ బలుమంది కిట్టిదో
షముఁకల దెల్లెడన్; దెలిసి శత్రుతగూర్తురు నాదుపట్టునన్. 51

వ. ఇట్లే మద్భక్తులుగూడ మన్మిత్రుండగు రమానాథు నెడల విద్వే
షంబు పుట్టింతురుగావి మద్భక్తులలో నాత్మమతాసక్తియే మెందు
గావి అన్యమతద్వేషబుద్ధి కదుంగడు మృగ్యంబని వెండియు. 52

కం. ఈయెడ నీకొక్కట నదు
పాయము నేఁ దెల్పువాఁడ నయ్యది కొమరున్

జేయు స్వమతాదరునిగా
నీయెదలో మానుమింక నెగులు సుశీలా। 53

వ. అయ్యాది వినుము. నీవు నీకొమరుని మంతనమ్మున సగౌరవంబుగ సవాత్సల్యంబుగ నొక్క ప్రశ్నమ్మడుగుము దాని కతం డుత్తరంబు వచించు దానితో సకలమ్మును జక్కంబడఁ గలదని యా యుపాయంబు దెలిపి యభవుం డంతర్హితుం డగుటయు భూపాలుండు మేల్కాంచి మేలు కలగాంచితినని సంతసించి పడంపడి యొక్కనాఁడు.

చ. ముదిరిన భక్తితో బికిరముఁగా గృహపుత్త్రికలీయఁ గొంచు న
య్యాది గురువర్యునొద్ద నిడు నాత్మజుపై ఖరిఁ జూచి యేటికి
య్యాది। "తుదకబ్బెరా" యనెడి యార్యుల లౌకికసూక్తికిన్ రమా
స్పదుఁడు కుమారుఁడగ్గమయి పాడఔనంచు విచారమందుచున్. 55

వ. తన మనంబునఁ గల కోపతాపంబుల నణంచికొని సప్రేమంబుగఁ గుమారుం జేరం బిలిచి. 56

కం. ఆగర్భశ్రీమంతుఁడ
వీగతి బికిరంబునెత్తె దేటికి। నీకే
యాగమము లిట్లు సెప్పె మ
తేగురులు వచించి రించు కెఱిఁగించెదవే। 57

వ. నావుడుఁ దండ్రికిఁ గొమరుం డిట్లను "అర్థం ప్రాణమాచార్యాధీనం" బను నభియుక్తోక్తి దీనికిఁ బ్రవర్తకంబు. నేను ఆగర్భశ్రీమంతుఁడ నగుటంజేసియే సాత్త్వినసాత్త్విభక్తులంబలె నూరంగల గృహమ్ముల కేగి యక్షయపాత్ర సేయక మన నగరునంద జంత్రపుబొమ్మల హస్తమ్ములయందుఁ దండులమ్ములకు బదులు తత్సదృశంబులగు ముత్తియంబులవిడి వానివలన నుపాదానం బొనర్చి యయ్యాది గురువకు సమర్పించుచున్నవాఁడ నియ్యాది గురువులొనర్చిన సదుపాయం బని నవినయమ్ముగ నొడువుటయు వృద్ధభూపాలుండు సంతసించుట

నటించి కలలో రాత్రి యీశ్వరోపదిష్టమ్మగు నుపాయమ్ము స్మృతికిం దెచ్చికొని యిట్లనియె. 58

కం. ముదమయ్యె నీదుభక్తికి
సదమలమగు మతము నీకు సంప్రాప్తించెన్
సదయులు నీగురులేమని
యెదరో యీమతమువారి నేగి యడిగెదే. 59

వ. అని వెండియు నీవవ్వారిని బ్రశ్నించునప్పు డియ్యది వైదికమతమా? లేక స్మార్తమతమా? లేక బ్రాహ్మణమతమా? యని వేర్వేఱనడిగి వారేమతమని సమాధానమిత్తురో దాని నాకు విన్నది విన్నయట్లు తూచా తప్పకుండ వచింపు మనవుడు రాకొమరుండట్ల యగుంగాక యని యడుగుటయు నా గురువు లియ్యది వైదికంబు స్మార్తంబు బ్రాహ్మణంబునుగూడ నగునని ప్రత్యుత్తరంబు వచించిరి యని వచించిన పదంబడి వృద్ధభూపాలుండు కుమారా! నీ కట్లుత్తరంబిడిరి కాని సభాముఖంబున వారల ప్రవృత్తి యేతత్త్రితయమ్మునకు భేదంబుగలయదిగాఁ దేలినచో నీపపు దేమి సేతువు నావుడు నృపాలసూతి యిట్లు సమయం బొనర్చె. 60

తే. గీ. వైదికము స్మార్తమునుగాక బ్రాహ్మమేని
గాక యిది యన్యమతమని జ్ఞానఘనులు
వారలే యొప్పికొన్న నే వారి విడిచి
మనకులాచారమతమున మసలువాఁడ. 61

వ. అట్లొనర్పనినాఁడు బ్రహ్మఘ్నసురాపాయి ప్రముఖదుర్జనులగతి కగ్గమగుదునని సప్రతిజ్ఞంబుగఁ బల్కుటయుఁ దండ్రి సంతసించెఁ బిమ్మట గొంతకాలం బరిగిన పిదప నేదేని యొండు నిమిత్తంబు గల్పించి బ్రాహ్మణులను విజ్ఞులగువారి నేరి రప్పించి వారివారికిఁ బృథక్ప్రదేశంబుల నేర్పఱచి కూర్చుండ నియమించి వేఱువేఱుగ వారల మంతనమ్మునకుఁ బిలిచి. 62

తే. గీ. మిమ్ము వితరుల వేఱుప్రశ్నమ్ములడిగి
తెలిసికొనవలెఁ గావునఁ దివిరి యెవరి
నేమురమ్మన్న వారలే యేగుదెందు
"కలగపులగపు" రాకలు వలదు వినుఁడు. 63

కం. "పిలువని పేరంటమ్ములు"
కలగాపులగములు చిక్కఁగలిగించెడి ని
మ్ములనెల్లవారి మర్యా
దలు సలుపనెఱండటంచుఁ దగఁ బిల్చుటయున్. 64

తే. గీ. వెనుక ముందనునట్టి విభేదమొందు
దక్కవిడు నీవిలో హెచ్చుతగ్గులుండ
వేమతస్థులఁ బిల్చిన నామతస్థు
లేగుదెంచి కైకొందు మాయుచ్చునీవి. 65

కం. ఇఁక నొకటి యిపుడె నుడివెద
మెకసక్కెము వలదదిందు కెవరేనియు నొ
ప్పక యన్యథాచరించినఁ
బ్రకటించిన శిక్షకపుడు పాత్రులె యెఱుఁగ. 66

వ. బ్రాహ్మణులేకానిండు వైష్ణవులేకానిండు ద్వైతులేకానిండు. అద్వైతులే
కానిండు ఎవ్వరైనను రాజశాసనం బతిక్రమించుటంజేసి దండనార్హు
లేయని నొక్కి వక్కాణించుటయు నెల్లరును రాజశాసనంబు మనం
బుననిడికొని మననయొనర్చుచుఁ దమతమ నియమితస్థానంబులఁ
బిలుపునకుఁ బ్రతీక్షించుచుఁ గిక్కురు మనకుండఁ గూర్చుండిరి
పిమ్మట నొక్క రాజభటుం డరుదెంచి గంభీర స్వరమ్మున. 67

ఉ. వైదికులార! రండొరులు వారలమధ్యను జేరకుండు జేఁ
దాదరమూనిచూడమియు నాపయి శిక్షయు సంభవించు ము
న్నే దయకల్మిఁ జెప్పెనదియేరును మీరలు విస్మరించి మ
ర్యాదను గోలుపోకుఁడు నృపాజ్ఞయు దేవునియాజ్ఞ వంటిదే 68

వ. నావుడు వైదికపదవాచ్యులగు వారలెల్లరును రాజనికటంబున కరుగ

వారలకు నమస్కారాదికంబులగు సమయోచితకృత్యంబు లొనర్చి
యంబరాది బహుమానంబు లొసంగి ఱేఁడు సమ్మానించి యనిపిన
వారలు యథాపూర్వమ్ముగఁదమ నియమితస్థానంబున కరిగి కూర్చుం
డిరి. మరల రాజపురుషం డేతెంచి. 69

ఆ. వె. రండుస్మార్తులార । రాజవరేణ్యుని
యాజ్ఞ మిమ్ముఁ బిల్చె నన్యులెవరుఁ
గూడరాదు ఱేఁడు కోపించు నెఱుఁగుండు
మొదలెమీకుఁదెల్పె ముదలవినరె । 70

వ. అయ్యది విని మున్ను సన్మానింపఁబడినవారలె తాము స్మార్తపద
వాచ్యులుగూడ నగుటచే నరుగ ఱేఁడు యథాపూర్వంబుగ సన్మానిం
చుటయు యథాపూర్వమ్ముగఁ గైకొని సంతసింపుచు యథాపూర్వ
స్థానమ్ములకరిగికూర్చున్న కొండొకసేపునకు మరలరాజపూరుషుండు

తే. గీ. రండు బ్రాహ్మణులార । మీరలు నృపాలు
నాజ్ఞయైనది వేఱొక్కరండుఁజేర
రామి మీకిష్ట చెప్పఁబరాకు పదరు
గాక; మీతోదమును చెప్పెఁగాదె । విభుఁడు. 72

చ. అనవిని బ్రాహ్మణాహ్వయము నందలి వాచ్యముతమ్మె చెప్పటన్
గొనగొన గుంపు గుంపులుగఁ గుంభినిభర్త సమీపభూమికిన్
జనిరల వైదికోత్తములె సత్కృతులన్ దనియించె ఱేఁడు చ
య్యనఁ దమతొల్లియున్నయెడ కందఱునేగిరి కూరుచుంటకున్. 73

కం. శ్రీవైష్ణవులాదిగఁగల
భూవిబుధులు తమ్ము రాజపురుషుండిఁక సం
భావించి పిలువఁగలఁడను
భావంబునఁ గూరుచుండఁ బార్థివుఁడంతన్ 74

వ. యువరాజసమేతంబుగా నరుదెంచి నమస్కరించుటయు వార
లెల్లరు ససంభ్రమంబుగ లేవంబోవ ఱేఁడు సగౌరవంబుగ వారి
వారించి యిట్లుప్రశ్నించె. 75

తే. గీ. స్మార్తులా! కారు మీరు బ్రాహ్మణులుఁగారు
కారు వైదికులేని యింక నెవరయ్య!
ఇతరశబ్దముల్ విప్రులనే వచింప
వెఱుఁగరే! యౌగికము లేరినేవి చెప్ప. 76

తే. గీ. పంకజాదులవలె రూఢిఁ బరఁగు మూఁడు
శబ్దముల్ వైదికాదులు సర్వసమ్మ
తములు మీరు త్యజించి రుత్తములె యగుదు
రైన నవ్వానిఁ ద్యజియించు టదియు లగ్గె? 77

వ. మాయున్నకడకు మీకెయ్యదియో సందియమ్ము పొడమి రాఁజాల
కున్నను మీరును మాకు వాలంబోలెఁ బూజ్యులగుటంజేసి మీసన్ని
ధికి మేమె వచ్చితిమి కైకొనుండని తాంబూలజాంబూనదాంబరాభర
ణాదులొసంగి సత్కరించి కొమరునవ్వారికిఁ గేలంజూపి యిట్లనియె.

ఉ. ఈతఁడు చిన్నవాఁడగుట నెవ్వరిబోధనొ మీకు శిష్యుఁడై
తాతలనాఁటి వంశపు మతంబటులుండఁ ద్యజించెసర్వ మే
మేతరమందు నెత్తనది యెత్తెఁజుఁడీ? తిరిపంబు సైతముఁ
వాతులుఁదేని చేయఁడిటు వైష్ణవసత్తములార! వింటిరే! 78

తే. గీ. ముత్తియములేవి తండులమ్ము లగునేని
బంగరువె కావి యేదియు భైక్ష్యమకద!
మీరె చెప్పుఁడు మాయయ్య కేరు చెప్పి
రేనియును నచ్చ వెలిఁగింపుఁ డీరె తగమి. 80

వ. మీమతంబు వైదిక బ్రాహ్మణ స్మార్తంబులయం దేదియని యేను
బ్రశ్నింపఁ దాను బైశబ్దంబులు మూఁటికిని బాహ్యంబుకాదని నాతో
వాదించిన నేను భగవదాదేశంబున నీయుపాయం బొనర్చి మీచేతన
యొప్పించుట తప్పకవచ్చి యిట్లొనర్చితి నియ్యది కొంచొక
కుయుక్తియని నాయెఱుంగనియది కాదు, అవసరముం బట్టి యవ
లంబింపవలసెనని వెండియు. 81

చ. నృపసుతుఁడంచుఁ గొంకక దరిద్రులపిల్లఁడువోలె నాయవా
రపుఁబని పూనఁజేసితిరి రాకొమరుల్గని నవ్వరయ్య! యే
వపుఁబనులంటొనర్పుటకు వైష్ణవధర్మము మాత్రమొప్పునే!
కృపణులుదక్క నీ బికిరమెత్తుదురే! మఱియెల్లవైష్ణవుల్. 82

వ. మీరు విలువగల ముత్తియమ్ములు సంగ్రహింపనెంచిన పన్నాగంబు
గాని యియ్యది వేఱొండు గాదని వెండియు. 83

కం. మీరొనరిచిన కుయుక్తికి
మా ఱొనరిచి తింతమాత్ర మాన్యతకీరల్
దూరగులుగారు విషముఁ
దూరీకృతమున్ దొనర్పు దుర్విషమెందుఁ. 84

వ. అని వారలను సమర్యాదంబుగ మందలించి కొమరుదిక్కు మొగంబై.

కం. ఈ వొనరుచు చెట్టను సం
భావించితివే! యటన్నఁ బార్థివసుతుఁడుఁ
భూవరుతో నిదిగో! సం
భావించితినంచుఁ దండ్రివశుఁడై చనియెఁ. 86

వ. ఇయ్యది యమ్మహేశ్వరుని యనేక లీలావ్రతమ్ముల యందుఁ గులా
చారావనవ్రతమ్ము దీనిశ్రవణ మననాదులఖిల శ్రేయోదాయకంబులని
సూతుండు శౌనకాదులకు వక్కాణించె. 87

కం. దేవా! యావత్తైలం
తావద్వ్యాఖ్యగద! దేహదార్ఢ్యముతగ్గెన్
సేవించుచుంటి విన్నను
నావార్ధక్యమ్ము నీవు నడపుము పేర్మిన్.

ఇది

శ్రీ కులాచారావన వ్రతము

సమాప్తము.

శ్రీమత్పరదేవతాయైనమః

శుభమస్తు - అవిఘ్నమస్తు

# ఏకపత్నీ వ్రతము.

కం. శ్రీలకిర యింద్రకీలము
కైలాసము కృష్ణ గంగగా బెజవాడన్
వాలాయము నివసించెడి
హాలాహలతోఁడప ! మల్లికార్జునదేవా. 1

వ. అవధరింపు మనంతరంబు సూతుండు శౌనకాదులం గని 2

కం. వినియుంటిరి వ్రతములు నే
వినిపింపఁగఁ గొన్నిటిని సవిస్తరముగ నిం
కను వానినే వినుతునో !
వినుతునొ యితరమ్ము నాకు వివరింపు డనన్. 3

వ. మును లిట్లనిరి. 4

కం. భగవంతుని చరిత్ర మ్మెం
దుఁ గలదొ యది సకలమైన దొసఁగులఁ దుంచి క
ల్గఁగఁ జేయు మంగళమ్ముల
నిగమసమానమది యనుచు నీవెఱిఁగినదే 5

కం. కావునఁ బరాత్పరుని లీ
లావిభవమె వినుటకున్ గలదు వేడుక మా
భావముల, నింగితజ్ఞుఁడ
నీవెఱుఁగని దొకఁడు గలదె యిందు మఱెందున్. 6

వ. ఇట్లు కోరుటయు సూతుండు వేఱొక భగవల్లీలా వ్రతంబున కిట్లుప
క్రమించె. 7

చ. కలదొకపట్టణంబు సిరికాపురమై తగు నాపురమ్మునం
గలరుద్విజుల్ నృపుల్ కడు నఖండధనాఢ్యులు వైశ్య లంఘ్రిజుల్
గలరు ద్విజన్ములందు శివు గాదిలి ప్రాణముగాఁ దలంచి పూ
జలిడెడి లింగధారులు నజస్రగళాసిక సువ్రతాదరుల్. 8

తే. గీ. ఇన్నివత్తుల దీపమ్ము లిన్నితమల
పాకు లిన్ని పుష్పమ్ములు వ్రతవిధాన
మునకుఁ గావలెనను నేమమునకు లోఁగి
వారుపూజింతు రభవు నవ్వారిగాఁగ. 9

ఉ. వారల విష్ఠలన్ మఱియువారల నేమములున్ గణించిత
ద్వారము గాచియుండెదరు తత్పరులై నృపులేమి? వైశ్యులే
మీ! రహి యీశునందుఁగల యెల్లఁ గులీనుఱుఁగూడ వారల
వ్వారలఁ గాదు నాక భగవంతునిజేర్తు రనుగ్రహించుచున్. 10

కం. ఇతరమతద్వేషములే
క తరించు నుపాయమును దగన్ వార లుమా
పతిపూజావ్రతతత్పర
మతులై బోధింత్రు భక్తిమంతుల కెలమిన్. 11

కం. అల వారికి శివపూజా
ఫలమగు మాద్యత్తురంగ భాస్వత్కరిసం
కులమగు వాఁకిలి సుందర
తలుపీ లసితమ్ము గృహవితతి చెలువారున్. 12

కం. పరమును గూరిచి లేశ
మ్మెఱుఁగని మానవులునయిత మీశ్వరపూజా
దరులై ప్రత్యక్షమహే
శ్వరులని తద్ద్విజుల పూజ సల్పుదురెలమిన్. 13

కం. దానికిఁ దగినట్టుగ నం
    తానధనమ్ములును సుఖము దైన్యవిహీనం
    బైన మనుగడయు నల యీ
    శానుం డవ్వారికిడుచు సతమలరించున్. 14

తే. గీ. అన్ని కాలములు శివభక్తియందుఁ దవిలి
    తదనుసరణమ్ముగా సిరుల్ పొదలమెలఁగు
    నప్పురంబును బోలు రమాలవాల
    మైన పురమొండు గానరాదవని నెందు. 15

ఉ. ఆపురి లింగధారులకు నందఱకుణ దలమానికంబు వి
    ద్యాపరమేష్ఠి నూతనవయస్కుఁడు నిత్యశివార్చనావిధూ
    తాపదఘాదిసాంస్కృతికహానికుఁ డేక సతీవ్రత
    స్థాపకుఁ డొక్కఁనాఁటి నిశి సందెకుఁ గొండొకమీఁదటన్ దగన్. 16

కం. సాయంకాలపు శివపూ
    జాయుక్తిన్నొఱపి భుక్తి జరుగకమున్నే
    యా యయవారు బజారుకుఁ
    బోయెన్ బనియొండుగలిగి పూజ్యుండవలన్. 17

ఆ. వె. అట్లు వెడలి యింటికరుదెంచుచో నొక్క
    వేశ్య యింటినుండి వెడలి నీళ్ళు
    శిరమునందుఁ బడియె "శివ! శివా!" యని శివ
    దేవు నొడివి యింటితెరువుఁ బట్టి. 18

తే. గీ. పోవుచుండంగ నాయింటి పూవుఁబోఁడి
    ధ్వనినిబట్టి యెదో యుపద్రవముగలిగి
    యయ్యవారెవ్వరో! అట్టు లభవుని స్మరి
    యించి యుందురటంచెంచి యేగిచూచె. 19

వ. చూచునంతట నన్నీరంబు తనయింటి వరవుడపుఁ జెలి యొనరించిన

ప్రమాదముగా నెఱింగి అయ్యో! యని నొచ్చికొనుచుఁ బరుగుపరు
గునంబోయి యమ్మహామహునకు సాష్టాంగమెఱఁగి వెండియు. 20

ఉ. ఏనొనరించినట్టి యిపు డెంగిలిసీఁకు లెవ ర్తెవోసినన్
దానికి సైఁపఁగావలయుఁ దత్కృతపాప మపాకరింప నే
దేనియుఁ బాచితంబొకటి దేఁకువ వేకువఁ దెల్లవాఱుపై
నేనొనరించికొందుఁ దమ రెయ్యది చెప్పినఁ దప్పకుండఁగన్. 21

కం. ప్రకృతంబు మాగృహము లో
నికి దయచేయంగవలయు నే నభ్యంగం
బకలంకచరిత! స్వయముఁగ
వికృతికినై చేసి దేవ నిన్ బంపింతున్. 22

వ. అని యాయింటి తలోదరి పరమశివభక్తిపరాయణురాలు నడివీధి
నడుగుల కడ్డువడి యకృత్రిమంబగు భక్తి మూర్తీభవించిన తెఱం
గునఁ బ్రార్థించి బలాత్కరించుటకు మాఱాడనోడి యమ్మహనీయుం
డా రూపాజీవాసదనంబున కరుగుటయు నవ్వసితాశిరోమణియు. 23

మ. తనజన్మంబు పవిత్రమైనయటు లంతర్బుద్ధినూహించుచున్
ఘనుఁడారాధ్య శిరోవతంసమునకున్ గాంచన్మణీకంకణ
ధ్వనితో గందపునూనెతో సొబగుచిందన్ శీర్షమంటెన్ సువా
సనలన్ బొల్పగు పిండితో నలుగిడెన్ స్నాతున్ బొనర్చెన్ వెసన్. 24

వ. అట్టులా బాలామణి సుస్నాతున్ గావించి క్రొత్తపట్టుపుట్టంబులుగట్టి
కొండని సమర్పించి యొడలినిండ మంచి మలయజ మ్మగురుతో
మేళగించిపూసి పన్నీరుచల్లి యత్తరువులు నానాభేదంబులు గలవి
యా క్రొత్త పట్టుపుట్టంబులనిండ నించి పూలమాలిక లలంకరించి
తన యూడిగపు వెలంది యెఱుఁగక యొనర్చిన దోసఁగునివర్తించి
నదవి యాయనచే ననిపించుకొని దీవనలనందికొని తాంబూలంబు
సదక్షిణాకంబుగా సమర్పించి యశ్వపుబండి తెప్పించి యందాయన

నధిరోహితుంగావించి బండివానితో నయ్యగారిని భద్రంబుగా వారి యింట దించిరమ్మని కొంతొకమేరఁ బాదచారిణియై శకటమ్ము వెంటనరిగి తదాజ్ఞకై కొని యావెలవెలంది యింటిలోనికిన్ జనియెఁ బదంపడి. 25

తే. గీ. అయ్యవారంత నొడలెల్ల నత్తరువుగ
మఱియుఁ బన్నీరుగాఁ బూలమాలికలుగ
నరిగినంతటఁగని యింటియాలియొదలు
భగ్గుభగ్గునమండియుఁ బతికినాపె. 26

తే. గీ. భోజనంబిడి పిదపఁ దాంబూలమిచ్చి
పడకగదిలోనఁ గ్రిందఁజాపపయిదాను
మూఁగవలె నొక్కటఁ బయిందె ముదిత భర్త
విటుఁడనెడి భ్రాంతిగదిరి నిర్విణ్ణయగుచు. 27

తే. గీ. ఆపెహృదయంబు పొదకట్టి యయ్యవారు
గతము సర్వమ్ము వాక్రుచ్చెఁగాని యామె
వినియు నమ్మికలేమిని "నను ము ముసు"
నాక మూకవ్రతము విడలేకయుండె. 28

వ. అట్లు కొన్నిమాసమ్ములుగడిచె నుభయులు నిష్కళంక చరిత్రులు నేకపత్నీవ్రతులలో నాయనకెంత యభినివేశమున్నదియో, యేక పతికవ్రతంబున నాయమకును నంతియ యభినివేశంబు గలిగి యున్నను నిర్హేతుకంబైనను సహేతుకంబట్లు కనుపట్టు కారణం బొకటి యేర్పడి పరస్పరముఖావలోకనమ్ము వినా సంభాషణాది కంబు కలలోనైత మెఱుంగని యప్పుణ్యదంపతులయందు జాలి వొడమి యొకనాఁడు జగదీశ్వరి జగదీశ్వరునకిట్లనియె. 29

తే. గీ. ఎఱుఁగుదురుగాదె! మీరు దుష్కరతపః ప్ర
శస్తు వలలింగధారి ద్విజాగ్రగణ్యు

నతని భార్యఁ బతివ్రతాహంకరిష్ణు
తాప్రశస్తిప్రకృష్టతాస్థాని ననఘ. 30

కం. కౌఱగాని ప్రసక్తియెదో
యిరువుర నెడఁబాపె నాపె యించుకదోషం
బెఱుగ దెఱుఁగ డాయనయును
విరహమనుభవింతు రెట్టివేఁదుఱులో ! కటా ! 31

తే. గీ. అనఘుఁడాయన కపరాధమాచరించి
పరమశివభక్తురాలొక్క పడపువెలఁది
స్నానముఖ్యోపచారముల్ సలిపిపంపె
గౌరవమ్ములరఁగ నట్టి కాంతుఁగాంచి. 32

కం. అత్తరువాసనపూవులఁ
జిత్తమునకువెగటుగొల్పి చిత్తజబాణా
యత్తుఁడయి భర్తవేశ్యా
సత్తికి లోఁబడియెనంచు సాధ్వితలంచెన్ 33

తే. గీ పాపమాగేస్తు నిజము సర్వమెఱిఁగించెఁ
గాని విటులకు సత్యమ్ముగాని శౌచ
కలనగాని యుండదనుచుఁ గలికినమ్మ
కురక వర్జించె భర్తతోఁ బరిచయంబు. 34

కం. శివపూజాపరికరములు
సవరించున్ వంటవండి చక్కఁగఁబెట్టున్
ధవునకు లోపముచేయదు
పవళింపదు కాంతుశయ్యపయినెన్నండున్. 35

కం. నగవెఱుఁగదెన్నఁడున్ దన
నగలను ధరియింపదల్ల నాతి తిలక మొ

ప్పుగఁదాల్చి నంతమాత్రమె
నగగావర్తించు నాయనకు మేలునకై. 36

ఆ. వె. కృత్రిమంబు "వడ్లగింజలో బియ్యపు
గింజ" కన్న నెంతకెలికి చూత
.మన్నఁ గానఁబడదయన్యాయమిది యుపే
క్షింపఁదగమి మీకుఁ జెప్పవలసె. 37

కం. ఇరువురలో నొకరేనియు
దురితము లవమేనెఱుంగుదురె ! పాపంబీ
విరహం బెందుకువారికిఁ
బరమశివాద్వైత విరతభక్తు లిరువురున్. 38

తే. గీ. భక్తులన బిడ్డలన్న లవంబు భేద
ముండునే ? మనమిట్లూరకుండునెడల
నెవరు వారల సేమంబు నెంచువారు ?
నాఁగఁ బరమేశ్వరుఁడు కరుణామయుండు. 39

కం. పరమంబగు నొక మాహే
శ్వరరూపము దాల్చి యొదలి భస్మరజము దు
ర్భరమగు నెండకు గలిగిన
శరీరఘర్మజలమునకు సగము లెడలెన్. 40

తే. గీ. భస్మరుద్రాక్షధారి విభ్రాజమాన
లింగధారియు వృద్ధు నళికతలాక్షి
మాత్రమేలేని శివునిగా ధాత్రినెల్ల
వారుఁ గనుచుండి రాయయ్యవారి నెలమి. 41

కం. మును వేశ్యాంగన గౌరవ
మును గని భార్యకు నెడమొగమును బెడమోమౌ
టను గన్నయతఁడు తనదగు
మనికితమున కతిథిగాఁగ మన్నించి వెసన్. 42

వ. తోడ్కొని చని యర్ఘ్యాదులచే నర్చించుటయు నతండు సంతుష్టుండై
భోజనానంతరము వీరల కన్యోన్యత గలిగించు టెట్లని యాలోచించి
తనయొద్దనున్న మడిసంచిని విప్పి. 43

కం. అందలి కనకకలశ మర
విందానన చూచుచుండ విభునకు విడి నే
నెందోచని వచ్చెద మీ
మందిరమున దీని డాఁచి మఱి నాకిడుఁడా ? 44

వ. అని మఱియు నిద్దాని డాఁచుభారంబు నీపైఁగాని నీభార్యపైఁగాని
యుండఁ గూడదనియు మీదంపతులు దీని దాఁపఱికమ్మునెడ బాధ్యు
లని నొక్కి చెప్పి యొకరిచేఁ బెట్టెలో నుంపించి యొకరిచే నద్దాని
బీగము వేయించి వెండియు. 45

చ. ఇరువురదిక్కు చూచి యిది యే జనియంతయుఁ గర్చువెట్టి సే
కరణ మొనర్చికొన్న కనకంబునఁజేసిన పాత్ర దీనిలో
భరము మదీయమున్నయది భద్రముసుండని హెచ్చరించి శం
కరుఁ డరిగెన్ దనంత నెలగా నటుపిమ్మట వచ్చె వెండియున్. 46

వ. అట్లభ్యాగతుండుగా వచ్చిన యావృద్ధమహేశ్వరు నర్చించి భుజింపఁ
జేయునెడఁ దన బంగరు చెంబొకపరి చూచినంగాని తనకుఁ జిత్త
స్వాస్థ్యమ్ము గుదురదనియు, నది కుదురని భుక్తి రుచింపదనియు,
రుచింపని భుక్తి యొడలఁ బట్టదనియుఁ, బట్టనిచో నది విషప్రాయో
జనం బనియు నేమేమో యుపన్యసించుటయు నాదంపతు లొకరితో
నొకరు సంభాషింపని మూఁగనోమున నుంటంజేసి యాయనకోరిక
చట్టన నెఱవేర్పరామి వేర్వేఱుగా నాయన కిట్టు లనునయింపఁ
దొడంగిరి. 47

కం. కుతపసమయ మనఘా యిదె
అతిక్రమించెడిని భుక్తియది గావింద

ర్పితమగు మీ కనక కలశ
"శతంవిహాయ" యనుసూక్తి స్మరియింపుడనన్. 48

కం. గృహమేధి కిట్టులను నా
యిహము సమస్తమ్ము దీననే గలదె న్నే
బ్రహుముతులు కరఁగిపోసిరి
నహిదీనికిఁ దుల్యమగు కనక మీభువిలో. 49

ఉ. ఈశుధనుస్సునందుఁగల హేమముగీటుకు జంకు నల్ల ల
క్ష్మీశుని పుట్టమందుఁగల హేమము గీటుకు జంకు నల్ల వా
ణీశుని బొజ్జలోనఁ గల హేమముగీటుకు జంకు మీదు న
భ్యాశమునందు నాయిడిన బంగరుసాటి జగానఁగానఁగా. 50

వ. పిమ్మట నమ్మనీషి యిల్లాలిట్లనియె. 51

ఉ. మంచిదియైన హేమమది మంచికి వించుకదీసి పోయినన్
మంచుటయందయెల్లరకు మానసముంట స్వభావసిద్ధ మీ
రించుక తాళుచో నిదుదు మే మదిగట్టితిఁ బెట్టెముట్టుకో
నంచితు లీరెఱుంగరె ! సమంజసరీతి భుజింపుఁడిచ్చెదన్. 52

కం. ఇరువురచేతికి నిచ్చితి
రిరువురమును బుచ్చికొంటి మిరువురమును సం
సరణపుఁబేటికలో జా
గరూకముగ దాఁచితిమి యిఁకన్ భయమేలా ! 53

వ. మీభోజనంబయిన యుత్తరక్షణమ్మునంద మదివిడిచి మీకలశంబు మీకిచ్చి మరల మదిగట్టుకొని యేముభుజించెద నింకను దమకు సందియమెందులకనియెడి సాధ్వికి నల వృద్ధమాహేశ్వరుండిట్లను. 54

కం. కనకమ్ము సర్వపూజ్యము
కనకముగలవాఁడె యందగాఁడగు వానిన్
గని వలచుజగము వానిఁ
దనూజులాదరముతోఁ గనఁగనెంత్రుమదిన్ 55

తే. గీ. అందులో వృద్ధునకుఁ గనకాళ హెచ్చు
నేనువృద్ధుండ నింటిలో దీనినుంచి
వచ్చుచోఁ గుబ్బలును భార్య పంచిపుచ్చు
కొందురనిగాదె ; వెంటఁజేకొని నడచుట. 56

ఆ. వె. మరలఁ ద్రోవలోన దురితాత్ము లెవరేని
గొట్టి దానిఁబుచ్చికొనిన నేమి
సేతునన్నభయముచే మీగృహమ్మున
దాఁచనిచ్చినాఁడ దథ్యమింత. 57

కం. ఇటనుండి తరలిచని న
ప్పటినుండియు నాకు నిద్రపట్టదు భుజియిం
చుట సైఁప దెపుడుఁ గలశ మె
దుటఁ గన్పడుఁ జూడకే మెదుకుతినఁగలనే ; 58

కం. ఏవిరహంబును గానీ
భావము సయిరింపనేర్చు బంగరు విరహం
బావంతగూడ సైపద
ఆ వంతకు మించు వంత యవనిన్ గలదే. 59

కం. ధనమున్న భార్యయున్నది
తనుజులుగలరాపెయున్నఁ దనుజాలవెంటన్
మనుమలు మునిమనుమలుగల
రెన ధవమున కొందు గల్గనే ; జగమందున్. 60

చ. కనకము దాఁచనిచ్చుటది కస్తికిమూలము, చాపమౌనటుల్
పొనరిచి చేతనుంచికొనె మున్నలశంభుఁడు వస్త్రమౌనటుల్
పొనరిచి మేనఁగట్టికొనెఁటో ; కమలాపతి, వీరికన్ననున్
ఘనుఁడు హిరణ్యగర్భుఁడది గర్భమునందిడి కొంటెబుంగమే. 61

తే. గీ. ఎన్నియెన్నియుపాయమ్ములెఱిఁగి మనము
దానిదాఁచెదమో ; అదివానినెల్ల
మోసగించు నపాయసమూహములను
వెదకి సురుఁగుచునుండుట విదితమెందు. 62

కం. మీదంపతు లతియోగ్యులు
గాఁదోఁచిరి నాకుఁ దానఁ గనకకలశ మీ
చేదాఁపనిచ్చితివి గా
సీదోషపు శంకలెవియొ యెదఁదజనించుణా. 63

కం. అవి మీకడ వివరించుట
అవివేకమ లేదు సందియము మదిలోఁ గొం
కువిడదుగా ; "మాతా పు
త్ర విరోధాయ" యనుమాట తథ్యమకాదే ! 64

వ. అని కొండొక యాఁకలిని నటించి యావృద్ధుండు. 65

కం. ఎందులకు నాలసించుట
సందేహములేదు కలశసాక్షాత్కారం
బందుబె శిపుఁ డందుటక
న్నందొడ్డ భుజింతు నప్డనణా బతి సతితో. 66

వ. ఆపెతోఁ దాను మాటలాడకుంటకు నిమిత్తము లేమింజేసి యథాపూ
ర్వమ్ముగఁ బిలిచి తాళమ్ము దాఁచినచోటు దెలిపి మదికేమి మరలఁ
గట్టికొందుగాక యని యొప్పించుటయు. 67

చ. కలశము దెచ్చి యిచ్చుటకుఁగా నలగేహిని యేగి పేటికన్
గలయఁగఁజూడ నందు నది గన్పడ దంతట నాపె మోమువె
ల్వెలమనె భర్త కక్కటన విహ్వలభావము పుట్టె వృద్ధుఁడున్
గలశముతేక భుక్తిగొనఁ గంతపుఁగత్తెర దిక్కటంచనెన్. 68

కం. భార్యాభర్తలు వృధగాఁ
జౌర్యపు నపవాదుమనకు సంఘటిలె నౌరుల్

కార్యమిది యెవరిదందుర
వార్యముగా వచ్చి నెత్తిపై దొసఁగువడెన్. 69

వ. అని యేమియున్ దోఁపక యెవరిమట్టుకువారు నిర్దోషులమని యెఱిం
గియు సదోషత్వం బనివార్యంబని యెఱుంగుటంజేసి. 70

చ. కనకము వస్తురూపమునఁ గాలగళార్చనకల్మి మాకునుణ
బనివడునేని యున్నయది భాగ్యపరీతులమం చెఱంగుదీ
వనఘ ! దినార్ధమిమ్మ గడువంతట నీకు లభించుఁ జెంబు భో
జనమొనరింపుమన్న నలశాంబరిపాలుఁడు పల్కెఁ గ్రుద్ధుఁడై. 71

ఆ. వె. భోజనమునకేమి ! బోసేసినను బోవుఁ
జేయకున్నఁ బోవుఁ జెలియమిన్న !
భాజనంబులేమి బాధకంబై నాకు
మెదుకు దిగదు నిక్కమిది యెఱుంగు. 72

వ. ఇద్దాని దాఁపటికంబు మీదంపతులకును నాకును మీగృహమ్మునందలి
పేటికకును దక్క నొరులకుఁ దెలియదు. నీవు పరమపతివ్రతాశిరో
మణివి. నీలోపమువలన నియ్యది మాయమై యుండదనుట శిలాక్ష
రంబు. తప్పైనను నొప్పయినను నీదోషంబు నీభర్తపై నిడుటకు
నామనంబు వెనుదీయకున్న యది యెట్లంటేని. 73

కం. ఈతఁడు వేశ్యాసక్తుం
డోతరుణీ ! నీవెఱుంగు దొసఁగెనో ! యేమో
యేతన్వికేవి యడుగుము
నీతో నీతండు చెప్పు నేనును విందుణ. 74

తే. గీ. అనెడి నుడివిని "శివ ! శివా !" యంచుఁ జెవులు
మూసికొనియె నాగేస్తు నమోనమో య
టంచు వృద్ధవిప్రుండు నీవడిగి చూడు
నీదుభార్య నాపెయె చెప్పు నిక్కమనుచు. 75

తే. గీ. ఆపె వేశ్యామరక్తుఁడవంచు విన్న
వదలిపెట్టినయట్టు లివ్వాడనున్న
గేస్తు లనుకొనవింటి నీకీలకంబు
నీవు నీభార్యయును దక్క నెఱుఁగు నెవఁడు. 76

కం. ఇంటన్నిను వేఱుగ వా
ల్గంటియె వెలిపెట్ట నొరులు ఘనుఁడందురె ? మీ
జంట పరస్పరమును వా
కొంటకు మొదలిడినఁ దెలిసికొనఁదగు నిదియున్. 77

వ. పెట్టెలో భద్రపఱచి తాళము వేయు నందనుక నాయెఱిఁగిన యంశమే దీనికి నొరుల సాక్ష్యముతోఁ బనిలేదు గాని. 78

ఉ. పిమ్మట భర్త కన్మొఱఁగిపెట్టియ నీవును గాని నీకు గో
ప్యమ్మగురీతి నీహృదయబంధుఁడు భర్తయుఁ గాని పెట్టె తా
ళమ్మును దీసియుండవలె లాతుఁలు దొంగలు వేశ్మమందుఁగ
న్నమ్మిడి దూఱినట్టులు వినంబడలేదుగదా ! సతీమణీ ! 79

వ. అక్కృతమ్మున మీలో మీరు సంప్రదించుకొన్నచో నిందేమియున్నది "వడ్లగింజలో బియ్యపుగింజ" సొమ్మెట్లును దొరకదు. మీరు నాసొమ్ముఁగలవారే యని నేనెఱింగిన కతన నాకు వధైర్యంబు లవమ్మును లేదుగాని నామూలమ్మున మీయిరువురకుఁ గాని మీలో నొకరికిఁ గాని యీయపవాదు ఘటించుట పుణ్యమునకుఁ బోయిన బాపమ్మెదురగుటకాక మఱేమి ! యని యోర్చినట్లును నోదార్చినట్లును బ్రసంగించు నావృద్ధమాహేశ్వరున కావిషధయోగ్యం దేకపత్నీవ్రతుండు గేస్తుం డిట్లు వక్కాణింపఁ దొడంగె. నయ్యా నేనెన్నండు గాని పరస్త్రీ ముఖం బెఱుంగనివాఁడ నయ్యు నొండొక నిమిత్తమ్మున నాభార్య నన్ననుమానించి వెలిపెట్టినది. ఆహేతువు మీరు నావలన వినుటకన్న నాపె ముఖమున వినుటయే సమంజసం బనుటయు నామహేశ్వరుండు. 80

ఆ. వె. ఈవె చెప్పుమనుము నేవిందు నందున్న
మంచిచెడ్డలను సమంచితముగఁ
దెలిసికొందు ననుడుఁ దెలవతోఁ జెప్పుమీ
వనుచుఁ బల్క నాపె యనువదించె. 81

వ. అయ్యది విని యాకపటమాహేశ్వరుండు గేస్తు దిక్కై నీవు నిర్దోషివే యైనను నిన్ననుమానించుటలో నీభార్య ప్రమాదపడినదని యనుకొనుట కవకాశమ్ములేదు. ఏమంటేని, వినుము. 82

ఉ. జారసఖిన్ ధనాంగనను జారుని జోరునిఁ ద్రాఁగుఁబోతు నె
వ్వారును గీర్తికాసపడువారలు గొంపకుఁజేర్పరాదు త
ద్ద్వారము కార్యముండినను దామునుద్రొక్కఁగరాదు నిక్కమీ
తీరు పెఱుంగకున్నఁ గొనితేవలెనే ! యపకీర్తి యొక్కచో. 83

వ. నీవు నిష్కళంక హృదయుండవే యయ్యును దైవసంఘటనమ్మునంజేసి బుద్ధిపూర్వకంబుగాఁ గాకున్నను నాఁ డా వెలవెలంది గృహమ్మున నడుగిడుటయ కాక ఆవశ్యకంబేయైనను నాశైవభక్తురా లొనర్చిన యభ్యంగనాద్యుపచారంబుల కంగీకరించుటయు నీ యెడల నీభార్య యనుమానించుటకుఁ గారణంబయ్యెనని వెండియు. 84

కం. మీరిరువురు నిర్దుష్టులు !
కారేమాత్రమ్ము దొసఁగుగలవారలు మీ
చారిత్రము నేనెఱుఁగుదు
దూటించుకలేక యిట్లు దుఃపిల్లుదురే. 85

వ. ఇట్లు మందలించుటయు నాదంపతులు మదిలో నీయనఘుడు సర్వసామాన్యుండగు మాహేశ్వరుండు గాఁదనియు సాక్షాత్పరమేశ్వరుండె కానోపుననియు ననుమానించి అట్లే కాకయున్న నంత భద్రమ్ముగాదాఁచిన కనకకలశం బగుపడకుంటకు నెన్నివేల గుండెలుండుననియు నిశ్చయించికొని యమ్మహాత్ము చరణమ్ములపైఁబడి గట్టిగా విరోధించుచు. 86

కం. ఏమెన్ని జన్మములనో ।
నోమిననోము ఫలియించె నూనముగా నీ
వా మంచుఁగొండ యల్లుఁడ
వేమని నిజరూప మపనయించుట శంభూ. 87

వ. మా మనఃకాలుష్య మ్మెడలింప ననుగ్రహించుట తెల్లంబయ్యె నీసం కల్పం బన్యథాకరింప మేమెవ్వరమని వెండియు. 88

ఉ. ఎవ్వనియాజ్ఞదాఁటుటకు సృష్టియొనర్చెడి బ్రహ్మజంకునో ।
యెవ్వనియాజ్ఞదాఁటుటకు నిందిరభర్త మురారి జంకునో ।
యెవ్వనియాజ్ఞ దాఁటుటకు నింద్రముఖామరకోటిజంకునో ।
అవ్విభుఁడీవు వ్యాజమున నంతరితుండవుగాఁగ నేటికిన్. 89

వ. నీనిజస్వరూపంబుఁ జూపించి మాయిడిన భక్ష్యభోజ్యమ్ములు నీవు నీసతీమణితోడ నారగింపవలయునని ప్రార్థించుటయుఁ బరమేశ్వరుం డుమాసహితుఁడై వారలకుఁ బ్రత్యక్షమ్మయి షడ్రసోపేతమ్మగు విందు నారగించి వారల నాశీర్వదించి వెండియు. 90

కం. మీరలు మదీయభక్తుల
రారాధ్యులు లోకమునకు నాయుర్భాగ్యో
దారులుగ నిట్టివే సం
సారసుఖమ్మనుభవించి శతసమలపయిన్. 91

ఉ. శ్రీరుచిరత్వసంస్మృతి యశేషము పుత్రులయందుడించి మీ
భారము [illegible] వదలి వత్తురుగాక । మదీయసన్నిధిన్
జేరి సుఖింపఁగాఁ బ్రమథసేవ[illegible]కరై చరింత్రుగా
కేరికి నందరాని పదమిచ్చితి మీకిఁక నేమి కావలెన్. 92

వ. ఇట్టు లాదంపతులఁ గృతకృత్యులం బొనరించి పరమేశ్వరుం డంతర్థానంబుచేసె. నిద్దాని శ్రవణపఠనాదులచే నాయురారోగ్యభోగభాగ్యంబులవ్వారిగా నేర్పడుట నిక్కువంబని సూతుండు శౌనకాదుల కెఱింగించె. 93

## గ్రంథాంతపద్యములు.

కం. దేవా! "యావత్తైలం
తావద్వ్యాఖ్యా" గద! కవిత దయచేసితి వీ
త్రోవ( దరియించుటకు నీ
సేవకు మొదలిడితి సాంగ( జేసితివభవా.

కం. దేవా! "యావత్తైలం
తావద్వ్యాఖ్యా" యని నేమొదలు వెట్టిన నీ
సేవను నిరంతరాయము
గావించిన నిను నుతింప(గా నాతరమే?

కం. నాయారోగ్యము సంతా
నాయుర్భాగ్యాదికమ్ము లఖిలమ్మును సు
శ్రీయుక్తమ్ముగ సలుపుచు(
బాయనికృప( బ్రోచు నీకు( బ్రణతులివె! శివా!

గద్య:

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన బాలకలానిధి బాలసరస్వ(
కళాప్రపూర్ణ విద్వత్కవి మహాకవిచక్రవర్తి శతావధానీ
త్యాది బిరుదాంకితులును చెన్నరాష్ట్ర ప్రభుత్వ
ప్రప్రథమాంధ్రాస్థాన కవితాపట్టభద్రులును
అగు బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వె
శాస్త్రి [illegible] ప్రణీతంబై
తిరుపతి వేంకటీయంబు
నా(బడు వ్రతకథలు
సమాప్తము.

UNIVERSITY OF HYDERABAD.
BC

INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

DATE DUE
DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged

UNIVERSITY O HYDERABAD, LIBRARY

T Acc. No. 3973

Call No. 81 V55V

Author

Title

INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep this book fresh & clean**